# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204977
UNIVERSAL LIBRARY

# పల్నాటి వీరచరిత్రము.

శృంగారనైషధాది గ్రంథకర్తయగు
మహాకవి శ్రీనాథ
విరచితము.

పరిశిష్టములు, వీరచరిత్ర కథాసారము, వీరచరిత్ర చారిత్రము
శ్రీనాథ జీవితసంగ్రహము ననునవి చేర్చి
బెజవాడ హిందూహైస్కూలు తెలుఁగుపండితుఁడు
అక్కిరాజు ఉమాకాంతము చేఁ
బ్రథమపర్యాయము ప్రకటింపఁబడినది.

ఏ. కే. స్వామి చే
బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడినది.

1911.

[All rights reserved.] [వెల రు॥ 1-0-0

## బాలచంద్రయుద్ధమున వచ్చువారు.

అనుగురాజు:—చేదిదేశమునుండి పల్నాటికివచ్చిన మహీపాలుఁడు.

అన్నమ్మ:—బాలచంద్రుని బొంగరాలాటచూడఁబోయిన వైశ్యకామిని.

అలరాజు:—కొమ్మరాజు కుమారుఁడు.

ఐతాంబ:—బ్రహ్మనాయుని భార్య, బాలచంద్రుని తల్లి.

కన్నమదాసు:—బ్రహ్మనాయునివరమునఁ బెమ్మసానికిఁ బుట్టినవాఁడు.

కొమ్మరాజు:—మలిదేవరాజు మఱఁది.

గండుకన్నమనీఁడు:—బాలచంద్రుని మామ.

తెప్పలినాయుఁడు:—మలిదేవరాజుయోధులలో నొకఁడు.

నలగామరాజు:—అనుగురాజునకు మైలమాదేవియందుఁ బుట్టినవాఁడు.

నరసింగరాజు:—నలగామరాజు సోదరుఁడు.

నాయకురాలు:—నలగామరాజు మంత్రిణి.

పినమలిదేవరాజు:—మలిదేవరాజు సోదరుఁడు.

పెమ్మసాని:—తెప్పలినాయునిభార్య.

బాలమలిదేవుఁడు:—మలిదేవరాజు సోదరుఁడు.

బాదన్న:—బ్రహ్మనాయుని యన్న.

బాలచంద్రుఁడు:—బ్రహ్మనాయుని కుమారుఁడు.

బ్రహ్మనాయుఁడు:—మలిదేవరాజు మంత్రి.

మలిదేవరాజు:—అనుగురాజునకు వీరవిజ్జలదేవియందు జనించినకుమారుఁడు.

మాంచాల:—బాలచంద్రునిభార్య.

మాడచి:—మలిదేవరాజుయొక్క రాణివాసముకాపాడు యువతి.

రేఖాంబ:—మాంచాలతల్లి; బాలచంద్రుని యత్త.

వెంకు:—నలగామరాజుసైనికులలో నొకఁడు.

శీలాంబ:—బ్రహ్మనాయుని తల్లి; దొడ్డనాయునిభార్య.

శ్యామాంగి:—బాలచంద్రుని వేశ్య.

| | |
|---|---|
| అనపోతు<br>వెలమలదోర్నీఁడు<br>చాకలచందు<br>మంగలమల్లు<br>కమ్మరపట్టి<br>కుమ్మరపట్టి<br>కంసాలిచందు | బాలచంద్రునియెడ సోదరభావముకలవారు |
| వెలమనాయుఁడు<br>మలినీఁడు<br>పినమలినీఁడు<br>గోపినాయుఁడు | మలిదేవరాజు సేనలోనివారు. |
| కొండముస్నమరాజు<br>కోటకేతుఁడు<br>మాడుగుల వీరారెడ్డి<br>చింతపల్లిరెడ్డి | నలగామరాజు హితులు. |
| ఆవాలనాయుఁడు<br>సుంకర రాముఁడు<br>చెవులనాయకులు<br>జంగిలినాయకులు<br>నెనుమాలవారు<br>పంపెటు నాగన్న | మలిదేవరాజు బాంధులు. |

# విషయసూచిక.


| పుట | విషయము |
| --- | --- |
| 3 | కథా ప్రారంభము. |
| | మలిదేవరాజు, బ్రహ్మనాయుఁడు మొదలయినవారు కార్యమపూడి యుద్ధరంగమునకు బయలుదేఱిపోవుట. |
| 7 | నాయకులు శకటంబులకుఁ బూన్చుటకై యెద్దులకుఁ బేరుపేరునఁ బిలుచుట. |
| 8 | మలిదేవరాజాదులు త్రిపురాంతకమునుండి మేళ్ళవాగు చేరుట. |
| 11 | బ్రహ్మనాయుఁడు కార్యమపూడి యుద్ధరంగముఁ జేరఁబోవుట. |
| 14 | ససైన్యంబుగ మలిదేవరాజు కార్యమపూడిం జేరుట. |
| 16 | నాయుఁడు నలగామరాజువద్దకు బట్టును రాయబారమునకై పంపుట. |
| | నలగామరాజు కొల్వుకూటమును వర్ణించుట. |
| 17 | నలగామరాజు సభయందు విద్యావినోదములు జరుగుట. |
| 19 | రాయబారమునకు వచ్చిన బట్టు నలగామరాజు సభయందుఁ బ్రవేశించుట. |
| | భట్టుమూర్తి నలగామరాజునకు రాజనీతి విశేషంబులఁ దెల్పుట. |
| 21 | నాయకురాలేకాంతంబున నలగామునకు సంధివిముఖమునైన మాటలు చెప్పుట. |
| 22 | నలగాముఁడు బట్టుతో మలిదేవరాజు బలంబుఁ దృణీకరించుట. |
| | భట్టుమూర్తి నలగామరాజును దూలనాడి బ్రహ్మనాయుని ప్రతాపాదులఁ జేర్కొనుట. |
| 24 | నాయకురాలు బట్టుతో భీకరవాక్యంబులఁ బల్కుట. |
| | బట్టు కార్యమపూడికిఁ దిరిగిపోయి గురిజాలలో జరిగిన వృత్తాంతము రాజునకుఁ దెల్పుట. |
| | బట్టు కార్యమపూడికిఁబోయిన తరువాత గురిజాలలో జరిగిన వృత్తాంతము. |
| 25 | నలగామరాజుతో నాయకురాలు మలిదేవరాజుయొక్క బలముం గూర్చి నిరసనవాక్యములాడుట. |
| | నలగాముఁడు నాయకురాలితో రాచకార్యంబులఁ జెప్పుట. |
| 29 | నలగాముఁడు గజారోహణంబొనర్చి యుద్ధభూమికి బయలుదేరుట. |
| 32 | నలగాముఁడు గజారూఢుఁడై సేనతోఁగూడి కార్యమపూడికేగుచుండఁ ద్రోవలోఁ గొదమగుండ్లవారలు విన్నపంబొనర్చుట. |
| 33 | నలగాముఁడు కార్యమపూడికిఁ జేరుట. |

| పుట | విషయము |
| --- | --- |
| 34 | వివిధదేశరాజులువచ్చి నలగామభూపతిని గలిసికొనుట. |
| 35 | వీరులు తమకు యుద్ధమున కాక్ష యిమ్మని బ్రహ్మనాయునిఁ దొందఱపఱచుట. |
| 36 | బ్రహ్మనాయుఁడు వీరులకుఁ దొందఱపడఁగలదని నీతు లుపదేశించుట. |
| 37 | ఈ సమయమున మేడపిలో జరిగిన వృత్తాంతము. |
| 38 | అనుజులతోఁ గూడి బాలచంద్రుఁడు తల్లియైన ఐతమ్మవద్దకువచ్చుట. |
| | ఐతమ్మబాలుని మనోగథము దెల్పుమని యడుగుట. |
| | భారతయుద్ధాది కథల వినుమని యైతమ్మ బాలచంద్రునికిఁ జెప్పుట. |
| 39 | బొంగరములాడుట నిజమనోరథంబని బాలుఁడు తెల్పుట. |
| | బొంగరాలాడవలదని తల్లి బాలునికిఁ జెప్పుట. |
| | బాలుఁడు తల్లిమాటలకుఁ బ్రత్యుత్తరంబు సెప్పుట. |
| | బొంగరాలాట కూడదని తల్లి మరలఁ జెప్పుట. |
| 40 | బాలుఁడు తల్లిమాటలకుఁ దగు సమాధానము చెప్పుట. |
| | బాలచంద్రుఁడు తల్లియొక్క లోభత్వమును దూలనాడుట. |
| | బాలుఁడు నిజౌదార్యమును దెల్పుట. |
| 41 | బాలచంద్రుఁ డైతమ్మకు వైరాగ్య ముపదేశించుట. |
| | బాలచంద్రుఁ డైతమ్మయొక్క వెనుకటి లోభకార్యంబుఁ బేర్కొనుట. |
| 42 | ఐతమ్మ బొంగరములు చేయుఁ బంచుట. |
| 43 | బాలచంద్రుఁడు ఘాతిక రహస్యములఁ దెల్పుట |
| | సిద్ధమైన బొంగరముల బాలచంద్రాదుల కొసఁగుట. |
| 44 | ఐతాంబ కుమారులకు బుద్ధులు గఱపుట. |
| 45 | బాలచంద్రాదులు బొంగరములాడఁబోవుట. |
| | అమ్మలక్కలు బొంగరాలాటఁ జూడఁబోవుట. |
| 46 | బాలచంద్రుఁడు బొంగరమును ద్రిప్పుట. |
| 47 | అన్నమ్మయను వైశ్యకాంతకు బొంగరముతగుల నామె మూర్ఛిల్లుట |
| | కోమటియన్నమ్మ బాలునిఁ దిట్టుట. |
| 48 | తప్పుక్షమింపుమని బాలచంద్రుఁ డన్నమను బ్రార్థించుట. |

| పుట | విషయము |
| --- | --- |
| 49 | బాలచంద్రుఁడు తల్లివద్దకేగి బ్రహ్మనాయుఁడుపోయిన యుద్ధరంగ మేదిరో యడుగుట. |
| | బాలునిమాటలు విని యైతమ్మ మూర్ఛిల్లుట. |
| | ఐతమ్మ యుద్ధవిముఖములైనమాటలు బాలునికిఁ జెప్పుట |
| 50 | బాలుఁడు నిజధర్మముల వివరించుట. |
| | ఐతమ్మ శీలమ్మ నాలోచనయడుగుట. |
| | శీలమ్మ యుపాయంబు సెప్పుట. |
| | భయంకర రణరంగవర్ణనముతో నైతమ్మ బాలుని భయపెట్టుట. |
| 51 | బాలచంద్రుఁడు నిజబలోత్కర్షంబుఁ దల్లి కెఱిఁగించుట. |
| 52 | సంతానమునకై పడ్డకష్టముల నోచిన వ్రతముల నైతమ్మ వేర్వేఱఁ జెప్పుట. |
| 58 | బాలచంద్రుని జన్మప్రకారము |
| 59 | బాలచంద్రుఁడు వీరధర్మప్రభావంబు దల్లికిఁ జెప్పుట. |
| 60 | బాలచంద్రుఁడు స్వధర్మనిరూపణముచేయుట. |
| 61 | భార్యకుఁ జెప్పి యుద్ధమునకేగుమని బాలచంద్రునితో నైతమ్మ చెప్పుట. |
| 62 | ఐతాంబ మాంచాలదగ్గఱకేగుట. |
| 64 | బాలచంద్రుఁడు వేశ్యయింటికిఁ జనుట. |
| 65 | బాలచంద్రుఁడు వేశ్యమాయలకు లోఁబడుట. |
| 67 | బాలుఁడు వారకాంతలఁ దూలనాడుట. |
| | శ్యామాంగి మాయాలాపంబులాడుట. |
| 68 | వేశ్యమాత బాలునిఁ గదియుట. |
| 70 | అనపోతు బాలచంద్రుని ప్రవర్తనను దెగడుట. |
| 71 | బాలచంద్రుఁడు గండువారింటి కేగుట. |
| | చెలికత్తెలు మాంచాల నలంకరించుట. |
| 75 | బాలచంద్రుఁడు నతనిభార్యయు నంతఃపురంబునఁ గ్రీడించుట. |
| 76 | రేఖాంబ తనకూతురయిన మాంచాలకుపదేశించిన జ్ఞానప్రకారము. |
| | బాలచంద్రుఁడు తన పూర్వప్రవర్తనకుఁ బశ్చాత్తాపమొందుట. |
| 77 | బాలచంద్రుఁడు భార్యతో వినోదంబులుసల్పుట. |
| | బాలచంద్రునియనుజాలు దుందుడుకు సేయుట. |

| పుట | విషయము |
|---|---|
| | బాలచంద్రుఁడేనుజాలపైఁ గవయ వారు లజ్జాకరంబులగుమాటలాడుట |
| 78 | మాంచాల భర్తనుదీవించి ఖడ్గంబుచేతికిచ్చి యుద్ధమునకంపుట. |
| 80 | ఐతాంబ కుమారునిదీవించి యుద్ధరంగమునకంపుట. |
| 81 | అనపోతును వెనుక కంపుటకు బాలచంద్రుఁ డుపాయంబువన్నుట. |
| 82 | బాలచంద్రుఁడు నలగొండను డాయుట. |
| 83 | సంధికయి నాయకురాలు రాయబారమంపుట. |
| | రాయబారులు మలిదేవమహీపతి కొల్వునకువచ్చుట. |
| 85 | కొమ్మరాజు వీరుల వాక్యములఁ బూర్వపక్షము సేయుట. |
| 86 | బాలచంద్రుఁడు నలగొండశిఖరమునుండి రణరంగంబు నవలోకించుట. |
| 87 | దోర్నీఁడు శిబిరంబునకు హద్దులు వివరించుట. |
| 88 | నలగొండదిగి రాజదర్శనమునకుఁ బోవుటకై బాలచంద్రుఁడు గమకించుట. |
| | బాలచంద్రుఁడు కార్యమపూడిం జేరఁగదలుట. |
| 90 | బాలచంద్రుఁడు సభలోఁ బ్రవేశించి రాజదర్శనమునకు మార్గమిమ్మని సభాస్తారుల నడుగుట. |
| | బాలచంద్రకన్నమదాసుల సంవాదప్రకారము. |
| 92 | బాలచంద్రుఁడు మలిదేవభూపతిని సమ్ముఖమున దూషించుట. |
| | గండుకన్నమనీఁడు బాలచంద్రుని వాక్యంబులఁ బూర్వపక్షము సేయుట. |
| 94 | బాలచంద్రుఁడు నాయకురాలకు కోపమువచ్చు మాటలాడుట. |
| 95 | కొమ్మరాజు బాలచంద్రుని కోపంబు చల్లార్చుట. |
| | అనపోతు మేడపికేగుట. |
| 96 | అనపోతు శ్యామాంగి గృహమునకుఁ జనుట. |
| 97 | అనపోతు మేడపినుండి మరలుట. |
| | బాలచంద్రుఁడువ్రాసిన పత్రము ననపోతు చదువుట. |
| | అనపోతు బాలచంద్రునిఁగూర్చి నిష్ఠురవాక్యంబులాడుట. |
| 99 | అనపోతుతలిదండ్రులు కుమారుని మృతకళేబరముంజూచి విలపించుట. |
| 100 | మాడచికార్యమపూడిలోని శిబిరము సొచ్చుట. |

| పుట | విషయము |
|---|---|
| | రక్తసిక్తంబైన జందెము బిరుదు చూచి బాలచంద్రుఁడార్చుట. |
| 101 | సంధి కాదని యందఱు నాశ వదలుట. |
| | బాలచంద్రుఁడు సోదరుల దగ్గఱకుఁ బిల్చుట |
| 102 | బాలచంద్రుఁడు వీరులకు నిజమనోరథంబు దెల్పుట. |
| 103 | బాలచంద్రుఁడు వీరులకుఁ బ్రత్యుత్తరమిచ్చుట. |
| | బాలచంద్రుఁడు తన పూర్వజన్మముల వృత్తాంతము తెల్పుట. |
| 105 | బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని సాహసము వారించుట. |
| | బాలుఁడు నిజశౌర్యంబు తండ్రికిఁ దెల్పుట. |
| 106 | బాలచంద్రుఁడు యుద్ధమునకుఁ బోవుటకు సమ్మతించి బ్రహ్మనాయుఁడతనికి రణధర్మంబుల నుపదేశించుట. |
| | యుద్ధరంగతత్త్వము. |
| | బ్రహ్మనాయుఁడు కుమారునకు రణనీతి నుపదేశించుట. |
| 107 | బాలుఁడు యుద్ధరంగమున కేగుట |
| | నరసింహభూపతి రణమునకు వచ్చుట |
| 108 | బాలచంద్రుఁడు భీమంబగు సంగ్రామ మొనర్చుట. |
| | నలగామరాజు సైన్యము కలఁత నొందుట. |
| 110 | బాలచంద్రుఁడు శాత్రవబలంబులఁ జక్కాడుట. |
| | పాఱిపోవుచున్న సైన్యమునకు నరసింహభూపతి ధైర్యవాక్యములు చెప్పుట. |
| 111 | నలగామరాజు సైన్యంబు బాలచంద్రునిపైఁ గవియుట. |
| 112 | బాలచంద్రుఁడు శత్రుసైన్యంబుఁ జాపకట్టుగఁ గూల్చుట. |
| | బాలచంద్రుఁడు నరసింహునితల యనుకొని వేఱొకనితలఁ గోసి తండ్రియొద్దకుఁ గొంపోవుట. |
| 118 | ఇరుపక్షములవారు సంకులసమరం బొనర్చుట. |
| 114 | బాలచంద్ర నరసింహభూపతుల ద్వంద్వయుద్ధము. |
| 115 | బాలచంద్రుఁడు నరసింహభూపతి తలఁగోసికొని తండ్రియొద్ద కేగుట. |
| | నరసింహుని శిరస్సనుకొని నాయకులు విలపించుట. |
| 116 | బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని కృత్యంబులఁ దెగడుట. |
| | బాలచంద్రుఁడు బ్రహ్మనాయుని కపటంబుల నెన్నుట. |
| | బాలచంద్రుఁడు మగిడి రణంబునకేగి యనాజాలతోఁ గలనిలో నొఱగుట. |
| 118 | యుద్ధరంగమునఁ బిశాచగణములు స్వేచ్ఛావిహారములు సల్పుట. |

## ఉపోద్ఘాత శుద్ధపత్రము.

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 6 | 5 | not horror- | not look-upon with horror. |
| 10 | 27 | శ్రీనాధ | శ్రీనాథ |
| 11 | 1 | శ్రీనాధ | శ్రీనాథ |
| | 9 | శ్రీనాధ | శ్రీనాథ |
| 12 | 26 | గా్యహస్థ్య | గార్హస్థ్య |
| 16 | 15 | శ్రీనాధ | శ్రీనాథ |
| | 16 | శ్రీనాధ | శ్రీనాథు |
| | 29 | సనాధు | సనాథు |
| | 20 | శ్రీనాధు | శ్రీనాథు |
| 18 | 28 | శ్రీనాధు | శ్రీనాథు |
| 20 | 8 | సొకనాఁడు | లోకనాఁడు |
| 23 | 10 | భీతిద్గుర్నివార | భీతిద్దుర్నివార |
| | 19 | శోకములో | శ్లోకములో |
| | 26 | శోకములు | శ్లోకములు |
| 38 | 16 | కేతుభూపాలో | కేతభూపాలో |
| 48 | 27 | మల్లమదేవు | మల్లదేవు |
| 45 | 25 | కృష్ణానదిస్నానము | కృష్ణానదిలో స్నానము |
| 52 | 1 | శ్రీనాధుఁడు | శ్రీనాథుఁడు |
| | 2 | శ్రీనాధ | శ్రీనాథ |
| 58 | 25 | కమలనాభ | శ్రీకమలనాభ |
| 57 | 28 | నందనసందన | నందనందన |
| 68 | 21 | శోకముల | శ్లోకముల |
| | 28 | శ్లోకము | శ్లోకము |
| 82 | 8 | ది॥ | ద్వి॥ |

## గ్రంథ శుద్ధపత్రము.

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 13 | ప్రార్ధించి | ప్రార్థించి |
| | 25 | శ్రీనాధు | శ్రీనాథు |
| 2 | 30 | వల్లలీ | వల్లవీ |
| | 50 | ధృవము | దృఢము |
| | 63 | భావింపగా | భావింపఁగా |
| 3 | 76 | కధా | కథా |
| | 80 | వెఱగంది | వెఱఁగంది |
| | 88 | యటకగణిక | యటఁగగణిక |
| | 105 | వెలయ | వెలయు |
| 4 | 111 | కోడెకాండ్ల | కోడెకాండ్ర |
| | 116 | పృధ్వీశు | పృథ్వీశు |
| | 121 | కట్టుబట్టి | కట్టువట్టి |
| 5 | 168 | నిందరు | నిందలు |
| | 168 | నుద్దండ | నుద్ధతి |
| | 173 | విరాగ | విరాల |
| | 198 | భూస్ధలి | భూస్థలి |
| 6 | 38 | తరుచు | తెఱుచు |
| 7 | 41 | కర్పూరకాశ్మీర | కాశ్మీరకర్పూర |
| | 56 | బిలచి | బిలిచి |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 8 | 98 | మ్రి | మఱ్ఱి |
| | 97 | కాడ | కడను |
| | 102 | బంఘు | బంధు |
| 9 | 129 | వింటపూని | వింటఁబూని |
| | 132 | బుద్ధి | బుద్ధి |
| | 135 | బంఘు | బంధ |
| | 140 | మగచి | మఱచి |
| | 147 | గ్రక్కునబిలిచి | గ్రక్కునఁబిలిచి |
| | 164 | గుడ్లు | గ్రుడ్లు |
| 10 | 172 | యఖలగక్కసులు | యఖల గాత్కసులు |
| | 184 | ద్రిప్పుమకడిసి | ద్రిప్పుమఁగడిసి |
| | 186 | యధిక | యధిక |
| | 188 | మెఱుపు | మెఱుపు |
| | 200 | యెతిగింపు | యెతేఁగింపు |
| 11 | 26 | పట్టయిన | పట్టైన |
| | 37 | ప్రమధులు | ప్రమథులు |
| | 38 | విపు | లిపు |
| | 48 | వేడ | వేఁడ |
| | 58 | కెతిగింప | కెతేఁగింప |
| | 61 | తరుచు | తఱుచు |
| 12 | 79 | బాతిరి | బాతిరి |
| | 81 | కెల్లకాగ | కెల్లఁగాగ |
| | 101 | ప్రమధా | ప్రమథా |
| | 106 | బుద్ధి | బుద్ధి |
| | 117 | ప్రేరేపించ | ప్రేరేపింప |
| | 119 | భూస్ధలి | భూస్థలి |
| | 122 | తరుచు | తఱుచు |
| 13 | 134 | బ్రహ్మాయయుసానక | బ్రహ్మాన్నయుసాన |
| | 164 | మానసులు | మానుసులు |
| 14 | 188 | మొప్పపం | మొప్పఁబం |
| | 198 | ప్రార్ధన | ప్రార్థన |
| | 12 | పూరాభ్యా | పూజాభ్యా |
| | 81 | భట్లు | బట్లు |
| 15 | 34 | ఆకధారు | అవధారు |
| | 42 | అందరును | అందఱును |
| | 52 | కలనను | కలనిక |
| | 57 | మెచ్చుగా | మెప్పుగా |
| | 62 | పోతులఁగావు | పోతులగావు |
| 16 | 73 | తీగ్ధ | తీగ్థ |
| | 80 | దరుచై | దఱుచై |
| | 98 | కధ | కథ |
| | 113 | పృధ్వి | పృథ్వి |
| 17 | 145 | మొఖ | ముఖ |
| 18 | 181 | లిద్దరు | లిద్దఱు |
| | 195 | స్ధానకస్ధితి | స్థానకస్థితి |
| 19 | 19 | తోష్ట | తోష్ఠ |
| 20 | 85 | చెనటి | చెనఁటి |
| | 96 | బదిలతఁబెట్టిన | వదలకపెట్టిన |
| | 110 | నగరూపు | నగజని |
| 21 | 128 | మిమ్ముకని | మిమ్ముఁగని |
| | 138 | నంపమటున్న | నంపమఁటున్న |
| | 139 | వెఱగందగలరు | వెఱఁగందఁగలరు |
| | 159 | యున్నాడు | యున్నాఁడు |
| | 162 | మగటిమి | మగఁటిమి |
| 22 | 171 | బృధ్వి | బృథ్వి |
| | 172 | పగరను | పగఱను |
| 23 | 14 | జక్కగా | జక్కఁగా |
| | 20 | యేరు | యేఱు |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 24 | 72 | చుండ గాను | చుండఁ గాను |
| | 61 | సిద్ధంబు | సిద్ధంబు |
| | 66 | పొమ్మ | పొమ్మఁ |
| | 82 | బుద్థి | బుద్ధి |
| 25 | 109 | మగటిమి | మగఁటిమి |
| 27 | 8 | పృధ్వీగంపింప | పృథ్వీగంపింప |
| 28 | 48 | బార్ధి | బార్థి |
| 20 | 76 | లందటికి | లందఱకు |
| | 111 | భూస్ధలి | భూస్థలి |
| 30 | 135 | ధట్టించి | దట్టించి |
| 31 | 193 | భూస్ధలము | భూస్థలము |
| 32 | 18 | పాత | పాద |
| 28 | 23 | ఝళిపించు | జళిపించు |
| | 59 | బలిమి | ఒలమి |
| 33 | 67 | మరు | మఱు |
| | 71 | మైనఁ | మైనఁ |
| | 77 | వీధి | వీథి |
| 34 | 119 | విరిథైన | వెరదైన |
| | 135 | దేవుండును | దేవుండును |
| 35 | 71 | నుపథంబు | సుపథంబు |
| | 194 | గొర్థ | గొర్ధ |
| 36 | 6 | వీధులఁబార | వీథులఁబాఱ |
| | 14 | సామర్ధ్యంబు | సామర్థ్యంబు |
| 37 | 62 | బృధ్వీ | బృథ్వీ |
| | 67 | వీధుల | వీథుల |
| | 80 | లందరు | లందఱు |
| 38 | 102 | లందరును | లందఱును |
| | 116 | బొసంగగ | బొసఁగఁగ |
| | 134 | కధ | కథ |
| | 136 | బుద్థి | బుద్ధి |
| | 140 | బుద్థి | బుద్ధి |
| 39 | 158 | బుద్థి | బుద్ధి |
| 40 | 7 | నేని | నీని |
| 42 | 86 | కెలతి | కెలఁత |
| | 102 | యగ్ధ | యగ్ర |
| | 124 | కస్నదుర | కస్నదట |
| 43 | 148 | పదార్ధ | పదార్థ |
| | 158 | పదార్ధ | పదార్థ |
| 44 | 188 | వార్థి | వార్ధి |
| | 193 | బాసన | బానస |
| | 8 | విఫణి | విపణి |
| 45 | 37 | జైన | జైని |
| 47 | 144 | గర్వారజ | గర్వారరజ |
| 48 | 188 | పధ్య | పథ్య |
| | 198 | మాయలెల్ల | మాయయ్యలెల్ల |
| 49 | 9 | మేడపికేగి | మేడపిఁకేఁగి |
| | 18 | మనుడు | మనుఁడు |
| | 32 | భూస్ధలి | భూస్థలి |
| 50 | 70 | పుడి | పురి |
| | 81 | బోకు | ఁబోకు |
| | 88 | వెరగు | వెఱఁగు |
| 51 | 120 | చెలరేగ | చెలరేగి |
| | 128 | మీగ | మీఱ |
| | 128 | ఝళిపింప | జళిపింప |
| | 116 | రధ | గధ |
| 52 | 146 | విధము | విధము |
| | 160 | పృధివి | పృథ్వీ |
| | 178 | దశరధ | దశరథ |
| | 187 | చాలకష్టించి | చాలఁగష్టించి |
| 53 | 12 | జగన్జ్యోతి | జగజ్జ్యోతి |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| | 18 | పధము | పథము |
| | 28 | మోము | నోము |
| | 27 | క్రాలేని | గ్రాలేని |
| | 33 | వీధి | వీథి |
| | 41 | శోధించి | శోధించి |
| 55 | 79 | కడుమోదము | గడుమోదము |
| | 80 | దిన్నగా | దిన్నఁగా |
| 57 | 158 | వక్షదేశంబుల | వక్షస్థలంబుల |
| 58 | 187 | యూర్వరు | యూఱ్వరు |
| 59 | 58 | కధలు | కథలు |
| 60 | 78 | వీధి | వీథి |
| | 96 | సేయగలరు | సేయఁగలరు |
| 61 | 185 | దుఃఖింపఁ | దుఃఖింప |
| 62 | 162 | నమ్మక | నమ్మఁక |
| | 184 | నుంచె | నుంచ |
| | 188 | పునుగు | పునుఁగు |
| 63 | 200 | రొటుంగు | రొటుఁగుఁ |
| | 4 | మగటిమి | మగఁటిమి |
| 64 | 64 | లార్ధి | లార్థి |
| | 71 | అర్ధము | అర్థము |
| | 86 | యునక | యునఁక |
| 64 | 86 | యునక | యునఁక |
| 65 | 115 | దరికిని | దఱికిని |
| 66 | 156 | జారి | జాఱి |
| | 157 | వక్షదేశంబున | వక్షస్థలంబున |
| 67 | 179 | వ్రెరి | వెఱ్ఱి |
| | 40 | విరిగిన | విఱిగిన |
| | 41 | పోసిన | పోయిన |
| | 47 | పైన | పైని |
| 69 | 89 | దోర్న్ని | దోర్గ్ని |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 70 | 181 | వీధి | వీథి |
| | 187 | నధు | నథు |
| | 188 | నందటి | నందఱి |
| | 150 | యుందటి | యుందఱి |
| | 156 | దోర్న్ని | దోర్గ్ని |
| 70 | 169 | సకలార్ధ | సకలార్థ |
| | 174 | మొదవ | మొదవఁ |
| | 175 | పలు | బలు |
| | 185 | దయ్యె | దయ్యెఁ |
| | 186 | తమ్ము | దమ్ము |
| 72 | 85 | భవిర | బవిర |
| | 41 | విశదంపు | విశదంబు |
| | 49 | భన్నస్వరాలు | బన్నసరాలు |
| 74 | 117 | యుద్ధటికిని | యుద్ధఱికిని |
| 76 | 30 | ప్రథమఫలంబు | ప్రథమఫలంబుఁ |
| 77 | 67 | చేయ | చేయఁ |
| | 72 | వెల్లదోలక | వెల్లఁదోలఁక |
| | 94 | కఁడంగె | కడంగె |
| 78 | 185 | మమర | మమఱ |
| 79 | 164 | బాయ | ఁబాయ |
| 80 | 186 | చుబాలు | చుబ్బాలు |
| 82 | 43 | వీధి | వీథి |
| | 49 | నానక్తి | నానక్తిఁ |
| 83 | 91 | మటంచు | మఁటంచు |
| 85 | 184 | పైన | పైని |
| | 7 | ట్లనియె | ట్లనియెఁ |
| | 8 | చేతి | జేతి |
| 87 | 90 | తూర్పొనను | దూర్పొనను |
| 89 | 186 | నన్నిఁటి | నన్నిటి |
| | 176 | పృథ్వి | పృథ్వి |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| | 177 | డెక్క్రాముం | డెక్క్రాముల్ |
| | 5 | తరగని | తఱుఁగని |
| 90 | 84 | పృథవి | పృథివి |
| 91 | 71 | పాధ్రివు | పార్థివు |
| 98 | 175 | ఋతి | ఋది |
| 94 | 50 | డనిక | డనిన |
| 95 | 71 | చూచి | జూచి |
| | 91 | బొదిలిన | బొదలిన |
| 97 | 156 | తిన్నగా | తిన్నఁగా |
| 98 | 28 | రీతి | రీతిఁ |
| | 80 | వ్యర్ధ | వ్యర్థ |
| 99 | 68 | బ్రార్ధించి | బ్రార్థించి |
| 102 | 10 | లాఱ్వారి | లాఱ్వార |
| 108 | 73 | ప్రధమ | ప్రథమ |
| | 88 | బగగి | గగఁగి |
| 104 | 127 | పేరఁట | పేరిట |
| | 181 | మగటిమి | మగఁటిమి |
| 106 | 9 | పుట్టినిలు | పుట్టినిల్లు |
| 109 | 129 | బండు | బండ్లు |
| 112 | 108 | వీది | వీథి |
| | 111 | నందటి | నందఱ |
| 118 | 181 | నాచు | నాఁచు |
| | 155 | ధగ్యంబు | ధైర్యంబు |
| 114 | 12 | నాగు | నాథు |
| 115 | 82 | నాగు | నాథు |
| | 52 | నాగు | నాథు |
| | 78 | జాగ | జాఱ |
| 116 | 117 | నిలిచి | నిలిచె |
| | 178 | తేంచేసి | వేంచేసి |
| 118 | 5 | బరమేశ్వ | పరమేశ్వ |
| 119 | 37 | బొండిగ | బొండుఁగ |
| | 47 | శ్రినాధ | శ్రీనాథ |

## పదపఙ్క్తిశుద్ధపత్రము.

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 1 | మాలాప్రభ | మాలాపహారిణీ |
| 54 | 1 | గురించి | గుఱించి |
| 55 | 2 | వగను | వఱకు |
| | 5 | వగను | వఱకు |
| 56 | 1 | లక్ష్మణుఁడు | సుగ్రీవుఁడు |
| 57 | 7 | తేబడ్డ | తేఁబడ్డ |
| | 8 | పుటంబులు | పుట్టంబులు |
| 60 | 1 | జగుద్ధా | జగుద్థా |
| 62 | 2 | కన్నమనేని | కన్నమనీని |
| 65 | 1 | యవస్ధ | యవస్థ |
| | | మన్మధా | మన్మథా |
| | 3 | మన్మధా | మన్మథా |
| | 4 | గోఽధ | గోఽథ |
| 66 | 2 | మన్మధా | మన్మథా |
| | 8 | మరణార్ధమై | మరణార్థమై |
| | | బ్రయత్నము | ప్రయత్నము |
| | | మన్మధా | మన్మథా |
| | 10 | చెప్పినాడు | చెప్పినాఁడు |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
| --- | --- | --- | --- |
| | 11 | షోఽఢ | షోఽఢ |
| | | కధోద్వ్యగ | కథోద్వ్యగ |
| | 12 | యధో | యాథో |
| 78 | 1 | యర్ధము | యర్థము |
| 79 | 1 | ననగా | ననఁగా |
| | 7 | రిట్లా | జిట్లు |
| | | తారగమ్యంబు | తారతమ్యంబు |
| 79 | 11 | ప్రణవంబు | బ్రణవంబు |
| 82 | 1 | 2 | 21 |
| | 6 | మధ్యమన్నది- | మధ్యమునన్నది |
| 84 | 4 | ప్రధాను | బ్రధాను |
| 87 | 8 | నేటనన్నిగండ్ల | పేటనన్నిగండ్ల |
| | | చెప్పుదురు | ఁజెప్పుదురు |

N.B. అలరాజు రాయబారముగల గ్రంథభాగమునుబట్టి విషయములు వేఱుగఁ గన్పించుటచే 4 వ పుటలోని పదపంక్తియందలి యంశములు మఱియొకవిధమునఁ దెలుపఁబడినవి. ఉపోద్ఘాతము 42 ప పుటలోఁ జూడనగును.

ఋ. ఉం.

# INTRODUCTION.

Ever since the evolution of man began from the brutal state, Great Persons have stepped into and passed away from this world leaving behind their marks in the annals of the progress of mankind. They are the light guiding and shaping men's thoughts and actions in their bewildering journey of life. They are the proclaimers of the unspeakable significance, the unreachable height, the immeasurable breadth and the unfathomable depth of the Infinite Power. By them the whole world moves ; in them the whole world rests ; for them the whole world longs. The history of the world is the history of these Great Men. Leaving the prehistorical periods, a little thoughtful mind can, from the dawn of documentary history down to modern times, perceive how the world has been affected by the appearance of the personages like Buddha, Christ, Alexandar, Sankara, Kalidas and Shakespeare. These Great Men or Heroes, as they are justly called, are not confined to a certain country or to a certain age. They have been making their appearance in different corners in different ages. Wherever they appeared, whether in the meditative East or in the practical West, they were received with divine honor, regarded with admiration and adored with prostration. "The worship of a Hero" truly says Carlyle, " is transcendent admiration of a Great Man......No nobler feeling than this of admiration for one higher than himself dwells in the breast of man." Architects built temples in their honour ; sculptors carved their pictures on wood and stone ; painters

drew their figures in beautiful colors; poets sang their heroic deeds. Through the veil of thirty and more centuries, we can clearly see the poetic genius, even in the earliest stages of intellectual development, bent towards venerating, worshipping and extolling the heroic element wherever found. The Vedic Rishis sang the glory of The Great Hero, Valmiki that of Rama and Vyasa that of Sreekrishna. It is this poetic instinct that excited the burning emotions of Sreenatha, the grandest, if not the first of the galaxy of Telugu Poets, to sing the valour of the Heroes of the *Palnad* and it is the history of these Palnad Heroes, depicted by Sreenatha that is found in the following pages of this book. These warriors had left their distant home on the banks of the Narmada, migrated into the broad grand plains of the Palnad and settled there—settled never to return. They conquered and colonized the country and ever since the Palnad has been called their home and they have been styled, "Palnad Heroes." They held undisturbed sway over it and diffused their religion and civilization among the people. They have built cities, made tanks, constructed anicuts, dug canals, erected temples and raised fortresses in the Palnad and the surrounding country, traces of which remain to this day whispering in the listening ears, dumb as they are, wonderful tales about the mental and material progress of their makers in days gone by. Fortunately or unfortunately, the country had their rule only for a short time. During that short period, they held such a wonderful sway as was never equalled in the annals of the mediæval history of India. Their love for the subjects was unlimited. Their principles of duty were unequalled. Their indomitable valour was unparalleled. The chaotic battlefield was their sporting ground. The roar of the trumpets

was their delightful sound. The bare flashing sword was their walking-stick. They were strict but not hard; they were brave but not ferocious ; they were valiant but not cruel. Fear, they did not know ; lawlessness, they did not hear ; death, they did not horror. After peacefully governing the country for a short period, in a great fratricidal war that ensued, they, sacrificing their lives in defence of their rights and for the honour of their country, displayed astounding and superhuman prowess which, as was naturally the case in those ancient times, held them deified in the eyes of the people dumb with awe and wonder. What with their humane government and what with their extraordinary character, they have earned the love, respect and admiration of the people as no other ephemeral sovereign had done. Villages are named after them. Temples are dedicated to them. Their pictures are carved upon stones. Gorgeous processions are held in their honour. People vie with each other in paying their adoration irrespective of caste and creed. I cannot refrain from quoting in this connection the following lines of that famous archæologist, Robert Sewell, concerning these Heroes:---

" It is a curious fact that, while the Palnad Heroes themselves worshipped indiscriminately Vishnu and Siva and while this mixture of worship is still largely observed in this out of the way part of the country, we have in this Heroes' temple a sort of Mussalman coalition into the bargain. The Mussalmans take part in the annual festival and pay their devotions to the souls of the Heroes; and the walls of the temple are discolored with the splashes of chunam water and red paint thrown on them by Muhammadan admirers." Lists of Ant. Vol. I.

The construction of the temple itself is attributed to a Mahammadan whose grave is still to be seen within the precincts of the temple. Our admiration is all the more increased when we read the story of a female of Panta Reddi family, who, acting, as the Commander-in-chief, made such wild charges, evinced such gigantic valour and fought with such stupendous courage as would excite the wonder of Nelsons and Nopoleans. Thousands of people flock together every year at Karempudi, the scence of the great battle, from almost all parts of the Telugu country. The people are very ardent in their faith in the Heroes. They worship them as Gods. In marriages and such like ceremonies, the symbols of the Heroes stand on the sacred altars in the houses of the people even to this day. It is really interesting to see how Veroism (Hero-worship) which resembles to some extent the Norse faith of Scandinavia and the Shintoism of Japan, originated in the Palnad and extended its influence thoughout the Telugu country. This Hero-worship has been continuing here for eight centuries and, though an orthodox religionist may coldly speak, a gloomy theologian may disapprove, and a haughty atheist may laugh at the idea, yet must continue as long as the Earth turns round the sun, of course, not in the same form in which it now exists in the illiterate country-folk uninfluenced by modern science and civilization.

This ballad of the Palnad Heroes, apart from its ethical and ethnical interest, marks a new era in the history of Telugu Literature. Telugu Literature seemingly beginning from Nannaya Bhatta, before whom the existence of Telugu works is only a hypothetical entity, greatly developed and arrived at a pitch of excellence, in the writings of Sreena-

tha, that has neither been equalled nor surpassed in subsequent years. Sreenatha, as a real poet, has clear insight into the recesses of human nature. He always expresses his own thoughts and feelings and does not imitate the descriptions of his forerunners so often and so shamefully as most of the Telugu poets do. He is never satisfied with using hereditary similes as Samuel Johnson calls them. His ways of description are peculiar to himself. He does not appear to have cared so much for the conventionalities of art as for the thought and its expression. For ceremony, he is a Vira Saivite, but for religion he seems to belong to the school of rational philosophers as they may be called. Though we cannot claim for him subtler elements of morality, his movements seem to be entirely in high society and he was the greatest scholar of his age in the Telugu country.

The Palnati Veeracharitra, the work of such a great poet, has been unpublished and unknown to the general public until this time. It, in the course of four hundred and more years through which it kept its existence, underwent many changes, though not radical, in its composition Somehow or other, the book, from very early times, has always been in the hands of the illiterate low caste beggars who sing the story to the people and receive something in reward from them. These illiterate people who possess the book never like the idea of publishing it thinking that, if published, every one would know those poems. Brahmins, in general, think it madness to pay close attention to the singing of these beggars and disgrace to hold conversation with them. Moreover, this voluminous poem is not in one place with one person but portions of it are scattered

throughout the Telugu country. Under such circumstances, the readers can imagine the awkward position in which I was when trying to get the book and the difficulties that would present themselves before finally succeeding in the attempt. In a way, I have now published this part of the whole poem and eagerly expect encouragement from the Telugu Public to bring out the remaining portions also within a short time. I have fixed the date of the war and the original home of the Heroes in my Telugu introduction with the light of the few historical accounts, Puranas and inscriptions I could have access to and if students of history kindly give their valuable suggestions upon the points, I shall feel highly grateful and acknowledge my indebtedness to them Although the book had been given to the press nearly one year back, it could not be completed till now owing to my limited means and time that I could devote for it in the midst of other duties. My best thanks are, however, due to M. R. Ry. D. Kesava Row Pantulu Garu, Proprietor of the Vani Press, for the kind and timely help he rendered me in many ways in bringing the book to its present form at least so early as this.

BEZWADA,
*9th June, 1911.* } AKKIRAJU UMAKANTAM.

# పల్నాటి వీరచరిత్ర కథాసారము

ఉత్తరదేశమునఁ బాలమాచాపురి యను పట్టణముకలదు. జంభనాపురియని దీనికి నామాంతరము. దీని ననుగురాజేలుచుండెను. ఇతఁడు కార్తవీర్యార్జునున కేడవతరమువాఁడు. కార్తవీర్యుఁడు చేసిన పాపములు బాధింపఁగా ననుగురాజు బ్రాహ్మణోత్తముల యాలోచనవలన జీడిమానిగడ్డలుధరించి ససైన్యుఁడు సామాత్యుఁడు సధనుఁడు సకలజీవుఁడు సకుటుంబుఁడై రాజ్యమువిడిచి పాపపరిహారార్థమై తీర్థయాత్రలకు వెడలి నానాక్షేత్రంబులసేవింపుచు నదులలో మునుఁగుచు నంధ్రదేశమునకువచ్చి యమరావతిరేవునఁ గృష్ణానదిలో స్నానము చేయఁగా నల్లనిజీడిమానిగడ్డలు తెల్లనాయెను. ఇట్లు వస్త్రములు తెల్లనగుటయే పాపవిమోచనమునకుఁ జిహ్నమని బ్రాహ్మణు లనుగురాజునకుఁ బ్రథమమునఁ జెప్పియుండిరి. అనుగురాజప్పుడు చందవోలులో రాజ్యముచేయుచున్న రాజుకూతును వివాహమాడెను. ఆమెపేరు మైలాంబ. కూతునకుఁ జందవోలురాజు పల్నాడరణమిచ్చినందున ననుగురాజు గురిజాలరాజధానిగఁ బల్నాటికధిపతియయ్యెను. అనుగురాజునకు భార్యలుమువ్వురు. వీరవిద్యాదేవి (విజ్జలదేవి?), భూరమాదేవి, మైలమాదేవి. వీరవిద్యాదేవియందుఁ బెదమల్లదేవుఁడు, పినమల్లదేవుఁడు, బాలమల్లదేవుఁడు నను మూగురుపుత్రులుగలిగిరి. మైలమాదేవియందు నలగామరాజు పుట్టెను. భూరమాదేవియందుఁ గామరాజు, నరసింగరాజు, ఘట్టిరాజు, పెరుమాళ్లురాజు నను నల్వురుసుతు లుద్భవించిరి. అనుగురాజుమంత్రి దొడ్డనాయుఁడు ఇతఁడు వెలమ; జేతినాయుని కుమారుఁడు. దొడ్డనాయునికొడుకులు బాదరాజు, బ్రహ్మనాయుఁడు. బాదరాజునకుఁ బెద్దన్నయని నామాంతరముగలదు. సంతానముకలుగకముం దనుగురాజుచే బాదరాజు పెంచుకొనఁబడి పుత్రియుండును గంచర్లపురాధీశుఁడగునైన కృష్ణగంధర్వుని కూతురు ఐవాంబను బెండ్లాడెను. బ్రహ్మనాయుఁడు విష్ణువుగా భావింపఁబడుచున్నాఁడు. కురుక్షేత్రయుద్ధమునఁ గృష్ణుఁ డెంత ప్రధానుఁడుగానుండెనో పల్నాటియుద్ధమున బ్రహ్మనాయుఁ డంతప్రధానుఁడుగానుండెను. ఈయన పల్నాటికృష్ణుఁడని పేర్కొనఁబడుచున్నాఁడు. ఇతని కుమారుఁడు బాలచంద్రుఁడు. కన్నమదాసని మఱియొకఁడుగలఁడు.

ఇట్లు దొడ్డనాయుఁడు మంత్రిగ ననుగురాజు కొంతకాలముపరిపాలించి మృతినొందెను. దొడ్డనాయుఁడుకూడ స్వర్గమునకేగెను. నలగామరాజు పట్టాభిషిక్తుఁడాయెను. నాయకురాలను నొకయువతి నిజశక్తిచేత ననుగురాజు ననుగ్రహము సంపాదించి

యతఁడు చనిపోయిన వెనుక నలగామరాజువద్ద మంత్రిణియయ్యెను. ఈ నాయకురాలి యసలు పేరు నాగాంబ. నాయకురాలనియే సాధారణముగ వ్యవహరింపఁబడుచున్నది. నాయకురాలి జన్మస్థలము పల్నాడుతాలూకాలో నాగులేటియొడ్డుననున్న జిట్టగామాల పాడను నొకచిన్న గ్రామము. ఈమె పంటరెడ్లకులమునఁబుట్టినది. తండ్రిపేరు చౌదరి రామిరెడ్డి. మేనమామ పేరు మేకపోతు సింగారెడ్డి. ఈమెయింటిపేరరవల్లివారని చెప్పఁబడినది. ఇది తల్లిగారింటిపేరో యత్తగారింటిపేరో తెలియదు. ఈమెభర్త నామ మెచ్చటఁ గానరాదు. పల్నాటియుద్ధమున కీమెయే కారకురాలు. అతిపరాక్రమశాలిని. గురిజాలపురవరాధీశ్వరులగు నలగామరాజాదు లీమెచేతిలోఁ గీలుబొమ్మలవలెనుండువారు. ఈమె బ్రహ్మనాయుని కిరుపోటీగా రాజ్యతంత్రమునడపిన మహాసమర్థురాలు. యుద్ధావసానమునకుఁ జలనమునొందక మగబిరుదుకట్టి యశ్వారూఢయై బ్రహ్మనాయునితోఁ బోర సమకట్టిన నిరుపమానశూరురాలు. గ్రంథవిస్తరభీతిచే నీమెచరిత్రము పూర్తిగ వ్రాయఁజాలకున్నాను. ఈమె మంత్రిణియగునప్పటికి వీరవిద్యాదేవికిజన్మించిన మల్లదేవులు బాలురుగానుండిరి. బ్రహ్మనాయుఁడు వీరిని దగ్గఱకుఁదీసి రాజ్యములోఁ గొంతభాగ మిప్పించి గురిజాలనుండిపోయి మాచెర్లపట్టణము నిర్మించికొని వారు యుక్తవయస్కులు కానందున వారికిబదులుగఁ దానే పరిపాలించుచుండెను. వారు పెద్దవారైనతరువాతఁ గల్యాణపట్టణాధీశుఁడైన వీరసోమునికుమార్తెలనిప్పించి వివాహముచేసి పెదమల్లదేవుని మాచెర్లకుఁ బట్టాభిషిక్తునిఁజేసెను. అనుగురాజు చనిపోవునప్పుడు కొడుకులనందఱను బ్రహ్మనాయునికప్పగించెనుగాని నలగామరాజు నాయకురాలిని మంత్రిణిగాఁ జేసికొన్నను మల్లదేవులకుఁ బెండ్లిచేసినతరువాత బ్రహ్మనాయుఁడు ద్వేషబుద్ధిలేక నలగామరాజునకు భూరమాదేవిపుత్రులకుఁ గట్నములిచ్చుటకై గురిజాలకుఁబోయెను. వారును దగినవిధముల నాదరించిరి. గురిజాలలో బ్రహ్మనాయునికి నాయకురాలు విషముపెట్టించెను గాని యామెప్రయత్నము నిష్ఫలమాయెను. మాయచేసి నాయకురాలతనినిఁ గోడిపందెమున నోడఁబఱచెను. ఓడిపోయినవా రేడుసంవత్సరములు రాజ్యమువిడిచిపెట్టి పరభూములకుఁ బోవలయునని పందెపుటొడంబడిక. పందెములో బ్రహ్మనాయుఁడోడి మల్లదేవుల వెంటఁబెట్టికొని మాచెర్లవిడిచి కృష్ణానదిని దాఁటి మండాదిపట్టణమునకు వలసపోయెను. నాయకురాలు సైన్యమునంపి మండాదిలోనున్న మల్లదేవుల యావులమందను బోడిపించెను. కుపితుఁడై బ్రహ్మనాయుఁడు గురిజాలపైకివెడలి యుద్ధముచేసెను. తరువాత మండాది విడిచి బ్రహ్మనాయుఁడు మల్లదేవులు మొదలగువారు శ్రీశైలమునకేగి యాసీమను బాలించుచుండిన భిక్షావలివారిదగ్గఱఁ గొన్ని గ్రామములు గుత్తకుఁదీసికొని * వీరమేడపియను

* వీరమేడపి యిప్పటికిఁ గలదు-

పట్టణముకట్టి యచ్చటనివసించిరి. వీరమేడపిలోఁ గొంతకాలముండి లెక్కలు చూడఁగా నప్పటికివారు మాచెర్లవిడిచి యేడుసంవత్సరములమీద నాలుమాసములాయెను. వలసపోవలసిన దేశుసంవత్సరములేగనుకఁ బై నాలుమాసములపన్ను తమకివ్వవలసియుండుననియు మాచెర్లరాజ్యము తమస్వాధీనము చేయవలసినదనియు బ్రహ్మనాయుఁడు నలగామరాజునకు రాయబారమంపెను. రాయబారి యలరాజు. ఇతఁడుమల్లదేవునిమఱఁదియైన కొమ్మరాజు కొడుకు; కల్యాణపురాధీశ్వరుండగు వీరసోముని మనుమఁడు; నలగామరాజుయొక్కయల్లుఁడు. నాయకురాలు పువ్వులలోవిషముపెట్టియిప్పించి యలరాజును †చెర్లగుడిపాటివద్దఁ జంపించెను. అలరాజుచావునకు మల్లదేవాదులుకోపించి యుద్ధసన్నద్ధులైరి. ఇరుపక్షములవారు కార్యమపూడివద్ద నాగులేటితీరమున మహాయుద్ధముగావించిరి. మల్లదేవునివైపు ప్రథమమున యుద్ధముచేసినవాఁడు బాలచంద్రుఁడు. తరువాత బాదరాజు, కొమ్మరాజు యుద్ధముచేసిరి ఉభయపక్షములలోను వేలకొలఁదిజనులుమడిసిరి. చిట్టచివరకు నలగామరాజు పరాజితుఁడై బ్రహ్మనాయుని శరణుచొచ్చెను. మహావీరుఁడు, దయారసపరిపూర్ణుఁడు, నిర్మలహృదయుఁడునైన బ్రహ్మనాయుఁడభయంబొసంగి నలగామరాజును గురిజాలసింహాసనమెక్కించెను. అ॥ ఉ॥

---

† గురిజాలకు సమీపముననున్నది.

## వీరచరిత్రచారిత్రము.

"Unhappy the nation that hath no history and happy the nation that can hear the ballads commemorating the adventures of her warriors sung with fervour and happy the country that can point with pride on the pages of history to patriots who wept for their countries' wrongs, stood againt the oppressor and the tyrant * * * *. But such is not our lot and our heroes passed away with their deeds unsung and unrecorded. (చరిత్రములేనిజాతి యానందవిహీనము. మనఃపూర్వకముగఁ గీర్తింపఁబడిన యోధుల సాహసకార్యములను జ్ఞాపకము చేయు కథలు వినఁగల జాతి యదృష్టవంతము. దేశము యొక్క లోపములను వగచి క్రూరకంటకుల నిరోధించిన దేశాభిమానులను జరిత్రపత్రములయందు గర్వముతోఁ జూపఁగలదేశము ధన్యము. కానిమనభాగ్యమట్టిదికాదు. మావీరులు గతించినారు. వారికార్యములు కీర్తింపఁబడలేదు. వ్రాయఁబడలేదు)" అని యొక హైందవనవలాకారుఁడు వ్రాసినవాక్యములు యథార్థములు. మనపూర్వులు చరిత్రగ్రంథములు విస్తారముగా వ్రాసినవారుకారు. కాని యచ్చటచ్చట మహాశూరులచరిత్రమును పాటలరూపముననో పదములరూపముననో సహజకవులు కీర్తించియున్నారు. అవి కేవలము భావప్రధానములు. శబ్దశుద్ధి కొన్నిట నరుదుగాఁగలదు. కొన్నిటలేదు. బొబ్బిలికథాదులిట్టివే. ఈ కథలుచెప్పునప్పుడు నేను బాల్యమునుండియుఁ గుతూహలముతో వినుచుండెడువాఁడను. మాగ్రామములలోఁ దఱచుగా నొకతెగవారు పల్నాటివారికథయని యొకకథను జెప్పుచు భిక్షమునకు వచ్చుచుండెడువారు. విద్యాగంధములేని చిన్నతనమందాకథ వినినప్పుడు దానియందలియంశములు గాని క్రమముగాని తెలియకపోయినప్పటికి వారు కత్తులు త్రిప్పుట గంభీరముగా గర్జిలుట మొదలగు నభినయములఁ జూచి యిదియేదో కలహమని తలంచుచుంటిని. 1906 సంవత్సరము వఱకు దినములు గడచినవి. కథవినినప్పుడు మాత్రము మరలమరల వినవలయునని యపేక్ష పొడముచుండెను. 1907 సంవత్సరము వేసవికాలపు సెలవులలో నింటికి వెళ్ళినప్పుడు తిరిగి యీకథవినఁ దటస్థించెను. అప్పుడు కథాంశములఁ జాలమట్టుకు గ్రహింపఁగలిగితినిగాని దత్కథయందువచ్చు పాత్రముల పరాక్రమమున కాశ్చర్యపడి యొకటిద్దఱు పెద్దమనుష్యులతో ముచ్చటింప నది శ్రీనాథవిరచితమనియు దానినే వల్లించి విద్యావాసనలేనివారు తప్పులు కుప్పలుగాఁ జెప్పుచుందురనియు వారుదెల్పిరి. అప్పటికి

శ్రీనాథకవికృతగ్రంథంబులఁగొన్నింటినిఁ జదివి యాతని కవిసార్వభౌమత్వము కొంతవఱకెఱిఁగియుండినవాఁడనగుటచే నదిమొదలాకథయందుఁ దొంటికంటె నెక్కువయాసక్తితోనుంటిని. దీనినిఁజెప్పుచుండెడు బల్నాటిలోఁ బెక్కుగ్రామములవినియుంటిని. ఎచ్చటఁజూచినను వాద్యసహితముగాఁ గథకుఁడీకథను జెప్పఁదొడఁగినప్పుడు పల్నాటివీరవరుల సంకీర్తనము శ్రోత్రపుటంబులఁబడఁగనే యాశక్తిగలవారందఱు శరీరము గగుర్పాటంద మనోవిలీనంబులై యణఁగియున్న యంతశ్శక్తులు ప్రబోధమునొందఁ దత్తద్రసోచితంబుగ ముఖంబులవికాసము మార్పుచెంద నింద్రియంబులన్యవిషయపరాఙ్ముఖములై యుండఁ బరవశులై విను చుందురు. గుణత్రయవికారంబులయిన మానవమనోవృత్తుల కిట్లేకాధిష్ఠానంబై శ్రీనాథమహాకవిసార్వభౌముని హృదయంబును గానము సేయఁబురికొల్పిన యావీరవరులచరిత్రము విశేషమహిమాస్పదంబై వాల్మీకి వ్యాస మహర్షిపుంగవులచేఁ గీర్తింపఁబడిన శ్రీరామశ్రీకృష్ణచరిత్రములంబోలెఁ బ్రపంచధర్మమార్గదర్శకంబై యుండుననితలంచి తచ్చరిత్రము సంపూర్ణముగ గ్రహింపఁగుతూహలుండనై పలుకష్టములకులోనయ్యు 1910 వ సంవత్సరమునాఁటికి గ్రంథము కొంతవఱకుసంపాదించితిని. దీనిని సంపాదించుటలోనేమి తరువాతఁ బ్రకటించుటలోనేమి నాకుఁగలిగినకష్టములన్నింటి నిచ్చట వివరించుట యప్రస్తుతము. చూచినమిత్రులు కొంతవఱకెఱుఁగుదురు. దీనినిఁజదివినప్పటినుండియు నిది ప్రకటింపఁబడకపోవుట యాంధ్రభాషకు గొప్పకొఱఁతయని నమ్మి పలుమాఱుసంభవించిన నిరుత్సాహములకులోనుగాక యిప్పటికొకతీరుగాఁ బ్రచురింపఁగలిగితి. ఈగ్రంథము పేరు పల్నాటివీరచరిత్రము- వీరులఁగూర్చియు వారిదేశకాలాదులఁగూర్చియు వ్రాయుటకుఁ బూర్వము పలనాటిసీమఁగుఱించి కొంతముచ్చటించెదను. పలనాడు ప్రస్తుతము గుంటూరుజిల్లాలో నొకతాలూకాయైయున్నది. దీనికిముఖ్యగ్రామము గురిజాల. ఇచ్చటనే తహశీల్దారుండును. పలనాటిసీమ కృష్ణానదీదక్షిణతీరమున సముద్రమునకు షుమారు 120 మైళ్ళదూరములోనున్నది. దీనికుత్తరమునఁ బడమట 75 మైళ్ళపొడవునఁ గృష్ణానది ప్రవహించుచున్నది. దక్షిణమునఁ గొండలచేతను సాంద్రారణ్యములచేతను నావరింపఁబడియున్నది. తూర్పునఁ జిన్నయడవులు వ్యాపించియున్నవి. దీనివైశాల్య మించుమించుగ 1050 చదరపుమైళ్ళు. నాగులేఱు, చంద్రవంక అనునవి యిచ్చటిముఖ్యనదులు. వీరచరిత్రలోఁ బ్రధానముగవచ్చు కార్యముపూడి మాచెర్లపట్టణములలో మొదటిది నాగులేటితీరమునను రెండవది చంద్రవంకయొడ్డుననునున్నవి. అప్పకవి నాగులేటిని నాగానదియని పేర్కొనియున్నాఁడు. ఒక గొప్పనాగుపాముయొక్క ప్రాణముతీసి మధ్యముగాఁ బాఱుటవలన దీనికి నాగులేఱని పేరువచ్చినట్లీగ్రంథమున 86వపుటలోవ్రాయఁబడినది. కానినాగులను నొకజాతివా రీదేశముననుండిరని పూర్వచరిత్రమువలనఁ దెలియుచున్నది. నాగయ్య, నాగమ్మ అను పేరులుగూడ స్త్రీపురుషుల కిచ్చట నెక్కువగాఁ బెట్టఁబడుచున్నవి.

బహుశః నాగజాతివారికిఁ బ్రియమైనదిగనుక దీనికినాగులేటని పేరువచ్చినదేమో. చంద్రవంకను జంద్రభాగ యని సాధారణముగ వాడుచున్నారు. ఈగ్రంథము 54 వ పుటలోఁ జంద్రభాగయని ప్రయోగము కానవగును. మాచెర్ల వీరభద్రస్వామియాలయములోఁ దూర్పువైపున దక్షిణ ముఖముగానున్న యెఱ్ఱరాతిబండమీది శాసనమునందుఁగూడఁ జంద్రభాగయనియే చెప్పఁబడియున్నది. ఆశాసనము నిందుదహరించుచున్నాను-

"లింగాంబా ప్రదదాతి............

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకవర్షఁబులు...... నిజఆనందసంవత్సర...లు మాచెర్ల యిష్టకామేశ్వరికిన్ని వీరభద్రేశ్వరునకున్ను గాయిగోవాన ఖడ్గనారాయణ బిరుదాంకితప్రశస్తులై శ్వేతచ్ఛత్రాధీశ్వర రేచెర్లగోత్రపవిత్రులయిన వెలిగోటి... ..మనాయనింగారి ప్రపౌత్రులై తిమ్మనాయనింగారి పౌత్రులై బ...నాయనింగారి పుత్రులైన కొమారి తిమ్మనాయనింగారి అర్ధాంగి లింగాంబగారు దండంబెట్టి యిచ్చిన శాసనము-

శ్రీమద్రాజమార్తాండ రాజపరమేశ్వర శ్రీవీరప్రతాప సదాశివరాయదేవమహారాజులంగారు పృథ్వీరాజ్యంచేయుచుండగాను తద్రాజ్యధురంధరులయిన శ్రీమన్మహామండలేశ్వర రామరాజు తిరుమలజయదేవమహారాజులుంగారు కుమారతిమ్మనాయనింగారి నాయంకరానకు పాలించియిచ్చిన నాగార్జునకొండసీమలోని మాచెర్లకు ఉత్తరభాగాన చంద్రభాగానదికి పడమర నం॥కు ౪౧। నాలుగుపుట్లపందుము క్షేత్రం పాలిచ్చే లింగాపురం అనెడి అగ్రహారం కట్టించి యీసోమగ్రహణపుణ్యకాలమందుల గంగాగర్భమందుల ధారాపూర్వకంగాను సమర్పిస్తిమి గనుక ఆలింగాపురాన నలుదరిపొలాలు హేమ కూప తటాక నిధి నిక్షేప జల పాషాణ ఆగామిసిద్ధసాధ్యాలు అనెడి అష్టభోగతేజస్వామ్యాలు సమర్పిస్తిమిగాన ఆలింగాపురమందుల పొలము ఆచంద్రార్కస్థాయిగాను అంగరంగవైభవాలకు అవుధరించి ఆగ్రామం దేవరకు ఎవ్వరుఇత్యకపోయినా గంగాగర్భమందు గోబ్రాహ్మణహత్యచేసినపాపాన బోతారు. వారాణసిలో తలిదండ్రుల చంపినపాపాన బోతారు-

శ్లో॥ ఏకైవభగినీలోకే ఏషామేవ భూభుజాం
నభోగ్యా నకరగ్రాహ్యా దేవదత్తావసుంధరా"

ఇట్లు చంద్రభాగయని పెక్కుస్థలములం దుదహరింపఁబడుటవలన "శరావతీ వేత్రవతీ చంద్రభాగా సరస్వతీ" యనియమరుఁడు చెప్పినచంద్రభాగయిదియే యేమోయని యభి

ప్రాయము కలుగవచ్చుఁగాని యది కేవలము భ్రమ. ప్రమగాదు. భారతమునందలి భీష్మ పర్వము 9 వ అధ్యాయములో

"నదీంపిబంతిపిపులాం గంగాంసింధుం సరస్వతీం

... ... ...

శతద్రుం చంద్రభాగాంచ యమునాంచమహానదీం- 5

నదీంవేత్రవతీంచైవ కృష్ణవేణీంచనిమ్నగాం- 17

విదిశాంకృష్ణవేణాంచ తామ్రాంచకపిలామపి- 28"

కౌశికీం నిమ్నగాంశోణాం బాహుదామథచంద్రమం- 29

సదానిరామయాంకృష్ణాం మందగాంచంద్రవాహినీం-" 38

అను శ్లోకములయందుఁ జంద్రభాగానది యుదహరింపఁబడినదిగాని నదులిచ్చటఁ గ్రమరహితముగఁ జెప్పఁబడియుండుటచేతఁ జంద్రభాగ యెచ్చటిదో యీశ్లోకములంబట్టి నిశ్చయించుటకు వీలులేదు. ఎట్లన కొకోక్కకమునందు వేర్వేఱుదేశస్త్రీల విశేషంబులఁజెప్పు సందర్భమున

గీ॥ "చంద్రభాగాసరిత్ప్రదేశములసతులు
వారిఁ జందఁ జెయగు శరావతిశతద్రు
సింధుసరిదంతరంబులఁ జెలువలెల్ల"

నని యుత్తరదేశస్త్రీల మొదటఁజెప్పిని తరువాత నాంధ్రదేశస్త్రీలంగూర్చి చెప్పినాఁడు. ఆపద్యములు నీతిబాహ్యములగుటచే నిందుదహరింపఁబడవయ్యె. దీనినిఁబట్టి చూడఁ జంద్రభాగానది యుత్తరహిందూస్థానమందలి నదిగానియాంధ్రదేశపునదిగాదని తెలియఁగలదు. ఇదియునుంగాక భారతమునందలి యానుశాసనికపర్వములోఁ ద్వితీయాశ్వాసమున భీష్ముఁడు ధర్మజునకుఁ బుణ్యతీర్థవిశేషంబుల నెఱిఁగించుచో

"సీ॥ సప్తదినంబులు చంద్రభాగను వితస్తనునూర్మిమాలినిఁ దగవసించి
యాహారవిరహితులైయుండ మునిసమానుండగుఁ గాశ్మీరమండలమున
నదులుకొన్ని" అని యుత్తరదేశనదులు క్రమముగాఁ జెప్పఁబడినతరువాత "విను వింధ్యంబుననొకనెల" అని మొదలుగ దక్షిణాపథంబునందలి తీర్థంబులు చెప్పఁబడినవిగానఁ జంద్రభాగ యుత్తరదేశపునదియేయని తేలుచున్నది. విష్ణుపురాణ మీసంశయము బూర్తిగ నివర్తించుచున్నది.

"శతద్రుచంద్రభాగాద్యా హిమవత్పాదనిఃసృతాః" అని విష్ణుపురాణ ద్వితీయాంశమందలి తృతీయాధ్యాయములోని 14వ శ్లోకమునఁ జెప్పఁబడినది. దీనివలనఁ జంద్రభాగానది హిమవత్పర్వతమునందుఁ బుట్టినదనియు నందుచే నార్యావర్తములోఁ బ్రవహించునదియే యనియు స్పష్టమగుచున్నది. కావునఁ బల్నాటిలోని చంద్రవంక చంద్రభాగానది కానేరదు. చంద్రవంకకుఁ బర్యాయనామముగఁ జంద్రభాగయని వాడియుందురు. చంద్రవంకయు నాగులేఱును దక్షిణమునుండి యుత్తరమునకుఁ బ్రవహించి కృష్ణానదిలోఁ గలియుచున్నవి. పలనాటిసీమ దండకారణ్యములో నొకభాగమై పూర్వము ఖరదూషణాదులు నివసించినస్థలమయినట్లు తెలియవచ్చుచున్నది. విశ్వామిత్రుఁడు సత్రయాగము చేసిన దిచ్చోటనేయని మాచెర్లకు దగ్గఱగాఁ గృష్ణానదీతీరసమీపమున నొకప్రదేశమును జనులిప్పటికిఁ జూపుచున్నారు. అచ్చటికనేకులు వెళ్ళి యాస్థలము నక్కడిస్వాభావికప్రదర్శనము చూచి బాహ్యప్రపంచంబు మఱచి స్ఫటికోపలముభంగి నిర్మలమయినహృదయముతో భగవన్మహిమలఁదలఁచితలఁచి పరవశులగు మహర్షిపుంగవులు నిశ్చయముగ నివసింపఁదగిన ప్రదేశమే యని తలలూచుచున్నారు. ఈసీమయందుఁ బలువిధములయిన లోహపుగనులుగలవు. బాస్వెలుదొరగారు వారి రిపోర్టులో నిట్లువ్రాసిరి.

" I may mention that lead in found is considerable quantitics near Karempudi in the Palnad, but the mines are not now worked. Copper is found both in the Palnad and Vinukonda Taluqs." (పల్నాటిలోని కారెంపూడివద్ద సీసము విస్తారముగా దొరకునని చెప్పవచ్చును. కాని యిప్పుడుగనులు త్రవ్వఁబడుటలేదు. రాగి పల్నాడు వినుకొండతాలూకాలలో రెంటిలో దొరకుచున్నది) రాగి సీసమేకాక యిచ్చట నినుముకూడ నెక్కువగ దొరకును. పల్నాటిలోని కొన్నిగ్రామములయందిప్పటికి నినుము కరఁగిన పెద్దకొలిములచిహ్నములు నినుపరాళ్లు స్పష్టముగాఁ గానవచ్చుచున్నవి. గుత్తికొండగ్రామములో నిప్పటికి నొక భాగమునకుఁ గొలిములపాలెమని పేరుగలదు. అచ్చటఁ గొలిములుపెట్టినప్రదేశమును నినుపరాళ్లను దిబ్బలును స్ఫుటముగ దృగ్గోచరములగుచున్నవి. ఈగ్రామములోఁజేరిన యొక కొండ కినుపకొండయనికూడఁ బేరుకలదు. వీనినిఁబట్టిచూడఁ బలనాటిసీమయొకప్పుడు లోహపరిశ్రమమునకు ముఖ్యస్థానమై మహాప్రసిద్ధిగాంచి చుట్టునున్న దేశములకుఁ గావలసిన యినుము రాగి మొదలగులోహములఁ బంపుచు వ్యాపారాశ్రయమై యుండెననుటకు సందేహ మెంతమాత్రమును లేదు. లోహములేగాక శ్రేష్ఠతరమయిన పాలరాయి నాపరాయి దొరకుగనులు చాలఁగలవు. ఈగనులలో నిప్పటికిఁ బనిచేయఁబడుచున్నది. విచారింప జగత్ప్రఖ్యాతములయిన యమరావతిచైత్యము లీపలనాటిరాతితోడనే నిర్మింపఁబడినవి. శ్రేష్ఠతరములగు శిలలకును లోహ

ములకు నేగాక పలనాటిసీమ వజ్రములకుఁగూడఁ బ్రసిద్ధికెక్కినది. మెమోయర్స్ ఆఫ్ ది జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా యను గ్రంథముయొక్క 8 వ సంపుటము (Memoirs of the Geological Survey of India, Volume 8) లోని 110 వ పుటయందు దీక్రిందివిధమున వ్రాయఁబడినది:—

"Along the eastern edge of the Tumrukota Range, there are traces of old diamond workings, more decidedly around Mallavaram on the right bank of the Kistna where the limestones lapping round the base of the hill have been regularly undermined to get at the quartzite beneath them containing diamonds Here there certainly seems good proof of the existance of a set of diamond bearing beds perfectly distinguishable from the quartzites of which the rest of the Range is mainly made, for the debris and other evidence of the old workings are strictly confined to the edge of the limestones................. . .........These works date from the Moghul rule."

దీనివలనఁ బల్నాటిలోని తుమ్మకోటవద్దను, మల్లవరమువద్దను వజ్రపుగనులున్నట్లును మొగలాయిరాజులకాలమునందాగనులలోఁ బనిచేయఁబడుచుండినట్లును దెలియుచున్నది. వేయేల ఢిల్లీపురాధీశ్వరుండయిన బేబరు దక్షిణహస్తతలంబున లాస్యమాడి షాజహానునకు బహిఃప్రాణమై, సౌగంధికనాదరుషాను వశీకరించి యాఫ్గనిస్తానాధినాథుని హృదయపీఠినధిష్ఠించి తిరిగి భారతచక్రవర్తులపజ్జంజేరి బలాత్కారముగ ద్వీపాంతరమునకుఁ గొంపోఁబడి ప్రస్తుత మఖండసామ్రాజ్యధురంధరుండయిన పంచమజార్జియుత్తమాంగమారోహించి ప్రపంచమునందలి గొప్పశేఖరులకెల్లఁ గన్నెఱ్ఱగానున్న యాయనర్ఘరత్నమున కాయమూల్యమణి కాసౌభాగ్యఖని కాకోహినూరు వజ్రంబునకుఁ బలనాటిలోని కృష్ణానదీతీరప్రాంతప్రదేశముల వజ్రపుగనులే జన్మస్థానమని యూహింపఁబడుచున్నది అసంపూర్ణవైదగ్ధ్యంబులయిన మానవహస్తములచే నిర్మితంబులగు వస్తువైచిత్ర్యంబులు పెక్కులు లేకపోయినను కవిసార్వభౌముల మేధస్సున కాహారముకల్పించి, యోధవరుల సంకల్పములకుఁ బ్రోత్సాహముకావించి మహర్షిసత్తముల హృదయములకు నిర్భరానందమొసంగు నైసర్గికవిలాసశోభితప్రదేశము లాసీమయందు మిక్కుటముగఁగలవని చెప్పవచ్చును. దీనికిఁ బల్లెనాడు, పలనాడు, పలినాడు, పల్నాడని పలునామము లచ్చటచ్చటఁ

గానవచ్చుచున్నవిగాని సాధారణముగ నిప్పుడు పలనాడని పల్నాడని మాత్రమే వ్యవహరింపఁబడుచున్నది. ఏదియుక్తనామమో విచారింతము. చిన్నిచిన్ని పల్లెలుగల దేశముగానఁ బల్లెనాడని పేరువచ్చినదని కొందఱుచెప్పుదురు. పల్నాటిలోని మాచెర్ల, గురిజాల, తుమ్మకోట, కారెంపూడి గ్రామములలోఁ గోటలుగలవు. పల్నాటిదేశము నేలిన రాజుల కొకప్పుడివి ముఖ్యస్థానములుగనుండెను. ఇవి యాకాలమునఁ బట్టణములుగ నుండియుండవలయును. కావునఁ బల్నాటిలోఁ గేవలము పల్లెలేగాక కొన్ని పట్టణములు కొన్ని పల్లెలు నుండెననుటకు సందియములేదు. దీనికిసమీపముననున్న కొండవీడు, వినుకొండ, బెల్లముకొండసీమలలోఁగూడ నిట్లే కొన్ని పట్టణములు కొన్ని పల్లెలునుండెను. ఈతీరుననుండుట సామాన్యమైయుండఁ బల్నాటిసీమకుఁ బల్లెనాడని పేరిడఁ గారణము కానరాదు. ప్రపంచచారిత్రము నవలోకించినచోఁ బ్రతిదేశమునకును దానియందలి నదులనుబట్టియో, కొండలనుబట్టియో, యేలినరాజులనుబట్టియో, నివసించుజనులను బట్టియో, నైసర్గికస్వరూపములనుబట్టియో పేరువచ్చినట్లు కనఁబడును. మఱియు,

గీ॥ "చిన్నచిన్నరాళ్లు చిల్లరదేవుళ్లు। నాగులేటినీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు సర్పంబులును దేళ్లు। పల్లెనాటిసీమ పల్లెటూళ్లు"॥

అనుపద్యమును శ్రీనాథరచితమైన చాటుపద్యమని యుదహరించుచు దీనిలో శ్రీనాథుఁడుకూడఁ బల్లెనాడనియే ప్రయోగించెననియు గాన బల్లెనాడను నామమే రూఢమనియు దానికిఁ దాముచెప్పిన వ్యుత్పత్త్యర్థమే యథార్థమనియుఁ బైపక్షమువారు నుడువుదురు. ఈపద్యమునందలి "దేవుళ్లు" అను రూపము వ్యాకరణవిరుద్ధమైనది. దేవశబ్దమును బహుత్వంబునఁ బ్రయోగింపఁగూడదు. సకలకవిసనాథుఁడును సర్వలక్షణవేత్తయును శబ్దశాస్త్రపారంగతుఁడు నైన శ్రీనాథుఁ డీస్వల్పవిషయంబు నెఱుఁగకయిట్లు ప్రయోగించెననుట యెంతయు సాహసము. కాన నీపద్యము శ్రీనాథరచితముకాక యిటీవలి యప్రౌఢకవికల్పితమైయుండును. వీనినిఁబట్టిచూడఁ బల్లెనాడనునది సరియైననామము కానట్లు విశదమగుచున్నది. కృష్ణామండలచరిత్రసంగ్రహము వ్రాసిన మెకంజీదొరగారిట్లు నుడువుచున్నారు.—

" A more poetical derivation of Palnad is 'Milk Land' from the light cream-coloured marble that abounds there."

పాలరాయి విశేషముగా నుండుటవలనఁ బాలనాడని పేరువచ్చినదనియుఁ బాలనాడే పల్నాడయినదనియు వీరియభిప్రాయము. పాలనాడనఁగాఁ బాలదేశమని యర్థ

ము. గాయిశబ్దమునకుఁగల "పాల" యను విశేషణము "నాడు" న కెట్లు రాఁగలదో తెలియదు. "పాలనాడు" అన్నప్పుడు పాలరాయిగలదేశమే యని యర్థము చెప్పుటకుఁ బ్రసక్తి లేదు. ఒకవేళ దొరగారు చెప్పిన వ్యుత్పత్తియే నిజమైనను "పాలనాడు" పల్నాడుగా మాఱుటలోఁ గొంత యస్వాభావికమయిన మార్పు కానంబడుచున్నది. పలునాడని యొకచోఁ గానంబడియెడు. నానావిధభూములుకలది యని దీనికర్థము చెప్పుచున్నారు. నాడనగా దేశముకాని భూమి కాదు. ఈసీమ యున్నతములయిన కొండలచేఁ జుట్టునావరింపఁబడి నడుమఁ బల్లము గానుండుటవలన "పల్లునాడు" నాఁ బేర్కొంది "పల్లునాడు" పల్లు, విల్లు, ముల్లు శబ్దంబులంబోలె ద్విత్వలోపంబు రాఁగా "పలునాడు" గా మాఱి "పలునాడు" కొద్దిమార్పుచెంది పలనాడై పలనాడు పల్నాడై "పలనాడు" "పల్నాడు" అను రెండురూపములుమాత్రము వ్యవహరింపఁబడుచువచ్చెనని నాయభిప్రాయము. పూర్వగ్రంథములయందును శిలాశాసనములయందును బలనాడు పల్నాడను రెండురూపములే సాధారణముగ నుపయోగింపఁబడియున్నవి. శ్రీనాథుఁడు వీరచరిత్రమునం దెచ్చటఁ బల్నాడని ప్రయోగింపలేదు. పింగళిసూరన ప్రభావతీప్రద్యుమ్నములోని

"ఉ॥ సంగర శాసనాపహరిపర్థిబలంబుఁ గృష్ణకేలంకులక్ష్మీ సూనుల్
పెంపుగ నమ్మహోగ్రులు గెల్చి బలనాటను బోకనాటనుం
సొంపుగ గందయాదులిటుఁ జెంపువహించిన యస్మదాదులా
పింగళిలోకమంత్రి యిలు పేరనె చాలఁబ్రసిద్ధులెల్లచోన్॥"

అనుపద్యమునఁ బలనాడని చెప్పినాఁడు. "పలనాటి గొల్లలపాటజాతి" యను సీసపద్యపాదంబున గణపవరపు వేంకటకవి పలనాడనియే వ్రాసినాఁడు. అమరావతిలోఁ గులోత్తుంగచోళుని పరాంతకుఁడగు కొమ్మనాయకుని శాసనమునఁ బలనాడని లిఖింపఁబడియున్నది. ఆశాసనము కొంత యిటనుదహరించెదను.

"స్వస్తిశ్రీశకవర్షంబులు ౧౦౭౭ అగు నేటి విషుసంక్రాంతినిమిత్తమున పలనాడు మహీమండలమండనంబైన దామలూరివిభుండును..............చతుర్థవంశతిలకుండును శ్రీమన్మహామండలేశ్వర కులోత్తుంగచోడ గొంకమహీశ్వరపదారాధకుండునైన కొమ్మనాయకుండు.........

శ్లో॥ అస్తి స్వస్తిమదగ్రహారనగర గ్రామైస్సమగ్రశ్రియా
జుష్టః పుష్టజనో............
.........పలనాడు నామవిషయో............
శాకాబ్దే మునిశైలఖంసగణితే శ్రీధాన్యవాటీపురే"॥

కార్యమపూడివీరాలయములోఁ దూర్పువైపు బండమీది నల్లాంచక్రవర్తుల శాసనమునందు "పలినాటివారు' అని వ్రాయఁబడియున్నది. పలినాడనునది పలనాడుయొక్క వికృతరూపమే కాని వేఱొండుకాదు- తనకంటెఁ బూర్వులు గ్రంథములయందును శాసనములయందును "బలనాడు" "పల్నాడు" అని ప్రయోగించియుండ


గీ॥ "పల్లెనాటను నూటతొంబదియు నాల్గు
గ్రామములనీడుగానక కాకునూరి
వెంగనార్యుఁడు వేదవేదాంగములను
బ్రస్తుతికినెక్క మాఱుటబ్రహ్మయనఁగ"

అనుపద్యమున నప్పకవి ప్రాకృతజనవచోధోరణిం బల్లెనాడని చెప్పుట ప్రమాద జనితంబు. వీని నన్నింటినిబట్టిచూడ "పలునాడు" అనునది నిజనామమనియు "పలనాడు" "పల్నాడు" అనురూపములు వ్యవహారమున రూఢములైనవనియు స్పష్టమగుచున్నది. గ్రంథవిస్తరభీతిచేఁ బల్నాటివిషయ మింతటితో ముగించి ప్రస్తుతాంశమైన వీరచరిత్రమునకు వచ్చెదను. వీరులనఁగా నెవరు? యుద్ధముఁజేయువారు మాత్రమే వీరులుకారు ఎవ్వరి సంకల్పము లమోఘంబులో, యెవ్వరి చరిత్రములు ధర్మమార్గదర్శకంబులో, యెవ్వరి వచనంబులు మానవసామాన్యము నాకర్షించి జీవితపరమార్థంబైన చిత్తవిశ్రాంతియొసఁగుచున్నవో, యెవ్వరి నిశ్చంచలమనోవృత్తిచేఁ బ్రపంచమునందలి మహాకార్యములన్నియుఁ గావింపఁబడినవో యెవ్వరియందుఁ బరమాత్మ పరిపూర్ణమునకు సమీపించియుండునో యా భగవదంశసంభూతులందఱు వీరులే. సత్యసంధుండై గురుభక్తిపరాయణుండై సమర రంగంబుల నసమానపరాక్రమశాలియైన భీష్ముఁడు వీరుఁడు. నిశ్చల సంకల్పుఁడై, యమోఘబాణుండై నిజనామసంచకితక్షాత్రవబలుండైన బ్రహ్మనాయుఁడు వీరుఁడు. తత్త్వరహస్యంబులబోధించి కుమతఖండనంబు గావించి జగద్గురువనం బ్రఖ్యాతిగాంచి నిఖిల జనవందనీయుండైన శంకరుండు వీరుఁడు. ఆ సేతుహిమాచలపర్యంతమే కాక పశ్చిమ ఖండంబులకుఁగూడ నేఁగి యచ్చటి జనులను వాగ్ధారలఁ బ్రమాన్వడఁజేసి హైందవుల యాధ్యాత్మికౌన్నత్యముం బ్రకటించి సకలప్రపంచంబు నాశ్చర్యాంబుధిం దేల్చిన వివేకానందస్వామి వీరుఁడు. మనోవికారంబులను మానుషభావంబులను బ్రకృతివైచిత్ర్యంబులను బయల్పఱచి నిజవాక్యంబుల నాలించు మానవులకు నిర్భరానంద మొసఁగుచున్న కాళిదాసుఁడు వీరుఁడు. సకలవిద్యాధురీణుఁడై కవితాసముద్రమంథరుండై విజ్ఞానప్రౌఢయోద్ధతములైన పల్కులనంధ్రజనంబుం బ్రబోధించుచున్న శ్రీనాథుఁడు వీరుఁడు. ఇట్లనేకవిధంబులఁ గాలవశంబున వీరులచ్చటచ్చటఁ బొడకట్టుచుందురు. ఏదేశమందీ పూజ్యులు జన్మించినను జనులు వారి నసాధారణులుగ భావించుచున్నారు, వారి నామములు పవిత్రములుగ స్మరిం

పఁబడుచున్నవి. వారి సంకల్పములు కార్యరూపములుగఁ బరిణమించి శాశ్వతమై యున్నవి. వారి వచనంబులు జనుల కర్ణంబులందు ఘంటానాదమై మ్రోఁగుచున్నవి. కవులీ మహానుభావుల చరిత్రములఁ గానము చేసియున్నారు. శిల్పు లీ పరమగురువుల ప్రతిమల శిలలపైఁ జెక్కియున్నారు. చిత్రకారు లీ పుణ్యపురుషుల యాకారమును మనోజ్ఞవర్ణములతో లిఖించియున్నారు. వారు మాటలాడుట చాలించియుఁ జాలించినవారు కారు. బోధించుట మానియు మానినవారు కారు. ప్రపంచమును విడిచియు విడిచినవారు కారు. మన కథానాయకులగు పలనాటివీరు లుత్తరదేశమునఁ దమ నివాసము వదలి దక్షిణాపథమునకు వచ్చి బల్నాటిసీమ స్వాధీనము చేసికొని యచ్చటనే స్థిరపడిరి. అప్పటినుండి వారు పల్నాటివారని పేర్కొనఁబడుచుండిరి. వీరు పలనాటి సీమారాజ్యభారము నిర్వహించుచుఁ జుట్టుప్రక్కలనున్న సంస్థానాధిపతులవద్దఁ గప్పములు పుచ్చుకొనుచుండిరి. ప్రజలసౌఖ్యమునకై యెక్కువ పాటుపడిరి. ఇప్పటికిని వీరు నిర్మించిన పట్టణములు గలవు; త్రవ్వించిన తటాకములు గలవు; కట్టించిన దేవాలయములు గలవు; కావించిన కోటలు గలవు. జనుల మతనాగరికతలయందు వీరివలనఁ బెక్కుమార్పులు కలిగినవి. వీరు కొద్దికాలముమాత్రమే రాజ్యము చేసిరి. ఈ కొద్దికాలములోనే జనులయొక్క విశ్వాసమునకు గౌరవమునకుఁ బ్రేమకుఁ బాత్రులై రామరాజ్యముగఁ బ్రభుత్వము చేసి సపత్నిపుత్రులకు సంభవించిన ఘోరయుద్ధంబున నసమాన పరాక్రమంబు నమానుష శౌర్యంబు నశ్రుతపూర్వ ధైర్యంబు కనఁబఱచి రణమొనరించి పరస్పరనిహతులై మానవాతీతులని జనులచే భావింపఁబడిరి. మహామహులఁ జూచినప్పుడుగాని వారినిఁగుఱించి వినినప్పుడుగాని తనబుద్ధి కగోచరంబైన యొకశక్తి వారియందుఁ గలదనియెంచి పరమోత్కృష్టులుగఁ దలంచుట మానవునికి సహజము. వీరి నారాధించుట కాలయములు నెలకొల్పఁబడినవి. వీరి యాకారములు శిలలమీఁదఁ జెక్కఁబడినవి. వీరి నామముల జ్ఞాపకము చేయుటకుఁగాను ప్రతి సంవత్సరము గొప్పయుత్సవములు జరుగుచున్నవి. కులమతభేదములులేక జనులందఱు వీరి నర్చింపుచున్నారు. ప్రస్తుతము కార్యమపూడిలోనున్న వీరాలయ మొకమహమ్మదీయునిచేఁ గట్టఁబడినట్లీ క్రింది వృత్తాంతము చెప్పుదురు. మహమ్మదీయులకాలమున నొక గొప్పసైన్యము దక్షిణమునుండి హైదరాబాదునకుఁ బోవుచు కార్యమపూడిలో నాగులేటియొడ్డునవిడిసి యచ్చటనున్న వీరులలింగంబులు పొయిగడ్డలుగఁ జేసి యన్నము వండికొనఁగా సైన్యమంతయు సర్పదష్టమై మూర్ఛలుభంగి నేలకు వ్రాలెనఁట. అప్పుడు సేనాధిపతి యేమితోఁపక నివ్వెఱపడియుండ నొక బ్రాహ్మణుఁ డా మార్గమునఁ బోవుచు నిది యేమని యడిగెనఁట. అతఁడంతయు సవిస్తరముగఁ జెప్పినమీద దీనికిఁ గారణము వీరులకపచారము చేయుటయేయనియు వారి కాలయము కట్టించెదనని మ్రొక్కినచో సైన్యము తక్షణమే లేచుననియుఁ జెప్పి కొంతదూరమేగి యదృశ్యుండయ్యెనఁట. ఆ తురు

ష్కుఁ డాపడిలోనున్న వాఁడుగాన నల్లే త్రొక్కఁగా సైనికులు నిద్రవోయి మేల్కాంచినట్లు లేచిరఁట. అంతట నతఁడు లింగములను గుడికట్టించి వీరులయం దత్యంత భక్తికల వాఁడయి వారి యమానుష శౌర్య పరాక్రమము నొకనాఁడు వినవిన నతనికి నతని తమ్మునికి నావేశము కలిగి యొఱలలోనుండి కత్తులుదూసి నిర్భరోద్రేకంబునఁ బొడిచికొని ప్రాణములు విడువ నా సోదరశవముల వీరాలయములోనేఁ బాతిపెట్టిరఁట. దీనిలోఁ జాల మట్టునకుఁ గల్పనయున్నను గొంత సత్యముండకమానదు. వారిగోరీలిప్పటికిఁ జెడకుండ నున్నవి. ఈ తురుష్కవీరులకుఁగూడఁ బల్నాటివీరులతోఁ బాటు పూజలు జరుగుచున్నవి. తురుష్కుం డననేల? పంచమకుల సంజాతుఁడైన యొక వీరునికిఁ బ్రత్యేకముగా వీరాలయములో గుడి నిర్మింపఁబడియున్నది. ఆహా! ఎంత శౌర్యము! ఎంత పరాక్రమము! ఎంత నిష్కళంకత! నిరుపమాన తేజోవిభాసితులై, యవ్యాజమనోవిరాజితులై, సంతతనిజధర్మపథానుసారులగు పుణ్యపురుషు లేకులమున జన్మించిన నేమి? ఏదేశమునఁ బ్రభవించిన నేమి? సర్వజన పూజనీయులు. ఒక్క పల్నాటిసీమవారు మాత్రమేకాక యాంధ్రదేశము యొక్క నానాభాగములనుండి వేలకొలఁది జనులు ప్రతిసంవత్సరము వీరోత్సవమునకు గార్యమపూడికి వచ్చుచున్నారు. ప్రప్రథమమున వారియందలి యధిక గౌరవముచే పూజోత్సవములు జరపియుందురు. కాని రానురాను జనులు వారి విగ్రహములకుఁ బూజచేసి వారినిఁ గేవలము దేవతలనియే భావించిరి. ఇప్పుడనేకులు తమకు జబ్బులువచ్చినప్పుడు గాని యాపదలు సంభవించినప్పుడుగాని తిరుపతి వేంకటేశ్వరునకు యల్లమంద కోటీశ్వనకు మ్రొక్కినట్లుగానే వీరులకు మ్రొక్కి కడగండ్లు గడచినచో ముడుపులు చెల్లించుచున్నారు. శుభకార్యములలో వీరుల నారాధించుచున్నారు. సోదిచెప్పెడు సెటుకలసానినోటినుండి మాటిమాటికి వీరులే వచ్చుచున్నారు. ఇట్టిస్థితి మిక్కిలి శోచనీయము. చెట్లకుఁ బాములకుఁ బూజలు సల్పువా రిదియొనర్చుట యొక వింతకాదు. జనులు విద్యావిహీనులై, మూఢభక్తి పరాయణులుగ నుందురంతకాల మిట్టివి జరుగుచునే యుండును-కాలము గడచి జనులలో నాగరికత హెచ్చినకొలఁది, విద్యప్రబలినకొలఁది, జ్ఞానమభివృద్ధియైనకొలఁదిఁ బైనుదహరింపఁబడినరీతిని దేవతలనిభావించి వీరులఁ బూజించుట యుండనేరదుగాని వీరపూజమాత్రము ప్రపంచ ముండునంతకాల ముండునదియే పోవునది కాదు. జ్ఞానము హెచ్చినకొలఁది మహాపురుషులయందు గౌరవము హెచ్చుచుండును. ఆధ్యాత్మికముగఁ దనకంటె నధికుని మహాత్ముని గారవించుటకంటె మానవున కుత్తమగుణము మఱియొకటి యుండనేరదు. ఈ విషయ మింతటితో ముగించి యికఁ జరిత్రాంశములఁ జర్చించెదను. కథలోఁ జెప్పఁబడిన యుత్తరదేశమునుండి పలనాటికివచ్చిన రాజు "అనుగురాజు." ఈతఁడు ప్రబలసైన్య సమేతుఁడై దక్షిణాపథమునకు వచ్చెను. ఈయన కార్తవీర్యార్జునుని వంశస్థుఁడని చెప్పఁబడినది. కార్తవీర్యుఁడు హైహయ వంశసంజాతుఁడు.

ఈ వంశపురాజులు హైహయులని చెప్పబడుదురు. కనుక ననుగురాజు హైహయుడే యగును నాకు లభించిన వీరచరిత్ర తాళపత్ర సంపుటముయొక్క ప్రథమభాగములో ననుగురాజు వంశావళి యీ క్రింది విధమున నున్నది.




ఇది వీరకామేంద్రునివఱకు సరిగాలేదు. ఈ వంశక్రమమునకును మురిగొండ వీరభద్రకవి పద్యకావ్యములోని వంశక్రమమునకును భేదమగపడుచున్నది. అనుగురాజుకుం

దరచక్రవర్తి కొడుకని వీరభద్రకవి చెప్పినాఁడు. అనుగురాజు పుత్రుని పేరు వీరకామేంద్రుఁడు. సాధారణముగఁ దాత పేరు మనుమనికిఁ బెట్టుచుండుదురు. కావున ననుగురాజు తండ్రి పేరు వీరభద్రకవి చెప్పినట్లు సుందరచక్రవర్తి కాక వీరకామేంద్రుఁడేయై యుండవలయును. అనుగురా జుత్తరదేశమునుండి వచ్చెనని చెప్పియుంటిమి. అది యేదేశమో విచారింపవలసియున్నది. ఇతఁ డుత్తరదేశములో స్వరాజ్యము విడిచివచ్చెనని వీరచరిత్ర ప్రథమభాగములోని యీక్రింది వాక్యములవలనఁ దెలియుచున్నది.

ద్వి॥ "ఒగినన్గుభూపుఁడయోధ్యపాలుండు
తమతాతచేసిన తగుపాతకములఁ
బోఁగొట్టవలెనని పొందుగాఁదలఁచి
యుత్తరాదినినుండి యుర్వీశుఁడపుడు
ఘనదక్షిణాదికిఁ గదలెడువేళ"

ఇందులో నయోధ్యపాలుఁడనియున్నందువలన నితఁడయోధ్యదేశము నేలినవాఁడని భ్రమకలుగుచున్నదిగాని వీరచరిత్రము సాకల్యముగఁ జదివినచో నీ భ్రమపోవును. ఇతని రాజధాని పాలమాచాపురి. దీనికి జంభవాపురియని నామాంతరము. ఉత్తరదేశములనుండి వచ్చినరాజుల నయోధ్యరాజులని చెప్పుట మనవారికి వాడుకగానుండినట్లు తోఁచుచున్నది. చాళుక్యులుకూడ నయోధ్యరాజులనియే యొకచోటఁ జెప్పఁబడినది. అనుగురాజు కార్తవీర్యుని వంశమువాఁడని యిదివఱకే తెల్పియుంటిని. ఈ వంశమువారికి హైహయులని పేరు. హైహయు లేదేశపురాజులో చూతము. ఈ హైహయులు క్రీ॥ శ॥ 12 వ శతాబ్దాంతమువఱకు రాజ్యముచేసినట్లు శిలాశాసనముల వలనఁ దెలియుచున్నది. మిర్జాపురమునకుఁ బోవురోడ్డుసమీపమున బిల్హారివద్ద హైహయుల శాసనమొకటి కనుఁగొనఁబడెను. ఇది యొకరాతిమీదఁ జెక్కఁబడి 84 సంస్కృత శ్లోకములతోనున్నది. వీనిలోఁ గొన్ని స్రగ్ధరలు, శార్దూలములు మఱి వివిధవృత్తములు గలవు. శాసనమంతయు నుదహరించినచో నిదియే యొక చిన్న గ్రంథమగును గాన మనకుఁ గావలసిన ముఖ్యాంశముల మాత్రము దెలిపెదను.

"7. శ్లో. నేత్రాదత్రేర్ధరిత్రీధవలన సుహృదాం ధామధామ్నాముదంచ
ల్లోకాలోకం యదాపః ప్రభవమతలినధ్వాంత విధ్వంసహేతుః
సోఽయంసోమాభిధాన స్తిలకయతికళావాళి మస్యైవవంశంభో
రస్మాదేవప్రవృత్తఃక్షిమపరమప్యన్వయో హైహయానాం
8. అస్మింశ్చవంద్య తమతాంగమి తే బుధాద్యై
రాద్యైర్ణృపైర్ణృపతి రర్జునఇత్యుదారః

ఆసీద్విపద్విపిన కర్ణనకీర్ణనీయ
కీర్తిచ్ఛటాచ్ఛురిత దీర్ఘదిగంతరాళః

55\. కింస్తూయతే౽సౌ మునిపుంగవో౽థవా
శ్రీచేది చంద్రోన్నృపతిః కృతాదరః
సుద్వృత్తభూత ప్రహితైరుపాయనైః
ప్రాదర్శ్యభక్తింవిధినానివాయయం

58\. అథసవిహితకృత్యశ్చేదినాథః సమగ్రః
కరితురగ సమగ్రః శక్తసామన్తపత్తిః
దిశమతిశయరమ్యాం సంప్రతస్థే ప్రతీచీం
అహితజనితభీతిర్దుర్నివార ప్రచారః

69\. యస్యోత్తుంగ గజేంద్రమజ్జనగళద్దానాంబుభిర్మిశ్రితం
రేవావారివివర్తితిక్తముచితస్నానేన తన్వీజనః
సంప్రాపోర్యునితంబతాడన వశవ్యస్తాస్తవీచీచయం
సర్వాంగంస్మరసౌరభేణ మహతానిర్వ్యాజమారాజితః''

శాసనము పూర్తిగా నుదహరించినఁ జదువరులకు విషయములు బాగుగ విశదమగా నుగాని గ్రంథవిస్తరభీతిచే నింతటితోఁ జాలించితి. ఈ శాసనములో హైహయ వంశస్థుఁడైన యువరాజ దేవుని వంశానుక్రమణిక శ్లోకబద్ధముగా చెప్పఁబడినది. పెండియు శ్లోకల్లుఁడు మొదలు యువరాజదేవునివఱకు వారికార్యములు పరాక్రమములు వర్ణింపఁబడినవి. 55 వ శ్లోకములోఁ జేదిరాజు కృతాదరుఁడై హృదయశివుఁడను మునికిఁగానుకలిచ్చినట్లు చెప్పఁబడినది. ''శ్రీచేదిచంద్రోన్నృపతిః'' అనునది యువరాజుదేవుని తాతయైనకేయూరవర్షునికన్వయించును- ఇచ్చటఁ జేదిచంద్రుఁడనగాఁ గేయూరవర్షుఁడే. 58 వ శ్లోకములో యువరాజదేవుని తండ్రియైన లక్ష్మణుఁడు ససైన్యముగఁ బశ్చిమదిక్కునకేగ నని యున్నది- ఈ శ్లోకములోనే లక్ష్మణునికిఁ 'జేదినాథః' యను విశేషణము చేర్పఁబడినది. దీనివలన హైహయులు రాజ్యము చేసినది చేదిదేశమయినట్లు స్పష్టపడును. ఈహైహయులదే మఱియొక శాసనము 'కరంబేలు'(Karambel)అనుగ్రామమువద్ద దొరకినది. ఇదియు సంస్కృతశాసనమే. దీనిలోను 44 శ్లోకములు నొకపెద్ద వచనముగలదు .దీనినిఁగూడఁ బూర్తిగా నుదహరింపఁజాలక యచ్చటచ్చట ముఖ్యాంశముల వివరించుచున్నాఁడ.

5 శ్లో॥ హేలాగృహీతపునరుక్త సమస్తశస్త్రో
గోత్రేజయత్యధికమన్యస కార్తవీర్యః

అత్రైవ హైహయనృపాన్వయపూర్వపుంసి
రాజేతి నామశశలక్ష్మణి చక్రమేయః॥

7 తత్రాన్వయే నయవతాం ప్రవరో నరేంద్రః
ఆసీన్మదాంధనృపగంధగజాధిరాజ
నిర్మాథకేసరియువా యువరాజదేవః॥

25 రమణగుణనికేతః కేతనం మంగళానాం
ప్రచురతరయశోభిః శోభితస్తత్తనూజః
నృపతిరవనిభానుర్విశ్వ విశ్వాంతభాను
ర్జయతి విజయసింహః సంహతారాతిసింహః॥

స చ పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర శ్రీవామదేవ పాదానుధ్యాత పరమభట్టారక మహారాజాధిరాజ పరమేశ్వర పరమమాహేశ్వర త్రికళింగాధిపతి నిజభుజోపార్జితాశ్వపతి గజపతి నరపతి రాజత్రయాధిపతి శ్రీమద్విజయ సింహదేవపాదే ద్విజయినః మహారాజ్ఞీ ప్రమహారాజ్ఞీ ప్రఅజయసింహదేవ మహామంత్రి ప్రవాచార్య భట్టారక శ్రీమద్రాజగురు విద్యాదేవ మహాపురోహిత పండిత శ్రీయజ్ఞధరశర్మప్రధాన మహామంత్యధికారి శ్రీకీకిమహాక్షపటలిక మహాప్రధానాధికరణలేఖ్యాధికారి శ్రీదశమూలికవత్సరాజ మహాసాంధివిగ్రహాధికారి శ్రీపురుషోత్తమ మహాప్రతీహార దుష్టసాధ్యపరాధ్యక భాండారిక ప్రవాత్యవార అశ్వసాధనిక ఇత్యేతానన్యాంశ్చ ప్రవాస్యమాన గ్రామనివాసి జనపదాంశ్చ ఆహూయ యథార్హం మానయతి బోధయతి సమాజ్ఞాపయతి చ యథావిదితమస్తు భవతాం సంవత్ ౯౩౨ శ్రీమత్త్రిపుర్యాం యుగాద్ నర్మదాయాం విధివత్స్నాత్వా శ్రీమహాదేవం సమభ్యర్చ్య మాతాపిత్రోరాత్మనశ్చ పుణ్యయశోభివృద్ధయే సాంబరాపత్తలాయాం చోరలాయాగ్రామః...............సావర్ణ్యగోత్రాయ భార్గవచ్యావన ఆప్నవాన ఔర్వజామదగ్న్యేతి పంచప్రవరాయ ఛందోగశాఖినే పండిత శ్రీజనార్దనప్రపౌత్రాయ పండిత సూర్యశర్మణ పౌత్రాయ పండిత శ్రీభిస్కరపుత్రాయ పండిత శ్రీసోఢశర్మణే బ్రాహ్మణాయ ఉదకపూర్వకత్వేన శాసనీకృత్య అస్మద్భట్టానుజ్ఞయా మాతృశ్రీకోసలదేవ్యా ప్రదత్తః॥

44 శ్లో॥ అభ్యధరస్య పౌత్రేణ శ్రీధర్మస్యసూనునా
లిఖితంవత్సరాజేనచేదీశదశమూలినా"

ఈ శాసనమున హైహయసంజాతుఁడైన విజయసింహుఁడు తనతల్లి కోసలదేవికిఁగాను చోరలాయిగ్రామము సోఢశర్మ కుదకపూర్వకముగ నిచ్చినట్లు చెప్పఁబడినది విజ

య సింహునియొక్క వంశావళి యువరాజదేవునివద్దనుండి వర్ణింపఁబడినది. ఈ యువరాజదేవుఁడు వెనుకటి శాసనములోని యువరాజదేవుఁడేయై యుండవచ్చును. శాసనమందలి సంస్కృతవచనములో విజయసింహుఁడు తనదశమూలిక్షైన వత్సరాజు మొదలగు వారలఁబిలిపించి దానకాలమున బోధించి యాజ్ఞాపించినట్లు వ్రాయఁబడినది. 44 వ శ్లోకములో వత్సరాజునకుఁ "చేదీశదశమూలినా" యను విశేషణము చేర్పఁబడినది. వత్సరాజు విజయసింహుని దశమూలి. చేదీశదశమూలినాయని వత్సరాజునకు విశేషణముంచుట వలన విజయసింహుఁడు చేదీశుఁడైనట్లు విశదమగుచున్నది. విజయసింహుఁడు హైహయుఁడుగాన హైహయులు చేదీశులని నిర్ణయింపవలయును. స్మిత్ దొరగారు తమ పూర్వహిందూదేశచరిత్ర (Smith's early History of India)లో 864 వ పుట యందిట్లు వ్రాయుచున్నారు:— "The Kalachuri or Haihaya Rajas of Chedi are last mentioned in an inscription of the year 1181 A. D. and the manner of their disappearance is not exactly known (చేదీశులగు కలచూరిలేక హైహయరాజులు క్రీ॥శ॥ 1181 వ సంవత్సర శాసనమునఁగడసారి యుదహరింపఁబడియున్నారు వీరెట్లు నశించినది సరిగాఁ దెలియదు)" ఈవాక్యములలో స్మిత్తుగారును హైహయులు చేదీశులనియే చెప్పిరి. ఇంకఁజాల నిదర్శనములు గలవు గాని యిదిచాలునని యుంచి హైహయులు చేదీశులేయని స్పష్టముచేసికొని చేదిదేశ మెచ్చటిదో వివరించెదను. చేదిస్థలనిర్దేశమున కీ శాసనములయందే కొన్ని యాధారములు కాన్పించుచున్నవి. మొదటిశాసనముయొక్క 69వ శ్లోకములో యువరాజదేవునిఁగూర్చి "ఎవ్వని యుత్తుంగగజేంద్రములు మజ్జనము చేయుటవలన జారిన దానజలముతోఁగూడిన తిక్తమైనతిక్తమైన రేవా (నర్మదా) నదీనీరమును స్నానముచేయుటచేఁ బొంది తన్వీజనము నిర్వ్యాజముగ దేహమంతటను గొప్ప సుగసౌరభముతోఁ గూడినదో" యని వర్ణింపఁబడినది. దీనినిఁబట్టిచూడ యువరాజదేవుఁడు రాజ్యముచేసినది నర్మదానదీప్రాంతదేశమై యుండవలెనని తేలుచున్నది. మఱియు రెండవశాసనముయొక్క వచనమునందు "నర్మదాయాంస్నాత్వా" అని లిఖింపఁబడియున్నది. విజయసింహుఁడు దానమిచ్చుటకుముందు నర్మదానదియందు స్నానముచేసి నర్మదా నదీ జలమునే సోఢశర్మకు ధారపోసినాఁడు. విజయసింహుఁడు రాజ్యముచేసినది నర్మదానదీతీరదేశమేయని దీనినిఁబట్టి విశదమగుచున్నది. యువరాజదేవుఁడు, విజయసింహుఁడు హైహయులేగావున నీరెండుశాసనములవలన హైహయులు రాజ్యముచేసినది నర్మదానదీప్రాంత దేశమేయని స్పష్టపడెననుటకు సందియములేదు. భాగవత నవమస్కంధములో

"చ॥ ఒకనాఁడా మనుజేంద్రుఁడంగనలతో నుద్దాముఁడై వేఁటనుం
డక రేవా (నర్మద) నదికేగి యందుఁ దెలినీటం జల్లుపోరాడి దీ

ఘుటకరాజ్యంబున నానదీజలములం గట్టెన్ వడిన్నీరు ప్రవా
లసుఁబెల్లుబ్బఁగ నాగతుండయిన యాలంకేశుపైఁ దొట్టఁగన్॥"

అని కలదు. దీనిలోని మనుజేంద్రుఁడు కార్తవీర్యార్జునుఁడు. నర్మదానదిలో జలక్రీడసల్పుట యితఁడా ప్రాంతదేశము నే పరిపాలించుటను సూచించుచున్నది. ఇట్లు పురాణములవలనఁగూడ హైహయులు నర్మదానదీప్రాంతదేశము నే యేలినట్లు తెలియుచున్నది. మఱియు మనకుదొరకిన రెండు సంస్కృతశాసనములును నర్మదానదీ సమీప ప్రదేశములలోనే కనుఁగొనఁబడినవి. మొదటిది నర్మదానదీ సమీపమున నున్న జబ్బలూపురునకు 50 మైళ్ళదూరమున బిల్హారియను గ్రామమునందు మిర్జాపురమునకుఁబోవు రోడ్డువద్ద దొరకినది. రెండవదికూడ జబ్బల్పూరునకు దాపున "కరంబేలు"(Karanbel) అను గ్రామములోఁ గనుఁగొనఁబడినది. ఈ శాసనములచ్చట నుండుట హైహయులు నర్మదానదీప్రాంతదేశమును బాలించిరనుటకు నిదర్శనముగ నున్నది. చేదీశునిదికాకపోయినను జేదీశుఁడుదహరింపఁబడిన శాసనము నర్మదానదికుత్తరమున జబ్బల్పురమునకు దూరముగ గ్వాలియరులో భీల్సాకోటయందొకటి కనుఁగొనఁబడినది గాని దానినిఁగూడ నుదహరించుట యనవసరమని వదలుచున్నాను. ఈ ప్రబల దృష్టాంతము లన్నింటివలనను హైహయులు రాజ్యము చేసినది నర్మదానదీప్రాంతదేశమేయని నిర్ధారణచేయుటకనుమానమేమియుఁ గానరాదు. హైహయులేలినది చేదిదేశమని యిదివఱకు స్పష్టపఱుపఁబడినది కనుక నర్మదానదీప్రాంతదేశమే చేదిదేశమని నిశ్శంకముగాఁ జెప్పవచ్చును. రెండవదియైన కరంబేలు శాసనముయొక్క వచనములోని "సాంబల" జబ్బల్పురమనియే తోఁచుచున్నది. లేదా "సంబల్పూర్" అయియుండును. ఇదియు నాప్రాంతములోనిదే. ప్రస్తుతము జబ్బల్పురముజిల్లాలోఁ గొంతభాగమైనను జేదిదేశముగా నుండునని విష్ణుపురాణమును భాషాంతరీకరించిన విల్సను(Wilson)దొరగారు నుడివిరి. హూను త్సాంగను చైనాయాత్రికుఁ డుజ్జయినినుండి చాలదూర (one thousand lis) మీశాన్యముగఁ బ్రయాణముచేసిన తరువాతఁ జేరిన "Tchi-ki-to" అనునది చేదిదేశమేయని కొందఱు పాశ్చాత్యపండితు లభిప్రాయపడియున్నారు. హూను త్సాంగుయాత్రలను భాషాంతరీకరించిన జూల్లియన్ (Jullien) గారు "Tchi-ki to" ను చిత్తూరని నిశ్చయించినారు గాని చిత్తూరుజ్జయినికి వాయువ్యదిశనుండుటవలన నయ్యది ప్రామాదికమని యెంచవలయును. "ప్రాచీన భూగోళ శాస్త్రపట సంపుటము" (Atlas of Ancient Geography, classical and Biblical) అనుగ్రంథములో హిందూదేశపటమునందు జబ్బల్పురము చుట్టుప్రక్కలనున్న దేశమే చేదిదేశముగాఁ గర్నలుయూలు(Colonel Yule) దొరగారు లిఖించినారు. స్మిత్తుదొరగారు తన అర్లి హిస్టరి ఆఫ్ ఇండియా (Early History of India) అను గ్రంథమున నిట్లువ్రాసిరి:—

"And the extensive region to the south of Bandalkhand, which is now under the administration of the Chief Com- missioner of Central provinces nearly corresponds with the old Kingdom of Chedi. (బండెలు ఖండునకు దక్షిణమునఁ బ్రస్తుతము "మధ్యపరగణా"ల చీఫ్ కమిషనరు పరిపాలనక్రిందనున్న విశాలదేశము దాదాపుగఁ బూర్వపుచేదిరాజ్యమై యున్నది)." దీనినిఁబట్టి చూచినను చేది నర్మదాప్రాంతదేశమే యగుచున్నది. ఇట్లు చరిత్రకారుల వచనములేకాక పైనినప్రత్యక్ష్యములైన శిలాశాసన నిదర్శనములు చూపఁబడినవి. కావున నర్మదానదీప్రాంతమున జబ్బల్పురమును జుట్టుకొని నాగపూరువఱకు వ్యాపించియున్న దేశమే చేదిదేశమని నిశ్చయింపవచ్చును. హైహయులు రాజ్యముచేసిన దీ దేశమే కనుకఁ దద్వంశస్థుఁడైన యనుగురాజు చేదిదేశమునుండియే పలనాటికి వచ్చియుండవలయును. ఈతఁ డిచ్చటనుండి వచ్చెననుటకు వీరచరిత్రమునందు మఱియొకని దర్శనముగలదు. శ్రీనాథరచితమని చెప్పఁబడునట్టియు నాకులభించినదియునగు తాళపత్ర గ్రంథమున

"ద్వి॥ కాశికి డెబ్బది యామడకనఁగ నయోధ్య
అచ్చటికి మఱియావలనున్న
యిరువదియామడగలదాకనకాద్రి
కనకజంభనాపురి ఘనమెట్లఁటన్న॥"

అనుగణభంగ ద్విపదపఙ్క్తియం దనుగురాజుపట్టణముజంభనాపురియని చెప్పఁబడినది. జబ్బల్పురమే జంభనాపురియని యూహింపవచ్చును. ఊహయేల? ముదిగొండ వీరభద్రకవి వీరచరిత్ర పద్యకావ్యమందు "కాంతాసహితంబుగా భల్లాతకితైలార్ద్రవస్త్రంబులు కట్టికొని జబలాపురంబుచేరి" యనుచోట జబలాపురమని స్పష్టముగఁ జెప్పినాఁడు. కనుక ననుగురాజుపట్టణము జబ్బల్పురమేయై యుండును. హైహయుఁడైన యనుగురాజు పలనాటికి వచ్చినది చేదిదేశమునుండియేయని నిస్సందేహముగఁ జెప్పవచ్చును. ఇఁక వీరి కాలమునుగూర్చి యోచింతము. వీరొనర్చిన యుద్ధముయొక్క కాలమును నిర్ణయించినచో వీరికాలము తేలునుగాన నాయుద్ధకాలమును మొదటనిశ్చయింపఁదగదను. దీనికిఁ గొన్ని యాధారములు వీర చరిత్రమునందే కలవు. బ్రహ్మనాయుఁడు వైష్ణవమతస్థుఁడగుటయు, నీచజాతివారు కొందఱు వైష్ణవమతమవలంబించుటయు, శైవవైష్ణవ పరస్పరద్వేషములును, వీరచరిత్రయందుఁ గానవచ్చుటచేతఁ బలనాటి వీరుల యుద్ధము రామానుజునిచే స్థాపింపఁబడిన వైష్ణవమతము వ్యాపించిన తరువాతనే జరిగియుండవలయునని యెంచనగును. రామానుజుఁడు క్రీ॥ శ॥ 1017 సంవత్సరములోఁ బుట్టెను. క

నుక నీయుద్ధము 11 వ శతాబ్దమునకుఁ బూర్వము జరిగియుండ నేరదు ఇంతియ కాదు. వీ రచరిత్రలో నొకభాగమైన నాకు లభించిన "అలరాజు రాయబారముకథ" గల తాళపత్ర గ్రంథమున లక్షణరహిత ద్విపదలలో నీక్రింది విధమున వ్రాయఁబడినది.

1 "ద్వి॥ విరజాజిమల్లెలు విభూతిపత్రి
లింగనికీరితిఁ బూజలుచేసి"

2 "లింగపూజలుచేసి నిజముగాఁదాను
విభూతిరేఖలు తిన్నఁగాఁదీర్చి"

అలరాజు భోజనముచేయుటకుఁ బూర్వము లింగపూజచేసినట్లును రాయబారమున కుఁ బోవుటకుముందు లింగపూజచేసి విభూతిరేఖలు దిద్దినట్లునుఁ బై ద్విపద పఙ్క్తులు చెప్పుచున్నవి. మఱియు నా గ్రంథములోనే

" ద్వి॥ పిలుమనిజంగాలఁ బిలిపించెరాజు
వచ్చిరి అప్పుడు పుణ్యజంగాలు
పసిఁడిపాత్రలవారు పదులఱువదులు
పెడమటముజంగాలు పెద్దలఁబిలిపించిరి"

అని యలరాజులో నతనిభార్యయగు రత్నాలపేరాంబ సమాగమనముచేయు పట్టు న వ్రాయఁబడినది. వీనినిఁబట్టిచూడఁ బల్నాటి వీరుల యుద్ధకాలము నాఁటికి జంగములుం డిరనియు లింగపూజలు ప్రబలినవనియు విశదమగుచున్నది. బాలచంద్రయుద్ధముయొక్క 7 వ పుటలోని

" అందెలబసవన్న యాదినాథుండ
కరినంది బసవన్న కంచివరదుఁడ"

అను పఙ్క్తులును బై విషయమును స్థిరీకరించుచున్నవి. వీరచరిత్ర ప్రథమభాగమైన తాళపత్రగ్రంథమున నలరాజుతాత, శివలింగరాజుమీదికి యుద్ధమునకుఁ బోవునప్పుడీక్రింది తీరున వర్ణింపబడినది.

" ద్వి॥ గుఱి శివనందుల కోటకు వారు
యుద్ధసన్నద్ధులై యుర్వికంపింప
వారితోడనెకూడి వడియజంగాలు
నల్లబొంతలవారు నాలుగువేలు
ఎఱ్ఱబొంతలవార లెనుబదివేలు

... ... ... ...
వారిపేరులుకొన్ని వరుసఁ జెప్పెదను
మేడయ్యపడమటి మేటి బసవయ్య
బోడశివయ్య బొబ్బోడి బుగ్గయ్య
... ... ... ...
కటకంఠ లింగయ్య కల్యాణబసువ
అక్కయ్య మక్కయ్య ఆదిమల్లయ్య
... ... ... ...
నిజలింగ చిక్కయ్య నీలకంఠయ్య
ఉరమున లింగాలు మెఱసెడువారు
గళముల రుద్రాక్షు గలిగినవారు॥ "

పల్నాటి వీరుల యుద్ధకాలము నాటికి జంగములు ప్రబలముగానుండిరనుట కింతకంటె విశ్వసనీయ సాక్ష్యము వేఱొండేమి కావలయును? కాబట్టి లింగధారిమతము స్థాపింపఁబడి జంగములు బయలుదేఱిన తరువాతనే పల్నాటియుద్ధము జరిగెననుట నిర్వివాదాంశము. లింగధారిమతము బసవనిచే స్థాపింపఁబడినది. వీరి మతగ్రంథములైన బసవపురాణము, ప్రభులింగలీల, పండితారాధ్యచరిత్రము మొదలగునవి చదువఁగాఁ బురాణములలో సహజముగానుండు నద్భుతకల్పనలుపోను వీరి మతస్వభావము బసవని చరిత్రము కొంత తెలియఁగలదు. పాల్కురికి సోమనారాధ్యుని బసవపురాణములోని

" ద్వి॥ జినసమయస్థుల శిరములుదునిమి
మునువిష్ణుసమయుల ముక్కులుగోసి
యద్వైతులను హతహతముగాపించి
విద్వేషబౌద్ధుల విటతటమాడి
చార్వాకవాదుల గర్వంబులణఁచి "

యను పద్యములవలన వీరి మతలక్షణము కొంచెము తెలియును. మత మెట్లున్నను మనకుఁ గావలసినది చరిత్రగాన నావిషయముల వివరించెదను. లింగధారిమతమును స్థాపించిన బసవేశ్వరుఁడు కర్ణాటదేశమునందలి హింగుళేశ్వరాగ్రహారములో మండెంగ మాదిరాజను బ్రాహ్మణునిపుత్రుఁడు. తల్లి పేరు మాదాంబ. పాల్కురికి సోమనరచిత బసవపురాణమునందలి కొన్ని ముఖ్యములైన పద్యముల నుదహరించి దానినుండి తెలియవచ్చు చరిత్రాంశముల వ్రాసెదను.—

" ద్వి॥ పాండురంగవిభుని పరుఁడు బిజ్జలుని
బండారిబలదేవ దండనాయకుఁడు
శివభక్తునికిఁ బెండ్లి సేయుదునన్న
ప్రవిమలమగుతొంటి బాస తలంచి
యిట్టిభక్తునికీక యింక నాకూతు
నెట్టివారికి మఱి నేనిత్తునంచు
బసవకుమారుని పాలికిఁబోయి"

" సుఖలీలబిజ్జలతో నీశ్వరుండు
తానును బసవన దండనాయకుఁడు "

బసవేశ్వరుఁడు తండ్రిమతమున కిష్టపడక యుపనయన సంస్కారము నిరాకరించి, తలిదండ్రులవదలి తోఁబుట్టువైన యక్కనాగమ్మను వెంటఁబెట్టికొని కల్యాణమునకుఁ బాఱిపోయి యచ్చట రాజ్యముచేయుచున్న బిజ్జలునియొక్క దండనాయకుని కూతును వివాహమాడి తనమామ యనంతరమునఁదానే బిజ్జలునివద్ద దండనాయకుఁడాయెను. ఇతని క్రొత్తమతమువలన నితనికి నేకులు విరోధులేర్పడిరి. రాజైన బిజ్జలునికి నితనికిఁబరస్పరద్వేషము హెచ్చి కలహము సంభవించెను. ఈకలహములో బిజ్జలుఁడు ప్రాణములఁగోల్పోయెను. తరువాత బసవేశ్వరుఁడు కపిలసంగమువద్ద లింగమందైక్యమైపోయెను. కల్యాణపురము రాజధానిగ రాజ్యముచేసిన పశ్చిమచాళుక్యులలో నొకఁడైె క్రీ॥ శ॥ 1150 వ సం॥రం మొదలుకొని 1168 వ సం॥వఱకుఁ బరిపాలించిన రెండవతైలపునివద్ద నీ బిజ్జలుఁడు దండనాయకుఁడుగానుండి ప్రబలుఁడై చివరకు రాజుమీదఁ దిరుగఁబాటొనర్చి సింహాసన మాక్రమించికొనెను. ఇతఁ డంతకుముం దేకల్యాణపురము స్వాధీనము చేసికొన్నను క్రీ॥ శ॥ 1162 వ సంవత్సరములో మాత్రమే రాజబిరుదముల వహించెను. ఇతని శాసనములు క్రీ॥ శ॥ 1157 సం॥ మొదలుకొని కానవచ్చుచున్నవి. 1157 వ సంవత్సరమితనిరాజ్యకాలమున రెండవ సంవత్సరమని యొక శాసనమునఁ జెప్పఁబడినది కనుక క్రీ॥ శ॥ 1156 వ సంవత్సరమున నితని పరిపాలన ప్రారంభించి యుండును. ఈ బిజ్జలుని దండనాయకుఁడు నాకాలముననే యుండితీరవలయును. పలనాటియుద్ధము బసవనిచే లింగధారి (వీరశైవ) మతము స్థాపింపఁబడిన తరువాత జరిగినదని యిదివఱకే తెల్పఁబడినది గావున నీ యుద్ధము క్రీ॥ శ॥ 1150 వ సం॥రమున కంటెఁ బూర్వమున జరిగియుండ నేరదు. అనుగురాజు కుమారుఁడగు మల్లదేవుఁడు కల్యాణపురరాజైన వీరసోముని కూతును వివాహమాడినట్లు వీరచరిత్ర ప్రథమభాగమునఁ జెప్పఁబడినది. చదువరులకుఁ దెలియుటకై యీక్రింది పద్యముల నుదహరించుచున్నాను:—

"ద్వి॥ పయనము చేసెను బ్రహ్మ తా నప్డు
ముంకరి కన్నమ సొంపుగ రాఁగఁ
దన వెంటఁ దోడ్కొని తరలి బ్రహ్మన్న
కల్యాణనగరంబు కడు వేగ చేరి
యాపట్టణం బేలు నట్టిభూపతులు
అల్లాణరాజును భల్లాణరాజు
నాదిసోముఁడు మఱి నాగసోముఁడును
కంచుసోముఁడు మఱి పెంచుసోముఁడును
జలములకర్తన జలసోమరాజు
అందఱకును బైని నావీరసోము
తమ్ములేడ్గురు కలధరణీశుకపుడు
పుత్రులు నల్వురు పుత్రియు నొకతె"

కల్యాణపురము నిజాము రాజ్యములో బీదరునకు 35 మైళ్ళదూరముననున్నది. కల్యాణము నేలిన కలచూరి వంశపు రాజులలో నొక వీరసోముఁడును జళుక్యవంశపు రాజులలో నల్వురు వీరసోములును గలరు. చాళుక్య వీరసోములలో మొదటి మువ్వురు బసవేశ్వరునిచే వీరశైవమతము స్థాపింపఁబడక పూర్వమే రాజ్యము చేసినవారుగావున నైనచో మల్లదేవుని మామ నాల్గవ వీరసోముఁడే యైయుండవలయును. కలచూరి వీరసోముఁడును లింగాయత మతస్థాపనానంతరమందున్న వాఁడు కావున నితఁడును విచారణీయుఁడే. మొదలు చాళుక్య వీరసోముని గుఱించి తెలిసికొనుటకై యతని వంశక్రమము వివరించెదను. దక్షిణహిందూదేశమును బాలించిన రాజవంశములలోఁ జళుక్యవంశము మిక్కిలి పురాతనమైనది. గుజరాతునందన్హిల్వార పట్టణమున రాజ్యము చేసిన సొలంకీవంశమునకును దీనికిని సంబంధముండియుండవచ్చును. చాళుక్యులుత్తర మధ్యహిందూస్థానములఁ బరిపాలించిన రాజపుత్ర సంతతివారైనట్లు కానవచ్చుచున్నది. ద్రుపదుని కాపదకలుగఁజేయుటకై శపించిన ద్రోణుని చుళుక (పుడిసిలిత) జలమునందొకఁడు జనించెననియు నతఁడు చుళుకజలమందుఁ బుట్టినవాఁడుగావునఁ జౌళుక్యుఁడయ్యెననియు నతని వంశమే చౌళుక్య (చాళుక్య) వంశమనియుఁ జేదిదేశపు మొదటిశాసనములో వ్రాయఁబడినది.

ఈ వంశమును గూర్చి వేలువేలుచోట్ల వేలువేలుగఁ జెప్పఁబడియున్నది. చాళుక్యులు రెండుశాఖలుగా నున్నారు. కళ్యాణపురము రాజధానిగ నేలినవారు పశ్చిమ చాళుక్యులనియు రాజమహేంద్రవరము రాజధానిగ నేలినవారు తూర్పు చాళుక్యులనియుఁ జరిత్రయందుఁ బేర్కొనఁబడుదురు. పశ్చిమ చాళుక్యుల వంశవృక్షమీ క్రింది విధముననుండును.—

- జయసింహుఁడు
  - రాజసింహుఁడు (రణరాఘవుఁడు)
    - పులకేశి
      - కీర్తివర్మ
        - సత్యాశ్రయుఁడు
          - అమరుఁడు
            - ఆదిత్యవర్మ
              - విక్రమాదిత్యుఁడు
                - వినయాదిత్యుఁడు (యుద్ధమల్లుఁడు)
                  - విజయాదిత్యుఁడు
                    - విక్రమాదిత్యుఁడు
                      - కీర్తివర్మ
                        - ౦
                    - ...
                      - కీర్తివర్మ
                        - తైలపుఁడు I
                          - భీమరాజు
                            - అయ్యన
                              - విజితాదిత్యుఁడు *
      - మంగళేశుఁడు
        - ౦

* త్రైలభూపవిక్రమాదిత్యుఁడు

సత్యాశ్రయుఁడు — దాసవర్మ

(దాసవర్మ కుమారులు:) విక్రమాదిత్యుఁడు — అయ్యన — జయసింహుఁడు (జగదేకమల్లుఁడు)

(అయ్యన:) ౦

(జయసింహుఁడు:) సోమేశ్వరదేవుఁడు I (త్రైలోక్యమల్లుఁడు, ఆహవమల్లుఁడు)

(సోమేశ్వరదేవుఁడు I కుమారులు:) సోమేశ్వరదేవుఁడు II (భువనైకమల్లుఁడు) — విక్రమాదిత్యుఁడు (కలివిక్రముఁడు పేరపెరుమాడిరాయలు)

(విక్రమాదిత్యుఁడు:) సోమేశ్వరదేవుఁడు III (భూలోకమల్లుఁడు)

(సోమేశ్వరదేవుఁడు III కుమారులు:) ...(జగదేకమల్లుఁడు) — త్రైలపుఁడు II (నురుమాడి త్రైలుఁడు, త్రైలోక్యమల్లుఁడు)

(త్రైలపుఁడు II:) సోమేశ్వరదేవుఁడు IV (త్రిభువనమల్లుఁడు)

జయసింహుఁడు:—ఇతఁడు రాష్ట్రకూటుల రాజైన కృష్ణుని జయించెను. ఇతని పూర్వికులు 59 మంది అయోధ్యరాజులుగ నుండిరి.

రాజసింహుఁడు:—జయసింహుని కుమారుఁడు. ఇతనికి రణరాఘవుఁడని బిరుదనామము గలదు.

పులకేశి:—రాజసింహుని కుమారుఁడు. ఇతనిచేఁ గాకుండిదేశముపై నధికారిగ నియమింపఁబడిన నీలసాంద్ర వంశజుఁడగు శివనందుని తామ్రశాసనమువలన నితఁడు క్రీ॥ శ॥ 489 వ సం॥లో రాజ్యముచేయుచు మిక్కిలి పరాక్రమముగలవాఁడుగానుండినట్లు తెలియుచున్నది. ఈవూరి శాసనమువలన నితఁడు వాతాపిపురాధీశ్వరుఁడని కూడఁ దెలియుచున్నది.

కీర్తివర్మ:—పులకేశి మొదటికుమారుఁడు.

మంగళేశుఁడు:—పులకేశి రెండవ కుమారుఁడు. కలచూరి రాజుల నోడించెను.

సత్యాశ్రయుఁడు:—కీర్తివర్మపుత్రుఁడు. పులకేశి మనుమఁడు. ఇతనివలన నీవంశమునకు సత్యాశ్రయకులమని పేరు వచ్చినది. ధార్వాడకు నాలుగైదు మైళ్ళ దూరముననున్న అనిగాభావితును గ్రామములోని శాసనమువలన నితఁడు క్రీ॥శ॥ 566 వ సం॥ లో రాజ్యము చేయుచుండినట్లు తెలియుచున్నది.

అమరుఁడు:—సత్యాశ్రయుని కుమారుఁడు.

ఆదిత్యవర్మ:—అమరుని కుమారుఁడు.

విక్రమాదిత్యుఁడు:—ఆదిత్యవర్మ కుమారుఁడు. ఇతని రాజ్యారంభకాలము క్రీ॥ శ॥ 592 వ సంవత్సరము.

వినయాదిత్యుఁడు:—విక్రమాదిత్యుని కొమరుఁడు. ఇతనికి యుద్ధమల్లుఁడని బిరుద నామము గలదు.

విజయాదిత్యుఁడు:—విక్రమాదిత్యుని పౌత్రుఁడు. ఇతఁడు క్రీ॥ శ॥ 695 సం॥ మొదలు 788 వఱకు రాజ్యము చేసెను.

విక్రమాదిత్యుఁడు—విజయాదిత్యుని కుమారుఁడు. క్రీ॥ శ॥ 733 సం॥లో రాజ్యమునకు వచ్చెను.

కీర్తివర్మ—విక్రమాదిత్యుని మొదటి కుమారుఁడు.

కీర్తివర్మ—విక్రమాదిత్యుని మనుమఁడు. అనగాఁ పేరు తెలియని విక్రమార్క ద్వితీయ పుత్రుని కుమారుఁడు.

తైలపుఁడు I—కీర్తివర్మకొడుకు

భీమరాజు—తైలపుని కుమారుఁడు.

అయ్యన—భీమరాజుకుమారుఁడు. కృష్ణనందనుని జయించెను.

విజితాదిత్యుఁడు—అయ్యనపుత్రుఁడు. నైజాము రాజ్యములోని యాపూరి గ్రామమునందు త్తరదిశనున్న బసవేశ్వరాలయములో నిల్వఁబెట్టఁబడిన రాతిమీది శాసనమువలన నితఁడు భేది (చేది?) వంశ్యుఁడైన లక్ష్మణరాజు కూతురు బొంతదేవిని వివాహ మాడినట్లు తెలియుచున్నది. చేదిదేశపు మొదటిశాసనమునందలి యువరాజదేవుని

తండ్రి లక్ష్మణరాజే యీలక్ష్మణరాజైన యెడల శాసనకాల మొకవిధముగ నిర్ణయింపవచ్చును.

తైలభూపవిక్రమాదిత్యుఁడు—విజితాదిత్యుని కుమారుఁడు. దేశముచాలమట్టుకు రాష్ట్రకూటులాక్రమించియుండ వారిని జయించి చళుక్యరాజ్యము నుద్ధరించెను. ఇతఁడు క్రీ॥ శ॥ 978 సం॥ మొదలు 997 సం॥వఱకు రాజ్యము చేసెను. ఇతఁడాహవమల్లబిరుదాంచితుఁడు. భార్యజాకబ్వ.

సత్యాశ్రయుఁడు—తైలభూపుని కుమారుఁడు. క్రీ॥ శ॥ 997 సం॥ మొదలుకొని 1008 వఱకుఁ బ్రభుత్వము చేసెను. భార్య అంబికాదేవి. సంతానహీనుఁడైనందున సోదరుని కుమారు లితని తరువాత రాజ్యమునకు వచ్చిరి.

దాసవర్మ—సత్యాశ్రయుని సోదరుఁడు. తైలభూపునికొడుకు.

విక్రమాదిత్యుఁడు—దాసవర్మ పుత్రుఁడు. క్రీ॥ శ॥ 1008 మొదలు 1018 వఱకు రాజ్యము చేసినాఁడు.

అయ్యన—దాసవర్మ రెండవ కుమారుఁడు. కొడుకులు లేరు.

జయసింహుఁడు—దాసవర్మ మూఁడవకుమారుఁడు. ఇతనికి జగదేకమల్లుఁడని బిరుదనామము గలదు. క్రీ॥ శ॥ 1018 సం॥ మొదలుకొని 1040 వఱకుఁ బరిపాలించెను.

సోమేశ్వరదేవుఁడు I—జయసింహునికుమారుఁడు ఆహవమల్లుఁడు, త్రైలోక్యమల్లుఁడని రెండు బిరుదము లితనికిఁ గలవు. క్రీ॥ శ॥ 1040 సం॥ మొదలు 1069 వఱకు రాజ్యము చేసెను.

సోమేశ్వరదేవుఁడు II—ఒకటవ సోమేశ్వరదేవుని కొడుకు. భువనైకమల్లుఁడని బిరుదనామము. ప్రజారంజకుఁడు గాఁడు. క్రీ॥ శ॥ 1069 సం॥ మొదలుకొని 1076 సం॥వఱకుఁ బ్రభుత్వ మొనరించెను.

విక్రమాదిత్యుఁడు—ఒకటవ సోమేశ్వరదేవుని కుమారుఁడు. కలివిక్రముఁడు, వీర పెరుమాడిరాయలుగని బిరుదములుకలవు. వివేకహీనుఁడైన సోదరుని రాజ్యభ్రష్టునిఁజేసి చాళుక్యులందఱిలో నెక్కుడు ప్రతాపశాలియై క్రీ॥ శ॥ 1076 సం॥ మొదలుకొని 1127 సం॥వఱకు 51 సంవత్సరములు నిరంకుశముగఁ బరిపాలించెను. ఇతఁడుబహుభార్యా సమేతుఁడు. ఇతని రాజ్యాంతకాలమున ద్వారసముద్రపు భల్లాణుఁడు

కల్యాణము మీదికి రాఁగా నితని దక్షిణమండలేశ్వరుఁడు వెడలఁగొట్టెను.

సోమేశ్వరదేవుఁడు III—విక్రమాదిత్యుని కుమారుఁడు. భూలోకమల్లుఁడు త్రైలోక్యమల్లుఁడని రెండు బిరుదనామములు గలవు. క్రీ॥ శ॥ 1127 మొదలుకొని 1138 వఱకుఁ బరిపాలించెను

జగదేకమల్లుఁడు—మూడవ సోమేశ్వరదేవుని మొదటి కుమారుఁడు. జగదేకమల్లుఁడను నది బిరుదనామముగాని వ్యావహారిక నామము కాదు. క్రీ॥ శ॥ 1138 సం॥ మొదలు 1150వఱకు రాజ్యము జేసెను. ఇతని పేరు శాసనములలోఁ గానరాదు

తైలపుఁడు II—మూఁడవ సోమేశ్వరుని రెండవ కుమారుఁడు. త్రైలోక్యమల్లుఁడని బిరుదము. నురుమాడితైలుఁడని నామాంతరము. క్రీ॥ శ॥ 1150 సం॥ మొదలుకొని 1163వఱకుఁ బ్రభుత్వము చేసెను. కలచూరివంశజుఁడైన బిజ్జలుఁడు తైలపునివద్ద దండనాయకుఁడుగానుండి మిక్కిలి యధికారము సంపాదించి చిట్టచివరకు రాజుమీదఁ దిరుగఁబాటొనర్చి సింహాసనమాక్రమించుకొనఁగాఁ దైలపుఁ డసహాయుఁడై దక్షిణభాగమునకుఁ బాఱిపోయి పడమటి కనుమలలో డాఁగియుండెను. బిజ్జలుఁడు రాజును వెడలఁగొట్టి రాజ్యమాక్రమించుకొన్నను గొన్ని సంవత్సరములవఱకేకారణముచేతనో శాసనములందు దండనాయకోచిత బిరుదములే యుదహరించుచు క్రీ॥ శ॥ 1162 వ సంవత్సరములో దక్షిణమునకుఁబోయి ఏకచ్ఛత్రాధిపత్యాది రాజబిరుదముల వహించెను. ఇతఁడు క్రీ॥ శ॥ 1156 వ సంవత్సరములో సింహాసనమధిష్ఠించెను. తైలపుని శాసనములు క్రీ॥ శ॥ 1150 సం॥ మొదలుకొని 1163 వఱకుఁ గానవచ్చుచున్నవి. క్రీ॥ శ॥ 1157 వ సం॥రములో నితఁడు కల్యాణపురములో రాజ్యము చేయుచుండినట్లు కానంబడుచున్నదిగాని యితని చిట్టచివరసంవత్సరమైన 1163 వ సంవత్సరపు శాసనములో బనవాసియందు రాజ్యము చేయుచుండినట్లు తెల్పఁబడినది

సోమేశ్వరదేవుఁడు IV—రెండవతైలపుని కుమారుఁడు. త్రిభువనమల్లుఁడని బిరుదనామము. వీరసోముఁడని నామాంతరము. తైలపునివద్దనుండి యన్యాక్రాంతమైన కల్యాణపురము నితఁడు క్రీ॥ శ॥ 1182 వ సంవత్సరములో స్వాధీనము చేసికొని చాళుక్యరాజ్యము పునరుద్ధారణ చేసెను బిజ్జలుఁడు నతని కుమారుఁడును బసవేశ్వరుని లింగాయతమతకలహములలోఁ జిక్కియుండుటచే సోమేశ్వరుని కంతగా నాటంకములు లేకుండినట్లు తెలియవచ్చుచున్నది. మల్లదేవునికిఁ గూతునిచ్చినదీ వీరసోముఁడేయై యుండునేమో. ఇంకన

దీనినిఁగూర్చి స్థలాంతరమునఁ జర్చింపఁబడును. యుద్ధప్రారంభమునకు ముందు నాయకురాలు సంధికై బ్రహ్మనాయునివద్దకుఁ బంపిన రాయబారులపేరు లీ గ్రంథముయొక్క 88 వ పుటలో నిట్లు చెప్పఁబడినవి.—

" కొండయన్నమరాజు కోటకేతుండు
కూరిమిహితుఁడు మాడ్గులవీరరెడ్డి
పరమాప్తుఁడౌ చింతపల్లిరెడ్డియును"

వీరిలోఁ గోటకేతుఁడు సుప్రసిద్ధుఁడైన ధరణికోటరాజు. ఇతనిశాసనములమరావతిలోను వేల్పూరి రామేశ్వరస్వామి యాలయములోను బెక్కులుగలవు ఇతనికి ధర్మముగానిచ్చినవియు నితనిభోగస్త్రీలిచ్చినవియు శాసనములు గుంటూరుతాలూకాలోని యనమదల వీరభద్రస్వామి యాలయమునందును వేల్పూరి రామేశ్వరస్వామి యాలయమునందును గలవు. అమరావతిలోనున్న యతని శాసన మొకటి యుదహరించుచున్నాను. కొన్ని సంస్కృతశ్లోకములు కొంత తెలుఁగు వచనముగలిగి శాసనము పెద్దదిగానుండుటవలనఁ గావలసినంతవఱకు మాత్ర ముదహరించెదను.—

"శ్లో॥ అస్తిశ్రీధాన్యకటకం (అమరావతి) పురంసురపురాద్వరం
యత్రామరేశ్వరో శంభురమరేశ్వర పూజితః
బుద్ధో దేవస్సాన్నిధ్యో యత్రదాత్రో ప్రపూజితః
చైత్యమత్యున్నతం యత్రసర్వం చిత్రసుచిత్రితం

... ... ... ...

శాకాబ్దే యుగఖేందురూపగణితే మాఘేదశమ్యాంతిథౌ
శుక్లాయాం గురువాసరే శుభదినే సంప్రాప్తరాజోన్నతిః
శ్రీమత్కేతనృపస్సమస్తగురవే గ్రామాన్ వరేణ్యాన్ బహూన్
సంప్రాదాత్సుగతేశ్వరాయ విపులశ్రీబ్రహ్మసంపద్వతః॥

స్వస్తిశ్రీ చతుస్సముద్రముద్రిత నిఖిలవసుంధరాపరిపాలక శ్రీమత్త్రిణయనపల్లవప్రసాదాసాదిత కృష్ణవేణీనదీ దక్షిణషట్సహస్రావనీవల్లభ భయలోభదుర్లభ చోళచాళుక్యసామంతమదానేకప మృగేంద్ర విభవవామరేంద్ర శ్రీమదమరేశ్వరదేవ దివ్య శ్రీపదపద్మారాధక పరబలసాధక శ్రీధాన్యకటకపురవరాధీశ్వర ప్రతాపలంకేశ్వర కలిగళమొగదక్క బెడ్డరగవక్క గండరగండ గండభేరుండ జగమెచ్చుగండ అగ్నిమార్తాండనామాది ప్రశస్తసహిత శ్రీమన్మహామండలేశ్వర కోటకేతమహారాజులు శకవర్షంబులు ౧౧౦౮

అగు నేటి మాఘ శు ౧౦ గురువారంనాడు శ్రీమద్బుద్ధదేవరకు నాచంద్రతారార్కంగా ని
చ్చినయీయాల్పుకంద్రవాటిలోని కంతేరు కొండపడమటిలోని మేడికొండూరు,డోకిపఱ్ఱు.

ఈ ధర్మం నడపనివారు పంచమహాపాతకములు చేసినవారు. వారణాశివచ్చినవారు తమపెద్దకొడుకు కపాలము పడిచినవారు.

శ్లో॥ స్వదత్తాం పరదత్తాంవా యోహరేత వసుంధరాం
షష్టిర్వర్ష సహస్రాణివిష్ఠాయాం జాయతే క్రిమిః''

కోటకేతుని కాలమునాఁటికి బౌద్ధమత మాంధ్రదేశమునందుఁ బూర్తిగ నశింపనట్లీ యీ శాసనమువలనఁ దెలియుచున్నది! ఈ శాసనప్రకారము కోటకేతుఁడు క్రీ॥ శ॥ 1182 వ సం॥రము నకు సరియైన శా॥ శ॥ 1104 వ సం॥ మాఘశుద్ధ దశమినాఁడు రాజ్యమునకువచ్చెను. శాసనములోఁ దెల్పఁబడిన వంశావళియం దీ కోటకేతుని తండ్రిపేరు భీమదేవుఁడని చెప్పఁబడినది. అమరావతిలోని కోటకేతుని శాసనములలో మఱియొక దానిలోని

"శ్లో॥ గోంకక్షితీశ శశినోభగినీ గుణాఢ్యా
సబ్బాహ్వయా కమలచారుతరాస్ఫుటశ్రీః
తస్యాభవత్ప్రియతమా పురుషోత్తమస్య
తస్మాత్తస్యాం సుజనిసుధారశ్మికాంతిర్వివస్వ
త్తేజో రాజద్గుణగణనిధిః కేతుభూపో౽భిరూపః॥"

అను శ్లోకములవలనఁ గేతన్నృపునితండ్రి భీమదేవుఁడు గోంకరాజు సోదరిని వివాహమాడినట్లును వారిదంపతులకుఁ గేతరాజు పుట్టినట్లును మనకుఁ దెలియుచున్నది. దీనినిఁ బట్టి కోటకేతుఁడు గోంకరాజు మేనల్లుఁడగును. ఈ గోంకరాజు క్రీ॥శ॥ 1127 వ సం॥గం మొదలుకొని 1158 వ సం॥వఱకు రాజమహేంద్రవరము రాజధానిగ రాజ్యముచేసిన తూర్పు చాళుక్యుఁడు. వేల్పూరి రామేశ్వరస్వామి యాలయములోఁ గోటకేతుఁడు క్రీ॥ శ॥ 1182 సంవత్సరమునఁ దనతల్లి సుబ్బమదేవికి ధర్మార్థముగా బ్రాహ్మణులకు భూదానముచేసిన శాసనములో

"శ్లో॥ గ్రామంకోకల్లునామానం ప్రశస్తంసస్యసంపదా
విద్వద్భ్యోఖ్య ద్విజవర్యేభ్యో జననీశ్రేయసేదదాత్॥

అను శ్లోకమున నితఁడు కోకల్లుగ్రామమిచ్చినట్లు కలదు. నే నుదహరించిన చేదిదేశప్రశాసనములరెంటిలో మొదటిదానియందు యువరాజదేవుని వంశావళి కోకల్లునివద్ద

నుండి ప్రారంభింపఁబడినది. ఆకోకల్లుని పేరే యీ గ్రామమునకుఁ బెట్టఁబడినదియుఁ దలఁ గో
టకేతుఁడు హైహయుఁడనియుఁ, దనపూర్వుఁడైన కోకల్లుని గౌరవార్థముగా గ్రామ
మున కీ పేరు పెట్టియుండుననియుఁ జేదిదేశపు మొదటి శాసనమునుబట్టి హైహయుల
కుఁ జాళుక్యులకు సంబంధబాంధవ్యము లున్నట్లు తెలియుచున్నది గనుకనే కోటకేతుని
తండ్రి భీమదేవుఁడు చళుక్యవంశజయైన సబ్బమను వివాహమాడెననియు మన యనుగు
రాజు కొడుకులు పెదమల్లదేవరాజు నలగామరాజు హైహయులే యైనందున స్వవంశము
వారు కలహించి చెడిపోవుదురను తలంపుతోఁ గోటకేతుఁడు సంధికుదుర్చుటకై రాయ
బారిగ పోయియుండవచ్చుననియు నూహించినచో నసందర్భమేమి గావరాదు. వేల్పూరి
రామేశ్వరస్వామి యాలయములోనే కోటకేతరాజుకొడుకుగణపయదేవర దివ్య శ్రీపాద
పంకజభక్తి పరాయణుండైన కేతనబాలుఁడు క్రీ॥ శ॥ 1240 వ సం॥లో తమ తల్లికిధర్మా
ర్థముగ నిచ్చిన దానశాసనము కలదు. దీనినిఁబట్టి కోటకేతునికొడుకు గణపరాజు క్రీ॥
శ॥ 1240 వ సం॥రములో రాజ్యము చేయుచుండినట్లు తెలుచున్నది కనుకఁ గోటకేతుఁ
డు క్రీ॥శ॥ 1182 వ సం॥రము మొదలుకొని 1240 వ సం॥రముదనుక లేక కొన్ని సం
వత్సరములు తక్కుఁగాగనో ప్రభుత్వమొనర్చి యుండును. పల్నాటి యుద్ధము కోటకేతుఁ
డు సింహాసనమారోహింపకపూర్వమే జరిగినట్లు కానంబడుచున్నది. ఈయుద్ధములో నల
గామరాజు తనకు సహాయులుగా రమ్మని కొంతమంది రాజులకు లేఖలు వ్రాసెను. ఆరా
జుల పేరు లీ గ్రంథముయొక్క 26, 27 పుటలలోఁ జూడనగును.

"ద్వి॥ ధరణికోటపురికి దక్షుఁడైనట్టి
భీమదేవుండను పృథ్వీశునకును"

అను 26 వ పుటలోని పద్యములవలన ధరణికోట రాజప్పుడు భీమదేవుఁడనియుఁ గో
టకేతుఁడు కాఁడనియు నేర్పడుచున్నది. ధరణికోటకు వెనుక ధరణాలకోట, ధన్నాల
కోటయను పేరులుండినట్లు గ్రంథములవలనఁ దెలియుచున్నది. పల్నాటియుద్ధకాలమున
ధరణికోటరాజుగానున్న భీమదేవుఁడు కోటకేతుని తండ్రియే. క్రీ॥ శ॥ 1127 మొదలు
కొని 1158 వఱకు రాజ్యము చేసిన గొంకరాజు తోఁబుట్టువును వివాహమాడెను గాన నితఁ
డు క్రీ॥ శ॥ 1140 వ సం॥రముననో లేక యాప్రాంతముననో రాజ్యము చేయుట కారంభిం
చి క్రీ॥ శ॥ 1182 సం॥రము వఱకుఁ బాలించియుండును. పల్నాటియుద్ధము జరుగునప్పటి
కిఁ గోటకేతుఁడు సింహాసన మధిష్ఠింపక పోయినను రాయబారము మొదలగు రాచకార్య
ములు నిర్వర్తించుటకుఁ దగిన వయస్సుగలవాఁడై యుండుటచేత రాజ్యభారము వహిం
చుటకు సిద్ధముగానుండి యుండవలయును. కావునఁ బల్నాటియుద్ధము క్రీ॥ శ॥ 1182 వ
సంవత్సరమునకుఁ బూర్వము కొద్దికాలముక్రిందటనే జరిగియుండును. అనఁగాఁ గొంచెము

హెచ్చుతక్కువగ క్రీ-శ|| 1176, 1182 సం||రముల మధ్యమున జరిగెనని చెప్పవచ్చును నలగామఁడు లేఖలువ్రాసినవారిలో వీరభల్లాణుఁడుగూడ నున్నాఁడు. వీరభల్లాణు లిద్దఱుగలరు. లింగాయమతము స్థాపింపఁబడిన తరువాతనున్నది రెండవ వీరభల్లాణుఁడు. కనుకఁ బల్నాటి యుద్ధకాలముననున్న దితఁడే కావలెను. ఈయనద్వారసముద్రము రాజధానిగ క్రీ||శ|| 1173 మొదలు 1224 వఱకు రాజ్యముచేసెను గావునఁ బల్నాటి యుద్ధము 1173 సం||రమునకుఁ బూర్వము జరిగియుండ నేరదు. కోటకేతుఁడు సింహాసనమెక్కకముందే జరిగెనని నిర్ధారణచేయఁబడియుండుటచేత 1182 సం||కుఁ బిమ్మటను జరిగియుండ నేరదు. కాఁబట్టి పల్నాటియుద్ధము 1173, 1182 సం||రముల మధ్యమున జరిగినదని నిశ్చయముగఁ జెప్పవచ్చును. నలగామరాజునకు సహాయముగా సాగిపోతరాజను నతఁడువచ్చినట్లు చెన్నపట్టణమునందలి లిఖితపుస్తక భాండాగారములోని ప్రతిలోఁ గానవచ్చుచున్నది. సాగిపోతరాజు గుడిమెట్ట నేలినవాఁడు. రెల్లూరి తిరుమలయ్య తనగుఱ్ఱము నపహరించిన పోతరాజు నేడుదినములకుం జావఁదిట్టిన చాటుధారయని యప్పకవి యుదహరించినట్టి

"ఉ. హాయమదిసీతపోతవసుధాధిపుఁ డాఁయ రావణుండు ని
శ్చయముగ నేను రాఘవుఁడ సహ్యజవారిధిమారుఁడంజనా
ప్రియతనయుండు లచ్చనవిభీషణుఁడా గుడిమెట్టలంక నా
జయమునుబోతరక్కసుని చావును నేడవనాఁడు సూడుఁడీ."

యను పద్యమీ సాగిపోతరాజును గూర్చియే. గుడిమెట్ట కృష్ణాజిల్లాలో నందిగామకు 8 మైళ్ళ దూరమునఁ గృష్ణానదీ తీరమందున్నది. సాగిపోతరాజుయొక్క క్రీ||శ|| 1199 వ సంవత్సరపు శాసనము బెజవాడ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ మండపములో నీశాన్యభాగ స్తంభపు తూర్పు పలకమీదఁ గలదు. ఇప్పుడు దీనిలోని యక్షరములు చాలవఱకు మాసిపోయి యస్ఫుటముగఁ గానవచ్చుచున్నవి. ఇతనిశాసనములు మఱికొన్ని కనుఁగొనఁబడినవి. వీనివలన నీయన 1199 సం||రమునకుఁ బూర్వమే రాజ్యభారము వహించి 13 వ శతాబ్దాదియందుఁ గొన్ని సంవత్సరములు జీవించియుండినట్లు తెలియుచున్నది గావునఁ బల్నాటి యుద్ధములోనుండియే యుండవచ్చును. యుద్ధమింక షుమారు నాలుగు సంవత్సరముల యాఱుమాసములకు జరుగుననఁగా నలగామరాజు మల్లదేవునికొనర్చిన మందపోటు నుపద్రవములో నీక్రిందిరాజుల సహాయము కోరుమని నాయకురాలు నలగామున కాలోచనసెప్పినట్లు శ్రీనాథరచితమని చెప్పఁబడుచుండి నాకు లభించిన తాళపత్ర గ్రంథములోని మందపోటుకథయందీ పద్యలు వ్రాయఁబడినవి.—

" ద్వి॥ ఎందఱైనను మన నేమిచేసెదరు
భల్లాణదేవుండు పంచపాండ్యుండు
తెలియఁగ విజ్జలదేశింగు విభుఁడు
కాశీమహారాజు గంగుదయుండు
వెలనాటిచోడుఁడు విక్రమాఢ్యుండు
మలిదేవుఁడన్నను మండుచుండుదుర॥"

వీనిలో వెలనాటిచోడుఁ డుదహరింపఁబడినాఁడు. ప్రస్తుతము చందవోలు బాపట్ల మట్టుప్రక్కలనున్న దేశమే వెలనాడని శాసనములవలనఁ దెలియుచున్నది. వెలనాటికిఁ గమ్మనాడను నామాంతరముగలదు. వెలనాటిచోడుఁడు కులోత్తుంగ చోళగొంక రాజు కుమారుఁడు. ఇతని యసలుపేరు రాజేంద్రచోడుఁడు. రాజేంద్రచోడునికి వెలనాటిచోడుఁడని నామాంతర మున్నట్లు మంచన కేయూరబాహుచరిత్రములోని యీక్రింది పద్యములవలనఁ దెలియుచున్నది—

"క. ధీరుండాగోవిందన । సూరిమినందనుఁడు వెలసెఁ గొమ్మనగొంక
క్ష్మారమణునకుదయించిన । వీరుఁడు రాజేంద్రచోడవిభు ప్రెగ్గడయై.

సీ॥ నవకోటిపరిమితద్రవిణమే భూపాలు భండారమున నెప్డు పాయకుండు
నేకోనశతదంతులే రాజునగరిలో నీలమేఘంబుల లీలఁ గ్రాలు
బలవేగరేఖనల్వదివేలతురగంబు లేనరేంద్రుని వాగె నెపుడుదిరుగుఁ
బ్రతివాసరంబు డెబ్బదియేనుపుట్లునేయే విభు మందల నెపుడుకలుగు
గీ॥ నట్టియధికవిభవుఁడగు కులోత్తుంగరా
జేంద్రచోడనృపతికిష్ట సచివ
తంత్రముఖ్యుఁడనుగుమంత్రి గోవింద నం
దనుఁడు కొమ్మనప్రధానుఁ డొప్పు॥

ఉ. ఇల వెలనాటిచోడ మనుజేంద్రునమాత్యత యానవాలుగాఁ
గులతిలకంబుగా మనినకొమ్మనప్రెగ్గడ కీర్తిమాటలన్
దెలుపఁగ నేల తత్క్రియఁ బ్రతిష్ఠితమైన తటాకదేవతా
నిలయమహాగ్రహారతతి నేఁటికిఁ జెల్లెడఁదాన చెప్పఁగన్."

ఈ పద్యములలోని కొమ్మనమంత్రి శాసనము గోపట్ల భావనారాయణస్వామి యాలయములలో నొకటి గలదు. రాజేంద్రచోడుఁడే వెలనాటిచోడుఁడైనట్లు వీనివలన స్పష్ట

పడినది. ఇతఁడు క్రీ॥శ॥ 1158 సం॥ మొదలు 1200 వఱకు రాజ్యము చేసినట్లు కనఁబడుచున్నది. కావుననొకవేళ యుద్ధము 1182 వ సం॥రములోనే జరిగినను మందపోటు సమయమున నితఁడుండియుండుననుట కాక్షేపమేమియు లేదు. అనుగురాజు కుమారుఁడగు మల్లదేవునికిఁ గూతునిచ్చిన సోమేశ్వరుఁడు కల్యాణాధిపతియైన నాల్గవ సోమేశ్వరుండై యుండవచ్చునని యనుమానముగఁ జెప్పితిమి. చేదిదేశములో జబ్బల్పూరువద్దనున్న బిల్హారియందలి శాసనమున యువరాజదేవుని తాతకేయూరవర్షుఁడు చళుక్యవంశజయైన నోహలాదేవినిఁ బెండ్లాడినట్లున్నది. దీనివలన హైహయులకుఁ జళుక్యులకు పూర్వమునుండిసంబంధబాంధవ్యము లున్నట్లు తెలియుచున్నది. కావున హైహయుఁడగు మల్లదేవుఁడు చాళుక్యుఁడగు వీరసోముని కూతును వివాహమాడిన నాఁడియుండవచ్చును. ఈ యభిప్రాయముతోడనే యీ గ్రంథముయొక్క 4 పుటలోని పదపఙ్త్తిని వ్రాసితిని. తరువాత నాకు దొరకిన "యలరాజు రాయబారము" కథ గల గ్రంథము చూడ విషయములు వేఱుగఁ గాన్పించుచున్నవి. అలరాజు రాయబారము కథలోఁ (యుద్ధమునకు ముందు) గొమ్మరాజుభార్య బ్రహ్మనాయునితో నీక్రింది వాక్యములు చెప్పినట్లుగలదు.—

"ద్వి॥ వినవయ్య నాయుఁడ విన్నవించెదను
తరుణిమాయత్తపుఁదనయులేడుగురు
ఏడ్వురికొక్కఁడై యెలమి నాసుతుఁడు
కల్యాణమేలుచు ఘనుఁడుమాకు మ
ఆడదేవరగొల్చి హరిపురికేగఁ
బరగురుతనయులు పదితెర్వులైరి"

ఈ వాక్యములవలన నలరాజు రాయబారము నాఁటికే (యుద్ధమునకుముందే) కొమ్మరాజు తండ్రి వీరసోముఁడు మృతినొందినట్లు స్పష్టపడుచున్నది. కొమ్మరాజుతండ్రియే పెదమల్లదేవుని మామ. చాళుక్యుఁడైన నాల్గవ వీరసోముఁడు 1182 వ సంవత్సరములో సింహాసనమునకు వచ్చి పల్నాటియుద్ధము జరిగిన తరువాతఁగూడఁ గొన్ని సంవత్సరములు బ్రతికినాఁడు. కనుక మల్లదేవునిమామ చాళుక్యవీరసోముఁడు కాక మఱియొక వీరసోముఁడైయుండవలయునని విశదమగుచున్నది. మల్లదేవుని పెండ్లినాఁటి కతనిమామయైన వీరసోముఁడు కల్యాణము నేలుచుండినట్లే, గ్రంథములోఁ జెప్పఁబడినది. విచారింప బసవేశ్వరుని లింగాయత మతము స్థాపింపఁబడిన తరువాత మల్లదేవుని పెండ్లికాలమునఁ గల్యాణము నేలుచు యుద్ధమునకుఁబూర్వమే చనిపోయిన వీరసోముఁడొకఁడు కలఁడని చరిత్రవలనఁ దెలియుచున్నది. ఇతఁడే మల్లదేవుని మామ, లేక, కొమ్మరాజుతండ్రియై యుండవలయును. ఇతఁడు కలచూరి వంశస్థుఁడు; రెండవ తైలపుని రాజ్యమునుండి వెడలఁగొట్టి

కల్యాణపురము స్వాధీనముచేసికొనిన బిజ్జలుని కుమారుఁడు. బిజ్జలుఁడు క్రీ॥శ॥ 1156 వ సంవత్సరము మొదలుకొని 1165 వ సం॥వఱకు రాజ్యముచేసి గతింపఁగా నితఁడు సింహాసనమధిష్ఠించి 1165 సం॥ మొదలు 1176 సం॥వఱకుఁ బాలించెను. మురారి సోమదేవర యనియు, వీరబిజ్జలుఁడనియు సోమేశ్వరదేవుఁడనియు నితనికి మూఁడు నామములు. ఇతని రాజ్యకాలము 1165 స సం॥ మొదలు 1176 వ సం॥వఱకగుటవలన యుద్ధమునకుఁబూర్వము షుమారు 10 సంవత్సరముల క్రిందట జరిగిన మల్లదేవుని పెండ్లికాలమునఁ గల్యాణము నేలుచుండి యుద్ధము జరగకముందే చనిపోయిన వీరసోముఁడితఁడే యగును. కావున మల్లదేవుని మామయైయుండుటకు సందియములేదు. కనుక బిజ్జలుని కుమారుఁడైన యీవీరసోముఁడే కొమ్మరాజుతండ్రియగును. కొమ్మరాజుయుద్ధమునకుఁ బోవునపుడతని ననుసరించియున్న యంకాళశక్తి

" ద్వి॥ శీలమురఘురామ చెప్పెద వినుము
మావారుకల్యాణ మందుననుండి
ఘనరాజ్యసంపదల్ కడకుఁబోఁదోలి
పాలుపొందఁగావిష్ణు పోరుకందఱము
లోనయివచ్చుట లోకంబు లెఱుఁగు
నీవు పెట్టినచిక్కు నీవెఱుంగుదువు
అందఱమాయచే హతముగావించి
పరఁగనీవిటువంటి పనియూహచేసి
నన్నొడఁబాపుట న్యాయమా నీకు"

అని బ్రహ్మనాయునితోఁబలికినట్లు వీరచరిత్రములో నొకభాగమైన కొమ్మరాజుయుద్ధములోఁ జెప్పఁబడినది. కల్యాణపట్టణములోఁ ద న్నాదరించువారు లేరనియుఁ బలనాటిలోనున్న కొమ్మరాజొక్కఁడు యుద్ధరంగమునకుఁ బోవుచున్నాఁడనియుఁ దనకిఁక నాధారము లేదనియు నంకాళశక్తి విలపించినట్లు పై నుదహరింపఁబడిన ద్విపద పఙ్క్తులవలన నర్థము కాఁగలదు. దీనినిఁబట్టిచూడఁ బల్నాటి యుద్ధకాలమునఁ గొమ్మరాజువంశము వారికిఁ గల్యాణపట్టణములో నధికారము క్షీణించినదని తెలియుచున్నది. తత్కాలమునఁ గల్యాణమున నధికారశూన్యమైనది కలచూరి వంశమే కాని చళుక్యవంశము కాదు. కనుకఁ గొమ్మరాజుతండ్రి, లేక, మల్లమదేవుని మామ క్రీ॥శ॥ 1165 సం॥ మొదలుకొని 1176 సం॥ వఱకుఁ బాలించిన కలచూరి సోమేశ్వరుఁడే కాని క్రీ॥శ॥ 1182 సం॥ మొదలు 1189 వ సం॥వఱకు రాజ్యముచేసిన చాళుక్యుఁడగు నాల్గవసోమేశ్వరుఁడు కాఁడని స్పష్టముగఁ జెప్పవచ్చును. యుద్ధమునకుముందే కొమ్మరాజు తండ్రియగు సోమేశ్వరుఁడు మృతినొంది

నట్లు చెప్పఁబడుటవలన యుద్ధము క్రీ॥శ॥ 1176 వ సం॥ తరువాతనే జరిగియుండవలయును. ఈ కాలమిదివఱకుఁ గ్రీ॥శ॥ 1178, 1182 సం॥ల మధ్యమున జరిగియుండవలయునని నిర్ధారణచేసినకాలమునకు సరిపోవుచున్నది. యుద్ధమునాఁటికిఁ గల చూరివంశము బొత్తిగ క్షీణదశలోనున్నదని చెప్పఁబడుటవలనను, గలచూరివంశము క్రీ॥శ॥ 1182 వ సంవత్సరమునఁ బూర్తిగ నశించినందువలనను యుద్ధము 1182 వ సం॥నకుఁ బూర్వము కడు స్వల్పకాలములోనే జరిగియుండవలెను. ఇది 1178, 1182 సం॥ల మధ్యమున జరిగినట్లు నిర్ధారణచేయఁబడినది గనుక జరిగిన సంవత్సరము 1182 సం॥రకు దగ్గఱగను 1178 సం॥నకు దూరముగనుండితీరవలయును. ఇట్టి సంవత్సరము 1178 సం॥నకు వెనుకనుండ నేరదు గనుకను యుద్ధమునకుఁ బూర్వము కొమ్మరాజు తండ్రిచచ్చియుండుటవలన నది 1176 సం॥నకుఁ బిమ్మటనే జరిగియుండును గనుకను మఱింతసూటిగాఁ గ్రీ॥శ॥ 1178, 1182 సంవత్సరముల మధ్యమునఁ బల్నాటియుద్ధము చేయఁబడినదని నిశ్చయింపవచ్చును. గ్రంథములో ననుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడుగాఁ జెప్పఁబడినదని యిదివఱకే తెల్పియుంటిని. రావణుఁడు నర్మదానదీతీరమున శివపూజచేయుచుండఁ గార్తవీర్యార్జునుఁడు నర్మదలో జలక్రీడలు సల్పుటయు నతనివేయిచేతులచేత నడ్డగింపఁబడిన జలప్రవాహ మొగఁదట్టి రావణునిపైఁ దొట్టుటయు వారిద్దఱు కలహించుటయుఁ బురాణప్రసిద్ధవిషయంబులు గానఁ గార్తవీర్యుఁడు రావణునికి సమకాలీనుఁడై యుండవలయును. రావణుఁడు రాముఁడు నేకకాలమందుండినవారు. రామాయణకాలము క్రీ॥ పూ॥ 18 వ-శతాబ్దమునకు ముందేకాని తరువాతనైయుండదని రమేశచంద్రదత్తు మొదలగు పండితులు వ్రాసియున్నారు. అనఁగా నిప్పటికి మూఁడువేలరెండువందల సంవత్సరములకుఁ బూర్వమనగును. కార్తవీర్యార్జునుఁడు రామాయణకాలముననుండినవాఁడగుటచే నతఁడును మూఁడువేలసంవత్సరముల క్రిందనేయుండితీరవలయును. అనుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడే యైనయెడలఁ దరమునకుఁ బూర్తిగ నూఱేండ్లప్రకారముచూచినను షుమారు రెండువేల సంవత్సరముల క్రిందట ననుగురాజుండినవాఁ డగును. కురుక్షేత్రయుద్ధము జరిగిన తరువాత నాలుగువందల సంవత్సరములకో యేడువందల సంవత్సరములకో పల్నాటియుద్ధము జరిగియుండును. ఇదియే నిజమైనచో వీరభల్లాణుని భీమదేవుని నాకాలమునకు సెట్టి శాసనములు రద్దుపఱచి హిందూదేశ చరిత్రము తలక్రిందుచేయవలసియుండును. కావున ననుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడని వ్రాసినవ్రాఁత నిరాధారపు వ్రాఁతయని స్పష్టముకాకమానదు. మెకంజీ దొరగారు సేకరించిన లిఖితగ్రంథములను విమర్శించినట్టి విల్సను (Wilson) దొరగారు వీరచరిత్రనుగూర్చి యిట్లు వ్రాసియున్నారు. "Account of seven years war from 1080 A, D. to 1087, which was carried on by Brahma Nayudu and Twelve other land-holders

and graziers against two towns, Gurzala and Macherla in the Palnad country and which originated in a dispute at a Cock-fight. In. Ant. Vo. I. page 273 (1080 సం॥ మొదలు 1087 సం॥ వఱకు జరిగిన యేడుసంవత్సరముల యుద్ధచరిత్రము. బ్రహ్మనాయుఁడు మఱి పన్నిద్దఱు భూస్వాములు పశువుల మేపరులు గలిసి పల్నాటిదేశములోని మాచెర్ల, గురిజాల అను రెండు పట్టణములమీఁద యుద్ధము చేసిరి. ఒకకోడిపందెములో సంభవించిన కలహమీయుద్ధమునకు మూలకారణము)." వీరు నిర్ణయించిన కాలమున కాధారములు చూపఁబడకపోవుటయటులుండఁగా యుద్ధమునుగుఱించియిచ్చిన యభిప్రాయమునుఁబట్టిచరిత్ర మెంతమట్టుకు గ్రహించిరో చదువరులే యూహింపఁగలరు. గతానుగతికులై టెయిలరు (Taylor) మొదలగువారిట్లే నిరాధారముగా విపరీతములు వ్రాసినారు గాని యవియన్నియు నిటఁ దెల్పుట యనవసరము.

క॥ గజనభగుణ చంద్రాదుల
భజనుండాషాఢశుద్ధ పక్షంబందున్
(విజయసమబాహుబలుఁడ
కృజయుఁగ) బల్నాటివీరగజమునిఁ బడియెన్ ॥

అను నొక చాటుపద్యము వాడుకలోనున్నది. ఈపద్యము నిర్దుష్టము కాకపోవుటకుఁ దోసము దీనిప్రకారము యుద్ధకాలము శా॥ 1808 లేక క్రీ॥ 1886 వ సంవత్సరమగుచున్నది. ఈకాలమునాఁటికి దేశము కొండవీటి రెడ్లస్వాధీనమైనది. కాన నీపద్యమెంత విశ్వసనీయమో నేను వివరింపఁబనిలేదు.

పైనిఁజూపఁబడిన నిదర్శనములన్నిటివలనఁ బలనాటివీరులు చేదిదేశమునుండి 12 వ శతాబ్దమున వచ్చి 1178, 1182 సం॥ మధ్యమున యుద్ధముచేసిరను సారాంశము స్పష్టముగాఁ దెలుచున్నది. అనుగురాజు చేదిదేశమునువిడిచి పల్నాటికేలవచ్చెనో చూతము. కార్తవీర్యుఁడు చేసిన పాతకములు బాధింపఁగా బ్రాహ్మణుల యాలోచనవలన జీడినూనె గడ్డలు ధరించి ససైన్యుఁడు సామాత్యుఁడు సకుటుంబుఁడై రాజ్యమునువదలి యిలవేలుపైన చెన్నకేశవుని వెంటఁబెట్టికొని తీర్థయాత్రకు వెడలి వచ్చివచ్చి * కృష్ణానది స్నానముచేసినప్పుడు తాముధరించిన నల్లగుడ్డలు తెల్లనాయెననియు నంతటఁ బాపవిముక్తులైరనియుఁ జందవోలులోనప్పుడున్న రాజనుగుభూపాలునకుఁ గూతునొసఁగి పలనాడు హరణమిచ్చెననియుఁ గార్తవీర్యుఁడు చేసిన పాపములు పట్టణమునంటియుండుటవలనఁ దిరిగి స్వదేశమునకుఁ బోవుట కిలవేల్పయిన చెన్నకేశవుఁ డిష్టపడలేదనియు నందుచేఁ బలనాటిలోనే స్థిరపడిరనియు గ్రంథములోఁ జెప్పఁబడినది. ఎన్ని సంవత్సరముల క్రిందటనో కా

* చంద్రవంకలోనని కొందఱు చెప్పుచున్నారు. ఈకథగల గ్రంథభాగము దొరకలేదు.

ర్తవీర్యుఁడుచేసిన పాపము లతనిపూర్వుల నెవరిని బాధింపక యనుగురాజునే యేలబాధించెనో తెలియరాదు. తీర్థయాత్రకు వెడలినచో రాజ్యమునఁ దమ ప్రతినిధి నెవ్వరినో యుంచి బయలుదేఱుదురు కానిదేశము నరాజకము చేసి యిలవేల్పును గూడఁ బెకలికొని కట్టుగట్టుక యందఱు నొక్కసారి బయలు వెడలి యుండరు. చెన్నకేశవుఁడు నోరుచేసికొని మానవభాషణంబుల స్వదేశమునకుఁ బోవలదని చెప్పెనఁట! పరమభక్తులుగనుక నట్లుచెప్పెననుకొన్నను జేదిరాజ్యము వంటిరాజ్యమునుండి తొలఁగించునంతటి కరుణభక్తుల పైఁ జెన్నకేశవునికిఁ బుట్టుటచిత్రమే. కార్తవీర్యుఁడుచేసిన పాపములు చేదిదేశమునంటికొని వదలకయుంటుదురవగాహము. ఏది యెట్లున్నను దానుదేశము విడిచిపోవలసి వచ్చినప్పుడు తనపూర్వుఁడైన కార్తవీర్యుఁడు చేసిన పాపము లనుగురాజునకు జ్ఞప్తికివచ్చియుండుట వాస్తవము.

పూర్వహిందూ దేశచరిత్ర (Early History of India) వ్రాసిన స్మిత్తుదొరగారిట్లు నుడువుచున్నారు.— "The Kalachuri or Haihaya Rajas of Chedi are last mentioned in an inscription of the year 1181 A. D and the manner of their disappearance is not exactly known; but there is reason to believe that they were supplanted by the Bhugels of Rewa. (చేదిదేశముయొక్క కలచూరి లేక హైహయ వంశపురాజులు క్రీ। శ॥ 1181 వ సంవత్సరపు శాసనములోఁ జివరసారి యుదహరింపఁబడియున్నారు. వారెట్లు పోయినది సరిగాఁ దెలియదు. కానిరీవాభగేలులు వారిస్థానమునకువచ్చిరని నమ్ముటకుఁ గారణముకలదు.)" 11 వ శతాబ్దప్రారంభమునుండి చేదిదేశము విభజింపఁబడి యొకరికంటె నెక్కువమంది రాజులక్రింద నుండినట్లు చరిత్రవలనఁ దెలియుచున్నది. పల్నాటి యుద్ధకాలమునహిందూదేశముమీఁదికి మహమ్మదీయులు దండెత్తివచ్చుచుండిరి. ఈ మహమ్మదీయుల తొందరలవలననో స్మిత్తుదొరగారు చెప్పినట్లురీవాభగేలులవలననో లేక యన్యశత్రువుల వలననో యనుగురాజు రాజ్యమును గోలుపోయి ససైన్యముగఁ బలనాటికి వచ్చియుండును. ఇతఁడు వచ్చినతరువాతఁ దక్కిన హైహయులు 1181 వ సంవత్సరమువఱకుసుండి వారు కూడ రాజ్యభ్రష్టులై యుందురు. ఇట్టికష్టకాలమున ననుగురాజు తనదురదృష్టమునకుఁ గారణము కార్తవీర్యుఁడుచేసిన పాపములేయని భావించుట యొకవింతకాదు. అనుగురాజు నిజదేశమువిడిచి వచ్చి చందవోలురాజుకూతును వివాహమాడ నతఁడు కుమార్తెకరణముగాఁ బల్నాడిచ్చినట్లు వీరభద్రకవియొక్క

" శా॥ నానాచిత్రపటుప్రతానములు రత్నస్వర్ణభూషణావళుల్
ధేనువ్రాతమిభాశ్వసంఘ మతిభక్తిన్బ్రీతిఁగాఁ గన్యకా

దానప్రోత్సవవేళనల్లునకుఁ జేతఃప్రీతిగానిచ్చె స
న్మానంబొప్పనొసంగెఁ బుత్రికకుఁ బల్నాడైదుదేశంబులున్''.

అను పద్యమువలనఁ దెలియును. "పల్నాడైదుదేశంబులున్" అనఁగా నైదుదేశములు కలిసిన పల్నాడో పల్నాడుమఱియు నైదుదేశములో వివరములేదు. చందవోలు రాజప్పుడు ధవళశంఖుఁడని యాకవి వ్రాయుచున్నాఁడు. ధవళశంఖుని శాసనము లెచ్చటఁ గానరావు. అతని పేరు చరిత్రలో నెచ్చటఁ గనఁబడదు. పల్నాడంతదేశము నన్యులకు సర్వస్వతంత్రరాజు లీవలయునుగాని తక్కినవారీఁజాలరు. అనుగురాజిక్కడకువచ్చునప్పటికిదేశమునందు సర్వస్వతంత్రరాజులు తూర్పుచాళుక్యులు. చాళుక్యులలో ధవళశంఖుఁడు లేఁడు. ఆకాలపు శాసనములు చందవోలులో వెలనాటి గొంకరాజాది యొకటివెలనాటిచోడునిది మఱియొకటి కానవచ్చుచున్నవి గాని ధవళశంఖుని శాసనములులేవు. చెన్నపట్టణమునందలి లిఖితపుస్తకభాండాగారములోని ప్రతియందుఁదనకు సహాయముగారమ్మని నలగామరాజు రాజులకు లేఖలు వ్రాసినస్థలమున "మామగుతమగొంకమహిపాలునకును" అని లిఖింపఁబడినది. ఈముద్రిత గ్రంథములో "మామగుండమకోట మనుజేశునకును" అని వ్రాయఁబడియున్నది. లిఖితపుస్తకభాండాగార ప్రతిప్రకారము నలగామరాజు మామగొంకఁడేయైన పక్షమున ననుగురాజునకుఁ గూతునిచ్చినది 1127 సం॥ మొదలుకొని 1158 సం॥ వఱకు రాజ్యముచేసిన కులోత్తుంగ చోడ గొంకరాజై యుండవలయును. దీనికి నిదర్శనముగాఁ బల్నాడు కాలమునఁగులోత్తుంగ చోడగొంకరాజు స్వాధీనములో నున్నదని తెల్పుటకై కారెంపూడి సురేశ్వరస్వామియాలయములో 1154 సం॥న నతనిశాసనముకలదు. నలగామరాజుమామయని చెప్పఁబడిన గొంకమహిపాలుఁడు వెలనాటిచోడుఁడగును. వెలనాటిచోడునికి గొంకరాజను నామాంతరమున్నట్లు బాపట్ల భావనారాయణస్వామి యాలయములోని శాసనమువలనఁ దెలియుచున్నది. ఆశాసనమిట నుదహరించెదను.

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౦౭౭ అగునేటి ఉత్తరాయణ నిమిత్తమున స్వస్తిశ్రీ సమస్తప్రశస్తసహిత శ్రీమన్మహామండలేశ్వర కులోత్తుంగ చోడగొంకరాజులు శ్రీమత్సంధివిగ్రహ కొమ్మనప్రెగడ కమ్మనాటిలోని భావనారాయణ దేవరకు నఖండదీపము తమతండ్రి గోవిందప్రెగ్గడకు తమతల్లి కేతసానికి ధర్మముగా నిల్పి............"

ఈ శాసనములోని కొమ్మనప్రెగ్గడ కేయూరబాహు చరిత్రమునందలి కొమ్మనప్రెగ్గడయే. కనుక శాసన సంవత్సరమునుబట్టియుఁ గేయూరబాహు చరిత్ర ప్రథమాశ్వాసములోని 19,20,21,22,28,24,25 పద్యములనుబట్టియుఁ బైశాసనములోని కులోత్తుంగ గొంకరాజు వెలనాటిచోడుఁడేయని స్పష్టపడకమానదు. అయినను పొన్నూరు డివిజనులోఁ జేరిన నిడుబ్రోలు గ్రామ మధ్యమునను్న చోడేశ్వరస్వామి యాలయముముందఱ రాతి

మీది శాసనమువలనను నర్సరావుపేట తాలూకాయందలి యల్లమంద కోటీశ్వరాలయములోని శాసనమువలనను వెలనాటి గొంకరాజును రాజేంద్రచోడుఁడును జతుర్థకులజులని తెలియుచున్నది గాన నీవిషయ మింకను విచారణీయము. మల్లదేవుఁడు మాచెలకావిడిచి మండాదికి వలనపోవునప్పటి కనుగురాజు నలువదియేండ్లును నలగామరాజు పదుమూఁడేండ్లును బల్నాటిలో రాజ్యముచేసినట్లు మండాదివలస కథలో వ్రాయఁబడినది. మండాదివలస తరువాత షుమారు 7 సంవత్సరముల 6 మాసములకు యుద్ధము జరిగినది. యుద్ధము 1178, 1182 సంవత్సరముల మధ్యమున జరిగినదని యిదివఱకే నిర్ధారణ చేయఁబడినది. ఇది 1178 వ సం॥ లో జరిగినను లేక 1182 సం॥లో జరిగినను మండాదివలసనాఁటి కనుగురాజు 40 సం॥లును నలగామరాజు 13 సం॥లును రాజ్యముచేసినది నిజమేయైనపక్షమున ననుగురాజు పల్నాటికధిపతియైన సంవత్సరము 1118 వ సంవత్సరమో లేక 1122 వ సంవత్సరమో యగును. కాని యనుగురాజు పల్నాటికధిపతియైనది 1127 సం॥ మొదలుకొని 1158 సం॥వఱకు రాజ్యముచేసిన కులోత్తుంగ చోడగొంక రాజుకాలములోనని యింతకుముందు విశదపఱచియుంటిని. కావున ననుగురాజో నలగామరాజో మండాదివలస కథలోఁ జెప్పఁబడినట్లు గాక కొన్ని సంవత్సరములు తక్కువగా రాజ్యముచేసియుండవలెను. అనుగురాజు వివాహమాడిన కథగల గ్రంథభాగము, శ్రీనాథవిరచితము, నాకు లభింపలేదు. దానిలో నెట్లుండునో తెలిసినయెడల మఱియెక్కువ నిశ్చయముగా వ్రాయవచ్చును. హైహయులశాసనములు తెలుఁగుదేశమునమిక్కిలి విస్తారముగఁ గానరావు. క్రీ॥శ॥1408సం॥లోఁ గార్తవీర్యుని వంశస్థుఁడును మధ్యదేశాధీశుఁడునైన చోడునిశాసనము విశాఖపట్టణము జిల్లా సర్వసిద్ధి తాలూకా పంచధార ధర్మలింగేశ్వరస్వామి యాలయములోఁ గలదు. పల్నాడు తాలూకా కార్యమపూడి వీరాలయములోఁ గన్నమదాసు మంటపము వెనుకనున్న బండమీద నయోధ్యరాజు శాసన మొకటియున్నది. అది స్ఫుటముగాఁ గనఁబడుట లేదు. ప్రయత్నముచేయఁగా నీక్రిందియక్షరములు చదువఁగలిగితిని. "స్వస్తిశ్రీమన్మహామండలేశ్వర అయోధ్యపురవరాధీశ్వర............లసింగునుండలేశ్వరుని సన్నిధిని చెన్నరాయులవారి గుడి యెత్తించ............దుకొనిలమస్యంది శకవర్షంబులు ౧౨౪౧ క్రోధిసంవత్సర............కార్తిక.........౧౦ గు॥ చండప్రసిద్ధ గరుడగంబ" ఈ శాసనకాలమునకు షుమారు 4 సంవత్సరముల క్రిందటనే ప్రతాపరుద్రుఁడు మహమ్మదీయులచే ఢిల్లీకిఁ బట్టుకొనపోఁబడి దేశము తురుష్కుల స్వాధీనమాయెను. శాసనము బొత్తిగ నగుపడుటలేదనియు నయోధ్యరాజు కొల్వులోనున్న యొకవతఁడేమో కట్టించి శాసనము వ్రాయించెననియు సూయాలుదొరగారు వ్రాసియున్నారు. ఎఱువతాన్వయరాజు భాగ్యయైన మైలమాదేవి శాసనము ద్రాక్షారామభీమేశ్వరాలయములో నున్నట్లు సూయాలు శాసనపట్టికలో నుదహరించినాఁడుగాని యాశాసనము నాకు లభింపకపోవుటచేత నామై

లమాదేవి యనుగురాజు భార్యయైన మైలమాదేవియో కాదో చెప్పఁజాలకున్నాను. పల్నాటివీరుల పేరులుగల గ్రామము లిప్పటికిఁ గలవు. అనుగురాజు పేర నలుగురాజుపల్లె పల్నాటిలోఁ గలదు. అనుగురాజని శ్రీనాథగ్రంథమందు నలుగురాజని వీరభద్రకవిగ్రంథమందుఁ గానఁబడుచున్నది. అలుగురాజను నామమే యథార్థనామమై యుండవచ్చును. అలరాచమల్లు పేర మాచెర్లకాఱుమైళ్ళదూరమున రాచమల్లుపాడు గలదు. ఝట్టిరాజు పేరఁ దుమ్మకోటకు నాలుగుమైళ్ళదూరమున ఝట్టిపాలెము కలదు. తుమ్మకోటవద్దనున్న మల్లవరము మల్లదేవుని పేరి గ్రామమైయుండును. అనుగురాజు సముద్రస్నానమునకు వెళ్ళినపుడు దొడ్డనాయుని పేర నాయునిపల్లెయుం శీలాంబ పేరఁ జీరాలయుఁ జేర్ని పేరఁ జేరాలయుఁ గట్టెనని వీరభద్రకవి వ్రాసినాఁడు. నాయకురాలి పేర "నాయకురాలికనుమ" అని యొక కనుమగలదు. ఇది కార్యమపూడికిని మేళ్ళవాగునకును మధ్యముననున్నది. వీరమేడపినుండి బాలచంద్రుఁడు యుద్ధమునకు వచ్చుచుండఁ గార్యమపూడి కనుమలో నాయకురాలు పంగచాచి యడ్డముగ నిల్చుండెననియు నదిమాచి బాలచంద్రుఁ డాడువారితోఁ గలహించుట యుచితముకాదని ఖడ్గముచేఁ గొండయొక్క యొకప్రక్కను నఱికి త్రోవచేసికొని కార్యమపూడి చేరెననియు జనులు చెప్పుదురు. బాలచంద్రుఁ డెక్కివచ్చిన వాహనపు గిట్టెవలనఁ బడినదని కార్యమపూడి నాగులేటియొడ్డున నొక గుఱుతు నిప్పటికిఁ బ్రజలు చూపుచున్నారు. నలగామరాజువద్దనుండి చీలి బ్రహ్మనాయుఁడును మల్లదేవులును మాచెర్లకుఁ బోయిరని కథాసారము చదివినచోఁ దేటపడఁగలదు. వారుగురిజాలనుండి బయలుదేఱి యొకచో మజిలీచేసి యచ్చటఁ బట్టణము కట్టిరనియు మజిలీచేసిన పట్టణముగాన దానికి మాచెర్లయని పేరువచ్చినదనియు వీరచరిత్రములో వ్రాయఁబడినది. పూర్వము మారీచుఁ డేలినది మాచెర్ల, ఖరుఁ డేలినది కార్యమపూడి, దూషణుఁ డేలినది దుర్గియని యచ్చటిజనులు చెప్పుకొందురు. శాసనములలో "మహాదేవిచెర్ల" అనియున్నది. మహాదేవిచెర్లయే మాచెర్లగా మాఱియుండవచ్చును. మాచెర్లలోనున్న చెన్నకేశవుని దేవాలయము బ్రహ్మనాయుఁడు కట్టించెనని ప్రతీతిగలదు. ఈ యాలయములోని పనితనము, హనుమకొండ వే స్తంభముల గుడిలోని పనితనము నొక్కతీరుగనున్నవి. ఫర్గ్యుసన్ దొరగారు "ఈస్టర్న్ అండు ఇండియన్ ఆర్కిటెక్చర్ (Eastern and Indian Architecture) అను గ్రంథమున హనుమకొండ యాలయమును గుఱించియిట్లు వ్రాసిరి. "According to an inscription on its walls the temple was erected in 1164 A.D by Pratapa Rudra who, thought not exactly himself a Chalukya in blood, succeeded to their possessions and style." దీనివలనఁ బ్రతాపరుద్రునిచేఁ గట్టఁబడిన యీ దేవాలయము చాళుక్యశిల్పముకలదని తెలియుచున్నది. మాచెర్లయాలయములోని శిల్పమునట్టిదే కాన నదికూడఁ జాళు

క్యశిల్పమై యుండును. బ్రహ్మనాయఁడు చాళుక్యులకాలములోని వాఁడగుటవలన మాచెర్లయాలము చాళుక్యశైలి ననుసరించి యతఁడే కట్టించెనని చెప్పవచ్చును. యుద్ధావసానము పూర్తిగ వర్ణింపఁబడిన శ్రీనాథరచిత గ్రంథభాగము నాకు దొరకలేదు. బ్రహ్మనాయఁడు యుద్ధములోఁ జచ్చినవారినందఱ బ్రతికించి వెంటఁబెట్టికొని గుత్తికొండ బిలములోఁ బ్రవేశించెననియు నందఱు నిజస్వరూపములు గైకొనిరనియు నందులో బ్రహ్మనాయఁడు విష్ణురూపము నాయకురాలు యోగమాయారూపము నందిరనియు వీరభద్రకవి వ్రాసినాఁడు. మల్లయ్యయను నొకఁడీ వీరచరిత్ర ద్విపదగా రచించినాఁడు. అది చెన్నపట్టణమునందలి లిఖితపుస్తక భాండాగారములో నున్నది. చిట్టచివరకు బ్రహ్మనాయఁడును బచకుల బ్రహ్మయుఁ బోరాడిరనియు బచకులబ్రహ్మ హతుఁడాయెననియుఁ దరువాతఁ జింతపల్లిరెడ్డి బ్రహ్మనాయునిమీఁదికిఁ బోయి మూర్ఛిల్లిపడిపోయెననియుఁ బిమ్మట నాయకురాలు కదియఁగ స్త్రీలతోఁ బోరాడుట యుచితము కాదని బ్రహ్మనాయఁడూరకుండ నాయకురాలే యతనిని బొడిచెననియు నతఁడా మెయికి గ్రన గుఱ్ఱమును బొడిచి చంపఁగా దిగి పాటిపోయి నలగామరాజును గలిసికొని యిద్దఱు కొదమగుండ్లకుఁ బోయి విప్రుల యిండ్లలో డాఁగిరనియు బ్రహ్మనాయఁడచటికిఁ దఱుముచుఁ బోవ బ్రాహ్మణులు వచ్చి రాజును మన్నింపుమని యతనిని బ్రతిమాలికొనిరనియు నతఁడును వారిని క్షమించి నలగామరాజును గురిజాలసింహాసన మెక్కించెననియు మల్లయ్య గ్రంథమువలనఁ దెలియుచున్నది వీరచరిత్రమును ద్విపదకావ్యముగా వ్రాసిన మఱియొకకవి కొండయగలఁడు. ఇతని గ్రంథములోఁ గూడ యుద్ధావసానము మల్లయ్యగ్రంథములోనున్నట్లే యున్నది. యుద్ధానంతరము వీరు విస్తార కాలము రాజ్యము చేసినట్లు కనఁబడదు. యుద్ధము జరిగిన తరువాత షుమారు 50 సం॥లలోనే దేశము కాకతీయగణపతిరాజుల యధీనమైనది. పల్నాటి వీరులఁగుఱించి వీరచరిత్రముగాక చరిత్రగ్రంథాంతరములయం దెచ్చటనైనఁ గలదేమోయని విచారింపఁగాఁ గొండవీటి దండకవిలెలో మోహనరాజు గోపాలరాజు ననువిద్దఱు జైనులు వచ్చిన తరువాత నుత్తరాదినుండి కుష్ఠవ్యాధి బాధితులై యనేక తీర్థయాత్రలు చేయుచు గుంటూరునకువచ్చి గుండువద్ద సెట్టిచెఱువులో స్నానము చేయఁగా వ్యాధి కుదిరెననియు వారచ్చటనేయుండి యగస్త్యేశ్వరునికి మంటప ప్రాకారములు కట్టించి ధనమును వినియోగించిరనియు వ్రాయఁబడియున్నది. ఇది మన యనుగురాజు మొదలగువారి విషయముగనే కన్పట్టును. దండకవిలె వ్రాసినయతఁడు వినికిడినిఁబట్టి నిజము తెలియక యిట్లు వ్రాసియుండును. దండకవిలెలో విషయము లెంతసూటిగా వ్రాయఁబడినవో యాగ్రంథములోని యీక్రింది వాక్యములవలనఁ దేటపడఁగలదు——"ఈ అయిదుగురు ధర్మంనడిచిరి. అటుతరువాతను క్రంటి అందురు. ఇతఁడే యోరుగంటి ప్రతాపరుద్రుఁడు. ............స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు 886 అగు నేటి దుందుభిసంవత్సరమున ఈ ఓ

రుగంటి ప్రతాపరుద్రుఁడు పగరాజుచేతఁ బట్టువడును" ప్రతాపరుద్రుఁడు వాస్తవమును క్రీ॥శ॥ 1328వ సం॥లోఁ బట్టుపడినాఁడు. కనుకఁ బైవాక్యములలోని వ్యత్యస్తములు చరిత్ర చదివినవారికి సులభముగఁ బొడకట్టఁగలవు. అనుగురాజు తీర్థయాత్రావశమున వచ్చెనని కథలు వ్యాపించియుండెను గాన నవికర్ణాకర్ణిగవిని నిజమైన పేరులు విషయములు తెలియక కవిలెకారుఁడట్లు వ్రాసినాఁడని చెప్పవచ్చును.

అనుగురాజు వంశస్థులజాడ యీప్రాంతములఁ గానరాదు. కాని వెలమయైన బ్రహ్మనాయుని గోత్రమువారు మాత్రము కలరు. వారు వెంకటగిరి సంస్థానాధీశులైన వెలుగోటివారు. బ్రహ్మనాయుఁడు రేచెర్లగోత్రుఁడు. వెలుగోటివారును రేచెర్లగోత్రులే. వెంకటగిరి సంస్థానవంశచారిత్రమునందు వంశావళి చేవిరెడ్డివద్దనుండి చెప్పఁబడినది. చేవిరెడ్డియు నొకమాలవాఁడును బొలముదున్నుచుండఁ గాధనము దొరకెననియు నాధనమునకా మాలవానిని బలియిచ్చి వాని యభీష్టప్రకారము చేవిరెడ్డి తనగోత్రనామము రేచెర్లగా మార్చెననియుఁ దచ్చరిత్రమునందు వ్రాయఁబడియున్నది. చేవిరెడ్డి కాకతీయగణపతిదేవుని కాలములోనివాఁడైనట్లా సంస్థానచరిత్రమువలనఁ దెలియఁగలదు. గణపతిదేవుఁడు 18వ శతాబ్దమందుండినవాఁడు కనుక వెంకటగిరిసంస్థానాధిపతులు 18వ శతాబ్దమునుండియే రేచెర్లగోత్రమువారయిరని దీనిచేఁ దెలియును. కాని వెలమయు రేచెర్లగోత్రుఁడునైన బ్రహ్మనాయుఁడు 12వ శతాబ్దమునకుఁబూర్వమందే యుండుటచేతఁ బైనిఁజెప్పఁబడిన చేవిరెడ్డికథయొక్క యాథార్థ్యమును సంశయింపవలసియున్నది. వెలుగోటివారు బ్రహ్మనాయుని వంశమువారేయైయుందురు. వీరిగోత్రమునకు రేచెర్లనామము చేవిరెడ్డివద్దనుండికాక యంతకుఁ బూర్వమునుండి వచ్చుచున్నదని నమ్మవలయును. రేచెర్లయను గ్రామమువలన గోత్రమునకా పేరు వచ్చియుండును. పల్నాటియుద్ధము జరిగిన కాలము హిందూదేశచరిత్రమునందు ముఖ్యమైనదిగా నున్నది. యుద్ధము జరిగినకాలమునందుత్తరమునఁ జేదిదేశములో హైహయుల రాజ్యము నశించెను. దక్షిణమునఁ బశ్చిమచళుక్యవంశ మంతరించెను. తరువాత స్వల్పకాలములోనే యుత్తరహిందూస్థానమంతయుఁ జాలమట్టుకు మహమ్మదుగోరి లోఁబఱచుకొనెను. దక్షిణహిందూస్థానమున ద్వారసముద్రపు భల్లాణరాజులు దేవగిరి యాదవరాజులు ప్రబలిరి. చివరకుఁజాళుక్యరాజ్యమంతయు యాదవుల స్వాధీనమాయెను. అప్పటిదేశస్థితి, పల్నాటివీరుల యాచారములు, నాగరికత, మతము మొదలగు నంశములు గ్రంథాంతరమందుఁ దెలుపఁదలఁచి వీరుల చరిత్రవిషయమింతటితో సమాప్తము కావించెదను. వీర చరిత్రమును ద్విపదగా మొదట రచించినది

—* శ్రీ నా థుఁ డు *—

( శ్రీనాథ జీవిత సంగ్రహము ).

ఈయన శృంగార నైషధము, భీమేశ్వరపురాణము, కాశీఖండము, హరవిలాసము రచించిన మహాకవి; పాకనాటి నియోగిబ్రాహ్మణుఁడు. భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శైవమతస్థుఁడు. ఇతని తాత పద్మపురాణ సంగ్రహము రచించిన కమలనాభుఁడు; తండ్రిమారయ; తల్లి భీమాంబ; జన్మస్థలము కొండవీటి సీమయని కొందఱు వ్రాసిరిగాని యీ విషయమై కొంతసందేహముగ నున్నది. కర్ణాటదేశమితని జన్మభూమియైన ట్లగపడును. సుప్రసిద్ధాంధ్రకవి కర్ణాటదేశీయుఁడనుట పలువురికి రుచింపకపోయినను మీదుమిక్కిలి నాకు నిష్టములేకపోయినను యాథార్థ్యముగఁ గనఁబడుచున్నది. నమ్మకపోవుట సంభవింపనేరదు గాన నాయభిప్రాయము తెలుపుచున్నాను. ఈయంశము నాలోచించుటకు సత్యాన్వేషణులు ప్రార్థితులు. శ్రీనాథుఁడు కాశీఖండములోని

"సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు రచియించితిని మరుత్రాటచరిత
నూనూగుమీసాల నూత్నయౌవనమున శాలివాహనసప్తశతినొడివితి
సంతరించితి నిండుజవ్వనంబునయందు హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొనియాడితిభీమనాయకుని మహిమఁ
బ్రాయమింతకు మిగులఁగైవ్రాలకుండఁ
గాశికాఖండమను మహాగ్రంథమేను
దెలుఁగుచేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి."

అను పద్యమున "కర్ణాటదేశకటకపద్మవనహేళి" (కర్ణాటదేశ పట్టణములను కమలములకు సూర్యుఁడు) అను విశేషణము తనకుఁజేర్చుకొనినాఁడు. జన్మస్థలమునందలి యభిమానమువలన నట్లు చెప్పికొనియుండును. మఱియు భీమేశ్వర పురాణములోని

గీ॥ ప్రౌఢిపరికింప సంస్కృతభాషయండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాషయండ్రు
రెవ్వరేమన్ననండ్రు నాకేమికొఱంత
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష."

అను పద్యమునందలి "నాకవిత్వంబు నిజము కర్ణాటభాష" యన్న వాక్యమతనికిఁ గర్ణాటభాషయందుఁగల ప్రేమను సూచించుచున్నది. ఈపద్యములోని 'కర్ణాటభాష' యనుదాని కంధ్రభాషయని యర్థమనియు నాకాలమున నంధ్రరాజులను గర్ణాటరాజులని చెప్పుచుండిరనియు నొకరువ్రాసిరి గాని యదియప్రామాణికము. ఆకాలమునఁ గర్ణాటరాజులు నంధ్రరాజులు వేఱుగానుండిరనియు నంధ్రభాష, కర్ణాటభాష వేఱు

వేఱుగ నెంచఁబడుచుండెననియు శ్రీనాథకృతగ్రంథములలోని యీక్రింది పద్యములవలనఁ దెలియఁగలదు.

శా॥ కర్ణాటోత్కలపారసీకనృపసఖ్యప్రాభవశ్రీనిధీ
ఘూర్ణోరాశిపరీతభూభువన మధ్యాంధ్రక్షమాధీశ్వరా
కర్ణాంత ధ్యగణ్య విశాల నేత్ర జగదేకప్రాజ్య సామ్రాజ్యదృ
కర్ణాటాధీశ్వరహారిభక్తినిగతక్ష్మాపాల చూడామణీ॥ కాశీ. ఆ. 3.

సీ॥ ఝూడేశవనస ప్రమాడ బాయహదాంతివంతునాదిక్షితీశ్వరుల గెలిచి
యొడ్డాదిమత్స్యవంశోదయార్జును చేతఁ బల్లవాధిపుచేతఁ బలచమంది
దండకారణ్యమధ్యపుళిందరాజగంభాహి వంశజులను నభయ మొసఁగి
భానుమత్కులవీరభద్రాన్న వేమేంద్ర గర్వసంరంభంబుఁ గట్టిపెట్టి

గీ॥ యవనకర్ణాటకటక భూధవులతోడ
బలిమివాటించియేలించెఁ దెలుఁగుభూమిఁ
దననిజస్వామి యల్లాడధరణినాథు
ధళిర యరియేటిలింగన ప్రభువరుండు॥ భీమ. ఆ. ౧॥

మ॥ అరబీభాష తురుష్కభాష గజకర్ణాటాంధ్ర గాంధారఘూ
ర్జరభాషల్ మళయాళభాషశకభాషా సింధుసౌవీర బ
ర్బరభాషల్ కరహాటభాషమొదలౌ భాషావిశేషంబుల
చ్చెరువై వచ్చునరేటియన్ననికి గోష్ఠీసంప్రయోగంబులన్॥ భీమ. ఆ. ౧॥

ఇట్టి పద్యములింకను గలవు. కర్ణాటదేశమనఁగా నంధ్రదేశమని కాని కర్ణాటభాషయన నంధ్రభాష యని గాని శ్రీనాథునికభిప్రాయము లేనట్లు నైపద్యములవలన స్పష్టము కాఁగలదు. భీమఖండములో

"మ॥ కనకక్ష్మాధర ధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
జినమజ్జ్యాంతర సార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తునా
యనుఁగుందాతఁ బ్రదాతకమలనాభామాత్య చూడామణిన్"॥

అను పద్యమునఁ దనతాత సముద్రతీరమందలి 'కాల్' అను పట్టణమున కధిపతియని చెప్పినాఁడు. ఇది పశ్చిమసముద్రతీర పట్టణమై కర్ణాటములోఁ జేరియుండును. కొం

డవీటి కైఫీయతులోనున్న ప్రకారమితఁడు కోమటివెంకారెడ్డి యాస్థానకవిగానుండి విజయనగరమునకుఁబోవుట కర్ణాటదేశమందలి ప్రేమను దెలియఁజేయుచున్నది. వీథినాటకములోని

''శా॥ కుళ్ళాయుంచితిఁ గోకసుట్టితి మహాకూర్పాసముందొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ బిసికితిన్ విశ్వస్తవడ్డింపఁగాఁ
జల్లాయుంబలిత్రావితిన్ రుచులుదోసంబంచుఁ బోనాడితిన్
దల్లీకన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడన్''॥

అను పద్యమునఁ గర్ణాటరాజ్యమును దల్లీయని సంబోధించినాఁడు. ఈతని కవితయందే మొదటఁ గన్నడపదము లెక్కువగఁ గాన్పించుచున్నవి. ఈ నిదర్శనములన్నియు శ్రీనాథుని జన్మభూమి కర్ణాటదేశమని చాటుచున్నవి. ఈయన కర్ణాటదేశమందు జన్మించినను దలిదండ్రులితని శైశవముననే యుద్యోగవశముననో లేక మఱియొక కారణముననో కొండవీటిసీమకు వచ్చియుందురు శ్రీనాథుని గ్రంథములు చదివినచో నంధ్రభాష యాతని స్వభాషగనే కాన్పించును. ఇంతభాషాకౌశల్యము పఠనమాత్ర సాధ్యముకాదు. కాని యితఁడు బాల్యమునుండి తెలుఁగుదేశములో నుండెననుట కనుమానము లేదు. బాగుగ మాటలాడ నేర్చినప్పటినుండి తెలుఁగే మాటలాడియుండును. తలిదండ్రులతో నింట నప్పుడప్పుడు మిశ్రమ కర్ణాటము మాటలాడుచుండినను నివసించినది కొండవీటిసీమ కావునఁ దెలుఁగువారితోఁ గలసిమెలసి తెలుఁగువారితో సహవాసముచేసి ప్రాతఃకాలము మొదలు సాయంత్రమువఱకుఁ దెనుఁగులోనే మునిఁగి తేలుచుండవలసినవాఁడై చివరకుఁ దెనుంగుదేశస్థుఁడుగా మాఱియుండును. కాఁబట్టియే బెండపూడియన్నమంత్రి ''పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు'' అని చెప్పినాఁడు. ఇతఁడు రాజమహేంద్రవరమును బాలించిన రెడ్ల యాస్థానకవీశ్వరుఁడని కొందఱు వ్రాసియున్నారు. కాశీఖండము వీరభద్రరెడ్డికి, భీమఖండము తన్మంత్రియైన బెండపూడి అన్నయ్యకును నంకితముచేయుటయే వీరుదానికిఁ జూపు కారణములై యున్నవి. ఇతఁడు తాను రచించిన గ్రంథములలోఁ జాలభాగము కొండవీటివారికే యంకితము చేసెను. పండితారాధ్యాది పెక్కుకృతులనందిన మామిడిప్రెగడయ్యది కొండవీటిసీమలోని బలిజేపల్లి. శృంగారనైషధకృతినందిన మామిడిసింగనప్రెగడయ్యతమ్ముఁడు. హరవిలాసకృతినందిన తిప్పయ్య కొండవీటి కుమారగిరి భూపాలునకు సుగంధద్రవ్యము లిచ్చువాఁడు. కొండవీటి కైఫీయతులో నీ క్రింది విషయము వ్రాయఁబడినది. కుమారగిరి భూపాలుని కుమారుఁడగు కోమటివెంకారెడ్డివద్ద శ్రీనాథుఁడాస్థానకవీశ్వరుఁడుగానుండి కర్ణాటరాజుల రాజధానియైన విద్యానగరమునకుఁ బోయెను. అప్పుడు రాజ్యముచేయుచుండిన హరిహరరాయలితనిని గౌరవించి నీవునివసించు స్థలమేదియనఁగా నతఁ డీ క్రిందిపద్యము చెప్పెను. —

“సీ॥ పగరాజగిరి దుర్గవర వైభవశ్రీలఁగొనికొని చెడనాడు కొండవీడు
పరిపంథిరాజన్య బలములబంధించి కొమరుమించినబోడు కొండవీడు
ముగురురాజులకును మోహంబుపుట్టించు గుఱుతైనయుత్రాడు కొండవీడు
చటులవిక్రమకళాసాహసంబొనరించు కుటిలాత్ములకుఁగాడు కొండవీడు
జవనఘోటకసామంత సరసవీర
భటనటానేక హాటకప్రకటగంధ
సింధురాగవమోహన శ్రీలఁదనరు
కూర్మియమరావతికిజోడు కొండవీడు॥”

హరిహరరాయలొంటిస్తంభపుమేడ కట్టింపఁదలఁచి సభలోఁగూర్చుండి యెవరైన నొంటిస్తంభపుమేడ యిదివఱకుఁగట్టినారాయని యడుగ శ్రీనాథుఁడు లేచి కోమటి వెంకారెడ్డి కొండవీటిలోఁ గట్టించుచుండెనని చెప్పెను. వాస్తవమునకప్పుడు వెంకారెడ్డికట్టించుచుండలేదు కావున హరిహరరాయలు పోయిచూచినచోఁ దనమాట యసత్యముకాకుండ శ్రీనాథుఁడు నిజశక్తిచే నవులూరిలోనున్న బ్రహ్మాండమైన తుమ్మచెట్టును గొండవీటికి రప్పించి మేడనిర్మింపఁబడునట్లు చేసెను. హరిహరరాయలు దూతనుబంపి కనుఁగొనఁగా శ్రీనాథుఁడు చెప్పినది నిజమాయెను. అతఁడు మెచ్చి కవికి జాగీరొసఁగెను. ఒంటిస్తంభము మేడవిషయమెట్లున్నను శ్రీనాథుఁడు కోమటివెంకారెడ్డి యాస్థాన కవీశ్వరుఁడని పై యంశములు తెలుపుచున్నవి. పల్నాటి వీరచరిత్రము కొండవీటిసీమాప్రాంతములయందుండియే వ్రాసినాఁడు. పైనిఁ జెప్పఁబడినరీతి నితఁడువ్రాసిన గ్రంథములలో రెండుతప్పఁ దక్కినవన్ని కొండవీటివారికే యంకితము చేసినాఁడు కొండవీటి వేమారెడ్డివద్దను, కోమటి వెంకారెడ్డివద్దను నీయనకవీశ్వరుఁడుగా నుండెనని కొండవీటికైఫియ్యతు చాటుచున్నది. ఇన్ని ప్రబల నిదర్శనములు శ్రీనాథుఁడు కొండవీటిరెడ్ల యాస్థానకవీశ్వరుఁడని ఘోషించుచుండఁగాశీఖండము భీమఖండము రెండుగ్రంథములు రాజమహేంద్రవరమువారి కంకితముచేసినన్న కారణమున నతఁడు రాజమహేంద్రవరపురెడ్ల యాస్థానకవీశ్వరుఁడని చెప్పుట కారణమునకు దూరముగనుండును. తననివాసస్థలమైన కొండవీటిసీమలో నఖండసామ్రాజ్యధురంధురులుండ వారినివిడిచి వారిచేనీయఁబడిన కొద్దిరాజ్యమేలెడు రాజమహేంద్రవగ రెడ్లకాస్థానకవీశ్వరుఁ డయ్యెననుట యసంభవము. కావున

“వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత వియ్యమందెనుగదా వెదురుగొడియ”

అను సీసపద్యపాదమునకుఁ బౌర్వాపర్యము విచారించి వీరభద్రరెడ్డికిఁ బ్రియుఁడైన విద్వాంసుఁడని యర్థము చెప్పవలయునుగాని యాస్థానకవీశ్వరుఁడని యర్థము చెప్ప నవకాశము లేదు. కొండవీటిరెడ్లకు బంధువులుగాన రాజమహేంద్రవరపురెడ్లు శ్రీనాథుని

సన్మానించి కృతులందియుండురు. గ్రంథములవలన నితఁడు 1397 సం॥ మొదలు 1422 సం॥ వఱకు రాజ్యముచేసిన * ఫిరోజుషాకాలములోను, 1381 సం॥ మొదలు 1395 సం॥ వఱకు రాజ్యము చేసిన కుమారగిరిభూపాలుని కాలములోను, 1379 సం॥ మొదలు 1401 వఱకు రాజ్యముచేసిన హరిహరరాయలకాలములోను, 1395 సం॥ మొదలు 1428 వఱకు రాజ్యముచేసిన కోమటి వెంకారెడ్డికాలములోను, వీరభద్రరెడ్డి పేరుగ 1415 సంవత్సరమునకుఁ బూర్వమే రాజ్యమునకువచ్చి 1436 సం॥ వఱకు రాజ్యముచేసినట్లు దృష్టాంతములుగల యల్లాడ వేమారెడ్డికాలములోను నున్నట్లు తెలియఁగలదు. ఇతఁడు భీమకాశీఖండములల్లాడ వేమారెడ్డికాలములో రచించెను. కాశీఖండములోని "చిన్నారిపొన్నారి" యను పద్యమువలన నితనికి నైషధము రచించునాఁటికి 20 సంవత్సరములును, భీమఖండము రచించునాఁటికి 40 సంవత్సరములును వయస్సుండివట్లూహింపవచ్చును.

భీమేశ్వరపురాణములోని

ఉ. అన్నయమంత్రిశేఖరుఁ డహమ్మదుశాసనదానభూమిభృ
త్సన్నిధికిన్ మదిన్ సముచితంబుగ వేమమహీసురేంద్ర రా
జ్యోన్నతి సంతతాభ్యుదయమొందఁగఁ బారసిభాషవ్రాసినం
గన్నులపండువైయమరుఁగాకిత సుందరలిపవర్ణపద్ధతుల్॥"

అను పద్యమువలన నహమ్మదుషా రాజ్యమునకువచ్చిన తరువాత నే భీమఖండమురచింపఁబడినట్లు తేలుచున్నది. కల్బురిగ (Kulburga) రాజధానిగఁ బరిపాలనచేసిన భామినీరాజులలో నహమ్మదుషా యొకఁడు. ఈయన క్రీ॥శ॥ 1422 సం॥ మొదలు 1435 సం॥వఱకు రాజ్యము చేసెను. దీనినిఁబట్టి భీమఖండము 1424 సం॥ ప్రాంతమున శ్రీనాథుఁడు రచించియుండునని చెప్పనగును. కావున నితఁడు క్రీ॥శ॥ 1384 సం॥ ప్రాంతమున జన్మించి, 1404 సం॥న నైషధము, 1424 సం॥ ప్రాంతమున భీమఖండము, 1432 సం॥ ప్రాంతమునఁ గాశీఖండము నాంధ్రీకరించియుండును.

శ్రీనాథుఁడాచారమునకుఁ వీరశైవుఁడైనను శివుఁడని విష్ణువని పోరాడెడు బుద్ధిమంతులవలెఁగాక న్యాయాదిశాస్త్రము లభ్యసించి జ్ఞానదృష్టిగలిగిన వేదాంతిగాఁ గన్పట్టుచున్నాఁడు. హరవిలాసములోని

"గీ॥ ఆవగింజంత బూదిమైనలఁదరేని
వెలఁదిగుమ్మడికాయంత వెట్టిపుట్టు॥"

అను పద్యపాదముల వలనను మఱికొన్ని పద్యములవలనను భస్మధారణాది బాహ్యవేషములయం దితనికెక్కువ నమ్మకము లేనట్లు కనఁబడుచున్నది. ఈయనగొప్ప పా

రాణికుఁడు; తార్కికుఁడు; వైయాకరణుఁడు; సాహిత్య చక్రవర్తి; యజుర్వేదవేత్త; వేదాంతనిధి; ధర్మశాస్త్రపారంగతుఁడు. భీమఖండకృతినాయక వంశావతారములోని

“కంసాసురధ్వంసి చరణపల్లవంబులు దనకుఁబుట్టినిల్లుకావునఁ గారణగుణసంక్రమణంబునంబోలెఁ జామరచ్ఛత్రధనుఃఖడ్గాది చిహ్నోపశోభితంబై”

యను వాక్యములును

“సీ॥ ముక్కంటిదరహాసమున కనుప్రాసంబు మిన్నేటిపీటికి మిక్కుటంబు
శారదాజ్యోత్స్నప్రసాదంబునకు వీప్సవలువకుద్ఘాంతమునకనుభాష
కల్పకారామరేఖకుఁ బ్రతిచ్ఛందంబు త్రిదశేంద్రకరటికి మేడితంబు
పుండరీకారణ్యమునకు సధ్యాహారమమృతాంబునిధికభిధాంతరంబు”

అనువాక్యములును శ్రీనాథుని తర్కవ్యాకరణ జ్ఞానమునుదిక్ఛాత్రము సూచింపుచున్నవి. తర్కపరిభాషాపదములైన “ప్రధ్వంసాభావము, ప్రాగభావము” అనునవి యుపయోగింపఁబడిన పద్యమొకటి వీథినాటకములోఁ గలదు గాని యది యశ్లీలముగ నుంటచే నుదహరింపఁజాలను. ఈ పద్యము శ్రీనాథరచితమో కాదోకూడ విచారింపవలసియున్నది. సర్వజ్ఞసింగమనాయునివంటి పండితునిచే మెప్పువడసి, సంస్కృతమునందుఁ బ్రౌఢములై “కాశీఖండమయః పిండం నైషధం విద్వదౌషధం” అని ప్రతీతిగాంచిన కాశీఖండనైషధములనే మిక్కిలి శ్లాఘ్యముగ నాంధ్రీకరించిన యితని వైదుష్యమేమని కొనియాడఁగలము? వ్యభిచారదోష మీయన కారోపించి యనేక కథలు చెప్పుచున్నారు. యౌవనమున స్వేచ్ఛగాఁ దిరిగినమాట వాస్తవమైనట్లే తెలియుచున్నది. ఇది యితనికిఁగల కళంకమని చెప్పక తప్పదు. కాని కాశీఖండము రచించునాఁటికితని మనోవృత్తియందును ప్రవర్తనమునందును సంపూర్ణమైన మార్పుకలిగినట్లు కాన్పించుచున్నది. శ్రీనాథుఁడు రచించిన గ్రంథములు మరుత్తరాజచరిత్రము, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్రము, భీమఖండము, కాశీఖండము, వీథినాటకము, హరవిలాసము, పల్నాటివీరచరిత్రము. నందననందన శతకముకూడ రచించినట్లు తెలియవచ్చుచున్నది. వీనిలో మరుత్తరాజచరిత్రము, శాలివాహనసప్తశతి, పండితారాధ్య చరిత్రము నిప్పుడు కానరావు. వీథినాటకమనఁబడు చిన్న పుస్తకమొకటి ప్రస్తుతమున్నదికాని యది శ్రీనాథకృతమో కాదో సందేహముగ నున్నది. వీథినాటకము దశవిధరూపకములలో నొకటి. దీనికి లక్షణము దశరూపకమునందీక్రింది విధమునఁ జెప్పఁబడినది :—

“వీథీతుకైశికీవృత్తౌసంధ్యంగాంకైస్తుభాణవత్
రసఃసూచ్యస్తు శృంగారః స్పృశేదపిరసాంతరం

యుక్తాప్రస్తావనాఖ్యాతైరంగై రుద్ఘాత్యకాదిభిః
ఏవంవీథిర్విధాతవ్యా ద్వ్యేకపాత్రప్రయోజితా॥

దీనిలోఁ బ్రధానరసము శృంగారము. సంధ్యంగాంకములు భాణములోరీతినుండును. ప్రస్తావనలో నుద్ఘాత్యకాద్యంగము లుండవలయును. మహావిద్వాంసుఁడైన శ్రీనాథుఁడు పూర్వోక్తలక్షణ లక్షితంబగు వీథినాటకరచ కారంభించి యసందర్భములైన వెట్టితొట్టిపద్యములతో గ్రంథమునింపియుండుట సంభవింప నేరదు. శ్రీనాథుఁడు సలక్షణమైన వీథినాటకము రచించియుండును. అది యేకారణముచేతనో నశింపఁగఁ గొన్ని శ్రీనాథరచిత చాటుపద్యములను గొన్ని యన్యకవికృతములను గైకొని గ్రంథమీరూపమును దాల్చియుండును. దీనిలోఁ గొన్ని పద్యములు గౌరవహీనులైన వ్యర్థులు వ్రాసినవిగాఁ గనంబడుచున్నవి. శ్రీనాథునికవిత్వము భావప్రధానముగానుండును. అనిమేషభంగురంబై, యనిర్వచనీయంబై, కేవల మానసగోచరంబైన యాత్మోద్బోధకము కలిగించుటయే కవితయొక్క పరమార్థము. ఇట్టి యాత్మోద్బోధక మలంకారగ్రంథములయందలి పద్యములఁ దలలుతోఁకలుమార్చి గుప్పించుటవలనఁగాని, నిరర్థకంబై, భావశూన్యంబై, కర్ణకఠోరంబులైన దీర్ఘసమాసములు నించుటవలనఁ గాని వేంకటేశ్వరునకు ముడుపుకట్టినట్లు శుద్ధాంధ్రనిరోష్ఠ్యాది నియమములు పాటించుటవలనఁ గాని యతిప్రాసములఁ బొందికగాఁ గుదుర్చుటవలనఁగాని కలుగనేరదు పదములెట్లు లాగిన నట్లులాగఁబడి శుష్కముగఁ జెప్పఁబడిన గర్భబంధ చిత్రకవిత్వములవలనను గలుగనేరదు. ఇవియన్ని కేవల నిష్ప్రయోజకములు. కవిత ప్రకృతికాదర్శప్రాయమై యుండవలయును. చరాచర ప్రకృతియందుఁ దరతమభేదంబుల విచారింప మనుష్యజన్మముత్కృష్టతమంబగుటచే మానుషభావంబులను, సత్త్వరజస్తమోగుణభేదంబుల నావహిల్లు మనోవికారంబులును బుద్ధియొక్క స్థూలసూక్ష్మావస్థలును గర్మజ్ఞానేంద్రియముల నానావిధగతులును జక్కఁగ నెఱిఁగియుండుట యుత్తమ కవిలక్షణము. కనుకనే వ్యాసుఁడగ్ని పురాణమున

శ్లో॥ నరత్వం దుర్లభం లోకే విద్యాతత్ర సుదుర్లభా
కవిత్వం దుర్లభం తత్ర శక్తి స్తత్ర సుదుర్లభా"

యని చెప్పినాఁడు; మఱియు భారతభీష్మపర్వాంతర్గతంబైన గీతాశాస్త్రంబున
"కింకర్మ కిమకర్మేతి కవయోప్యత్ర మోహితాః"

అని వచించెను. కర్మాకర్మవిభేదమునందుఁ గవులుకూడ మోహితులైరని దీని యర్థము. విద్వాంసులని శాస్త్రజ్ఞులని చెప్పక కవులని చెప్పుటవలన సామాన్యజనుల మనస్సునకగోచరములైన ప్రకృతి సూక్ష్మంబులు ధర్మమర్మంబులు భౌతికరహస్యంబులు నె

లుఁగుకవులుకూడ భ్రమించిరని యభిప్రాయమై యున్నది. కనుకఁ గవులనఁగాఁ గేవల యతిగణప్రాసైకవేదులే కాక పైనిఁ జెప్పబడినట్లు నన్యసామాన్యగుణములు కలవారని విశదమగుచున్నది. శ్రీనాథుఁడు తెలుఁగుకవితయందుఁ ద్రొక్కని త్రోవలేదు. లెస్లిస్టిఫెన్ (Leslie stephen) అను నతఁడు జార్జి ఎలియట్ (George Eliot) జీవచరిత్రములో " A strong imaginative genius is devoloped early; it is an overmastering faculty which forces its possession into activity often before knowledge or serious thought has accumulated; draws romances, epic poems, and dramas from children in their teens ; and suggests that not only the material surroundings, but ev∍n the storge of intellectual accomplishments is but an accidental stimulus to the innate creative power. " అని చెప్పినట్లు శ్రీనాథుఁడు బాల్యమునుండి కవిత చెప్పుచుండెను వాఁడు. బుద్ధివిజ్ఞానయుతము కాకముందే యపూర్వమేధావంతుల నిర్భరశక్తి పొంగిపొరలి బయటికివచ్చుచుండుట సహజము. "సీ॥ చిన్నారిపొన్నారి చిఱుతకూకటి నాఁడు రచియించితిని మరుద్రాజచరిత" అనుపాదమువలన నీయన పిల్లజుట్టువాఁడే మరుద్రాజచరిత్రము వ్రాసెనని తెలియఁగలదు. భీమఖండములోని "భాషించినాఁడవు బహుదేశబుధులతో విద్యాపరీక్షణవేళలందు" అనువాక్యమువలన గృహమునో లేక తన్నాదరించు సంస్థానమునో కనిపెట్టికొనియుండు తక్కిన కవులవలెఁగాక యంధ్రదేశమంతయుఁ గలయఁ దిరిగినట్లు కాన్పించుచున్నది. వేంకటగిరి ప్రభువగు సర్వజ్ఞసింగమనాయుని యాస్థానమునకుఁ బోయినప్పుడు "గోలకొండ, మాలముండ, పూలదండ, కొత్తకుండ" యను పదములనుంచి భారతార్థము వచ్చునట్లు పద్యము చెప్పుమని యడుగ నీక్రిందివిధమునఁ జెప్పెనని వాడుకగలదు—

"గీ॥ ఓయి ధృతరాష్ట్ర నీ కొడు కుత్త గోల
కొండ విధ మాలముండఁ గృష్ణుండు కాచి
పాండుసూనుల గెల్పించు నండ యగుచు
నుదరమునఁ బూలదండ రే కొత్తకుండ॥"

[ఉత్తగోల=వట్టి యవివేకి; కొండవిధము=కొండవలె నభేద్యమై; ఆలము=యుద్ధము; ఉండఁ=ఉండఁగా; ఉదరమున=మెడలో వేసికొనిన నుదరముపైఁబడియుండు; పూలదండ రేకు=పువ్వులదండ రేకు; ఒత్తకుండ=ఒత్తుకొనకుండ ననఁగా నలఁగకుండ; మెడ

లో వేసికొన్న పూలదండయొక్క రేకైన నలఁగకుండు నంతభద్రముగా రక్షించి కృష్ణుఁడు పాండవుల గెలిపించునని యర్థము].

మఱియు నితని చాటుపద్యములని యీ క్రిందివి వాడుకలో నున్నవి.-

సీ॥ దీనారటంకాలఁ దీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాలఁ
బలుకుఁదోడై తాంధ్రభాషామహాకావ్య నైషధగ్రంథ సందర్భమందుఁ
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తిరాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమబిరుద
మెటుల మెప్పించెదో నన్ను నింక మీఁద। రావుసింగమహీపాలు దీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు। సకలసద్గుణ నికురుంబ శారదాంబ. 1

సీ॥ కవిరాజుకంఠంబు కౌఁగిలించెను గదా పురవీథి నెదురెండ పొగడదండ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా నగరివాకిటనుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ దగిలియుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత వియ్యమందెను గదా వెదురుగొడియ
కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము। బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేఱి మోసపోతి। నెట్లు చెల్లింతుఁ డంకంబు లేడునూర్లు 2

సీ॥ కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి రత్నాంబరంబు లేరాయఁ డిచ్చుఁ
గైలాసగిరిఁ బండె మైలారువిభుఁడేగి దినవెచ్చ మేరాజు దీర్పఁగలఁడు
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱి హేమపాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు
భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ। గలియుగంబున నిఁక నుండఁ గష్టమనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గురనఁగ। నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి. 3

శా॥ అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము చేయు రా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
దాక్షారామచళుక్యభీమవర గంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించు నవ్వాసనల్॥ 4

వీనిలోని 1, 4-పద్యములు వీథినాటకమునఁ గానవచ్చుచున్నవి.

ఈయన దేశసంచారము చేసెనుగావుననే తెలుఁగు దేశమందలి యాచారములను నడవడికలను సంపూర్ణముగ గ్రహించెను. వివిధదేశములం దిరుగునప్పుడు నానావిధ జ

నులతోఁ గలియుట సంభవించునుగదా. ఈతని కవిత్వమున కౌన్నత్యము కలిగించిన కారణములలో బహుదేశసంచారమే ముఖ్యమైనదని చెప్పవచ్చును.

శ్రీనాథుఁడు మొదటఁ బల్నాటిసీమకుఁబోయినప్పు డతనికవిసార్వభౌమతా వైదుష్యములచ్చటి ప్రజలదివర కెఱుఁగమిచేఁ గాఁబోలు నంత గౌరవము చూపఁబడినట్లు కాన్పింపదు. అతఁడును దనకుఁ గలిగిన యనాదరణ సూచకముగఁ గొన్నిగ్రామముల మీఁదఁ బద్యములు చెప్పినాఁడని జనులిప్పటికి వాడుకొనుచున్నారు. వానిలోఁ గొన్ని పద్యముల నిందుదహరించెను.—

క॥ సొమలిపురి యమపురంబుగ। యముఁడాయెను బసివిరెడ్డి యంతకుమిగులన్
యమదూతలైరి కాపులు। క్రమమెఱుఁగనిదున్నలైరి కరణాలెల్లన్॥

క॥ గుడిమీఁదికోతిచేతను। గుడిలోపలినంబివారి కోడలిచేతన్
నడివీథిలంజచేతను। నడిగొప్పులయోరుగాలి నణఁగితినసుమీ॥

క॥ జొన్నకలి జొన్నయంబలి। జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ। పన్నుగఁ బల్నాటిసీమ ప్రజలందఱకున్॥

క॥ తేకులమండ బోనము। పాలాయెను మంచినీళ్ళుపడియుంకుటకే
నేలేకలవై పోయెను। గాలినగుర్జాలనిష్టకా మేశహరా॥

గీ॥ ఊరువ్యాఘ్రనగర (పులిపాడు) మురగంబు (శేషయ్య) కరణంబు
కాపుకపివరుండు (హనుమయ్య) కసవు (పుల్లయ్య)నీఁడు
గుంపుగాఁగఁజేరి గురిజాలసీమలో
నోగులంతగూడి రొక్కచోట॥

కార్యమపూడిని శ్లాఘించుచు నీక్రిందిపద్యమును జెప్పెనఁట :—

‘ఉ॥ వీరులుదివ్యలింగములు, విష్ణువునాయుఁడు, కల్లిపోతరా
జారయ భైరవుండు (తుహినాద్రిజయంకమ, నిర్మలాంబువై)
శేరెడు గంగధారమడుగేమణి కన్యక యన్నిభంగులం
గారెమపూడిపట్టణము కాశిసుమీ కనుఁగొన్నవారికిన్॥’’

ప్రథమమున గౌరవము వడయకపోయినను రానురాను శ్రీనాథుఁడు పల్నాటివారితో మిక్కిలి మైత్రినాటించి తనవార్ధక్యమునంతయు నచ్చటనే గడపెను. పల్నాటివీరచరి

త్రముచ్చటనుండియే వ్రాసినాఁడు. ఇప్పుడు కానవచ్చుచున్న గ్రంథములలో నితఁడు మొదట రచించినది శృంగారనైషధము. ఇతనికిఁ బూర్వము కవులందఱు విస్తారముగఁ బురాణములఁ దెనిఁగించిరి. శ్రోత్రమార్గ మవలంబించి యితఁడు శ్రీహర్షరచిత నైషధకావ్యము నాంధ్రీకరించి కొండవీటి వేమారెడ్డి మంత్రియైన మామిడిసింగన కంకిత మొసర్చెను. మామిడిసింగన కొండవీటిసీమలోని బలిజేపల్లి నివాసుఁడు. బలిజేపల్లిలో నిప్పటికి మామిడివారు గలరు. శ్రీనాథుఁ డాంధ్రీకరణములో ననన్యసామాన్యశక్తిని జూపినాఁడు. "సీ॥ ప్రౌఢదీర్ఘసమాసపదములచేత శ్రీనాథుండు కూలార్చె నైషధంబు" అని యొకరు వ్రాసిరిగాని యయ్యది తెలివిగలమాట గాదు. నైషధమును గూలార్పలేదు. కష్టపడి నేర్పుతో లఁది రసమును బోఁగొట్టక పట్టుకవచ్చినాఁడు. ఒకభాషలోనుండి మఱియొకభాషలోనికి గ్రంథమును దెచ్చుట సామాన్యమైనపనికాదు. నైషధమున ట్లాంధ్రీకరించుటకు శ్రీనాథునికిఁ దప్ప నన్యులకు సాధ్యముకాదని నాయభిప్రాయము. నైషధమునఁ దనయాంధ్రీకరణపద్ధతిని గూర్చి యిట్లు చెప్పికొనినాఁడు. —

"భట్టహర్ష మహాకవీశ్వరుండు కవికులాదృష్టాధ్వపాంథుండు రచించిన నైషధశృంగార కావ్యం బాంధ్రభాషావిశేషంబున నశేషమనీషి హృదయంగమంబుగ శయ్యననుసరించియు నభిప్రాయంబు గుఱించియు భావంబుపలక్షించియు రసంబుపోషించియు నలంకారంబు భూషించియు నౌచిత్యం బాదరించియు ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబుగఁ జెప్పఁబడిన యీభాషానైషధకావ్యంబు"

ఇతఁడు కొన్నిచోట్ల శ్లోకమునందుఁగల యభిప్రాయమునుమాత్ర మనుసరించి స్వేచ్ఛగఁ దెనిఁగించినాఁడు.

శ్లో॥ తవరూపమిదంతయావినా విఫలంపుష్పమివావకేశినః
ఇయ మృద్ధధనాపృథావనీ వ్యసనీ సంప్రవదత్వికాసికా॥ స. ౨॥

దీనిని

"గీ॥ సౌరభములేనియట్టి పుష్పంబువోలె
కందుఁగోయిలవెలియైన కానవోలె
నధిప దమయంతితోడ సఖ్యంబులేని
నీదుసౌందర్యవిభవంబు నిష్ఫలంబు॥"

అని తెనిఁగించెను. సంస్కృతమున "అవకేశినః విఫలంపుష్పమివ (వంధ్యవృక్షము యొక్క ఫలరహితమైన పుష్పమువలె)" అనియుండ సౌరభములేని యట్టి పుష్పంబు వో

తో' నని తెలుఁగునఁ జెప్పినాఁడు. "ఇయమృద్ధధనాఢ్యధావనీ" అనునది విడిచిపెట్టినాఁడు. "స్వవనీ సంప్రవదత్పికాపికా (కూయుచున్న కోకిలలుగల స్వోద్యానవనము నిరర్థకము)" అనియుండ దీనిభాగము పరిత్యజించి "గండుఁగోయిల వెలియైన కానవోలె" నని యుపమానము చెప్పెను.

శ్లో॥ తరుమూరుయుగేన సుందరీ
కిమురంభాం పరిణాహినాపరం
తరుణీమపి జిష్ణురేవతాం
ధనదాపత్య తపఃఫలస్తనీం॥ స. ౭॥

దీనిని.—

మ॥ వనజాక్షేక్షణ యూరుయుగ్మమును లావణ్యంబునుం గేళికా
ననసంక్రందన పట్టణప్రకటజన్మస్థానలన్ రంభలన్
ధనదాపత్యతపఃఫలస్తనుల నత్యంతాభిరామాంగులన్
మనుజాధీశయుధఃకరించుఁ బొగడన్ మాబోంట్లకున్ శక్యమే.

అని యాంధ్రీకరించినాఁడు. దీనిలో మూలమునలేని 'కేళికాననసంక్రందన పట్టణప్రకటజన్మస్థానలన్" అను క్రొత్తవిశేషణము చేర్చినాఁడు. మూలములోని "ధనదాపత్య తపఃఫలస్తనీం" అనునది తరుణీపరమైన రంభాశబ్దమునకు విశేషణముకాని తరుపరమైన రంభాశబ్దమునకు విశేషణముకాదు. ఈతఁడీ విశేషణము రెంటికిఁ జేర్చినాఁడు. మూలములోఁ దరుణీ తరువాచకములైన రంభ శబ్దములకు రెంటికి వేఱువేఱు విశేషణము లుండ నితఁడు విశేషణములన్నియు రెంటికిఁ గలిపిచెప్పెను. పద్యమునకు శ్లోకమునకు నర్థములోఁగూడఁ గొంత భేదము కన్పట్టుచున్నది. ఇట్లు కొన్నిచోట్ల స్వేచ్ఛ నుపయోగించినను మొత్తముమీఁద మాతృక ననుసరించియే తెనిఁగించెను. మూలములోనున్న శ్లోకముల నొకదానివెంట నొకటిని క్రమముగఁ దెనిఁగింపలేదు. కాని కథాక్రమము మిక్కిలిగఁ బాటించినాఁడు. "నిపీయయస్యక్షితిరక్షిణఃకథా" అను ప్రథమశ్లోకమును బొత్తిగవదలిపెట్టి "సువర్ణదండైకసితాతపత్రిత జ్వలత్ప్రతాపవళికీర్తిమండలః" అను రెండవశ్లోకములోని భాగమును, "పవిత్రమత్రాతను తేజగద్యుగే స్మృతారసక్షాళనయేవతత్కథా" అను మూఁడవశ్లోకభాగమును "అమున్యవిద్యారసనాగ్రనర్తకీ" అను నైదవశ్లోకములోనిభాగమును "స్ఫురద్ధనుర్నిస్వనతద్ఘనాశుగ ప్రగల్భవృష్టివ్యయితస్యసంగరే" అను తొమ్మిదవ శ్లోకములోని భాగమును జేర్చి కథాప్రారంభమందలి మొదటిపద్యము చెప్పెనాఁడు. ప్రథమసర్గమును ప్రథమాశ్వాసముగ నాంధ్రీకరించి ద్వితీయ తృతీయ చతుర్థసర్గములు ద్వితీయాశ్వాసమందును; 5, 6, 7 సర్గములఁ దృతీయాశ్వాసమందును; 8, 9 సర్గములను

10 వ సర్గములోని 87 శ్లోకములను చతుర్థాశ్వాసమందును; 10వ సర్గములో మిగిలినశ్లోకములను, 11, 12, 13 సర్గములను, 14 వ సర్గములోని 47 శ్లోకములను పంచమాశ్వాసమందును; 14 వ సర్గములో మిగిలిన శ్లోకములను, 15 వ సర్గమును, 16 వ సర్గములోని 118 శ్లోకములను షష్ఠాశ్వాసమందును; 16 వ సర్గములో మిగిలిన శ్లోకములను, 17 18 సర్గములను సప్తమాశ్వాసమందును; 19, 20, 21, 22 సర్గముల నష్టమాశ్వాసమందును నిమిడ్చినాఁడు. సంస్కృతములో నైషధమునిట్లు క్లుప్తము చేసినప్పటికిఁ బూతిఁగ నాంధ్రీకరించినాఁడు. కథాక్రమమునందేమియు వ్యత్యస్తము చేయలేదు. సంస్కృతమునను్న ట్లే చెప్పెను. స్వయంవర సమయమున సరస్వతీ వచనానుసారముగ దమయంతీదేవి నలునికంఠమున మధూకదామమున వేసిన తరువాత, ననఁగా నలవరణానంతరమున, నింద్రాదులు స్వస్వరూపములఁ దాల్చినట్లు సంస్కృతనైషధమునఁ జతుర్దశ సర్గమునందుఁ జెప్పఁబడియుండ నలుని కంఠమున దమయంతి పుష్పమాల వేయకముందే యింద్రాదులు నలాకారమువిడచిరని యాంధ్రనైషధ పంచమాశ్వాసమున నున్నది. అయినను కథాక్రమమునం దిదియొక గొప్పలోపముకాదు. ఈ మార్పులవలన వెనుకజరిగిన కథాక్రమమునకుఁ గాని ముందురాఁబోవు కథాక్రమమునకుఁ గాని భంగముకలుగదు. కాలక్రమము మఱచిపోయి "పాకశాసనుండు, పావకుండు, పరేతపతి, పాశహస్తుండు, పంచముండనైన నేను నిర్యోవురముం బాండవులు పాంచాలింబోలెఁ బంచికొని యనుభవింతము" అని కలి పలికినట్లు సప్తమాశ్వాసమునఁ జెప్పినాఁడు. రాజతరంగిణి యను గ్రంథములో

"శ్లో॥ శతేషుషట్సుసార్ధేషుత్ర్యధికేషుచభూతలే
కలేర్గతేషువర్షేషు ప్రభవాకురుపాండవాః॥"

అని కలియుగమునఁ గొన్ని సంవత్సరములు గడచినతరువాతఁ గురుపాండవులున్నట్లు చెప్పఁబడినది ఇది గాక బృహదశ్వుఁడు నలోపాఖ్యానము ధర్మజునకుఁ జెప్పుట పురాణసిద్ధము. కనుకఁ బాండవులకంటెను నలుఁడు మిక్కిలి పూర్వుఁడనుట నిర్వివాదకము. ఈ పొరపాటు శ్రీనాథునిదికాదు. శ్రీహర్షుఁడే

"శ్లో॥ యతథ్వంసహాకతుర్ణాంమాం పాంచాలీ పాండవైరివ
సాపిపంచభిరస్మాభిః సంవిభజ్యైవభుజ్యతాం॥"

అని సప్తదశసర్గమునఁ జెప్పెను. దీనినే శ్రీనాథుఁ డాంధ్రీకరించెను.

నైషధమునకు వ్యాఖ్యానము వ్రాసిన నారాయణ పండితుఁడీ విషయమునిట్లుసమర్థించినాఁడు :—

"పాండవానామగ్రభావిత్వాత్తదానీం దృష్టాంతత్వేన
కలేర్యోగిత్వ భవిష్యదర్థజ్ఞాన సామర్థ్యాద్వచనం యుక్తం
జగత్ప్రవాహానాదితయాపాండవ పాంచాలీవృత్తాంతానా
మతీతత్వాత్తదుదాహరణీ కృత్యైతదుక్తమితివా॥" (పాండవుల యగ్రభావిత్వము (ముందుండుట) వలన నప్పటి దృష్టాంతత్వముచేఁ గలియొక్క యోగిత్వ భవిష్యదర్థజ్ఞాన సామర్థ్యకారణమున వచనముయుక్తము. లేక, ప్రపంచముయొక్క యనాదితచేతఁ బాండవపాంచాలీ వృత్తాంతములయొక్క యతీతత్వమువలననది యుదాహరణము చేసి చెప్పఁబడినది).

ఇతఁడు శ్రీహర్షునియందలి గౌరవాతిశయముచే నెట్లులైన సమర్థింపవలెనని యత్నించెఁగాని జ్ఞానదృష్టితోఁజూచిన యెడల నీసమర్థనము యుక్తియుక్తముగఁ గాన్పింపదు. కవి ప్రమాదమునొందెననుటయే సమంజసముగా నుండును. బహుశః రచనావేగమున నీ పొరపాటతఁడు కనుఁగొని యుండకపోవచ్చును. "ప్రమాదోధీమతామపి" యను న్నార్యోక్తికలదుగదా.

నైషధమునందు నలచరిత్ర సంపూర్ణముగ లేదు. నలుఁడు దమయంతిని బెండ్లాడి స్వనగరము ప్రవేశించిన తరువాతఁ గలి యచ్చటికివచ్చి మందిరోద్యానమునందలి పాదలోని తాండ్రచెట్టు తొఱ్ఱలోనుండి నలునియందు రంధ్రాన్వేషణము చేయుచుండ నూతన దంపతు లిష్టోపభోగములఁ బొందునప్పుడు ప్రాద్దుగ్రుంకఁగా నుదయించిన చంద్రుని వర్ణనముతో గ్రంథము సమాప్తిగావించినాఁడు. శ్రీహర్షుఁడు నైషధము సంపూర్ణముగ నలువది సర్గములలో రచించెనని కొందఱందురుగాని యది యవిశ్వసనీయము. ఈ విషయమై నైషధమునకు వ్యాఖ్యానము వ్రాసిన నారాయణ పండితుఁడిట్లు నుడువుచున్నాఁడు:—

"మహాభారతాదౌవర్ణితస్యా ప్యుత్తర నలచరిత్రస్య నీరసత్వాన్నాయకానుదయవర్ణనేన రసభంగ సద్భావాచ్చకావ్యస్యచ సహృదయాహ్లాదన ఫలత్వాచ్చాత్రోత్తర నలచరిత్రం శ్రీహర్షేణానవర్ణిత మిత్యాది జ్ఞాతవ్యం (మహాభారతాదులయందు వర్ణింపఁబడినప్పటికి నుత్తర నలచరిత్రయొక్క నీరసత్వమువలనను, నాయకానుదయ వర్ణనముచే రసభంగము గలుగుటవలనను బండిత హృదయాహ్లాదము కావ్యమునకు ఫలమగుటవలననను నీనైషధకావ్యమునం దుత్తర నలచరిత్రము శ్రీహర్షునిచేత వర్ణింపఁబడలేదని యెఱుఁగఁదగినది.)"

శ్రీహర్షుఁడు వర్ణించినమట్టునకు శ్రీనాథుఁ డాంధ్రీకరించెను. ఆంధ్రీకరించుటలోఁ బదములు మార్చినయెడల శైలికి భంగము కలుగునని తోఁచినప్పుడు మూలమునంద

లి సమాసములనే యుపయోగించినాఁడు. ఇతఁడు పండితారాధ్య చరిత్రముకూడ నిట్లే వ్రాసెనని పిడుపర్తి సోమనాథుని బసవ పురాణమునందలి.

"సీ॥ ... ... ... ... ...
వారభక్తిస్ఫూర్తిదికంబని శ్రుతులిడి చెప్పెఁ బ్రతిభ సోమేశుఁ డారాధ్యచరిత
వరవిశ్రీనాథుఁడా చరిత పద్యప్రబంధము చేసె ద్విపదలు తఱచు నిలిపి
యాతండె పద్యకావ్యము చేసె నైషధమంచిత హర్షవాక్యములఁ బెట్టి"

యను పద్యపాదములవలనఁ దెలియఁగలదు. పైనిఁ జెప్పఁబడినచోట్లఁ గాక మిగిలిన చోట్లఁ గడుసొంపుగను జాతీయముగను దెనిఁగించెను. ఇతని దీర్ఘసమాసములు నిరర్థకములు గాక భావగర్భితములై యుండును. కొన్ని శ్లోకములు వానికి సరియైన పద్యములు నుదహరించినచో నితని యాంధ్రీకరణపద్ధతి మిక్కిలి స్పష్టముగఁ దెలియఁగలదని తలఁచి యట్లొనర్చుచున్నాను.

(1) శ్లో॥ అయం దరిద్రో భవితేతి వైధసీం
లిపిం లలాటేఽర్థిజనస్య జాగ్రతీం
మృషాం న చక్రేఽల్పితకల్ప పాదపః
ప్రణీయ దారిద్ర్య దరిద్రతాం నృపః॥ స॥ ౧

చ॥ ఇతఁడు దరిద్రుఁడౌ ననుచు నేర్పడ నర్థిలలాటపట్టికన్
శతధృతి వ్రాసినట్టి లిపిజాలమనర్థము కానియట్లుగా
వితరణకేలనావిభవవిభ్రము నిర్జితకల్పభూరుహుం
డతఁడు దరిద్రతాగుణమునందు దరిద్రుని జేయు నాతనిన్॥ ఆ ౧

(2) శ్లో॥ సరసీః పరిశీలితుం మయా గమికర్మీకృతనైకనీవృతా
అతిథిత్వమనాయి సాదృశోః సదసత్సంశయ గోచరోదరీ॥ స॥ ౨.

మ॥ కమలేందీవరషండమండితలసత్కాసార సేవారతిన్
గమికర్మీకృతనైకనీవృతుఁడనై కంటిన్ విదర్భంబునన్
రమణిం బల్లవపాణిఁ బద్మనయనన్ రాకేందు బింబాననన్
సముపీనస్తన నస్తినాస్తి విచికిత్సా హేతు శాతోదరిన్॥ ఆ॥ ౨.

(3) శ్లో॥ విరహీణో విముఖస్య విధూదయే
శమనదిక్పవనస్స న దక్షిణః

సుమనసో నమయన్నటనాధను
స్తవతు బాహుర సౌయది దక్షిణః॥ స. ౪.

ఉ॥ రాకసుధాంశుమండలము రాకను మాఱు మొగంబు సేయుచో
దీక్షనివచ్చు దండధరదిక్పవమానము దక్షిణంబుగుం
గాకవియోగికిం గుసుమకార్ముకశృంగముగాఁజేయు నీ
యాకరపంకజాతము రతీశ్వరదక్షిణమైననాఁటికిన్॥ ఆ॥ ౨.

(4) శ్లో॥ దృశాకిమస్యాశ్చపలస్వభావే
నదూరమాక్రమ్య మిథోమితేతాం
నచేత్కృతః స్యాదనయోః ప్రయాణే
విఘ్నః శ్రవఃకూపనిపాతభీత్యా॥ ఆ॥ ౭.

గీ॥ శ్రవణ పుటకూపవిని పాతసాధ్వసమున
నిగిడియవ్వలికటుపోక నిల్చెఁగాక
యధిక చపలస్వభావంబులైన యట్టి
దీనికన్నులు తలచుట్టు తిరిగిరావె. ఆ. 3

(5) శ్లో॥ వృథాపరీహాసః ఇతిప్రగల్భతా
ననేతిచత్వా దృశివాగ్విగర్హణా
భవత్యవజ్ఞాచ భవత్యనుత్తరా
దతఃప్రదత్తః ప్రతివాచమస్మితే. స. ౯

గీ. కలికినవ్వు ప్రగల్భతా కారణంబు
కాదుకాదంటవాచావి గర్హణంబు
పలుకకుకంట తిరస్కారకలనముద్ర
గానప్రత్యుత్తరంబిచ్చుదాననీకు. ఆ. ౪

(6) శ్లో. నిస్త్రింశత్రుటితారివారణ ఘటాకుంభాస్థికూటావట
స్థానస్థాయుక మౌక్తికోత్కరకిరఃకేరస్య నాయంకరః
ఉన్నీతశ్చతురంగసైన్య సమరత్వంగత్తురంగక్షురా
క్షుణ్ణాసుక్షితిషుక్షిపన్నివయశః క్షోణీజబీజవ్రజం. స. ౧౨

శా. క్రూరాసిత్రుటితారి వారణఘటా కుంభస్థకూటస్థలీ
రారాజన్నవమౌక్తికోత్కరకరారంభక్రమోజ్జృంభియై

యీ రాజన్యకరంబు పోరులఁగరం బేపారు నత్కృతిఁ జే
జారోపం బొనరించుభంగి హాయరింఖాగ్రక్షతక్షోణులన్. ఆ. ౫

(7) శ్లో. అహర్నిశావేతిరతాయపృచ్ఛతి
క్రమోష్ణశీతాన్నకరార్పణాద్విజే
ప్రియావిదగ్ధాకిల తన్నిషేధినీ
న్యధత్తసంధ్యామధురేఽధరేఽంగుళిం. స. ౧౮

గీ. ఉష్ణశీతాన్నకబళంబులొక్కఁడునూపఁ
బవలో రాత్రియో యొడఁగూడనవసగమని
దానిపుత్తరమొకలతాతన్వి యిచ్చె
నధరబింబంబు విచెచి సంధ్యాగమమని. ఆ. ౬

(8) శ్లో. నిజాదమున్ప్రవ్రజ్య సమండలావధే
ర్నలంనివృత్తా చటులాపతాంగతః
తడాగకల్లోల ఇవానిలంతటా
ద్ధృతానతిర్వ్యావవృతే వరాటరాట్. స. ౧౬

గీ. ఆత్మమండలమవధిగా ననుసరించి
అవనినాథుఁడు జామాతననిపిమరలె
నాప్రతీరంబు గంధవాహంబు ననిచి
మగిడివచ్చు తటాకంపు తరఁగవోలె. ఆ. ౭

(9) శ్లో. పితాత్మనః పుణ్యమనాపదఃక్షమా
ధనం మనస్తుష్టిరథాఖిలంనలః
అతఃపరంపుత్రినకోపితేహామి
త్వ్యదద్రుమరేవ వ్యస్పృజన్నిజౌరసీం. స. ౧౬

మ. గురువన్నన్ ధనమన్నఁ బుణ్యమనినన్ గోత్రోదయంబన్న దే
వరయన్నన్ మనమన్నఁ దుష్టియనినన్ వాత్సల్యమన్నన్ నిజే
శ్వరుఁడన్నన్ బరమోపకారమనినన్ సర్వంబునన్నన్ దలో
దరి నీకున్ నిషధాధినాథుఁడె సుమీ తథ్యంబుగాఁ జెప్పితిన్. ఆ. ౭

(10) శ్లో. విశ్వరూపకృతవిశ్వకియత్తే
వైభవాద్భుతమణౌ హృదిసర్వే

హేమసహ్యాతి కియన్నిజచీరే
కాంచనాద్రి మధిగత్య దరిద్రః. స. ౨౧

గీ. విశ్వరూపభవద్భూరి విభవమహిమ
యెంతవర్ణింపఁజాలునీ యీమనంబు
ప్రాఁతపైచీర చెఱఁగున బడుఁగువాఁడు
హేమశైలంబు చిదిపిరాలెన్ని ముడుచు. ఆ. వ

(11) శ్లో. స్వధాకృతం యత్ర జనైః పితృభ్యః
శ్రద్ధాపవిత్రం తిలచిత్రమంధః
చంద్రం పితృస్థానతయోపతస్థే
తదంకరోచిః ఖచితాన్నదైవ

గీ. చంద్రమండలమిది పితృస్థానమగుట
జనసమావర్జిత స్వధాసలిలతిలలు
మంత్రబలమున నెక్క నీమధ్యమునకుఁ
జంద్రబింబాస్యలాంఛన చ్ఛాయగాదు.

నైషధము తరువాత నితఁడు రచించినది భీమేశ్వర పురాణము. నైషధములో నితఁడు చేసిన క్లిష్టీకరణముగాని గైకొనిన స్వేచ్ఛగాని భీమఖండమునఁ గానరావు. సంస్కృతమున 82 అధ్యాయములలోనున్న భీమఖండము తెలుఁగున నాఱాశ్వాసములుగ రచించెను. చాలమట్టుకు మూలము ననుసరించి యున్నదంతయుఁ దెనిఁగించినాఁడు. కాని ద్వితీయాశ్వాసములోఁ బీఠికాపురవర్ణనము స్వేచ్ఛగఁ జేసినాఁడు. సూర్యాస్తమయ చంద్రోదయ సూర్యోదయవర్ణనముల నధికముగఁ జేర్చినాఁడు. అజాగరూకుఁడై భీమఖండమాంధ్రీకరించెనని కొందఱనిరిగాని కాదాచిత్కముగఁ గొన్నిచోటులఁ బ్రామాదికములుండినమాత్రమున గ్రంథమంతయు నట్లే వ్రాసెనని భావించుట పొరపాటు. ఈ క్రింది శ్లోకములు వానికి సరియైన పద్యములు చూచినట్లయిన నెట్లాంధ్రీకరించినది స్పష్టముగఁ దెలియును

శ్లో॥ అహో కిమేతన్మే బ్రూహి వైవర్ణ్యం వదనే తవ
దృశ్యతే నేత్రయోర్దైన్యం మానసవ్యథయానఘ
కచ్చిన్న జాతో వాగ్వాదో లోలార్కేణ సమం తవ
డుంఠివిఘ్నేశ్వరః కచ్చిన్న త్వాం ధిక్కృతవాన్రుషా
కచ్చిత్త్వం క్షుధితః కాలే విశాలాక్ష్యా న వంచితః

నకశ్చిత్త్వయ్యనుచితం భైరవేణకృతంమృథా
కథంత్యక్తం త్వయాగంగావాహినీసైకతస్థలం
కథంతత్పరమం స్థానంత్వ స్వజత్కోకి పంచకం
కథంత్వంముక్తవాన్ ప్రాప్యామవిముక్తవసుంధరాం
కథంవిశ్వేశ్వరం దేవం సతాముజ్ఝితవాన్ధనం॥

వీనిని :—

గీ. ఆననమునందు వైవర్ణ్య మగ్గలించెఁ
గన్నుగవయందు దైన్యంబు గానఁబడియె
నాతిఁ యేదేని యొకటి నీయంతరంగ
మూనియున్నది యిది యెట్టులోకొ యనఘ.

సీ॥ లోలార్కునకు నీవులోలోన నేమేనిఁబోటిపుట్టదుగదా మాటమాట
వెనక యుక్తిడుంఠి విఘ్నేశ్వరసామి ధిక్కరింపఁడుగదా తెగువనిన్ను
నాఁకొన్ననిన్ను మధ్యాహ్నకాలంబు ననరయకుండదుగదా యన్నపూర్ణ
కెపమేమియును లేక నీయెడాటమ్మునఁ బాటిదప్పఁడుగదా భైరవుండు
ఎట్టుపానితి మిన్నేటి యిసుకతిప్ప
ఎట్టుపానితి వాస్థలంబేనుకోను
లెట్టుపానితి యవిముక్తహట్టభూమి
ఎట్టుపానితివిశ్వేశు నిందుధరుని.

అని తెనిఁగించెను. ఇంతకంటె మృదువుగను, జాతీయముగను, సరిగను భాషాంతరీకరణ మెట్లుండును? మఱికొన్ని శ్లోకములు వానికిసరియైన పద్యములు నుదహరించుచున్నాను—

1 శ్లో॥ అథక్రోధస్సముద్భూతః క్షుధార్త్యవ్యాదయేమమ
తేనక్రోధాంధకారేణ ప్రవృద్ధేనాహముద్ధతః
కిమప్యదృష్ట్వానహాసాభిక్షా పాత్రాణ్యపాతయం
శిలాయాంశతధాభిన్నం శిష్యేషుభయకంపిషు. అధ్యా. ౧౫

శా. శక్తిప్రోద్భవనిష్ఠు రక్షుధితదుష్క్రోధాంధకారంబునం
జక్షుల్ రెండును జిమ్మచీకఁటులుగా సంరంభ కుంభద్గతిం

ప్రేక్షుచ్ఛాత్రులు భీతినొందఁ గడునుద్రేకించి హట్టంబునన్
భిక్షాపాత్రలు రాతిమీద శతధాభిన్నంబుగా వైచితిన్. ఆ. ౨

2 శ్లో॥ సర్వేతద్వాక్యమాకర్ణ్యతమవోచన్నిదం వచః
ననివర్తయితుం శక్యమమోఘంనోవచోऽనఘ
తస్మాదన్యేనమార్గేణకరిష్యే మశ్నివంవయం. అధ్యా. ౨౧

గీ॥ అనుటయును వారలామాట లాదరించి
క్రమ్మఱపరాదు పలుకమోఘమ్ముమాకు
నీవయిప్పుడు చెప్పినహితమునాది
వేఱుచందాన మేలుగావింతుమింక. ఆ. ౪

8 శ్లో॥ సముచ్ఛలత్పయోవీచీమాలికా పరిశోభితా
దూరీకృతేశ గోవిందధామ సిద్ధవసుంధరా
జవాతిశయశీర్ణాద్రిధామరేణుచయావిలా
వివేశ గౌతమీగంగా దక్షవాటమహాపురీం॥

వ॥ మలఁగిమలంగి భీమపతి మందిరమండలసిద్ధభూమికిన్
వాలఁగితూలంగి యుచ్ఛలితతోయతరంగ పరంపరోద్ధతిన్
జెలఁగిచెలంగి యారభటిశీర్ణధరాధర ధాతురేణులం
కలఁగికలంగిపాఱె వడిగౌతమకన్యకదక్షవాటికన్. ఆ. ౪

శ్లో॥ తిష్ఠన్నాత్రోపివాసిష్ఠావసిష్ఠసదృశోపివా
దక్షవాటీ పురస్థాతా మోక్షంయాతినసంశయః. అధ్యా. 3౨

క॥ తిష్ఠన్మాత్రునకైన వ| సిష్ఠప్రతిమానుఁడైన శిష్టునకైనన్
నిష్ఠాత్మగలిగ నేనియు| నిష్ఠాకాలంబుముక్తినియమం బచటన్. ఆ. ౬

సంస్కృతమున 82 వ అధ్యాయములో ముగింపువాక్యమైన "యజ్ఞానసానసమమే భీమేశంవీక్షితుం యయుః" అనుదానిని "యజ్ఞానసావసమయంబున శ్రీమన్మహాదేవుని సందర్శింపంజనిరి" అని తెనిఁగించి కథముగించి తరువాత సంస్కృతములోనున్నట్లే తాను గూడ ఫలశ్రుతిచెప్పి గ్రంథము సమాప్తికావించినాఁడు. భీమఖండమిబ్భంగిఁ జాలమట్టు కు మూలము ననుసరించియే యున్నది. దీని పిమ్మట నతఁడు రచించినది కాశీఖండము. నైషధమునందుకంటెను భీమఖండమునందుకంటెను గాశీఖండములో నెక్కువ స్వత్తీకర

ణముకావించినాఁడు. క్లుప్తీకరణముమాత్రమే కాదు. స్వేచ్ఛకూడ మిక్కిలి యధికముగ నుపయోగించినాఁడు. 100 అధ్యాయముల గ్రంథము నేడాశ్వాసములలోఁ దెనిఁగించెను. కాశీఖండము రచించునాఁటికితనికవిత్వము నిగ్గుదేఱినది. ఈయన సీసపద్యములు చదువఁజదువఁ జవులూరుచుండును. దీనిలో నున్నంత భాషామార్దవము, రచనాచాతుర్యము, సొంపునితఁడింతకుముందు రచించిన నైషధభీమఖండములలోఁ గానరావు మాదిరికి రెండుపద్యపాదము లుదహరించెదను—

సీ॥ "ఎవ్వాఁడు డాచేతి క్రొవ్వాఁడినఖమునఁ జిదిమెభాషాదేవి చిగురుముక్కు"

సరస్వతి నవమానించెననుటకే యిట్లు చెప్పినాఁడు.

సీ॥ "చీకిలించుకయుండెఁ జిగురురెప్పలలోనఁ గుసుమసాయకవైరి నొసలికన్ను"

శివుని మూఁడవకన్ను ప్రకాశమానముగ లేదని దీనియర్థము. ఈవాక్యముల మార్దవమేమని నుతింపవచ్చును? ఇతఁడు చేసిన మూలాతిక్రమణము, నొనరించినయధికక్లుప్తీకరణము, నుపయోగించిన స్వేచ్ఛ తెలియుటకై కొన్నిశ్లోకములను వానికి సరియైన పద్యముల ను జూపుచున్నాను—

(1) శ్లో॥ అరుంధతీంధ్రువంచైవ విష్ణోఃత్రీణిపదానిచ
ఆసన్నమృత్యుర్నో పశ్యేచ్చతుర్థంమాతృమండలం

ఉ॥ కానఁడరుంధతిన్ ధ్రువునిఁ గానఁడు విష్ణుపదత్రయంబునుం
గానఁడు మాతృమండలము కానఁడుకన్నులుకల్గియేనియే
మానవుఁ డమ్మనుష్యునకు మానములాఱు విరామమొందఁగాఁ
గానఁగవచ్చుఁ గుంభభవ! కాలునిబంధురసౌధవీథికల్. ఆ ౫

(2) శ్లో॥ మృదుఃస్నాపనంచక్రుః పాకశాలాధికారిణః
నజానామోవయంనాథత్వ త్ప్రతాపభయార్దితాః
కుస్వత్యాచకయాచిద్వ్యాసష్టో వైశ్యావరఃపురాత్
తథాపిసూర్యపాకేన సిద్ధాపత్తిహి కాచన

గీ॥ అవధరింపుము నీ ప్రతాపాతిశయము
గరిమమునకోర్వఁటించిరో కాశవహ్ని
కాశికాపట్టణమున నివేశమునకుఁ
బదిలమైయుండనోపక పాతిపోయె॥

ఉ॥ అంబుజబాంధవాన్వయనృపాగ్రణిభోజనము నేఁడు సూర్యపా
కంబున నాయితంబయిన ఖజ్జము భోజనకాలలోనఁ బ
ళ్యంబిడినారు పంకజదళాక్షులు రెండవజాముగంట వ్రే
యంబడె నారగింప సమయంబని చెచ్చెరవిన్నవించినన్॥

(8) శ్లో॥ కస్మైదేయా మయాకన్యా సురమ్యేయం సులక్షణా
అస్యాఅనుగుణోలభ్యః క్వమయావరఉత్తమః
కులేనవయసాచాపిశీలేనాపి శ్రుతేవచ
రూపేణార్థేనసంయుక్తః కస్మైదత్వా సుఖంలభే
ఇతిచింతయత స్తస్యజ్వరోభూదతిదారుణః
యశ్చింతాఖ్యోజ్వరో పుంసామహాపస్మారోన్నిపశామ్యతి
తస్మాత్కలర్మవిపాకేన చింతాత్యేన జ్వరేణచ
సవిప్రః పంచతాంప్రాప్తస్త్యక్త్వా సర్వంగృహాదికం

గీ॥ తగినవరుఁ డెవ్వఁడొక్కొ యీతలిరుఁబోడి
కనుగుణుం డెవ్వఁడొక్కొ విశుద్ధాభిజాత్య
పరమసౌభాగ్య భాగ్యసంపదలకనుచు
నిత్యమును దండ్రియాత్మఁ జింతించుచుండె॥

గీ॥ మూలనక్షత్రమునయందు మొదలికాలఁ
గన్యగండానఁబుట్టిన కారణమునఁ
గర్మఠుఁడు విప్రుఁడానందకాననమునఁ
జచ్చెఁజింతాజ్వరము పైని జ్వరము తాఁకి.

100 వ అధ్యాయములో 87 వ శ్లోకమువఱకుఁ బూర్తిగఁదెనిఁగించి తక్కిన 59 శ్లోకముల నొక్క పద్యములో నిమిడ్చినాఁడు. కాశీఖండము తరువాత నితఁడు రచించినది హరవిలాసము. హరవిలాసములోని కవిత్వము తక్కిన గ్రంథములలోని దానికంటె నెక్కువ స్వాభావికముగ నున్నది. కాశీఖండమందలి "చిన్నారిపొన్నారి" యనుపద్యమున హరవిలాస ముదహరింపఁబడక పోవుటచేతను నీకృతిపతియై శ్రీనాథునికి బాలసఖుఁడైన తిప్పఁడు "మంటిబహువత్సరంబులు" అని చెప్పియుండుటవలనను నిది కాశీఖండము రచించినతరువాతనే వృద్ధత్వమున రచించెనని భావింపవలసియున్నది. శైలికూడ నీవిషయమునే బలపఱచుచున్నది. ఈ గ్రంథములోని చిఱుతొండనంబి చరిత్రము పాల్కురికి సోమనారాధ్యుని బసవపురాణమునుండి గైకొనఁబడినది. శ్రీనాథుఁడు పేర్లు మార్చినాఁడు.

బసవపురాణమునుబట్టి కొడుకును జంపి మాయజోగి కాహారము పెట్టినవాఁడు సిరియాలుఁడు. సిరియాలునికే మఱియొక పేరు చిఱుతొండనంబి. కొడుకు పేరు లేదు. సిరియాలుని భార్య తిరువెంగాణి. కర్ణాటభాషలో భీమకవి రచించిన బసవపురాణములోని పేలఱకు సోమనారాధ్యుని బసవపురాణములోని వానికి వ్యత్యస్తము కలదు. హరవిలాసమునుబట్టి చిఱుతొండనంబి కుమారుఁడు సిరియాలుఁడు, సిరియాలుని తల్లి తిరువెంగనాచి. బసవపురాణములోనున్న చిఱుతొండనంబి చరిత్రము పూర్తిగ శ్రీనాథుఁడు హరవిలాసమునఁ జెప్పలేదు. కైలాసమునకేగిన తరువాత సిరియాలుఁడు తనంతటిభక్తుఁడు లేఁడని విఱ్ఱవీఁగఁగా శివుఁడతనిని భూలోకమునకు మరలఁ దీసికొనివచ్చి నిమ్మవ్వహాలాయుధుల వృత్తాంతములు చూపి గర్వభంగము కావించి తిరిగి కైలాసమునకుఁ గొంపోయిన కథ విడిచిపెట్టినాఁడు. ద్వితీయవిలాసంబైన గౌరీకల్యాణము చాలవఱకుఁ గాళిదాసుని కుమారసంభవమునకుఁ దెనుఁగు. హరవిలాసము స్వకపోలకల్పితముగా రచింపఁబూని నడుమనీట్లు చేయుట కాళిదాసుని కవితయందుఁగల గౌరవమువలననని తోఁచెడిని. తారకాసురుని వధదనుకఁ గుమారసంభవము 17 సర్గములుగా నున్నది. శ్రీనాథుఁడు కుమారసంభవములోని యంత్యోపరి శ్లోకమైన

శ్లో॥ అథవిబుధగణాంస్తానిందుమౌళిర్విసృజ్య
క్షితిధరపతికన్యా మాదదానః కరేణ
కనకకలశయుక్తం భక్తిశోభాసనాథం
క్షితివిరచితశయ్యం కౌతుకాగారమాగాత్

అనుదానిని—

గీ॥ "కనకకలశాది భక్త్యలంకారయుతము
నైనకౌతుకరత్న గేహంబుసొచ్చి
పార్వతియుఁదాను నీహారభానుమౌళి
పవ్వళించెను ముదమునఁ బాన్పుమీఁద॥"

అని తెనిఁగించి మిగిలిన 10 సర్గములలో వర్ణింపఁబడిన కుమారజనన మాదిగఁ దారకాసుర వధవఱకుఁగల కథనంత యేనిమిది వచనపఙ్క్తులలోఁ జెప్పినాఁడు. 8వ సర్గములో సంభోగవర్ణనము మిక్కిలి విస్తారముగనున్నది. శృంగారవర్ణనమన్న ముందంజవేయు శ్రీనాథుఁడు సంభోగవర్ణనము తెనిఁగింపక కొద్ది వాక్యములలో ముగించుటచూడఁగ హరవిలాసమును రచించునాఁటికేండ్లు గడచినవాఁడై మనోవృత్తియందు గొప్పమార్పుచెందినట్లు కానంబడుచున్నది. ఏండ్లు గడచినను స్వాభావికచాపల్యము బొత్తిగఁ బోదనియొడు

పక్షమున వేదకసర్గము తరువాతఁగల గ్రంథమతనికి లభింపక పోయియుండును. 8 వ సర్గములోనిసంభోగవర్ణనము చాలవఱకశ్లీలముగను నశాచిత్యముగనునుండుటచే 8వసర్గములే కాళిదాసుఁడు రచించెననియు మిగిలిన 10 సర్గములు వతని పిమ్మట నెవ్వరోరచించి కాళిదాసు పేరు పెట్టిరనియుఁ గొంతమంది పండితుల యభిప్రాయము. కాని పూర్వమునుండి 8 వ సర్గముకూడఁ గాళిదాసునిదేయని భావింపఁబడినట్లు దృష్టాంతములుగలవు. విశ్వనాథకవి సాహిత్యదర్పణమను నలంకార గ్రంథమునందు నాయికాప్రణయమానమున కు "నాయికాయాయథా కుమారసంభవే సంధ్యావర్ణనావసరే" యని నుడివినాఁడు. ఈ సంధ్యావర్ణన మెనిమిదవ సర్గములోనున్నది. మఱియు దోషభేద సందర్భమునఁ బ్రకృతివిపర్యయమునుగూర్చి వ్రాయునప్పుడు "ప్రకృతయోదివ్యా అదివ్యాదివ్యాదివ్యాశ్చేతి। తేషాంధీరోదాత్తాదితా। తేషామప్యుత్తమాధమమధ్యత్వం । తేషుచయోయథాభూత స్తస్యాయథావర్ణనే ప్రకృతివిపర్యయోదోషః। ధీరోదాత్తస్య ధీరోద్ధతవత్ ఛద్మనా వాలివధః। యథా వాకుమారసంభవే ఉత్తమదేవతయోః పార్వతీ పరమేశ్వరయోః సంభోగశృంగారవర్ణనం" అని చెప్పినాఁడు. ఈ సంభోగశృంగారవర్ణనము 8 వ సర్గములోనిదే. ధనంజయుఁడు దశరూపకమునందు వ్యభిచారిభావముల లక్షణలక్ష్యములు చెప్పుచో జడతకు లక్ష్యముగా

శ్లో॥ "ఏవమాలినిగృహీతసాధ్వసం
శంకరోరహసి సేవ్యతామితి
సాసఖీ భిరుపదిష్ట మాకులా
నాస్మర త్ప్రముఖవర్తిని ప్రియే॥"

అను శ్లోకము నుదహరించినాఁడు. ఇది కుమారసంభవాష్టమ సర్గములోని 4 వ శ్లోకమైయున్నది. ఈ నిదర్శనములవలనఁ గొందఱను నట్లు 7 వ సర్గముతరువాతఁ గల గ్రంథము మఱియెవ్వరో కాక కాళిదాసుఁడే రచించెనని పూర్వమునుండి భావింపఁబడుచుండుట విశదమగుచున్నది. శ్రీనాథుఁడు మిక్కిలి యుచితానుచితజ్ఞుఁడు. కనుకనే వష్టమసర్గములోని "ద్విధాప్రయుక్తేనచవాఙ్మయేన సరస్వతీ తన్మిథునంనునావ" యను శ్లోకమునందలి "ద్విధాప్రయుక్తేనచవాఙ్మయేన" అనుదానికి "సంస్కృతప్రాకృతరూపేణద్వైవిధ్యేన ఉచ్చారితేన శబ్దజాతేన" అని మల్లినాథుఁడు వ్యాఖ్యానము చేసియుండ నితఁడు "కల్యాణసమయోహార్హ గద్యపద్యంబులఁ గైవారమొనరింపఁగర్థఁగె వాణి" యనుచో "గద్యపద్యంబుల" అని తెనిఁగించినాఁడు. ఆంధ్రగ్రంథములో "సంస్కృత ప్రాకృతరూపంబుల"నని చెప్పుటకంటె "గద్యపద్యంబుల" నని చెప్పుట యెంతయు సమంజస

ముగ నున్నది. ఇతఁడు కుమారసంభవము తెనిఁగించిన పద్ధతి తెలియుటకై కొన్ని శ్లోకములను వానికి సరియైనపద్యముల నుదహరించుచున్నాను.

(1) శ్లో॥ తయాదుహిత్రాసుతరాం సవిత్రీ
స్ఫురత్ప్రభామండలయాచకాశే
విదూరభూమి ర్నవమేఘశబ్దా
దుద్భిన్నయారత్న శలాకయేవ॥ స. ౧

గీ॥ జననివిద్యుల్లతాభవకా చాయగలిగి
క్రొత్తయుదయించినట్టి యాకూతువలనఁ
గారుకాలంబు మణిశలాకయునుబోలె
నొప్పెడువిదూరభూమిని యుద్దియయ్యె॥ ఆ॥ 3

(2) శ్లో॥ పురేతావంతమేవాస్య తనోతిరవిరాతపం
దీర్ఘికాకమలోన్మేషః యావన్మాత్రేణసాధ్యతే॥ స. ౨

గీ॥ దానవునిఱిటిలోన మార్తాండుఁడెండ
యంతమాత్రంబకాని కాయంగవెఱచు
నెంతమాత్రముకాసిన నెలమిఁబొందుఁ
గేళిదీర్ఘికలందుఁ బంకేరుహములు॥ ఆ॥ 3

(3) శ్లో॥ కామేకపత్నీ వ్రతదుఃఖ శీలాం
లోలంమ నశ్చారుతయా ప్రవిష్టాం
నితంబినీమిచ్ఛసి ముక్తలజ్జాం
కంఠేస్వయంగ్రాహనిషక్తబాహుం॥ స॥ 3

సీ॥ ఏకభర్తృవ్రతస్థయై యేలతాంగి
నీకుఁజేయాడు ధర్మంబునిలువరించె
నదివినిర్ముక్తలజ్జలయై యమరరాజుఁ
జేయుఁగాత స్వయంగ్రహాశ్లేషణంబు॥ ఆ॥ 3

(4) శ్లో॥ హృదయేవససీతిమత్ప్రియం యదవోచ స్తదవైమికైతవం
ఉపచారపదం నచేదిదం త్వమనంగః కథమక్షతారతిః॥ స॥ ౪

గీ॥ హృదయముననుండి యెప్పుడు హృదయనాథ
ప్రియముచెప్పెదనను టెట్లభేషజంబు

హృదయమునసుంట నిజమేని మదనుడెట్లు
భస్మమైతివి నేనెట్లు బ్రతుకుఁగంటి॥ ఆ॥ 3

(5) శ్లో॥ అపిక్రియార్థం సులభం సమిత్కుశం జలాన్యపిస్నానవిధిక్షమాణి తే
అపిస్వశక్త్యాతపసి ప్రవర్తసే శరీరమాద్యంఖలుధర్మసాధనం॥

సీ॥ సలిలంబు త్రిషవణస్నానక్షమంబౌనె యంభోజపత్ర దీర్ఘాయతాక్షి
కుసుమంబులును నిధ్మకుశపల్లవంబులు సులభంబులైయున్నె సుందరాంగి
సత్వంబులనోపినట్టి జాతివైరముడక్కి శాంతిగైకొనియున్నె చంద్రవదన
యనుదినంబును దేహయాత్రకాయితమౌనె నీవారసాకాది పూవుఁబోడి

గీ॥ శక్తికొలఁది తపశ్చర్య సంఘటింతె। ఫలముపై నాససాగ్రహంబంధముడిగి
శ్రామబింబోష్ఠి ధర్మసాధనములందు। నాద్యమగు సాధనంబు దేహంబకాదె॥

(6) శ్లో॥ తామగౌరవభేదేనమునీంశ్చాపశ్యదీశ్వరః
స్త్రీపుమానిత్యనాస్థైషావృత్తం హిమహితం సతాం॥ స॥ ౬

గీ॥ అంధకారి యరుంధతినాదరించె। గౌరవంబున భేదంబు కలుగకుండఁ
బెద్దవారికి స్త్రీపుంవిభేదమేల। మాననీయంబు పుణ్యకర్మంబుగాక॥ ఆ॥ ౪

నాయకానవవిహారము, హాలాహలభక్షణము, కిరాతార్జునీయమునను మిగిలిన భాగములు పురాణకథల ననుసరించి స్వయముగ రచించినాఁడు. భారవికృత కిరాతార్జునీయములోని యోజనవర్ణనమునందలి

శ్లో॥ మనసాజప్తైః ప్రణతిభిస్సముపేయివా నధిపతింవదివః
సంజీతరాజశసకాదధతీవిభరాంబభూవ యుగపన్మహసీ

అను శ్లోకములోని యుత్తరార్థమును, హరవిలాసకిరాతార్జునీయకథయందలి

"గీ॥ వీరగపగర్భితంబయ్యె వి స్తరిల్లె। శాంతరసమెంతయును సవ్యసాచియందు"

అనువాక్యములలోని భావము నొకటిగనున్నవి కాని యీ భావము శ్రీనాథుఁడు భారవినుండి గైకొనెనని చెప్పఁబనిలేదు. హ్యాంలెట్ (Hamlet) అను నాటకమునఁ గొమరునికిఁ బొలోనియసు (Polonius) చెప్పినట్లుగా షేక్స్పియరు (Shakspeare) మహాకవి వచించిన

" ... ... ... Beware
of entrance to a quarrel, but being in,
Bear it that the oppossed may beware of thee."

అను వాక్యములలోని భావమును గాశీఖండమందలి

"క॥ ఎవ్వనితో నెవ్వాటం। బివ్వఁకఁ జేఁజాపవలదు చేఁజాచినచో
నివ్వలనవ్వల నెవ్వరు। నవ్వకయుండంగఁ బగ సనందీర్పఁదగుఁ॥"

అను వాక్యములలోని భావము నొకటిగానున్నది. షేక్స్పియరు కాశీఖండములో జూచిగాని, కాశీఖండకర్త షేక్స్పియరు గ్రంథములోఁ జూచిగాని వ్రాసెనని చెప్పుటకు వీలులేదుగదా. ఒకటేయూహ వేఱువేఱుకవులకుఁ దట్టుచుండుట సహజము.

హరవిలాసము తరువాత నితఁడు రచించినది పల్నాటివీరచరిత్రము. వీరచరిత్రము యొక్క పౌర్వాపర్యము తెలిసికొనుట కా గ్రంథమున నాధారములు కన్పట్టుచున్నవి. బాలచంద్రుని యుద్ధఘట్టమున

"ద్వి॥ ఎసఁగెడు శివకంచి యేకామ్రపతికిఁ
జిఱుతొండభక్తుఁడు చెలఁగుమాతండ్రి
సెంకెలసిరువను చెలువమాతల్లి
సిరియాళుఁడనఁబుట్టి చెన్నొందినాఁడ"

అని తన హరవిలాసములోని చిఱుతొండనంబి కథను సూచించి యున్నాఁడు. కనుకఁ బల్నాటి వీరచరిత్రమే యితఁడు రచించిన గ్రంథములలో నెల్లఁ జివరగ్రంథమని చెప్పవలయును. శైలినిఁబట్టికూడ నిట్లే తలంపవలసియున్నది. వీరచరిత్రము తరువాత నేమియు రచించినట్టు కన్పట్టదు. ఇతఁడు వీరచరిత్రరచనకుఁ గడగుటంగూర్చి యనేక కథలు గలవు. నారికులుపుచే బాధపడుచు శోకభరమున నీ సుద్దులు చెప్పెనని కొందఱందురు. ఈక్రిందికథకూడ వాడుకలోఁ గలదు. ఇతఁడు యౌవనప్రాయమందు స్వేచ్ఛగఁ దిరుగుటచే శరీరము చెడిపోయియుండెనఁట. పల్నాటికిఁ బోయి గ్రామంబుల సంచారము చేయుచుఁ జంద్రవంక నదీతీరమందున్న మాచెర్లకు జని యానదియందు స్నానముచేసి చెన్నకేశవుని సందర్శింపఁగ జాడ్యము కొంత యుపశమించెనఁట. అదినమే రాత్రి చెన్నకేశవుఁడు స్వప్నమున సాక్షాత్కరించి యతనితో మత్సేవారతులు నఖండపరాక్రములునైన పల్నాటివీరుల చరిత్రము రచించి నా కంకిత మొనర్పుమని చెప్పి యంతర్హితుండయ్యెనఁ

ట. శ్రీనాథుఁడును మేల్కాంచి స్వప్నవృత్తాంతమునకు సంతసించి పల్నాటివారి హృదయసీమలయందు చిరకాలవిజృంభణముతో నాటియుండిన చారిత్రాంశములఁ జక్కఁగ గ్రహించి గ్రంథరచనకుఁ దొడఁగి తాను రోగపీడితుఁడు వయసుమీఱినవాఁడు నగుటచే వ్రాయుటకు శక్తిలేక యేడుగురు శిష్యులలేఖకులుగా నియోగించి చెన్నకేశవుని యాలయములోఁ గూర్చుండి చెప్పుచు దాదాపు భారతమంత పెద్దదిగానున్న యీ గ్రంథమును రెండుమాసములలోఁ బూర్తిగావించెనఁట. గ్రంథము సమాప్తియగువఱకు రోగముకూడఁ బూర్ణముగఁ గుదిరెనఁట. గ్రంథము పూర్తియైన తరువాత నేకారణముననో మనస్సు చలించి తొంటియట్లు విషయప్రవృత్తుండుకాఁగాఁ జెన్నకేశవుఁడు కోపించి ప్రతిదినము పగలే శ్రీనాథునికిఁ బ్రత్యక్షముగువాఁ డారోజతనికి దర్శనమీక స్వప్నమునం దగుపడి నీవు పతితుఁడవైతివి గాన నీ గ్రంథము నేను బరిగ్రహింపఁజాల నది మాలమాదిగలపాలగుఁగాక యని వాక్రుచ్చి యదృశ్యుండయ్యెనఁట. మఱునాఁడు శ్రీనాథుఁడు మేల్కాంచి యశుభస్వప్నంబునకు వగచి యెంతొకష్టముతో రచించిన యమ్మహాగ్రంథము భగవంతుఁడు చేకొననిచో గాన ఫలమేమియని దుఃఖావేశంబునఁ జేతనున్న తాళపత్రసంపుటము చింపి చిందఱవందఱగాఁ బాఱవేసెనఁట, మాలలు మాదిగలు మొదలైనవా రెవరికి దొరకిన పత్రములు వా రెత్తుకొనిరఁట. ఈకథయొక్క నిజానిజము లెట్లున్నను గ్రంథమొకచోటను సంపూర్ణముగ లేక శకలములుగా నొకరివద్దఁ గొంత మఱియొకరివద్దఁ గొంతగఁ జాలమట్టుకుఁ బిచ్చుకుంటులు మాలలు మొదలగు నిమ్నకులుల యధీనములోనే యున్నమాటవాస్తవము. హీనకులులచేతులలోనున్నందువలన నస్పృశ్యమనియు, నశ్రావ్యమనియు, నగ్రాహ్యమనియుఁ దలఁచి, జ్ఞానశూన్యులై విద్యాగంధము లేకపోయినప్పటికి నగ్రజన్ములమనిగర్వముమాత్రము వదలని పండితంమన్యులు చూపిన యనాదరణమే గ్రంథ మిన్నిదినముల దనుక నిట్టి దుస్థితిలో నుండుటకుఁ గారణమైయుండును. జనసామాన్యమునకు వీరులయందుఁగల భక్తితాత్పర్యములచే నేమి, గ్రంథముయొక్క సహజోత్కృష్టతవలన నేమి యాదరణా నాదరణములకు లోనుగాక నేఁటివఱకు జీవముతోడ నున్నది. శ్రీనాథుఁడు రచింపకముం దీకథ వచనరూపముననో పదరూపముననో యుండియుండును. ఇతఁడుదీనిని ద్విపదకావ్యముగ రచించెను. శ్రీనాథునికిఁ బూర్వము రంగనాథాదులు ద్విపద కావ్యముల మనోహరంబుగ రచించిరి.

“సీ॥ కందషట్పదములాఱుగాక యుత్సాహంబు తరువోజ మధ్యమాక్కరలునైదు
దీపించుమంజరీ ద్విపద త్రిపద చతుష్పద పంచపాద షట్పదవిధములు
తొమ్మిదివిధములతో నొప్పు రగడలు కళికలు నుత్కళికలునుగూడ
జాతులు నవవిధగీతంబులును సీసస్తకంబును నుపజాతులయ్యె

వనుచు నన్నయభట్టు భీమనయుఁ బెద్ద
సచివుఁడును మూలికాలాత నొజ్జయుననంత
మంత్రియును దిమ్మరాజు నిమ్మడిక్కఁ జెప్పి
కందముగ వారుచేసిన ఛందములను॥"

అని యప్పకవి చెప్పినదానినిఁబట్టి నన్నయభట్టునకుఁ బూర్వమునుండి ద్విపద యున్నట్లే కాన్పించుచున్నది. తరువోజ, అక్కర మొదలగు తక్కినజాతులనువలె ద్విపదను గావ్యములలో మిశ్రమముగా నచ్చటచ్చటఁ జెప్పుటలేదు. నన్నయభట్టారకుఁడు భారతమునందుఁ దరువోజ, మధ్యాక్కర, అక్కర, మధురాక్కర, ఉత్సాహము, కందము నుపయోగించెనుగాని ద్విపదను జెప్పలేదు. సోమయాజులు నెఱ్ఱాప్రెగ్గడ యీపక్కికనే యవలంబించిరి. అల్లసాని పెద్దన మనుచరిత్రమునందు గగడను జెప్పినాఁడుగాని ద్విపదనుపయోగింపలేదు. యక్షగానములలో మాత్రము ద్విపద నచ్చటచ్చట వాడుదురు. వీనినిఁ బట్టిచూడ వివిధపద్య మిశ్రమణంబులైన కావ్యములలో ద్విపదను జేర్పక ద్విపదకావ్యములఁ బ్రత్యేకముగ రచింపుచువచ్చినట్లు నిశ్చయమగుచున్నది. మనలోనున్న కావ్యములన్ని చంపువులేకాని పద్యకావ్యములు (నిర్వచనములు) మిక్కిలితక్కువగా నున్నది. సంస్కృతమునందుఁ బద్యకావ్యములే మెండు. చంపువులు తక్కువ. పద్యకావ్యములలోనే సంస్కృత పద్యకావ్యములకుఁ దెలుఁగు పద్యకావ్యములకు భేదముకలదు. సంస్కృత కవులొక్కొక సర్గమును సామాన్యముగా నేకవిధశ్లోకముతో రచించుచు వచ్చిరి. సర్గాంతమందుమాత్రము వృత్తములమార్చిరి. కాళిదాసుఁడు మేఘసందేశమంతయు నేకవిధశ్లోకముతో రచించెను. ఆంగ్లేయ కవులుకూడఁ జాలవఱకీ నియమము నే పాటించిరి. తెలుఁగుకవులట్లుగాక యొక యాశ్వాసముననే బహువిధవృత్తములు, జాతులు నుపజాతులువ్రాయు నభ్యాసముకలిగి యున్నారు. సర్గమంతయుఁ బలువిధవృత్తములతో రచించినవారు సంస్కృతకవులలోఁగూడఁ గలరు గాని యీ విషయమునఁ దెలుఁగుకవులు వహించినంత ప్రావీణ్యత వహింపలేదు. ఇట్టి వృత్తమిశ్రమణము శ్లాఘ్యముకాదనియే చెప్పవలయును. పద్యకావ్యములయందుబహువిధపద్యములఁ గలుపుటయసహ్యాకరమను భావము రిస్టాటిల్ (Aristotle) అనుగ్రీకువిద్వాంసుఁడుకూడనీక్రిందివాక్యములలోఁగనఁబఱచి యున్నాఁడు. "Still more absurd would it be to mix different metres as was done by Charemon" తెలుఁగునఁబద్యకావ్యములుఁ (నిర్వచనములు) లేని లోపమును నివారింపఁబూనియేకాబోలు తిక్కనసోమయాజి ఉత్తరరామాయణమును బద్యకావ్యముగ రచించెను. కాని బహువిధపద్యమిశ్రమణము మాత్రము మానలేదు. తిక్కన సోమయాజిచూపిన మార్గమవలంబించి పిమ్మటి కవులు వృద్ధిపఱచినవారుకారు.

అచలజిహ్వోక్తి, నిరోష్ఠ్య, శుద్ధాంధ్రప్రముఖ నిరర్థక నియమములలో నిర్వచనమొక నియమముగాఁ బాటించి పెద్దపెద్ద బిరుదనామములు పెట్టి డంబమునకు రచింపుచువచ్చిరి గాని సాధారణముగ గ్రంథములన్నియు నట్లు రచించినవారు కారు. గ్రంథమునందంతట నొకటే విధమైన పద్యములుండుటవలనఁ జదువువారికి విసుగుగాదాయని కొందఱందురు గాని యయ్యది యవిచారితంబు. సంస్కృతమున మేఘసందేశాది కావ్యములఁ జదివి యానందించు రసజ్ఞులు విసుగునొందుదురా? సుప్రసిద్ధులగు నాంగ్లేయకవుల కావ్యములఁ బఠించి పరవశులగు పండితులు విసుగునొందుదురా? మన యాంధ్రభాషయందుఁగల కావ్యములఁ బరిశోధింపఁగాఁ బైనుదహరింపఁబడిన లోపములులేనివి ద్విపదకావ్యములు శతకములు గన్పట్టుచున్నవి. శ్రీనాథుఁడు తన యనుమానవాగ్ఝరిని ద్విపదపఙ్క్తులలోఁ బ్రవహింపఁజేసినాఁడు. భావప్రకటనమునకు ద్విపదపఙ్క్తులే మిక్కిలి యర్హముగ నుండును. మాదిరికొక యుదాహరణము మాపెదను. వాల్మీకిరామాయణ బాలకాండమునందలి 84 వ సర్గములోని

"శ్లో॥ గతోర్ధరాత్రః కాకుత్స్థ కథాః కథయతో మమ
నిద్రామభ్యేహి భద్రం తే మాభూద్విఘ్నో ధ్వనీహనః
నిష్పన్దాస్తరవస్సర్వే నిలీనా మృగపక్షిణః
నైశేన తమసా వ్యాప్తా దిశశ్చ రఘునందన
శనైర్వియుజ్యతే సంధ్యా నభో నేత్రైరివావృతం
నక్షత్రతారాగహనం జ్యోతిర్భిరవభాస్యతే
ఉత్తిష్ఠతి చ శీతాంశుశ్శశీ లోకతమోనుదః
హ్లాదయన్ ప్రాణినాం లోకే మనాంసి ప్రభయా విభో
నైశాని సర్వభూతాని ప్రచరన్తి తతస్తతః
యక్షరాక్షససంఘాశ్చ రౌద్రాశ్చ పిశితాశనాః
ఏవముక్త్వా మహాతేజా విరరామ మహామునిః
సాధుసాధ్వితి తం సర్వే మునయో హ్యభ్యపూజయన్।

అను శ్లోకములు భాస్కరరామాయణమున

"క॥ గతమాయె యత్తువిహారసు। మత్తుంబు నిలీనమృగచయంబు నిమీల
త్పతగకులాక్షము నిశ్చల। వృక్షమ్ము నిశాటభూత విహృతిస్థలమున్॥

వ॥ అగుచు నిశ్వనమున్నది మఱియు

చ॥ గగనము తారకాగ్రహవికాసవిభాసితమై చెలంగఁగన్
ముంగిసినచీఁకటిం జెఱచి ముంగలిదిక్కులు తెల్లనేయుచున్
జగములకుత్సవంబొదవఁ జంద్రిక గాయుచు భాసమానుఁడై
మిగ డెడునింగిఁ జందురుఁడు నిద్దురపోయిరి యెల్ల జీవులున్॥

క॥ వినుమర్ధరాత్రమయ్యెన్। జనవరనిద్రింపుమీవు సౌమిత్రియునిం
కనిపలికియూరకుండెన్। మునివరుఁడపుడఖిలమునులు మోదముతోడన్॥"

అనియు రంగనాథ రామాయణమున

" ది॥ నడురాత్రి యేతెంచె నగలోకనాథ
కడుడస్సినాఁడవు కనుమోడ్పుగాక
చలియింపకున్నవి సకల వృక్షములు
మెలఁగవువనభూమి మృగసమూహములు
నెఱివిహంగంబులు నీడముల్ చేరి
మఱచియున్నవితమమంజులధ్వనులు
యామినీచరులైన యక్షరాక్షసులు
భూమివిచ్చలవిడిఁ బొరిచరించెదరు
దీటుగఁజీఁకటి దెసలునాకసము
కాటుకపూసిన కరణినున్నదియు
నీలాంబరంబున నిండుముత్తెములు
గీలించిబ్రహ్మాండ గేహగోళమునఁ
గడుఁగొప్పగా మేలు కట్లెత్తినట్లు
లుడుగణంబులతోడ నున్నదినింగి
యడరంగజనులకు నానంద మొదవ
నుడురాజుపొడతెంచుచున్నాఁడటన్న
నామాటలకు మెచ్చి యఖిలసంయములు"

అనియు నాంధ్రీకరింపఁబడినవి. భాస్కరరామాయణములోని కందవచన వృత్తములలోకంటె రంగనాథ రామాయణమునందలి ద్విపదపఙ్క్తులలో భావమెక్కువహృదయవశీకరముగను నానందజనకమును బ్రకటింపఁబడినదని యొప్పుకొనక తప్పదు. ద్విపదజాతి చరణంబులు నాతిదీర్ఘంబులై నాతిహ్రస్వంబులై యుండుంగావునఁ గగచరణాది సమస్తావయవంబులు నిరవధికముగ నొక్కటి దృగ్గోచరంబగు పరిమిత పరిమాణ చిత్రపటంబు

భంగి నిరంతరాయ సమగ్రగ్రాహ్యంబులై తదనుగుణావిచ్ఛిన్నానందజనకంబులై యుండును. శ్రీనాథుఁ డుపయోగించినది మంజరీ ద్విపద. మంజరీద్విపదనుగూర్చి కవిజనాశ్రయములో

"ద్వి॥ ద్విపదగణంబుల తెచ్చియన్నిటిఁ
బ్రాసంబులిడక యె పలుకఁజాలినను
మూఁడవగణమున మొగి విశ్రమముగ
మంజరియందురు మధురవాక్పణితి"

అని చెప్పఁబడినది. కవిజనాశ్రయములో నేకాక నన్నయభట్టు ఛందములోఁగూడ మంజరీ ద్విపద యుదహరింపఁబడినట్లే యప్పకవీయమువలనఁ దెలియుచున్నది. కాని శ్రీనాథునికిఁ బూర్వము మంజరీ ద్విపద కావ్యము రచించినవారెవరును లేరు. శ్రీనాథుఁడీ వీరచరిత్రమున యతిస్థానములఁ జక్కఁగ గణించినాఁడు. ఇతఁడు వ్రాసిన గ్రంథములలో నిది చివరిదియుఁ బరిణామావస్థలో వ్రాయఁబడినదియుఁ గనుక వ్రాయునాఁటి కనుభవశాలియుఁ బ్రవృత్తినివృత్తిమార్గములయం దారితేఱినవాఁడునైయుండును. కావున నీగ్రంథమున మిక్కిలి యనుభవము కనఁబఱచినాఁడు. దీనియందలి వర్ణనములు శుద్ధస్వాభావికములుగ నున్నవి. 8,9 పుటలలోని రాత్రికాలవర్ణనము కడు స్వాభావికముగ నున్నది. కవియొక్క పరిశీలనశక్తి యతఁ డుపయోగించు నుపమానములవలనఁ దెలిసికొనవచ్చును. పూర్వకవులు చెప్పిన యుపమానముల నితఁడు నొకటిపాటుగఁ జాలవఱకుఁ జెప్పలేదు. అట్లు చెప్పుటంగూర్చి సామ్యూల్ జాన్‌సన్ (Samuel Johnson) అను నాంగ్లేయ కవీశ్వరుఁడు తన "ఆధ్యాత్మిక కవులమీది యుపన్యాసము (Essay on the metaphysical poets)"లో నిట్లు వ్రాసినాఁడు :—

"No man could be born a metaphysical poet, nor assume the dignity of a writer, by descriptions copied from descriptions, by imitations copied from imitations, by traditional imagery and hereditary similes, by readiness of rhyme and volubility of syllables" (వర్ణనములఁ జూచి వ్రాసిన వర్ణనములవలనఁగాని, యనుకరణములనుండి గైకొనిన యనుకరణములవలనఁగాని, యనుశ్రుతములైన యుత్ప్రేక్షలవలనఁగాని, కవికులపరంపరగవచ్చు నుపమానములవలనఁగాని, ప్రాససౌలభ్యమువలనఁగాని, పదవేగమువలనఁగాని యాధ్యాత్మిక కవిగా నేరఁడు; గ్రంథకర్తయను గౌరవము వహింప నర్హుఁడును గాఁడు)."

శ్రీనాథుఁడు స్వోపమానముల స్వాభావికముగఁ జెప్పినాఁడు. మాదిరికై రెండు మూఁ డుదహరించెదను. చేతికిఁజిక్కిన శత్రువును విడిచి యతనితోఁ గలహించుటకు

"చేతఁజిక్కినఫలమును జేనంటిచూచి
వేగ మెదిగిరాత వేసినట్లగును"

అనియుఁ జిన్నవాఁడయ్యుఁ బరాక్రమవంతుఁడనుటకు

"పిడుగుచిన్నదికాదె ఛేదించుఁగొండఁ
జిన్నమిరియమునందుఁ జెడునెకారంబు
ఘనకపాలము కెక్కి కాకనొందించు
మానకనోర్ల మందును లెస్స॥"

అనియుఁ గొండలు ప్రతిధ్వనులీనెననుటకు

"ధరణీధరంబులు తల్లడంబంది
గుహలనునోళ్ళతోఁ గూయంగసాగె"

అనియు నుపమానములు చెప్పినాఁడు. గ్రంథవిస్తరభీతిచేఁ గొన్నింటిమాత్రమె యుదహరించితి. ఇటులనే వీరచరిత్రమునందలి యుపమానములన్ని స్వభావసిద్ధములుగ ను స్వకల్పితములుగనునున్నవి. మల్లదేవరాజంపిన బ్రహ్మనాయుఁడు నలగామరాజుతోడను, నా యకురాలు నలగామరాజుతోడను జెప్పిన ధర్మములు యుక్తియుక్తములుగనుండి శ్రీనాథు ని రాజనీతికౌశలము బ్రకాశింపఁజేయుచున్నవి. నలగామరాజు సభలో వేశ్యానాట్య సందర్భమునఁజెప్పిన సంగీతరహస్యము లాతఁడాదియందు

" ద్వి॥ సంగీతసాహిత్య చాతుర్యకవిత
చెప్ప నేర్చినవాఁడఁ జెలఁగిమాచెర్ల
చెన్న రాయుని పాదసేవారతుండ"

అని చెప్పుకొన్న విషయమును ధ్రువపఱచుచున్నవి. బాలచంద్రుఁడు వేశ్యను గహించి

"ద్వి॥ కుటిలాత్ములారనీ గుణములు తెలిసె
మటుమాయచేఁజిక్కి మానముధనము
నీపాలుచేసితి నేఁగానసైతిఁ
గామాంధకారంబు కష్టపువిద్య

నీతిమాలినచర్య నేఁటికిఁదెలిసె
నింటిలో భోజనం బిచ్చువురాక
పరులయెంగిలి కాసపడితిని నేను"

అని పల్కిన వాక్యములును ననపోతు వేశ్యల విషయమై బాలచంద్రునితో

"ద్వి॥ వారకాంతలరీతి వర్ణింపరాదు
బిడ్డలకొసఁగక ప్రియురాలికిక
సొమ్ములుగూర్చిన చెలువునఁగూర్చి
ధనవంతులగువారి ధనమెల్లదోఁచి
ముంజికాండ్రనుజేసి మురిపెమడంప
స్వార్థులైవిటవృత్తి వసుమతిమీఁదఁ
బోయిరి బ్రదికెడు పొందికలేక"

అని చెప్పినవాక్యములును నీతిబోధకములై మిక్కిలి శ్లాఘ్యములుగనున్నవి. 41 వ పుటలో బాలచంద్రుఁ డైతాంబకుఁజేసిన వైరాగ్యోపదేశము విన్నచో తా ననుభవింపకయుం చికార్యములకు వినియోగింపక ద్రవ్యము కూడఁబెట్టు పెనులోభికూడ లోభత్వంబు వదలి యుక్తమార్గమునకు వచ్చును బాలచంద్రుఁడు యుద్ధమునకుఁబోవు సంకల్పము సూచించి నప్పుడు తల్లియైన ఐతాంబ దుఃఖము చెందుటయు వలదని ప్రతిమాలుటయు శోకించుటయు విన్నచో బిడ్డలఁగనని గొడ్డాలకుఁగూడఁ గన్నీరుకారును. బాలచంద్రుఁడు నిజసంకల్పంబువదలక తల్లినూరార్చి సకారణంబుగఁ బలికిన నీతిధర్మవాక్యంబులు చదివిన యెడల బుద్ధిహీనుఁడుకూడ స్వవిహితధర్మంబునం బ్రవర్తింప సమకట్టును. బాలచంద్రుఁడు వీరులతో బాలత్వమునుగూర్చి చెప్పిన విషయములు ద్వితీయఖండమునఁ బ్రతివిద్యార్థియుఁ బ్రతియౌవనప్రాయుఁడును స్మరింపఁదగినవి. ఆవాక్యములయందు నాకుఁగల గౌరవాతిశయముచే నిట నుదహరింపకమానఁజాలను.—

" ద్వి॥ పేరుబాలుఁడుగాని బిరుదుమగండఁ
బగవారిఁగొట్టని బాలత్వమేల
తలిదండ్రులనుబ్రోవఁ దనయుఁడౌకర్త
మానాభిమానముల్ మగఁటిమినిలుపఁ
ప్రబలింపఁగలవారు బాలురెమ్ము
బాలురె పెద్దలు బల్లిదుల్ వారె
బాలురకేవృద్ధి పరికించిచూడఁ

పెద్దలుమతిచెడి పిఱికిపాఱుదురు
పాంచభౌతికదేహ పటిమక్షీణించు
ధైర్యంబుతగ్గు నుత్సాహంబులుడుగు
వయసుమీఱినవేళ వచ్చుసాబలిమి
కీర్తికైనను నపకీర్తికినైన
బాలురపైనుండు భారమంతయును''॥

బ్రాహ్మణక్షేత్ర సంజాతుఁడైన యనపోతును యుద్ధమునకు రానీక వెనుకకుఁబంపి బాలచంద్రుఁడేగినపిమ్మట నతఁడుపలికిన వీరవాక్యంబులు

"శ్లో॥ అగ్రతశ్చతురో వేదాః పృష్ఠతస్సశరంధనుః
ఇదం బ్రాహ్మమిదం క్షాత్రం శాపాదపి శరాదపి''

అని పరశురాముఁడు చెప్పిన వాక్యములను జ్ఞప్తికిఁదెచ్చుచున్నవి. అనపోతు బ్రాహ్మణుఁడు; ఆఱువేలనియోగి; గృహనామము "ఒడ్డి". పెద్దనపౌత్రుఁడు; మల్లపరాజు పుత్రుఁడు; తల్లి పేరమ్మ; చతుర్వేదాధ్యయనముచేసినవాఁడు; బాహుయుద్ధమునందు నిపుణుఁడు. అనపోతుతండ్రి మల్లదేవునివద్ద వ్రాయసకాఁడుగానుండెను. శ్రీనాథునికిఁ బిమ్మట వీరచరిత్రమును వీరభద్రకవి పద్యకావ్యముగను, మల్లయ్య, బతిరామిసెట్టికొడుకు కొండయ్య యను నిరువురు ద్విపదకావ్యములుగను రచించిరి. కొండయ్యయు మల్లయ్యయుఁ దమగ్రంథములలో శ్రీనాథు నుదహరించియున్నారు. వీరు తమ గ్రంథములఁ బాలకథను శ్రీనాథుననుసరించియే చెప్పిరి. వీరొక్కొక్కచోట లేనివికొన్ని కలిపి, యున్నవికొన్ని తీసివేసిరి. బొంగరముపుట్టుకయని కొండయ్య యొకవింతకథ కల్పించినాఁడు; శ్యామాంగి (సబ్బాయి) తమ్ముఁడంతర్వేదిగానికథ యెక్కువగఁ జెప్పినాఁడు; ద్విపదకావ్యము వ్రాయువాఁడయ్యును బాలచంద్రుఁడు బొంగరములాడు కథాసందర్భమునఁ గొత్తగాఁబద్య మొకటి వ్రాసినాఁడు. దానినిఁ జూపుచున్నాను:—

"క॥ సాటిగలిగినాఁటినాఁటికి। సరిగదకఁగ బిరుదుకచకుచద్వయమొరయన్
చిఱుతొడలు నడుమునెక్కన। విఱిగినొయనఁ జెలులుదాను వెఱచుచునడచెన్''

మఱియుఁ గథాంశములయందుఁగూడ నచ్చటచ్చట మార్పులు చేసినాఁడు. కొండయ్య, మల్లయ్య, శ్రీనాథునిగ్రంథ మేరీతి ననుసరించిరో తెలియుటకై మువ్వురగ్రంథముల నుండి యొకటే సందర్భమునందలి కొన్ని పంక్తుల నుదహరించుచున్నాను.

## —* కోమటి స్త్రీకి బొంగరము తాఁకిన కథ *—

శ్రీనాథుఁడు :—

"ద్వి॥ పొక్కుచుఁజేరను బోలఁతులగుంపు
కప్పురివలువలు కణఁజంబులందుఁ
గర్పూరరజమును గలయంగనూఱి
పదతలంబులయందుఁ బాణులయందు
గస్తూరిగంధంబుఁ గలిపిపట్టించి
సతులెల్లనైత్యోప చారముల్ సలిపి
చింతింపఁబోకుఁడి చెలిలేచునిపుడె
యనిపల్కనంతలో నామూర్ఛదెలిసి
ముకుళితహస్తుఁడై ముందఱనున్న
బాలునిఁగనుఁగొని బలుకోపమునను"

కొండయ్య :—

"ద్వి॥ ఏమనివగతుము ఏమిచేయుదుము
ఏమనిమామకు నెఱుఁగఁదెల్పుదుము
నినుఁబాసిభువిమీద నిల్వఁగోపుదుమె
వనజాక్షి నీవెంట వత్తుమఁటంచు
నెతిబ్రహ్మపుత్రుఁడు నీవిధియంచుఁ
గరియానలిరుగడఁ గదిసిచల్లఁగను
భామలందఱుకూడి పలుతెఱఁగులను
గోమలి కుపచరణ కొంతగైసేయఁ
జెలికిఁగప్పినమూర్ఛ తెలిసి శీఘ్రముగఁ
దలవంచి తనకాలు తప్పకచూచి
యిదియేరిబొంగరం బింతచక్కనిది
యిదియెవ్వరిదయమ్మ యీవెలలేని
దప్పుడు చెలికత్తె లందఱుచూచి
యప్పగోవినవమ్మ యాతఁడు బాలుండు

మల్లయ్య :—

"ద్వి॥ అంతలోఁజెలికిని నటుమూర్ఛదెలిసి

ముకుళితహస్తుఁడై ముందఱనున్న
తెప్పిరిబాలుని తెఱఁగెల్లఁజూచి
నిప్పులుచెదరఁగ నెలఁతయిట్లనియె
కావర మేలన్న కట్టెఁడిదుష్ట

—* వృద్ధవేశ్యావర్ణనము *—

శ్రీనాథుఁడు :—

"ద్వి॥ కోఁతివంటిది వృద్ధగాయతరకోప
కోలపట్టుకవచ్చెఁ గూఁతుదగ్గఱకు
పిఱిగినరొండిరొమ్ము ప్రేలుచన్దోయి
యొఱసిపోయినయొళ్ళు నూఁచలుకాళ్లు
వంగిననడుమును వదలినపండ్లు
పీలచేతులుగూని పీనుఁగుమోము
చిక్కఁగనరిసిన చింపిరితలయు
వ్రాలినబొమముడి వదలినమేను
మెడమీఁదఁగణఁతియు మీఁగాళ్ళఁబూత
పలుచనిగడ్డంబు పైనిఁబుల్పిరియు
మూతిమీఁసపుమొలక ముక్కురోమములు
తలవడంకును మాట తబ్బిబ్బుమఱపు
చొల్లుగాఱెడునోర కుభ్రంపుకంపు
కన్నులఁబుసులును గాంతుమిక్కుటము

కొండయ్య :—

"ద్వి॥ కల్లలపుట్టిల్లు కడునోడతెల్ల
శిస్తువెడలినచింత చివికినగంత
పత్తిగింజలగంత పరదేశిబొంత
ఊదుపోవనిడొక్క యూరిపడ్డనక్క
… … … …
యుచితంబెఱుఁగని యూదలితొత్తు
… … … …
తెరలుయీదనపెల్లి దేవాంగపిల్లి

మాయలకతకారి మందులమారి
కాయనిపడుచెట్టు కడుబాడుచెట్టు
దొందరతినగండి తొమ్మండ్రదొండి
యందతుపలబొడ్డి యామిదెవుమడ్డి
యఖిలకోతలవెల్లి యాసబ్బతల్లి

మల్లయ్య:—

"ద్వి॥ వృద్ధవానరమైన వెసగాగముండ
దద్దరంపుమశేచి తగునూతకోల
పిత్తిగినరొండియు నూఁచనా కాళ్లు
ఊరిసిపోయినయొళ్ళు నూడినతలయుఁ
దోలుశల్యములతోఁ దూగాడునడుము
పీలచేతులు నడపేమఁగురీతి"

కొండయ్య శబ్దస్వరూపము పాటింపక యిచ్చవచ్చినట్లు చెప్పినాఁడు. మల్లయ్యవర్ణనములలోఁ జాలవఱకు శ్రీనాథుని వాక్యములేయున్నవి.

శ్రీనాథునివర్ణనము మిక్కిలి స్వాభావికముగ నున్నది. ఇతఁడేరసము వచ్చినప్పుడా రసమును హృదయాకర్షణముగఁ బోషించిన విబుధుఁడు నియమముల వలన నర్థమును జెడఁగొట్టక భావము నాదరించిన ప్రాజ్ఞుఁడు. నిఖిలదిగ్దేశములఁ దిరిగి వివిధప్రకృతుల గ్రహించి కవిత్వమునకు వన్నె పెట్టికొనిన నిరుపమాన స్వతంత్రుఁడు. కావ్యరచనకు దారితీసి, నాటకరచన ప్రారంభించి స్వకపోలకల్పిత గ్రంథరచనకుఁ బ్రథమాచార్యుఁడై యంధ్రభాషా మహాక్షేత్రంబున స్వలేఖినీలాంగలంబున దున్ని భవిష్యత్సంస్కారబీజములు వెదచల్లిన కృషికుఁడు. నానారసభరితంబై, హృదయోద్బోధకంబై, భావిసంస్కారగర్భితంబై, నిర్భరపరమానంద జనకంబై, యల్లసాని పెద్దనాది కవీశ్వరులకు మాతృకాయమానంబైన శ్రీనాథమహామహుని కవితనుగుఱించి యంతవ్రాసినను దఱుఁగదు గాన గ్రంథవిస్తరభీతిచే నింతటితో ముగించుచున్నాను.

ఈపల్నాటివీరచరిత్రము నాకుఁ జాలవఱకుఁ దప్పులతోఁ దొరకినది. కొన్ని చోట్లఁ బట్టులుపోయినవి. పోయినచోట్లను, బోయినట్లగుపడినచోట్లను నా నీరసవాక్యములతోఁ బూర్తిచేసి కుండలీకరణముకావించితిని. ఒకటిరెండుపదములు పూర్తిచేసినచోట్లఁ గుండలీకరణములుంచలేదు. అచ్చునూర్చువారి పొరపాటువలననైననేమి నాపొరపాటువలననైననేమి 20,25,38,43,50,60,102పుటలలో నేనపూరించిన కొన్ని పట్టులకుఁ గుండలీకర

ణములు విడిచిపెట్టఁబడినవి. ఉపయోగకరమని యెంచి విషయసూచిక చేర్చినాఁడను. అవసరమనితోఁచిన స్థలములలోఁ జదువరులకు సులభముగ బోధపడుటకై కొన్ని పదపఙ్క్తులు (Foot-notes) వ్రాసినాఁడను. అన్య పండితుల సంస్కృతాంగ్లేయ వాక్యముల నుదహరించినప్పుడు వలయుచోట్ల వానికి సరియైన తెలుగువాక్యములు వ్రాసి కుండలించితిని. బాలచంద్రుని వేశ్యనామము సబ్బాయియని యుండ శ్యామాంగియని దిద్దితిని. ఉపోద్ఘాతములో నిర్ధారణచేయఁబడిన ప్రకారము పల్నాటియొక్క నిజరూపము పలునాడైనందున గ్రంథమునకుఁ బలునాటి వీరచరిత్రయని నామముంచితిని. పల్నాడనునది రూఢనామమగుటచే దానినిఁగూడఁ బ్రథమ పత్రముమీఁద నుదహరించితి. బహుధనైక సాధ్యములయ్యుఁ జిత్రపటములను గొంతమంది మిత్రుల యనుగ్రహముచే సమకూర్పఁదలంచితిఁగాని వారిసహాయము సమయమునకు రాకపోవుటవలన వీలైనదికాదు. యుద్ధకాలమును ననుగురాజు జన్మదేశమును నాకు లభ్యమైన కొద్దిగ్రంథసామగ్రితోడను శిలాతామ్రశాసనములతోడను నిర్ణయించితిని. చారిత్రవిదులు విశేషాంశములేమైనఁ దెల్పినయెడలఁ గృతజ్ఞుఁడనైయుండెదను. గ్రంథమునందలి తప్పులఁ జాలమట్టుకు మొదలే సవరించితిని. మిగిలినవి శుద్ధపత్రములో దిద్దితిని. ఇఁకను బొరపాటున విడిచిపెట్టఁబడినవి కన్పడినఁ బండితులు తెల్పినయెడల వినయముతో నంగీకరించి రెండవకూర్పునందు సవరించెదను. వీరచరిత్రముయొక్క యేభాగమైన దయయుంచి యెవరేని నాకందఁజేయఁగలిగినయెడల నదివ్రాసికొనివారిగ్రంథము వారికి వందనములతో మరలఁబంపెదను. గ్రంథమును ముద్రించుట కిదియే ప్రథమపర్యాయము గావున నేమైన లోపములుండెనేని క్షమింపఁ బ్రార్థించుచున్నాను.

ఈ గ్రంథవిషయమునఁ దోడ్పడిన మిత్రులందఱకు నమస్కారము లాచరించుచున్నాఁడను. అందులో, నేనుశ్రమపడుటయటులుండ నాకొఱకుశ్రమపడి నిజాము రాజ్యమునుండిగ్రంథమును దెప్పించివ్రాయించియిప్పించిన మ॥రా॥రా॥ అక్కిరాజు శంకరనారాయణగారికిని, జల్లగుండ్ల పిచ్చయ్యగారికిని, ప్రత్యంతరము నందఁజేసిన జానపాటి వేంకటప్పయ్యగారికిని వీరచరిత్ర ప్రథమభాగము నొసంగిన పిడుగు వీరభద్రయ్యగారికినిఁ దగినసమయములఁ దోడ్పడుచు వచ్చిన తాడేపల్లి సీతారామయ్యగారికిని, ముద్రణాది వ్యయమునకేఁబదిరూప్యములొడఁగూర్చి సహాయముచేసిన గుంటూరులో న్యాయవాదులగు మహారాజరాజశ్రీ ఉన్నవ లక్ష్మినారాయణ పంతులుగారికిని నామనఃపూర్వక వందనములు సమర్పించుచున్నాఁడను.

గుంటూరు,
జూలై, 1వ తేది, 1911.

అక్కిరాజు ఉమాకాంతం.

# పలనాటి వీరచరిత్ర.

## బాలచంద్రయుద్ధము.

శ్రీరఘునాయకుఁ జిత్తమందెంచి
శ్రీకంఠుఁబరమేశు శివునాత్మఁదలఁచి
పార్వతీదేవికి భావించిమ్రొక్కి
శివగణంబులనెల్లఁ జింతించిపొగడి
ప్రాకటంబుగవిష్ణుఁ బ్రార్థనఁజేసి
యిందిరాదేవిని నిచ్చలోనిలిపి
విష్ణుభక్తులనెల్ల వినుతులుచేసి
జలజజుఁగొనియాడి శారదనెంచి
యఖిలవిద్యలకెల్ల నాద్యుఁడైనట్టి
గజముఖువిఘ్నేశు ఘనతఁగీర్తించి
వీరభద్రునిశౌర్య విభవంబులెన్ని
† సంగమేశ్వరునకుఁ జక్కగామ్రొక్కి
గుర్జాలగంగనుఁ గోరిప్రార్థించి
భక్తి ¶ గోగులపాటి భైరవుఁదలఁచి
చెలమేశుశ్యామ నిజమూర్తియయిన
§ శీలమ్మనాయునిఁ జిత్తమందెంచి
కసువేద్రుఁ బోతలింగముఁగొనియాడి
* మాచెర్లచెన్నుని మదిలోనఁదలఁచి
యాంధ్రకవుల నుతులమరఁగావించి
గీర్వాణకవులను గీర్తించిమ్రొక్కి
సంగీతసాహిత్య చాతుర్యకవితఁ
జెప్పనేర్చినవాఁడఁ జెలఁగి"మాచెర్ల"
చెన్నరాయునిపాద సేవారతుండ
వలను భారద్వాజ వంశవర్ధనుఁడఁ
గవిసార్వభౌముఁడ ఘనతఁగన్నట్టి
శ్రీనాథుఁడనువాఁడ శివభక్తిపరుఁడ

† కృష్ణా, మాలాప్రభానదులు సంగమించుచోట సంగమేశ్వర క్షేత్రము గలదు.

¶ గురిజాలకుఁ దూర్పుగానున్నది.

§ శీలమ్మ పుత్రుఁడు అనగా బ్రహ్మనాయుఁడు.

* పల్నాడుతాలూకాలో చంద్రవంక తీరమునందున్నది దీనికిమహాదేవిచెర్ల అనికూడ పేరు కలదు.

శాశ్వతంబైనట్టి సద్గ్రంథమొకటి
చెప్పఁబూనిమనసు చెఁరేగియుండ
శ్రీరమ్యవక్షుండు శ్రితవత్సలుండు
వారిజనేత్రుండు వల్లీవిటుఁడు
శమితభక్తజనార్తి శాశ్వతకీర్తి
కందర్పజనకుండు కనకాంబరుండు
సురరాజవిహితుండు శుభసమేతుండు
కరుణాంతరంగుండు కలుషభంగుండు
నెల్లజగంబుల నేలినఘనుఁడు
పాలమున్నీటిపైఁ బవళించువాఁడు
సారిదినెల్లఫ్ఘభూ సురరక్షకుండు
గిరిధరుండగుచంద్ర గిరిరంగవిభుని
వేంకటాద్రిపునకు వెలయనొక్కొక్క
సరసునకును రణసాహసాంకునకు
నలరాజుబాఁకున కవతారమొంది
మలసినూటొక్క బొమ్మలపెండేరంబు
చెలఁగిడాకాలరంచిన మహాఘనుఁడు
చిలుకలపైకోర్కెఁ జిక్కుడువాఁడు
చేకొన్నమాచెర్ల చెన్నకేశవుఁడు
నాకలలోవచ్చి నయమొప్పఁబలికె
వినవోయిసత్కవి వేడ్క నామాట
మనమున నాకు సమ్మతమైనదొకటి.

అనవిని దేవ మహాప్రసాదంబు
ధ్రువముగ నానతి యిమ్మనాకిప్ప
డనచెన్నకేశవుఁ డప్పుడిట్లనియె
సౌఖ్యంబు పుణ్యంబు సమకూర్చునట్టి
పలునాటివీరుల భాగవతంబు
ప్రకటితంబుగనీవు రచియించిమాకు
నంకితంబొనరింప నను వేఁడుదుగావె
యనుచును శ్రీకాంతుఁ డరిగినపిదప
మేల్కాంచి మనమున మేలయ్యెననుచు
విలసిల్లు పలునాటి వీరులచరిత
జనులెల్ల భక్తిచేఁ జదువుటకొఱకు
* మంజరిద్విపదగా మన్నించి నేను
జెప్పఁబూనితివచో శ్రీమెఱయంగ.
ప్రకటితంబైనట్టి పలునాటిలోన
భావింపగావిష్ణు భక్తిని మెఱసి
నగనాథసింహంబు నలగామరాజు
మహితచారిత్రుఁడు మలిదేవరాజు
ధారుణి నేలుచుఁ దమలోనఁ బోరి
§ కార్యమపూడి శ్రీకలనిమధ్యమున
నరపాలచంద్రుండు నలగాము మీదఁ
బంపిన † బాలుండు బాహువిక్రముఁడు
తోరంపుగజములు తురగచయంబు

---

* ఈద్విపదయందుఁ బ్రాసములేదు.

§ పలునాటిలో నాగులేటితీరమున నున్నది

బ్రహ్మనాయుని కొడుకు.

మన్నీలబలముల మహితశౌర్యమునఁ
జెదరిపారఁగఁ గొట్టి చీకాకుసేసి
నలగామునతమ్ముఁడు నరసింగు నెదిరి
మర్దించి రణమున మడిసినవిధము
ప్రచురింతు వీరుల పండువుగాను

### కథాప్రారంభము.

గణుతింపతత్కథా క్రమ మెట్టిదనిన
నరయ • మేడపిలోన * నలగామరాజు
తీరని క్రమతచే దీనసాహసతఁ
బొఁగిననాయకుల్ పటుపరాక్రములు
వీరనాయకులెల్ల వినిమెండ్రి
భాషించితెలపోసి బాలమల్దేవు
నిరుడు రాజును దెచ్చి పృథ్వి వెలయఁగ
...యనట్టి లగ్నంబునందు...
బట్టంబుఁ గట్టిరి పరఁగ మేడపిని.
భూమిశులనునిట్లు పుడమినినిలిపి
భాస్కరసముతేజు...దెచ్చి
సచివకార్యంబున సమ్మతినుంచి
యటకనిశికకార్య మనబోతుకిచ్చి
మాడచియనునట్టి మగువను దెచ్చి
రాణివాసము గాగ రక్తితోనుంచి

యానందమునుబొంది రంతటవారు.

### మలిదేవరాజు, బ్రహ్మనాయుఁడు మొదలయినవారు కార్యమపూడి యుద్ధరంగమునకుఁ బయలుదేరి పోవుట

అటమీఁద భూమీశుఁ డధికోత్సవముల
నానకార్యమాపూడి కదనరంగంబు
చేఁగబోవుటకునై చింతించి యపుడు
పరివారలతో మేడపిఁ బదిలంబుసేసి
పగఁగమువ్వురుపతుల్ పైనంబుగాఁగ
నెలమిభూసుర పురోహితులెల్లఁబూని
జయముహారాగ్రముఁ బెట్టి చనుమని చెప్పఁ
గొల్లియే కాదని దురమానటంచు
రణభేరి వేయించి రమణీయముగను
...
† కొల్లెనల్ గట్టిన గొప్పతాంబూలములు
...
...§ తమ్మపడిగెలు
...

* బ్రహ్మనాయుఁ డితనిని రాయబారమునకుఁ బంపఁగా నాయకురాలు కుట్రచేసి చంపించెను.

• వినుకొండతాలూకాలోనున్నది. మలిదేవరాజాదులు తమ రాజధానియైన మాచెర్ల

† గుడారము. [విడిచిపుండాదికివలసపోయి తిరిగివచ్చి యీ మేడపిని నిర్మించికొనిరి.

§ తాంబూలము వేసికొన్న తరువాత నుమ్మివేయుటకై యుంచికొను నొకవిధమైనపాత్ర.

సొక్కసంబులబల్వు బోనగావళ్ళు
జవ్వాజిపిట్టలు శారికాకీర
పంజరముల్ వట్టు పరిచారకులును
గోఁడెకాండ్లదలించి కొట్టెడువార్లు
పడివాగ తేజీలు పాలకీవోళ్ళు
నష్టభాగ్యంబుల సంగళ్ళవారు
సందడిపడదండు సయ్యాటగదలెఁ
బెంగైనపాలకిఁ బెదమల్లుగదలెఁ
బినమల్లుగదలెను బృథ్వీశు వెనుకఁ
దమ్ముఁడుగదలెను ధరణీశు వెంటఁ
బచ్చలులింగాలు పట్టుగాఁ జెక్క
బాగుసేసినయట్టి పాలకియెక్కి
పలుమాఱుపుత్రుకై పలువరింపుచును
గొలువులోనాయుఁడు గొనరెట్టబట్టి
కొలపగదీర్పనీ కొడుకితఁడంచుఁ
బెట్టెనా చేతిలోఁ బ్రియతనూజాతు
బాలుని తెగువ యేపాటిదోయనుచుఁ
* గొమ్మభూమీశుండు గొబ్బునఁగదలె
నల్లాణరాజులు నచ్చోటినృపులు
నన్నలుదమ్ములు నందఱుగూడి
సూర్యవంశమువారు సొంపుశోఁజనిరి.

వారికివీరికి వరమంత్రియైన
నీలవర్ణుండును నియతచిత్తుండు
బ్రహ్మన్నగదలెను బాయనివేడ్కఁ
బట్టిరిగొడుగులు పాలకినెత్తి
సూర్యాతపంబు సైసోఁకనియట్లు
పాలకీలసురాసు పార్శ్వంబులందు
నందంబుగాఁబట్టి కరిగెలవోళ్లు
వింజామరంబులు వెలయఁగానెమిలి
కుంచెలవారును గూడివీవంగ
నాయుఁడురాజులు నయముగాఁజనఁగ
ముందు † డమాయీలు మురజసంఘంబు
బూరలు భేరీలు పోటుధారలును
గాహాళవంకిణి కాలికొమ్ములును
శంఖసమూహంబు సన్నాయిజోళ్ళు
మురళిచయంబును ముఖవీణవితతి
నరగలుతప్పెటల్ నయమైనవోళ్ళు
తమ్మటమ్ములు నెంచఁ దగువీరణములు
ఘనమైనరుంజలు § గనకతప్పెటలు
చేగంటలును మఱి చిఱుగంటచయము
ఘనమైనమ్రోఁతచే గగనంబుగప్పఁ
గుంభిణిపణఁకంగఁ గులగిరులెల్లఁ

* ఇతఁడు క్రీ॥ శ॥ 1188 వ సంవత్సరమునందు కల్యాణమును పాలించుచున్న నాలుగవ సోమేశ్వరుని కొమారుఁడు. ఇతనికుమారుఁడలరాజు. కొమ్మరాజును అలరాజును పలునాటిలోఁ జనిపోయినందున కల్యాణము నేలు పశ్చిమచళుక్యవంశము వీరితో నశించెను.

† చర్మవాద్యవిశేషము.

§ బంగారుతప్పెటలు కావు తప్పెటవిశేషము.

బ్రతిబ్రోఁతలీయంగ భావముప్పొంగ
నావాలవారును నాణెమువారు
కొండ్లవిందులవారు గోవిందువారు
ముత్తసానివారును ముయ్యూరువారు
నర్సాల్మలవారును నాయనివారు
పైఁడిచుక్కల పొలపర్తివారలును
బలుమూరివారును బాలెమువారు
రేవనూళ్ళలవారు రేచెర్లవారు
నట్లూరి ముట్లూరి యాఖ్యలవారు
చెవ్వులవారునుమతి చిల్లరవారు
గురిమైననాయకుల్ గూడియే తేర
గంతువా రేగురు గదిసిన వేడ్కఁ
గనిరిబిరుదులతో సాహసమడర
నొప్పుగానిందరు నుఱ్ఱవైనబండ్లు
ఘోటకంబులు మేటి కుంజరా[illegible]లు
నుత్సాహమున హుటాహుటినడువంగ
భట్టువారలుమించి బహువిధంబులను
బిరుదుపద్యంబులు సెళ్ళగాఁజదువ
నుద్దండ $ మాస్తీలు నొనరనిర్వంక
నైశిగవఖడ్గముల్ పట్టుక రాఁగ
శీలమ్మతనయుని సింహవిక్రముఁడు
కగమర్థి కనుకుల కన్నమనడిచె
సకలవీరచయంబు సంతతోత్సాహ
పౌరుషంబులుమీర † బ్రహ్మకిట్లనియె.
"మముఁజూడు నాయుఁడామాలావుకోలఁది
మముఁజూడుబ్రహ్మన్న మాశౌర్యపటిమ
సింహరంబులమీఁద జెన్నుగాదుమికి
కుంభస్థలంబులు క్రుంగఁజేసెదము
కొదమసింగంబులఁ గూలఁద్రోచెదము
గండభేరుండాల ఖండింతుమలుక
వాయువుఁబోనీక వడినాపఁగలము
జాతవేదునిఁబట్టి చమిరివేసెదము
ఘనసముద్రముఁజొచ్చి కలఁగఁజేసెదము
కుంభినిఁ గాళ్ళతోఁ గ్రుంగఁదన్నెదము
కులగిరులైనను గొట్టివేసెదము
గిరిజాలనేలెడు కువలయేశ్వరునిఁ
గొలపగకైపట్టి క్రొవ్వణఁగించి
చలమునవిడువక చంపఁగాఁగలము"
అని పెక్కుపంతంబు లాడుచునడువఁ
జూచినవారలు చోద్యంబుగాఁగఁ
బటువిక్రమాఢ్యులు పలు[illegible]
వరులంచుఁబొగడుచు వర్ణించిపలుక
మలిదేవభూపతి, మంత్రిబ్రహ్మన్న
కంపింపభూస్థలి కదలిరావేళ.

## మలిదేవరాజు, బ్రహ్మనాయుఁడు త్రిపురాంతకము జేరుట.

¶ త్రిపురాంతకమునకుఁ దిన్నఁగావచ్చి

---

$ శస్త్రవిద్యావిశారదులు.

† బ్రహ్మనాయుఁడు.

¶ శ్రీశైలమునకుఁబోవు త్రోవలోనున్నది.

మహితచారిత్రుఁడౌ మలిదేవనృపతి
రాజులుమంత్రులు గసికులుదొరలు
పాటించిసుంకర వారితోఁగూడ
నావేళనీశ్వరు నతిభక్తిఁజూచి
సాష్టాంగదండముల్ సయ్యనఁజేసి
హస్తముల్ మొగిడించి యనియెబ్రహ్మన్న
గౌరీమనోహర గంగోత్తమాంగ
నాగకంకణశివ నందివాహనుఁడ
కాంచనగిరిచాప కంధితూణీర
గరుడాసనాంబక కైలాసవాస
ఘనగజాసురభంగ కామభస్మాంగ
లాలితశ్రీకంఠ లయకాలకర్త
సకలభూతేశ్వర శరభావతార
ఫాలాక్షభూతేశ పరమేశయిపుడు
విన్నవించెద నేను వినుముసత్కరుణ
* శివపురిలోనుండి చేర్చినయట్టి
భూతరాట్స్తంభంబు పొందుగానుంచి
మితిజేసిచనితిమి మీనగరంబు
మృతివచ్చె నేఁటికి మీకృపచేతఁ
గార్యమీడేర్పంగఁ గర్తలేమీర
లనుచుఁబ్రార్థనఁజేసి యచ్చటనున్న
కంబముఁగనుఁగొని కడుభక్తిమ్రొక్కి
యినుము పిత్తళి కంచు హేమతామ్రములఁ
బంచలోహంబులఁ బ్రబలినదాన
నాలుగుముఖముల నశ్మమొప్పమఱియు
నెనిమిదిముఖముల నెన్నికైనావు
మగువమూర్తులునొక్క ముఖమందునిలిచి
యొకటసిద్ధులుమఱి యొక్కటమునులు
గంగయుదుర్గయు కాలభైరవుఁడు
నిలిచిభూదేవియు సింహాసనముల
గంధర్వపతులతోఁ గామధేనువును
యనుచుఁబ్రార్థనఁజేసి యాబ్రహ్మనలికె
ఘనకార్యమాపూర్తి కలనుఁగొసలను
నలగామరాజుతో నయముగాఁబోరి
మడియంగవచ్చిరి మన్నె నాయకులు
గణగంగపట్ట[illegible]రాజవై నీవు
సాక్షివై యుండవే సర్వభూతేశ
భక్తినిచ్చెదనీకు భూతేశుఁడేలుఁగ
దాహంబుఁదీర్చుకో తగుమార్గమున
నిప్పుడాహారంబ యిదిగోసమర్పింతుఁ
గంబమునకునిట్లు గట్టిగాఁజెప్పి
పెక్కువిధంబులఁబిండివంటలును
బరమాన్నమునుమంచి పప్పుకూరలును
బానకంబులుజున్ను పచ్చళ్ళునెయ్యి

---

* శివపురియనునది శివసింగురాజుయొక్క పట్టణము. కల్యాణపట్టణరాజయిన వీరసోముఁడీపట్టణముమీద దండెత్తినపుడు బ్రహ్మనాయుఁడు వీరసోమునికి సహాయముగాఁబోయి శివపురి ధ్వంసముగావించి యచ్చటనున్న శస్త్రములఁదెచ్చి త్రిపురాంతకములో నిల్పెను.

ఖండశర్కరతియ్య కండగడ్డలును
గొని తెచ్చి కుంభము కొండల రీతి
కస్తూరికర్పూర కాశ్మీరసహిత
పరిమళగంధంబు బాగుగా నలఁది
మైసాక్షి సాంబ్రాణి మంచిగుగ్గిలము
శోధూత లెస్సగా ధూపమర్పించి
ఘనమైనపోతుతోఁ గావు జెల్లించి
యాహారమంతట నర్పించి పిదపఁ
* గంబము చినయట్టి ఘనమైన శకట
నిచయంబుఁ దోలింప నిలిచి బ్రహ్మన్న
శకటచక్రంబులు సమ్మతిఁ గాక
నాయకావళి నెల్ల నయముతోఁ బిలిచి
పితరావతురుఁడై పిడియంబులిచ్చి
యనయంగమనవీట నెఱగు[illegible]లను
గనుఁగొని తప్పించి కాండ్లకుఁ గట్టి
సయ్యన బండ్లను సాగింపుమనియె.

## నాయకులు శకటంబులకుఁ బూన్చుటకై యెద్దులనుఁ బేరు పేరునఁ బిలుచుట.

అనివీడుకొలిపిన నంతంతవారు
పేరుపేరున వాని బిలచిరీరీతి
నందెలబసవన్న యాదినాగుండ
నందులపిడిఘుంట నాగవాసయ్య
గోవులవిటకాఁడ గోఁగుబయ్యన్న
వంటరిపలిజంకు వరి వెరుమాళ్ళు
కట్టనికలుకోట కరినందిరంక
అకలంకగాత్రుండ అంబుధిశయన
బిరుదుగరుత్మంత భీమునిగజము
గోవర్ధనాచల గోపాలదేవ
కరినందిబసవన్న కంచివరదుఁడ
నెలబాలచంద్రుండ నీలవర్ణుండ
జల్లులదర్జన జయకంఠనాద
వైకుంఠవాసుఁడ వాసుదేవయ్య
పుట్టలభూపతి పుంజెల్లు పెద్ద
ఇంద్రునివజ్రము యిప్పగిరీశ
గోఁగుశైగవమూర్తి గోవిందరాజ
చెంచులనోబయ్య చెన్నమల్లయ్య
కంచియేకాంబర కాళికానాథ
మధురాపురిప్రియా మానందినాథ
కాముఁడాసోముఁడా కాయజవరుఁడ
రాముఁడాభీముఁడా అంకెలుసలుపు
మిటువలెఁ బిలిచిన నేపుమీఱంగ
వచ్చిన యెద్దుల వరుసతోఁ జూచి
వన్నెలుచిన్నెలు వడిఁ జెప్పికొనుచు
నెత్తురుకొమ్ముల నేర్పైనవాని
గణుపులోఁకలుగల కరిబొల్లివాని
నచ్చుఁగాఁగరివన్నె లమరినవాని
మూపురంబులతోడ మొనసినవాని
నుదుటఁజుక్కలుగల నునుపైనవానిఁ
దెల్లనివన్నెలఁ దెలివైనవానిఁ

* త్రిపురాంతకమునుండి కంబమును దగలించుచున్నారు.

బచ్చనివన్నెలఁ బ్రబలినవాని
నిటువంటియెద్దుల నెంతయు నేర్చి
గంటలుగజ్జలు గణగణమ్రోయ
గ్రక్కునయెద్దులఁ గాఁడ్లఁగట్టించి
మోఁకులఁబంధించి ముందుగానపుడు
పంచవన్నెలకూఁడు పైఁజారఁదిపిచి
కంబముఁదర్శించెఁ గమలనాభుండు.
* మర్రివేములఁదాటి మండలేశుండు
ఘూర్ణిల్లురవముతో § గుమ్మడంపాడు
చేరియచ్చటనిల్వఁ జిత్తంబువిడిచి
† గరికెపాటికివచ్చి కాలూనకచటఁ
‡ గంకణంబులపల్లె కాడనాఘనులు
కంకణంబులుగట్టి కదలిరా వేళఁ
బట్టుభద్రులు ¶ పైఁడిపాటికివచ్చి
పరఁగవీరులకెల్లఁ బైనంబుఁజెప్పి
మెఱసినమన్నీలు మేటినాయకులు
ప్రభువులుదొరలును బంధువర్గంబు
వీరవర్యులుగొప్ప విద్యలవారు
మిక్కిలిబిరుదులు మెఱయుసాహసులు
కవులును జెట్టిలు కలసియందంద

## మలిదేవరాజాదులు త్రిపురాంతకమునుండి మేళ్ళవాగుఁ జేరుట.

$ మేళ్ళవాఁగుననిల్చి మించినదండు.
అందరుగొల్లెన లమరంగనెత్తి
యుండిరినాయకు లుత్తలపడక.
అంతలోదినకరుఁ డస్తాద్రికరిగె
సాంద్రమైచీఁకట్లు జగమెల్లఁగప్పె
విలసిల్లెఁజుక్కలు వినువీధియందు
గుమిగూడిపక్షులు గూళ్ళలోఁజేర
గూఁబకదుపుమించి కూయంగసాగెఁ
జక్రవాకంబుల సంతసంబడఁగె
ఘనచకోరంబులు కౌతుకంబందెఁ
గొలఁకుల[illegible]లముల్ కుందుచుమొగిడె
వికసించెఁగుముదముల్ విచ్చలవిడిని
జారకామినులెల్ల సంతోషమునను
మగలనిద్దురఁబుచ్చి మనసులుబెదర
కెరలివిటులఁగూడి గృహములువెడలి
మించిసాహసమున మేరలుమీటి
తొడికోడండ్రను దోడివారలును

---

* వినుకొండతాలూకాలోనున్నది.

§ వినుకొండకుఁ గొంచెమీశాన్యముగ 18 మైళ్ళదూరమున నున్నది.

† వినుకొండకుత్తరముగ 19 మైళ్ళదూరముననున్నది.

‡, ¶ ఇవియు వినుకొండతాలూకాలోనున్నవి.

$ నాయకురాలికనుమ దాటినతరువాత నున్నది. కార్యమపూడికి 6 మైళ్ళదూరము లో దక్షిణముగా నున్నది.

గురువులుబంధులు గుఱితెఱఁగినను
నిందింతురనిశంక నిలుపకమదిని
వాఁగులవంతల వనములయందు
నిసుకదిబ్బలయందు నిరవైనపొదలఁ
గుంటెనకత్తెలు కూడికాపాడ
మనసులఁదమిమించ మదనుఁడావేళ
పూబాణములువింట పూనిసంధించి
మర్మముల్ నొవ్వంగ మాటికి నేయ
మంచిగంధముఁబూయ మనసుభీతిల్లఁ
బువ్వులుముడువను బుద్ధియులేక
ఘనసఖక్షతదంత ఘాతలువీడి
రతికూజితంబుల అంతులుమాని
బంధునై పురియందు భావంబువిడక
కొందఱు నేలను గొందఱునిలిచి
నయముతోఁ గొందఱు నానావిధములఁ
గలసిరి మేనులఁ గంపంబులలరఁ
జారులుసాహస స్ఫూర్తులగోడఁ
బ్రాణంబులకుఁదెగి భార్యలమరచి
బ్రతికివచ్చెదమను భావంబువదలి
పట్టణంబులయందుఁ బల్లెలయందు
ధనికులగృహములఁ గన్నానిదోఁచి
సారెకుఁదిరుగంగ సాగిరావేళ

### కార్యమాపూడి రణరంగమును బరీక్షించుటకై బ్రహ్మనాయుఁడు కన్నమనీని నర్ధరాత్రంబున బంపించుట.

నంతటబ్రహ్మన్న యామధ్యరాత్రి
కనుకులదాసుండు ఘనబాహుబలుఁడు
కన్నమదాసువాని గ్రక్కునబిలిచి
వెనుకటిరాజులు విక్రమస్ఫూర్తిఁ
బోరాడిసమసిన బూడిదపెంట
యిలభీమమైనట్టి యెముకలపోఁగు
లెసఁగినరణభూమి యెన్నికగాను
భావనంబుగఁజేసి బహుకాలమందుఁ
గనిపెట్టియున్నట్టి ఘనరాజవితతి
దుర్గములోపలనుండి తొలఁగింపవలయు
నిరవుగాఁగలనిలో నీరాత్రివేళ
నెవ్వరెవ్వరుగాచి యెట్లున్నవారొ
యరసిరమ్మనిపంప నావీరఘనుఁడు
వాసనపెల్లైన వనమాలగదల
కరముల * గుజ్జరి కడియముల్ మెఱయ
నేర్పైనపిడిసుంట నెమలిసోఁగలును
నల్లనిదట్టిని నయమొప్పఁగట్టి
యర్ధనారీఝల్లకాదులనమర
ఘోరభైరవగద కోరమీసములు
నెగుభుజంబులుమించ నెరజేరుగడ్డు
ఘనమైనదేహంబు కాలిపెండెరము
వెరవైనభీకర వేషంబుతోడఁ
గదలెఁగన్నమనీఁడు కదనభూమికిని.
కాటుకకొండయై కదిసినయట్లు

* గుజ్జరిఅనునది ఘూర్జరశబ్దభవము. ఘూర్జరదేశమునే యిప్పుడు గుజరాతని చెప్పుదురు.

గరిమతోఁ జేకట్టి గ్రమ్మినయట్లు
హరిహరాదులమూర్తు లతనికిఁ గలిగె
నడికలనిం జొచ్చి నలుదెసల్ జూచె
నక్కడ కాపున్న యఖిలరక్కసులు
గండభైరవమూర్తి ఘనభూతవితతి
గుంపులై యున్నట్టి కొఱవిదయ్యములు
నిరవుననున్నట్టి యెఱుకలసాని
యున్నతావునువచ్చి యొయ్యననియె
వింటివే వార్తలు వినవిచిత్రంబు
గొల్లెనలచ్చటఁ గుదురు గాఁ జేసి
యీరుద్రభూమికి నీతఁడు వచ్చె
నేమికార్యమొకాని యెఱుఁగంగరాదు
మదముననున్నాఁడు మనుజాధిపుఁడు
తెలిసికోవలెనని తెఱఁగెల్లనిప్పు
డనియుగ్రకోపాన నార్పులునిగుడఁ
గత్తులుద్రిప్పుచు కదిసికూయుచును
గట్టిగానిలిచిరి కన్నమమీద
నంతటఁ గన్నమ యధికరోషమునఁ
గాలాగ్నిరుద్రుఁడై కత్తినిఁదీసి
మెఱుపుకైవడినిల్వ మెచ్చెభూతములు
వల్లకాటికిభర్త వైభవంబెసఁగ
నెవ్వఁడే తెంచెనో యెఱుఁగరాదిప్పు
డీశ్మశానములోన నెసఁగురుద్రుండో
బ్రహ్మయో విష్ణుఁడో పాకశాసనుఁడో
అగ్నిహోత్రుఁడో లేక యమధర్మరాజో
అలనైరృతియొ లేక యంబుధిపతియొ
పవనుఁడో ధనదుఁడో ఫాలనేత్రుండో
మునివితతికి నెల్ల ముఖ్యుఁడోయేమొ
తెలియుదమంచును దిన్నగానరి
యెవఁడవు రా యోరి యీభూమిఁజొచ్చి
యేమికార్యముకొఱకేతెంచినాఁడ
వేరాజుబంటవో యెఱిగింపుమనినఁ
బలికెఁ గన్నమనీఁడు పటుశక్తి మెఱయ
సోమవంశంబున శోభిల్లుచున్న
కానుగురాజేంద్రున కంగనమైన
విద్యలదేవికి విభవంబుమీఱ
ముక్కంటివరమున ముగ్గురుసుతులు
మల్లికార్జుని మొక్క మానసపూవు
లనఁగ జన్మించిరి యందులో మేటి
పెదమలిదేవుఁడు పృథ్వీతలేశుఁ
డా రాజు[illegible]మంత్రి యాదిదేవుండు
కొరవిసరేచర్ల గొడ్డనాయునికిఁ
బడఁతిశీలమయను పద్మనేత్రయను
గలికిఁ గృష్ణుండైన కారుణ్యమూర్తి
పుట్టెను బ్రహ్మన్న భూలోకమందు
నతనికి గాసుఁడ నామను నేను
మాలలకునుబుట్టి మాలనై పోక
విష్ణుపాదముఁబట్టి విశ్వంబులోనఁ
చెప్పలినాయుఁడు తెలవయైనట్టి
యంబుజలోచన పెమ్మసానికిని
శ్రీమించుమాచెర్ల చెన్నునిమేనఁ
బెంపొందెడుతులసి పెదవనమాల
వరమునఁగన్నట్టి వరపుణ్యసుతుఁడఁ
గన్నమనాపేరు కమలాక్షి వినవె

కామునికెదిరించి కదనంబుఁ గోరి
పగరపైఁ దండెత్తి బవరంబునకును
వచ్చిరి మావారు వైభవంబలగ
ఖండనక్రియకిది పట్టయినచోటు
వెనుకటి రాజులు విక్రమఖ్యాతిఁ
బోరాడిచచ్చిన పుడుకలనెంట
తొలఁగించి శుచిసేయ వలెనందుఁ దలఁచి
కాముని బలముల ఖండించి వైచి
మడియంగ వచ్చిరి మన్ననాయకులు
పరభయంకరమైన ఖండనభూమి
నరసింగమ్మ నిపంపె నవతారపురుషుఁ
డైనట్టి బ్రహ్మన్న యనుమఁ జెప్పంగ
వినియెఱుకలసాని విస్మయం బంది
ప్రళయకాలేశుండు పార్వతీశ్వరుని
పాదసేవకులైన ప్రమథగణువార
నిపుడిటు వచ్చుట నెసఁగ సంతసము
మనసులోఁ గోరిక మాకు సిద్ధించె
బ్రహ్మనాయుఁడు వచ్చి ఖండనభూమిఁ
బాదరేణువుచేతఁ బావనం బొప్ప
వెలయింపవలసిన వేళయే తెంచెఁ
గడు వేగ రమ్మను కన్నమానేడె
యనినకన్నమ విని యాశక్తి కపుడు
దండనమస్కృతుల్ దగఁజేసి మగిడి
బ్రహ్మనాయునిఁ జూచి పదములకెఱఁగి
కమలవల్లభ విను కంటి నివింత
కంటి నెఱుకసానిఁ గంటి దైత్యులను
జయమగు వెంచేయు జలజలోచనుఁడ

బ్రహ్మనాయుఁడు గార్యమపూడి
యుద్ధరంగమునఁ జేరఁ బోవుట.

అనుమనచ్చటివృత్త మఖిలంబుఁ జెప్ప
విని బ్రహ్మనాయుండు వీరకార్యమున
ద్వాదశసూర్యులు ప్రబలినరీతి
నెవ్వరికెఱిగింప కేగ నావేళఁ
బొలుపొందనారుద్ర భూమికేతెంచి
నాలుగుకొమ్ముల నాయుఁడు నిలిచె
నారుద్రవసుమతి నాశ్చర్యముగను
గూలినశల్యముల్ కుఱుచతుండములు
సొక్కినచర్మముల్ మట్టలైయున్న
పేగులునరములు పెంటలైయున్న
యేడుమాసంబుల యెముకలుపగిలి
రాలిదట్టంబైన రాసులు తఱచు
మునిఁగి దుర్గంధంబు మొనసిన మెదడు
గాలికిఁ దూలెడు నూనశిరోజములు
కాలికప్పలుబడ్డ కాయవిభూతి
చిదిమినశవములు చెదరుకొలువులు
నానావిధంబుల నాట్యముల్ సలుపు
భూతకోటులతోడఁ బొందుగా నుండెఁ
దలకాయపుట్టెలఁ దగుబంతులాడు
శాకినుల్ మొదలైన సకలభూతములు
బెదరక వారించు క్షేత్రాళిచయము
పిల్లాటలాడెడు పెనుపిశాచములు
మిణుగురుల్ దిక్కుల మించి రాల్పుచును
గూబరొప్పపరుగిడు కొఱవిదయ్యములు
వేదమంత్రంబులు వెసఁ బఠించుచును

బ్రహ్మనాయునిఁజూచి భయసంభ్రమమున
నాశీర్వదింపుచు నళుకుచుఁదొలఁగి
పరుగులువెట్టెడు బ్రహ్మరాక్షసులు
కలఁగిబ్రహ్మన్నను గనినంతలోనఁ
బారిరిభయమున బలుదైత్యవితతి.
ఇటువంటిరణభూమి నెసఁగనీక్షించి
ఘనకార్యములకెల్ల కారణంబగుచు
నెమకలవెంటయై యేహ్యమైయున్న
కార్యమాపురిపుణ్య ఖనియగునట్లుఁ
గావింతుదేవతల్ గనిసంతసింప
ధీరతశ్రీవీర తిరుపతిసేయ
వలెనంచునూహించి వైరులపాలి
కాలమృత్యువువంటి ఘనుఁడుబ్రహ్మన్న
భయదమై రణభూమి పదిలుఁడై నిలిచి
మూఁడుకాలంబుల ముచ్చటలెల్లఁ
దెలిసినయోఋకల దెలవనీక్షించి
బలువైనబ్రహ్మాండ పంక్తులనెల్లఁ
బుట్టింపరక్షింపఁ బొలియింపనేర్చు
బ్రహ్మదేవునికిష్టు ఫాలలోచనులఁ
బ్రార్థించికీర్తించి ప్రణుతులుచేసి
హరియొక్క పదియైన యవతారములను
మనసునఁదలపోసి మానంబురోసి
భువనరక్షణసేయ బుద్ధిలోనిలిపి
పరమేశ్వరునిఁగూర్చి పలికెబ్రహ్మయ్య
"ఓచక్రధరస్వామి ఓకంజనాభ
జలమువైఁబవళించు సర్వభూతేశ
ప్రమథావతారులు బలువీరవరులు
ప్రధనవసుమతిలోఁ బదిలులై నిలిచి
యిత్తుముప్రాణంబు లీయనినంచు
వచ్చియున్నారదె వైభవంబలర
వీరసింహంబులు వీరనాట్యంబు
సేయుచుదిరిగెడు స్థిరబుద్ధితోడఁ
బావనహీనమై పరఁగునీభూమి
నిర్దుష్టముగఁజేయ నిన్నువేఁడెదము
నీచరణంబున నెతిజనియించి
పావనగంగయై పరఁగిలోకముల
ఘనపవిత్రముచేసెఁగద పూర్వమందు
నాజలరూపమై యమరుమేఘంబు
వర్షించియీభూమి వరపవిత్రంబు
సేసెడునట్లుగా సెలవిమ్ముతండ్రి"
అనుచుబ్రహ్మనవేఁడ నాలించిహరియు
ఫణిశాయియైయుండి పంపెదేవేంద్రు
నతఁడుప్రేరేపించ నానీలమేఘ
మాకాశమెల్లను నల్లినట్లుండి
గాఢాంధకారంబు గప్పిభూస్థలిని
ఘూర్ణిల్లుధ్వనులతోఁ గుంభినిమీఁద
నుఱుములుపిడుగులు నుయ్యానఁబడఁగఁ
దళతళమెఱుపులు తరుచుగామెఱయ
వడగండ్లురాలంగ వాయువువిసర
వాఁగువంతలనీళ్లు వఱదలైపాఱ
గుంటమిట్టనరాక కుంభినినెల్ల
ముంచెదేవతలంత మూఁకలైచూడ
జలజనాభునిపాద జనితమైనట్టి
గంగలోకమువెల్లఁ గ్రమ్మెనోయనఁగ
నేకార్ణవంబుగా హెచ్చివర్షించె

నప్పుడా జలమధ్య మందుండియొక్క
పునుక జలముపైనఁ బొర్లాడికొంచుఁ
బడమరగా వచ్చి బ్రహ్మన్న వద్ద
నిల్చి హాసించెను నిస్సార్గణముగ
నపుడు బ్రహ్మయు నా నకవ్వఁజూచి
తలపుఱ్ఱెతోనానెఁ దగువాక్యములను
నవ్విన హేతువు నాతోడఁ జెప్పు
వీనులనిండఁగా వినఁగోరినాఁడ
ననిన నాయునితోడ నాపుఱ్ఱెవలికె
నాపూర్వమంత విన్నపము చేసెదను
శంఖచక్రాంకిత సకలలోకేశ
ఇందిరామందిరా యినచంద్రనేత్ర
జలజజ జనకుండ శార్ఙ్గశరాస
సకలవేదమయాత్మ శ్యామలవర్ణ
సకలధర్మంబులు సమసెడువేళఁ
దగినరూపముఁ దాల్చి ధరఁ బ్రోతువెపుడు
వేదశాస్త్రంబులు వినుతులు సేయఁ
జాలఁగ జడనిధి సంయూష్ణుఁడగుచు
దనుజేంద్రసంహార తార్క్ష్యవాహనుఁడ
ఎ త్రితీయవతార మీయుగమందు
శోభిల్లునీ మేనుఁ జూడంగఁగలిగెఁ
దప్పఁజూడకవిను తగుమనముంచి
దానవుఁడనుఁగాను దయ్యముగాను
భూరిభయంకర భూతంబుగాను
వాసియగాయూకాశ వాణినిఁగాను
గహిమించఁగా బ్రహ్మరాక్షసిఁగాను
జలనిధికోటయై చక్కనైయుండు
దక్షిణజలనిధి దండనున్నట్టి
రమపురమను పేర రాజిల్లుచున్న
పట్టణంబేలెడు పరమధర్మండ
జలధిసోముఁడ నేను సర్వజ్ఞతిలక
ద్వాపరయుగమున భాగ్యంబుతోడ
బహుతరాక్షౌహిణి బలములఁ గూర్చి
భార్గటికెదిరించి దురమొనరించి
కరులుగుఱ్ఱంబులు కాలిమానసులు
హతమైనపిమ్మట నాలంబులోనఁ
బడితిని పగవారి పంతంబుఁ గెలువ
రణధూర్తుఁడను గాను రాజును గాని
సర్వయుగజనులు సమసినకలని
గతిగానకీలాగు కాలంబుఁ బుచ్చి
చెదురుచూచుచునుంటి నెంతయు మేము
నీరాగ్రగణ్యత వెలసిననీవు
కదనవిక్రముఁడవై కలసికివచ్చి
శోధింపఁదిరిగితి ఘోరధర్మమునఁ
బరమాత్మ మాజన్మ పావనంబాయె
నై కుంఠపట్టణ వైభవంబెల్లఁ
గంటి నాయునిమూర్తిఁ గన్నందుచేత
నీపాదములధూళి నెఱసినకతనఁ
పావనంబాయెనీ ఖండనభూమి.
ఇటువంటికలినిలో నేపునమీరు
కదనవాట్యము సల్పఁగనుసంతసిల్లి
శంకరుఁడింద్రుండు సకలదేవతలు
నెనుగు రాఁజనుదెంచి యిత్తురిష్టములు
ఘనపవిత్రులు గాఁగఁ గలియుగమందు

వీరపుంగవులయి వెలయంగఁగలరు
పరువడిఁజనిన భూపతులలోఁగలసి
దివికేగెదము మేము దేవదేవేశ
అని చెప్పిబ్రహ్మచే నంపించికొనిరి
కరమొప్పపండ్రెండు గడియలతడవు
కుంభవర్షంబయ్యెఁ గుంభినియందు
నీతిచేభూతముల్ నిల్చికొల్వంగఁ
గలనికిఁగర్తయై ఘనమైనశక్తి
గరిమబ్రహ్మన్నను గాంచియునిల్చె
నిలిచినఁగనుఁగొని నీలవర్ణుండు
"ఓవిశ్వమయమూర్తి ఓవిశ్వకర్త
ఓలోకపావన యోజగద్భరణ
యోశాంభవీదేవి యోజగన్మాత
సమరంబునకునీవు సాక్షివైయుండు"
మనుచుఁబ్రార్థనఁజేసి యాబ్రహ్మనీఁడు
మగిడెమనోవేగ మానితగతిని
వేగుజామునువచ్చి విడిదిలోనిలిచెఁ
దెల్లవాఱఁగనప్డు దివిజులుప్పొంగఁ
జుక్కలకాంతులు శూన్యమైయడఁగెఁ
గలువలమిత్రుని కాంతులుతగ్గెఁ
జీఁకటిగుహలలోఁ జేరియుడాఁగె
గుడ్లగూబలుపోయి (గొందులనణఁగెఁ)
జక్రవాకంబులు సంతసంబందెఁ
గమలముల్ వికసించెఁ గలువలు మొగిడెఁ
దమతమకార్యముల్ తగఁజేసికొంచు
మోదంబునొందిరి భూజనులెల్ల
వేదమంత్రంబుల వినుతులు సేసి
యఖిలభూసురతతి యర్ఘ్యంబులివ్వ
పూర్వపర్వతకూట పూర్వాగ్రమందు
ఘనతరమాణిక్య ఖచితసౌవర్ణ
కుంభంబువలెనిల్చి గురుతేజమునను

## ససైన్యంబుగ మలిదేవరాజు కార్యమపూడిం జేరుట.

భానుండుదిక్కులఁ బ్రబలెనావేళ.
తరువాతమలిదేవ ధరణీశ్వరుండు
పాలుపొందకార్యమ పురికేఁగఁదలఁచి
తానుబ్రహ్మగలసి తగవిచారించి
ఘనమైనడేరాలు గట్టినబండ్లు
నితరవస్తులుమోసి యేతెంచునట్టి
యెద్దులనొంటెల నెల్లముందుగను
సాగించియంతట సంతోషమునను
గాలిబలంబుల ఘనఘోటకముల
మదమునవిలసిల్లు మంచియేనుఁగల
నాలుగుదిశలను నడువంగఁజేసి
వీరనాయకులూని వెనుఁజొట్టినడువఁ
దమ్మఁడునాయుఁడు తగుబంధుజనులు
తమతమవాహనోత్తమములనెక్కి
వెంబడియేతేర విభవంబుమీఱఁ
దలుచుగారత్నముల్ స్థాపించినట్టి
పాలకిలోనెక్కి భట్లునుతింప
నిరువంక * నరిగెలనెత్రిక్రమ్మంగఁ

* డాలు.

గటు వేత్రకుల్ బరాబరులొనరించి
"అనధారుగాజేంద్ర" యని హెచ్చరింపఁ
బూజ్యుఁడౌ మలిదేవభూపతిసనియె
నైదువిధంబుల నమరువాద్యంబు
లాకాశమంతయు నదరిపడునట్లు
సాంద్రధ్వనుల్ హెచ్చ సంతసంబంది
కదనరంగంబైన కార్యమపూడి
పుణ్యభూమినిఁ జేరి పొందుగా దండు
విడిసెను వైరులు వెక్కసంబంద.
వేదశాస్త్రజ్ఞులు విప్రులందరును
నధిపునాశీర్వాద మమరంగఁ జేసి
నగసంపుభూమి ప్రశస్తంబొనర్పఁ
జెన్నకేశవదేవు శ్రీపాదజలము
తివిరిపూజారులు దెచ్చుటఁ జేసి
తులసిపత్రంబులతోడఁ దీర్థంబు
నచ్చోటఁ జల్లించి యలరు లగ్నమున
శాంఖికస్థాపన సమ్మతిఁ జేసి
నిక్షేపముగ రత్ననిచయంబులుంచి
తెచ్చినకంబంబు ధీరతతోడ
నడికలననునిల్పె నగనాథవరుఁడు
కాశ్మీరకస్తూరి కర్పూరయుక్త
పరిమళగంధంబు బాగుగాఁ బూసి
మైసాక్షిగుగ్గులు సుహితధూపంబు
నర్పించియటమీద నారగింపంగ
మృగములమాంసంబు మెచ్చుగా వండి
పంచామృతంబులు పాయసాన్నములు
పేర్లైన పచ్చళ్లు పిండివంటలును
భూతరాట్టునకష్ట భోజనంబిచ్చి
యఖిలభూతంబుల కాచారముగను
ఘనమైనపోతులఁ గావు చెల్లించి
తరువాత * సర్పాఖ్య తటినిలోపలను
పటు § గంగధారనాఁ బరఁగిసమడుఁగు
పొంతనుఁ జని వీరపుంగవులెల్లఁ
దమతమనామముల్ ధరలోనఁ దలుచు
ప్రఖ్యాతినొందంగ భక్తితోనందు
స్నానంబు జేసి (విశాలతీరమున)
నిలిపిరి † లింగముల్ నేమంబుతోడఁ
దరువాత మలిదేవ ధరణీశ్వరుండు
నాయునితోడను నదికి నేతెంచి
కాలోచితక్రియల్ క్రమముగాఁ జేసి

---

* నాగులేఱు.

§ ఈమడుఁగిప్పటికిని గార్యమపూడివద్దఁ గలదు. ఇది నాగులేటిలోనిదే. దీనిలోని నీటినే సాధారణముగా నచ్చటిజనులు త్రాగుటకుపయోగించెదరు.

† వీరునిలిపిన లింగములివియేయని కొన్ని లింగములను జనులిప్పటికిఁ జూపించుచున్నారు. ఇవి గంగధార మడుఁగునొడ్డునగల గుడిలోనున్నవి. వీనికి పూజలుకూడ సల్పబడును.

నామతీర్థంబులు నయమొప్పఁదీర్చి
పటుపటీరములకుఁ బన్నుగావచ్చి
సకలనాయకతతి సన్నిధినుండఁ
గొలువునఁగూర్చుండెఁ గుధరారిరీతి
నప్పుడుబ్రహ్మన్న యవనీశుతోడ
నుచితవిచారంబు నొనరించిపిదపఁ
జెలఁగుచుసమరంబు సేయఁగావలెను
దరుచైనబలముతోఁ దగలిరమ్మనుమఁ
బొలుపొందునలగామ భూమీశుకడను

### నాయుఁడు నలగామరాజువద్దను భట్టును రాయబారమునకై పంపుట.

భట్టునుపొమ్మన్నఁ బయనమైతాను
వాయువేగముగల వాజిపైనెక్కి
బంగారుగుబ్బతో భాసిల్లుగొడుగు
పట్టుకముందర భటుఁడొకఁడేఁగ
విలసిల్లుజల్లుల వింజామరంబు
లీవలావలనుండి యిద్దఱువీవ
* గురిజాలకేతెంచి కువలయభర్త
తావుకుముందరఁ దగఁజెప్పిపంపె
వినికామభూపతి విభవంబు మెఱయఁ
గొలువుశృంగారింపఁ గూర్చినవారిఁ
బంపించెవారలు పరిచారజనుల
రప్పించితీర్చిరి రమణీయముగను
గస్తూరిచేతనుఁ గలయంగనలికి
ముత్యాలతోడుత ముగ్గులువెట్టి
కర్పూరముదకంబు కలిపిముందటను
(గలయంపిచల్లి నిష్కల్మషభంగి)
శ్రీరామకథలును శ్రీకృష్ణకథలు
పన్నుగావ్రాసిన పటములఁదెచ్చి
కట్టిరిగోడలు కనుపడకుండ
మౌక్తికమంజీర మంజుపుంజంబు
వ్రేలాడుచుండెను వివిధరత్నముల
ఘనవితానమ్ములు కట్టిరిమీఁద
నిలువుటద్దంబులు నిలిపిరిదిశల.
తంతుపటములు (విస్తృతముగఁబఱచి)
వన్నెలపటములు వానిపైఁబఱచి
పఱచినవానిపైఁ బంచవర్ణముల
రత్నకంబళములు రంగుగాఁబఱచి
కాంచననవరత్న ఖచితమైనట్టి
పీఠమొక్కటిఁదెచ్చి పెద్దకొల్వునను
నిలిపిరిదిక్కుల నిగ్గులుదేర.
చెలువుగానిటువలెఁ జేసినవార్త

### నలగామరాజు కొల్వుకూటమున కేతెంచుట.

వినినంత నలగామపృథ్వీశ్వరుండు
సురసంపుపన్నీట జలకంబులాడి
ఘనశుచివస్త్రముల్ కటియందుఁదాల్చి
చిత్రాసనంబుపైఁ జేరికూర్చుండి
నిలువుటద్దముఁజూచి నేరుపుమీఱఁ
దిలకంబునుదుట సుస్థితిమీఱఁదీర్చి

* గురిగింజతీగెలువిస్తారముగానుండుటవలన దీనికీపేరువచ్చినదని కొందఱుచెప్పుదురు

సంధ్యాదికృత్యముల్ సమ్మతిఁజేసి
భుజియించితరువాత పునుఁగుజవ్వాజ
కస్తూరిరసమును గలిపినయట్టి
శ్రీచందనము మేనఁ జెలువుగాఁబూసి
తగటుకూసంబులు ధరియించితలను
నొకవింతయుష్ణీష మొప్పుగాఁగట్టి
నవరత్నమాల కంఠంబునఁ బ్రేల
డంబుగాఁ గర్ణకుండలములు మెఱయ
భుజకీర్తులనియెడు భూషలుదాల్చి
మేనికిరక్షయై మించు తాయెతులు
దండచేతులరెంట ధారణచేసి
మురుగులుగొలుసులు ముంజేతులందుఁ
దిరముగాఁ బ్రేళ్ళ ముద్రికలనుఁ బెట్టి
నవరత్న ఖచితంపు నడికట్టుదాల్చి
గండపెండేరఁబు కాలికిఁ బెట్టి
బంగారుదుప్పటి పైననుగప్పి
పావుకోళ్ళనురెండు పదములఁదొడిగి
కటికివారలు మ్రోలఁ గనుపించిపొగడ
నీవలావలఁజేరి హెచ్చరింపంగ
వేత్రహస్తులుగూడి విచ్చలవిడిని
సందడిదూరమై చనునట్లుచేయ
(రహిమించ) నంతఃపురంబును వెడలి
కొలువునకేతెంచి కుతుకంబుమీఱ
నిలిచెశృంగారంబు నేర్పునుఁగనఁగ
నంతటకింకరు లతివేగమునను
దూలికాతల్పంబు దూర్చినయట్టి
మొఖమాలుగుడ్డలు ముసుకొని తెచ్చి
పఱచి పీఠముమీద బాగైన దిండ్ల
నుంచినఁగనుఁగొని యుర్వీశుఁడైన
కామభూమీశుండు గద్దెపైనుండె
వెనుకను నరసింగవిభుఁడుగూర్చుండె
* నాగమయొకవంక నమ్రతనుండె
బంధుజనముచుట్టు బలిసికొల్వంగ
వేదశాస్త్రజ్ఞులు విద్వాంసులెల్ల
నాశీర్వదించుచు నాసీనులైరి
సకలదేశాధీశ సచివపుంగవులు
ముకుళితహస్తులై ముందరనుండ్రి
శాస్త్రపారంగత సంస్కారయుతులు
కవులునుభటులును కనిపెట్టియుండ్రి

## నలగామరాజు సభయందు విద్యావినోదములు జరుగుట

వింతగాగాయకుల్ వీణెలఁబూని
తంత్రులుబిగియించి తగసుతిఁబెట్టి
సరిగమేళములైన స్వరసప్తకంబు
నారోహణావరోహణ భేదములను
బహురాగసంప్రాప్తి పట్టుగాఁజేర్చి
సంచారిసంస్థాయి సరసభావముల
మృదుతరశబ్దార్థ మిళితమైనట్టి
ఘనతరాలంకార గతిపరంపరలు
† మూర్ఛనల్ మొదలైన ముఖ్యధర్మములు

---

* నాయకురాలనగా నీమెయే.

† సంగీతమునందు వరుసగా సప్తస్వరములయొక్క ఆరోహణావరోహణములు.

జంత్రగాత్రంబులు జంటగావించి
చెలఁగియెండినచెట్లు చిగిరించునట్లు
పాడిరితమతమ ప్రౌఢిమమీఱఁ
బాకశాసనుకొల్వు పగిదినున్నట్టి
వేళ నేతెంచిరి విద్యాధికతను
నాట్యమేళమువారు నవవిలాసముల
వచ్చినమ్రత మ్రొక్కి ప్రక్కగానిల్వ
ఘనవైభవంబునఁ గామభూవిభుఁడు
నవ్వుచు సెలవిచ్చె నాట్యంబు సేయ
వరమృదంగము లెస్స వాయించు మేటి
కుడిభాగమందునఁ గుదురుగానిలిచెఁ
దాళమానజ్ఞులు దాపటిదిశను
నిలిచిరుత్సాహంబు నేరుపుమీఱ
ముఖవీణెవాయించు ముఖ్యుఁడొకండు
రాగమాలాపించు రమణులిద్దరును
నిండువేడుకతోడ నిలిచిరి వెనుక.
కంజలోచనయును ఘనమైనపాత్ర
మదనుపట్టపుదంతి మంజులవాణి
భరతశాస్త్రోచిత బహురాగములను
గరిమతో నేర్చిన కంతుబాణంబు
వచ్చియు సభవారు వర్ణించిచూడ
నిలిచినాట్యమునకు నేర్పరియైన
వేత్రపాణికిఁదగ వినయంబుఁజూపి
యతఁడొసంగినగజ్జ లతిభక్తితోడఁ
బాదములంగట్టి పంచవర్ణముల
కాళగట్టిగఁగట్టి కడుజపంబడర
మద్దెలతాళాల మధ్యనిల్చుండి
గౌరచూపునరాజు నొయ్యనఁజూచి
సమపాదయుతమైన స్థానకస్థితిని
దాత్పర్యమున దేవతలకును మ్రొక్కి
పుష్పాంజలియొసంగి పూని నాట్యంబు
సమకట్టినాదంబు సభయెల్లఁగ్రమ్మఁ
గైకోలువిడుదలల్ ఘనకళాశైలి
* కైముడికట్నముల్ కనుపింపఁజేసి
వెలయంగఁదొమ్మిది విధములయినట్టి
భూచారినాట్యంబు పొందుగాసలిపి
పదునాలువిధములై పరఁగినయట్టి
యాకాశచారియు నమరంగనాడి
యంగహారాఖ్య గలట్టినాట్యంబు
విదితమౌతొమ్మిది విధములనాడి
గతిచారిభేదముల్ గనుపడునట్లు
భ్రమణసంయుతదీప్త పటిమమీఱంగఁ
బాణిభేదములను బాటించిచూపి
స్థానకసంచయ సంయుక్తమమరఁ
భేరణిదేశిని ప్రేంఖణశుద్ధ
దండికాఖండలి తగుబాహుచారి
పస్తుతాండవములు పల్పెఁజిత్రముగ
సభవారలాశ్చర్య సంయుక్తులైరి
తరువాతనిరుమేలఁ దగుచెలులమర
సంయుతాసంయుతా చలనసంకుచిత
నానార్థకరములు నాట్యహస్తములు
శిరమునుమాపులు చెక్కిళ్లుబొమలు

* తాళవాద్యవిశేషము.

దంతోష్ఠకంఠములఁ దగు చుబుకంబు
ముఖరాగవక్షంబు మొదలుగాఁ జెన్ను
నంగంబులాఱు నుపాంగంబులాఱు
ప్రత్యంగసముదయం బాఱునుంగూడి
యెనిమిదిపదియగు నెసఁగునంగంబు
లమరంగనభినయం బాశ్చర్యముగను
మాచెర్లచెన్నుని మహిమంబుఁదెలుపు
నాంధ్రసంస్కృతవాక్యయాదిగీతముల
భావంబులెస్సగాఁ బ్రకటంబుసేయఁ
జూచిరంభాదులు చోద్యంబునొంది
శిరసులువంచియు సిగ్గునుజెంది
రప్పుడుభూమీశుఁ డాదరంబొప్ప
వస్త్రభూషణములు వారికినిచ్చి
భట్టునురమ్మని పంపించెఁబిదపఁ

రాయబారమునకు వచ్చిన భట్టు
నలగామరాజు సభయందుఁ
బ్రవేశించుట.

దురగంబునైనెక్కి దుమికించికొనుచు
వచ్చికొల్వునుజేరి వాజినిడిగ్గి
భూమీశునెదుటను బొందుగానిలిచి
రాజాధిరాజ విరాజితకీర్తి
రాజవేశ్యావిట ప్రాభవప్రకట
గండరగండాంక ఘనదానచతుర
స్థైర్యనిర్జితమేరు ధరణీధరేంద్ర
శౌర్యవిక్రమకళా సంపూర్ణచంద్ర
భాస్కరసమతేజ ప్రౌఢగుణాఢ్య
మానదుర్యోధన మైలమ్మసుతుఁడ
అనుఁగుభూపతిపుత్ర అంచితగాత్ర
వీరకామవరేంద్ర విభవదేవేంద్ర
రాయబారమునకు రాజుపంపించె
వచ్చిన * యల్లుని వధియించినారు
మనసునఁగ్రోధించి మలిదేవరాజు
తమ్ములుతానును దనబంధుజనులు
వీరనాయకతతి విఖ్యాతిమెఱసి
ఖరదూషణాదులు గతమైనచోటు
శ్రీశైలభూమిలో శ్రేష్ఠమైనట్టి
కార్యమపురిభూమి ఘనపుణ్యరాశిఁ
బటుతరవిక్రమ ప్రౌఢిమమీఱ
ధాటిమైనిల్చిరి దండుతోఁగూ[illegible]
నలరాజుకోడనే హతమైనదు[illegible]
జలమునఁగోపంబు సంవృద్ధినొ[illegible]
వీరనాయకులును వేగిరపడఁగ
మలిదేవభూపతి మన్నించియిట[illegible]
నన్నుఁబుత్తెంచెను నరనాథవిను[illegible]

భట్టుమూర్తి నలగామర[illegible]నకు
రాజనీతి విశేషంబులఁదె[illegible]ట

పరవృద్ధిఁబొందించు భ్రష్టులెకా[illegible]
యడఁగించునేర్పరు లవనిలోలేర[illegible]

* ఇతడు "అలరాజు". ఇదివరకు బ్రహ్మనాయుఁడు రాయబారమునకై [illegible]ను బంపించినాఁడు. అలరాజు నలగామరాజున కల్లుఁడైనప్పటికి విరోధ[illegible]మున రాయబారమునకు వచ్చినాఁడుగనుక నతనిఁ జంపిరి.

నరసింగభూమీశు నమ్మికవీరు
తమ్ముఁడా మలిదేవధరణీశుకడకుఁ
బంపుఁడియేకమై పగలనునణఁచి
పలునాడు మొదలైన బహుభూము లెల్ల
నెదురెవ్వరును లేక యేలుఁడిసుఖత
శృంగారయుతు నరసింగుభూమీశుఁ
బంపించుమలిదేవ పతిఁగలయంగఁ
బోరుమంచిదిగాదు భూమి నెక్కుడను
బాడౌను దేశంబు పగమించె నేని
ప్రజలెల్ల నోయించి పాతిపోవుదురు
బండారమునకును భైకంబులేదు
రాణావయందుచే రహించడియుండుఁ
[illegible]త్రగాండ్లెల్లఁ జెలఁగికోపించి
[illegible]శంబు లిమ్మందురపుడు
[illegible] మేగలు పరిహారవరాను
[illegible]యఁ బాలుమాలుదురు
తెలి[illegible]వుర్ ధీరతనోడ
భూ[illegible]నుటకు బుద్ధి వెట్టుదురు
పగ[illegible]లు పరికింపలేరు
మేక[illegible]న మీరుపోరాడఁ
జూ[illegible]కిఁ (జాలకనయానను)
(కోరి[illegible] బుమీ గస్త్రైలుంగుదురు)
పలువ[illegible]ఁజేరి పగఁజావనీక
చెప్ప[illegible]దురు చెనటివాక్యముల
నైక[illegible]చెడు నద్దానితోడఁ
జెడు[illegible]ఖును జెడును భాగ్యంబు
చెడు[illegible]బును జెడును శౌర్యంబు

చెడును రాజ్యంబులు చెడ్డపిమ్మటను
దేశంబు పరన్నపాధీనమౌనుమ్మ
పారతంత్ర్యంబు మాసైఁబడఁగలదు
పరతంత్రజనముల పాలికష్టములు
చెప్పంగనలవియే శివునకునైనఁ
బంజరంబునమున్న పక్షులరీతి
(బంధించిపాములవాఁడు పెన్బుట్టఁ
బదిలతఁబెట్టిన పాములభంగి
గంగిరెద్దులవాఁడు కావరమణఁచి
ముకుదాడుపొడిచిన పోతెద్దులట్లు
బోనులోనుంచిన పులులవిధంబు
స్వాతంత్ర్యరహితతఁ బడియుండవలయుఁ
బరికింపఁగామనో వాక్కాయములను
నైజదుర్గ్రాహ్య మానసమదితప్ప
వాక్కాయములు రెండు బంధింపఁబడును
మనసులోఁబుట్టిన మంచితలంపు
ఆచరణమునందు నలవికాకున్న
జన్మఫలంబేమి చచ్చుటే మేలు.
అన్యకృకీట తిర్యక్ నేకహీన
యోనులలో నెన్ని యోమార్లు పుట్టి
పడయకపడయక పడసినయట్టి
దుర్లభనరరూపు దూషితంబగును
బార్థివాయిటువంటి పారతంత్ర్యంబు
కటకటా పరవారికైననువలదు.)
కుందబృందసితాబ్జ కుముదాప్తతార
హారడిండీరనీ హారపటీర
ఘనమరాళంబుల కాంతినిమించు

సత్కీర్తివేగమే సరవినశించు
నపకీర్తిజగముల నధికమైయుండు
నుభయవాదులువీర లోకకర్తైయున్న
సకలకార్యంబుల సమకూర్పవచ్చుఁ
బ్రజలకుసుఖమౌను బంటలుపండు
ధనముసంపాదింపఁ దగియుండునపుడు
సంపూర్ణకాములై సకలసేవకులు
కాపాడుదురుమిమ్ము కనిపెట్టియుండి
పరరాజులనుగెల్వఁ బైకొనిపోయి
యతిమిక్కుటముగ ద్రవ్యాదులెల్లఁ
గొనవచ్చు ధర్మముల్ కూర్పంగవచ్చు
సత్కీర్తిజగముల సాంద్రమైనిల్చుఁ
గలహించి వెనుకటి కౌరవులెల్ల
గతిచెడిపడినట్టి కష్టముల్ వినమె
పగసెరిగించుట భావ్యంబుగాదు.
ఉభయవాదులువీర లోకకర్తికనుక
నయమొప్పఁజెప్పితి నామాటవినుఁడి
యనుచుఁజెప్పిననీతు లాలింపఁడయ్యెఁ

## నలగాముఁడు భట్టుమూర్తి చెప్పిన వాక్యంబుల నిరాకరించుట.

గామభూపాలుండు కనులెఱ్ఱచేసి
కోపంబుమించఁగాఁ గొలువెల్లఁజూచి
వింటిరేసభవారు వీరలతలఁపు
రాణువతో మును రణభూమినిలిచి
తమ్మునంపమటన్న ధర్మమాతమకు
విన్నవారెల్లను వెఱగందగలరు
మగతనంబునఁబుట్టి మగకాశఁగట్టి
మగటిమివిడనాడి మానంబువిడిచి
వారున్నతావుకు వచ్చుటతగవె
భటవృత్తివాఁడవై పల్కితివిట్లు
పూర్వకార్యంబుల పుట్టువుమఱచి
యీరీతిఁబల్కితి వేమందునిన్ను
ననరాదువినఁగూడ దామాటలిపుడు
తనుభూమినిచ్చిన దక్కించికొనఁగ
శక్తిగల్గినఁజాలు సదయుఁడనగుచు
నిచ్చితిఁదమభూమి యేలికొనంగ
ననుచువింతగఁబల్క నామాటలకును
భావంబుతెలియక పటురోషమంది
నవ్వుచుడగ్గరి నాయకురాలు

## నాయకురాలేకాంతంబున నలగామునకు సంధివిముఖంబులైన మాటలుచెప్పుట.

నెవ్వరువినకుండ నేకాంతమునను
బల్కెఁగామునితోడఁ బ్రౌఢిమమెఱయ
విను నరనాయక విన్నవించెదను
బాలరాజులుతాను బ్రహ్మనాయకుఁడు
కలిగినబలముతోఁ గార్యమపూడి
కలనుఁబ్రవేశించి కదనంబుఁజేయఁ
గనిపెట్టియున్నారు గ్రక్కునమిమ్ము
రమ్మనిపిలిచిన రామనరాదు
కలిగినబలిమియుఁ గలిమియువిడిచి
మగటిమివిడనాడి మానంబుదూలి
పంచిభూమినొసంగఁ బంతంబుగాదు
కయ్యంబుసేయుట ఘనవిచారంబు.

ఇద్దఱురాజులై యేర్పడిరేని
నవనిలోపలనాజ్ఞ కమరికయౌనె
సిరిపొత్తుసేయుట చెల్లునుగాని
యాజ్ఞపాత్తిచ్చుట యదినీతిగాదు
చర్చించిచూచిన జ్ఞాతియుండంగ
నగ్నితోఁబనియేమి యన్నవాక్యంబు
వినవెపెద్దలుసెప్పఁ బృథ్వీతలేంద్ర
పగరకుఁజోటివ్వఁ బాడికాదెదరు
తరువాతఁబెరుకంగ ధరనసాధ్యంబు
పాండవులకుభూమి పాలిచ్చిపిదపఁ
గౌరవులేమైరి కార్యమర్మజ్ఞ
నీవెఱుంగనినీతి నేనెఱుంగుదునె
యనవినిభూమీశుఁ డాత్మలోఁదెలిసి

## నలగాముఁడు భట్టుతో మలిదేవ రాజుబలంబుఁ దృణీకరించుట.

భట్టునుఁగోపించి పలికెనావేళ
నలరాజుచావున కాగ్రహమంది
పగతీర్పఁదమకెంత బలమదిగద్దు
నాతోడఁబోరాడ నరులెంతవారు
సేనాధిపతిలేఁడు సేనలులేవు
బలువైనకూలాల బండ్లునులేవు
కరితురగంబులు కాలిమానసులు
లెక్కింపఁగానేమి లేవువారలకు
నేనెఱుంగనిబల మెప్పుడువచ్చెఁ
గూడిగుంపైయున్న గున్నయాచింత
చెట్టుక్రిందికిలేదు శిబిరమంతయును
మూఁకంతవరిమడి మూలకులేదు.
ఏమివిచారించి యిటువచ్చినావు
బవరంబొనర్చినఁ బట్టిబంధించి
గణబలిపెట్టింతు రణభూమియందుఁ
బ్రాణముల్ వలసిన బాలరాజులను
దిన్నఁగాఁదోడ్కొని తిరిగిపొమ్మంచు
బహుబుద్ధిగాఁజెప్పు బ్రహ్మనాయునికి
ననినఁగోపంబుతో నాభట్టుపలికె

## భట్టుమూర్తి నలగామునిఁ దూలనాడి బ్రహ్మనాయుని ప్రతాపాములఁ బేర్కొనుట.

నుత్తలమేటికి నుర్వీశనీకుఁ
గాకిబలమువలెఁ గ్రమ్మియున్నట్టి
బలముఁజూచుకగర్వ పడనేలనయ్య
సంధికేతెంచిన జామాతఁబట్టి
చంపినవారలు జగతిలోఁగలరె
* యాఁడుబిడ్డనుఁజంపి యల్లునిఁజంపి
హింసకురోయని హీనవర్తనుఁడ

* ఆఁడుబిడ్డయనగా నిచట నలగామరాజుకూతురు. ఈమెపేరు రత్నాల పేరమ్మ. ఈమెను నలరాజునకిచ్చి పెండ్లిచేసిరి. అలరాజు నాయకురాలిక్రుట్రచేఁ జంపబడినప్పుడు, భర్తయైన అలరాజుతోఁ బేరమ్మ సహగమనముచేసెను. ఈవిధమున నలగామరాజుయొక్క అల్లుడు కూతురు నొక్కసారియే చనిపోయిరి కనుక నే "యాఁడుబిడ్డనుఁజంపి యల్లునిఁజంపి" యని చెప్పినాఁడు.

ఎఱుఁగవా వీరుల నెఱుఁగవా బ్రహ్మఁ
బగవారిగుండెలు బ్రద్దలుసేయు
పటుతరవిక్రమ ప్రౌఢిసంయుతుఁడు
పగరాజులబొజుంగు బ్రహ్మన్నతొల్లి
నష్టదిక్కులరాజు * లారణగండ్ల
కేతెంచిరణమున నెదిరినవేళఁ
గుంజగంబులమీఁదఁ గొదుమసింహంబు
దుమికినరీతిని దోర్బలంబొప్పఁ
గినిసివారలనెల్లఁ గెలిచియాలమున
మెప్పించిదివిజుల మేటివ్రజంబు
సమమైనకుంతంబుఁ జక్కఁగాఁగొనియె
నప్పనంబులుగొని నవనీశులొద్ద
నాదినారాయణు నవతారమూర్తి
కృష్ణునీడెడువేళఁ గేరిగ్రాహంబు
చంపవచ్చినఁజూచి జంకింతలేక
ఖండించివైచిన ఘనశూరుఁడతఁడు
మట్టునిప్పులయేరు శోభిల్లుచున్న
నేకైనశివపురి నీరుగాఁజేసి
భూతరాష్ట్రంథంబుఁ బుచ్చికొన్నట్టి
శూరుఁడుధీరుఁడు సుమహితుఁడెన్నఁ
జెడనాడవారలఁ జెల్లునానీకు
లక్షకొక్కఁడుసరి లావునయందుఁ
బదికోట్లనైననుఁ బవరంబునందుఁ
దెగవేసిపుత్తురు ధీరతతోడ
నుగ్రకోపాఢ్యులు నురుబాహుబలులు
నసహాయశూరులు నలువదేగురును
భండనవిజయులఁ బటుపరాక్రములఁ
గన్నులమదమెక్కి గర్వించిపొంగి
కానకనిందింపఁ గలుగునాఘనత
చిరినక్కకొమ్మపైఁ జీదరరేఁగి
వృక్షంబుపైఁగంతు వేసినయట్లు
బలములుగలవని పటుగర్వమేల
యెదురునీబలముల నెన్న నేమిటికి
నేనుఁగుల్ సింగము నెదిరింపఁగలవె
కార్చిచ్చుభంగినిఁ గనలికోపించి
యున్నారురణమున నుత్సహించుచును
వెడలుఁడుకలనికి వెడలకుండినను
నడుతురుకోటకు నాయకులెల్లఁ
గరులుసరస్సునుఁ గలఁచినయట్లు
గురజాలపురమునుఁ గోటతోఁగూడఁ
బెరికివైతురు క్రుంగువేఱులతోడ
నిన్నునీతమ్ముని నీకైనవారి
నీమంత్రినాగమ న్నీకూర్మిహితుల
శిక్షింపుదురురాజ సిద్ధమీమాట
అనిననారణభట్టు నందరుచూచి
కోరమీసలుదువ్వి కోపించిరపుడు

---

* ధరణికోటరాజైన యుత్తరేశ్వరునికి ననుగురాజానకు నిచ్చట గొప్ప యుద్ధము జరిగినది. బ్రహ్మనాయుఁడు, ఉత్తరేశ్వరుని నతనికి సహాయము గావచ్చిన రాజులనుఁ బూర్తిగనోడించెను. ఇది సత్తెనపల్లితాలూకాలోనున్న యమరావతికి సమీపమున నుండియుండవచ్చును.

### నాయకురాలు భట్టుతోఁ భీకర వాక్యంబులఁ బల్కుట.

మంత్రియానాగమ్మ మండుచుఁబలికె
భటవృత్తివాఁడవై పల్కితివిట్లు
కామభూపతిపాద కమలంబులాన
కరిచేతఁద్రొక్కింతు గట్టిగానిన్ను
భట్టువాఁడవుగాన బ్రతుకనిచ్చితిని
దైవంబునీపాల దయచేసినాఁడు
వీరులుఘనులని వెఱపింపరాకు
సమరంబులోవారు సమయంగఁగలరు
మశకాళితేనెలో మడిసినరీతి
మిడుతలుచిచ్చులో మిడిసిపడ్డట్లు
మాచేతజచ్చును మన్నీలబలము
లన్నదమ్ములమేర లడఁగ సిద్ధంబు
వాజులపైఁబడి వడితోడఁబోరి
గుఱుతుగాశిరములు కుప్పలుచేసి
మత్తకరులచేత మట్టించివిడుతుఁ
బైనమైదండెత్తివత్తుము మేము
పాఱకనిలుమని వాక్రుచ్చుపొమ్మ
టంచుఁగట్నములిచ్చి యతనిని నంపె
ననిచినఁబురికేగ నప్పుడేకదలి

### భట్టు కార్యమపూడికిఁ దిరిగిపోయి గురిజాలలోజరిగినవృత్తాంతము రాజునకుఁ దెల్పుట.

కార్యమపూడికి గ్రక్కనవచ్చి
మలిదేవుఁబొడగని మన్ననవడసి
కాముఁడాడినయట్టి కఠినవాక్యములు
వీరులునాయుఁడు వినుచుండగాను
విన్నవించినరోష వివశులై వారు
కార్చిచ్చుభంగినిఁ గనలికోపించి
గొబ్బుననీవేళ గురిజాలకేగి
కోటలగ్గలకెక్కి కూలఁద్రోసెదము
పట్టణంబంతయుఁ బాడుచేసెదము
నావుఁడునాయకుఁ డప్పుడిట్లనియె
దండెత్తివచ్చెదు ధరణీశువిడిచి
తగదుకోటకునేగ ధర్మంబుగాదు
వీరధర్మముదప్పి వెనఁగుటయేల
అనిబుద్ధిగాఁజెప్ప నట్లుండిరంత
గురిజాలలోపలఁ గుంభినీశుండు

### భట్టు కార్యమపూడికిఁబోయిన తర్వాత గురిజాలలో జరిగిన వృత్తాంతము.

నలగామభూపతి నాగమఁబిలిచి
మనవద్దబట్లును మన్నెవారలును
బత్తులనన్నంబు భక్షించువారు
రొక్కజీతంబుల రూఢులౌవారు
క్షేత్రముల్ జేసుక జీవించువారు
పల్లెలుబుచ్చుక బ్రతికెడువారు
నెలగొల్లుప్రజలకు నెల్లరకిప్డు
పైనమైరమ్మని పరఁగజెప్పింపు
కరితురగంబులఁ గదలింపుమనుము
బలువైనశూలాల బండ్లఁదర్లింపు
సాగింపునీవుండి జాగుసేయకుము
నావుఁడుమంత్రియౌ నాగమ్మపలికె

### నలగామరాజుతో నాయకురాలు మలిదేవరాజుయొక్క బలముం గూర్చి నిరసనవాక్యంబు లాడుట

వినుము చెప్పెదనీకు వీరకామేంద్ర
పిల్లసైన్యమునకు భీతిల నేల
అలువదేగురెకాని యధికులు లేరు
బలములఁగప్పించి పన్ని పోరాడ
వారికిబల మేది ప్రారంభమందు
గుంపుగానల్లఁ గూర్చుకవచ్చి
బాలులఁగొనివచ్చి బ్రహ్మనాయకుఁడు
భూమిఁగొనెదనంచుఁ బూనియున్నాఁడు
నీబల్మికల్మిలు నీకగోచరము
దేవేంద్రుఁడైననునిన్ను ధిక్కరించునొకో
వారిబింకములకు వంగఁగ నేల
నీవు రాఁబనిలేదు నృపకులశ్రేష్ఠ
నన్ను బలముసంపు నాయుని గెలిచి
మన్నీలవీరుల మగటిమిఁదూల్చి
మేదినీభర్తను మేడపపురికి
వట్టిచేతులతోడఁ బంపంగఁజూతు
ననిననాగమతోడ నారాజువలికెఁ
గొడుకుచావునకయి కొమ్మభూవిభుఁడు

### నలగామఁడు నాయకురాలుతో రాచకార్యంబులఁ జెప్పుట.

బహుఖేదయుక్తుఁడై పగతీర్చికొనఁగ
బాలరాజులుతాముఁ బటిమతోవచ్చి
యున్నాఁడుకలహింప నుగ్రతేజమున
నాకులక్ష్యములేదు నాగమవినుము
నీతిశాస్త్రంబుల నిర్ణయరీతి
పగవారలఁతులని భావింపరాదు
కొంచెపుఫణియైనఁ గొట్టెడుకొఱకు
ఘనమైనదండము కావలెఁగాని
కూడదుపన్నని కోలఁగొట్టఁ
దప్పునాతమకానఁ దఱుముకవచ్చు
హెచ్చైనబలముతో నేగుటనీతి
మరణమైనంజాలు మంచిదియంచుఁ
దరఁదెంపొనర్తురు దారిద్ర్యయుతులు
వేగిరపడ నేల వెలఁదిరోమనకు
ధనధాన్యబలములు తక్కువలేవు
పట్టఁజాలవునిండి భండారములును
దఱుఁగవుగాదెలు ధాన్యంబు హెచ్చి
తండ్రినాఁటిబలంబు తక్కువలేదు
మానాఁడుగలయది మంచిబలంబు
బంధుమిత్రులుచాల పట్టుగాఁగలుగ
నఖిలభూపతులు నా యాజ్ఞ చేపట్టి
పనులనొనర్తురు భక్తితో నిప్పు
డిటువలెమనలావు హెచ్చియుండంగ
మలిదేవుకార్యంబు మనసునరాదు
కార్యస్వతంత్రత గలదెయాతనికి
భండారమాకొద్ది పగయధికంబు
ప్రస్తుతిసేనకే ద్రవ్యంబులేదు
బలములఁగూర్చిన భత్యమేడ
యీవిలేకుండిన నెవరువచ్చెదరు
వచ్చినవారలు వశ్యులవుదురె
యొకనెలమించెనా యోర్వరుబంట్లు
దొరబంటుమేరలు తొలఁగుచునుండుఁ

గార్యముల్ చెడిపోవుఁ గలిమిలేకున్నఁ
బ్రతిమలనాఁడగఁ బట్టినయట్లు
నాటకవిధమున నాయుఁడు చేసెఁ
గదనరంగంబునఁ గానఁగ నాను
మన్నీలవీరులు మనశక్తి యెఱుఁగ
వేగ మెచ్చనిదండు విరియింపవలయుఁ
జుట్టుకవారల శూలాలఁబొడిచి
తురగరింఖలచేతఁ ద్రొక్కించుదనుక
నెఱయఁగన్నులనిండ నిద్దురవట్టి
దనియిట్లుపలికిన నారాజుతోడ
నాగమపల్కెను నయయుక్తిమెఱయ
మనకప్పనము పెట్టు మన్నెవారలకుఁ
బంపించిలేఖలు బలములఁగూర్చి
పగతులశిరముల బల్మినిఁగొట్టి
రాలుబఱచినట్లు రణమునఁబఱచి
భద్రగజంబుల బంతిగాఁగట్టి
మట్టింపవలెనన్న మైలమ్మనూనుఁ
డట్టులేయని చెప్పి యంగీకరించి
తెనకు సహాయము రమ్మని నలగా
ముఁడు నానాదేశ రాజులకు

## లేఖలఁ బంపుట.

వ్రాయించెలేఖలు వసుధేశతతికి
"బ్రహ్మనాయునివద్ద బలువైనకుంత
మున్నదియనిభీతి నుర్వీశులెల్ల
నప్పనాలిచ్చినా రడిగినయట్టు
లేనును మీరలు నేకమైయిపుడు
పటువిక్రమస్ఫూర్తి ప్రకటంబుగాను
బ్రహ్మనాయునిగర్వ పటిమమాలించి
మనసులోనరమరల్ మానియుమనము
పోరాడిశత్రులఁ బోరిగొనియెదము
శ్రీగిరీశునియాన చెన్నునియాన"
అనిబాసపత్రిక లపుడువ్రాయించి
మామగుండముకోట మనుజేశునకును
* ధరణికోటపురికి దక్షుఁడైనట్టి
భీమదేవుండను పృథ్వీశునకును
గోలంకిభర్తకు ఘూర్జరపతికి
నుగనసేనుండను నుర్వీశ్వరునకు
నేకుమాఁడెములేలు నెఱుకకామునికిఁ
బొన్నాళ్ళభూపతి † పొదిలెరాజులకుఁ

---

* గుంటూరునకు 20 మైళ్ళదూరమున నుత్తరముగా సత్తెనపల్లి తాలూకాలోఁ గృష్ణానదీతీరముననున్నది. దీనినిఁ ద్రిణయనపల్లవుఁడునిర్మించెనని సంప్రదాయజ్ఞులు చెప్పుదురు. ఈ త్రిణయనపల్లవుండు క్రీ. శ. 2 వ శతాబ్దముననో 3 వ శతాబ్దముననో యుండియుండునని చరిత్రకారుల యభిప్రాయమైయున్నది.

† నెల్లూరుజిల్లాలో నెల్లూరునకు కొంచెము వాయవ్యముగా 84 మైళ్ళ దూరముననున్నది.

§ గటకాధిపతికినిఁ ¶ గల్వరాయనికి
● దేవాద్రినేలెడు తెలుఁగుబిడ్డలకుఁ
బెదబాహుభూపతి భీమసేనులకు
సూర్యకుమారాఖ్య చోళరాజునకు
సంగ్రామవిజయుఁడౌ జయదేవునకును
జయసింగునృపతికిఁ ※ జంద్రాద్రిపతికి
ధీరవిక్రముఁడైన తిరునాళ్ళపతికి
† వీరభళ్ళాణుండు విక్రమాఢ్యునకు
నరవసింగాళ్లున కర్ణమాపతికి
బంగాళపతికిని బాండ్యేశునకును
మళయాళకర్ణాట మాళవేంద్రులకు
వ్రాయించిపంపిన వారెల్లఁగూడి
చింతించిరీరీతిఁ జిత్తంబులోన
నలగామరాజును నాయునివారు
పగపెట్టికొనిపోరఁ బైనమైనారు
తనకుసహాయులై తరలిరండంచు
నయలేఖలంపెను నలగామరాజు
సవతిపుత్రులకిష్ట సమకూడఁబోరు
తీరదెవ్వారలో తెగటారుదనుకఁ
గాముఁడు గెల్చినఁ గలయప్పనములు
లేవనిపంపెను లేఖలుమనకుఁ
గదలుదమిప్పుడు కామునికడకు
వీరకామునిఁగూడి వీరయుద్ధమున
బలియిచ్చియందటి బ్రహ్మనాయకుని
పొంగెల్లనణఁగింపఁ బోలునుమనకు
ననుచువిచారించి యాప్రొద్దకదలి
భేరీధ్వనులుమించి పృథ్విగంపింపఁ
గరులుఘోటకములు కాలిమానుసులు
ధ్వజములుగొడుగులువాసిటెక్కెములు
వేలసంఖ్యలఁగూర్చి వెడలి వేగంబె

§ కటకము. ఇది గజపతిరాజుల ముఖ్యపట్టణము.

¶ కర్నూలుజిల్లాలో నంద్యాలకు 21 మైళ్ళదూరమునఁ గల్వయను గ్రామముకలదు. కల్వరాయుఁడనగా దీనినిబాలించినయతఁడేనని యూహింపవచ్చును.

● ఇది యాదవరాజుల రాజధానియగు దేవగిరియైయుండనోపు.

※ ఇదియే చంద్రగిరి. ఇది ఉత్తరార్కాడుజిల్లాలోఁ జిత్తూరున కీశాన్యమూలగా 29 మైళ్ళదూరములోనున్నది. యాదవరాజులలో నొకఁడయిన యిమ్మడి నరసింహభూపతిచేఁ గ్రీ. శ. 1000సంవత్సరమునఁ గట్టఁబడినదని చెప్పఁబడు నొకప్రాఁత కోట యిప్పటికిచటఁగల యొక కొండమీఁదనున్నది.

† ఈతఁడు క్రీ. శ 1173-1224 వరకు ద్వారసముద్రము రాజధానిగా రాజ్యముచేసెను. ఇతనిపూర్వులు చళుక్యరాజులకు సామంతులుగా నుండిరికాని యితఁడు స్వాతంత్ర్యమువహించెను. ఇతఁడు రెండవ వీరభళ్ళాణుఁడు. See "Thompsons' History of India".

పెక్కుదిక్కులనుండి తెంపునవచ్చి
తీరైనచోటుల దిగియుండిరప్పు

### నలగాముఁడు నిజబలంబును యుద్ధమునకై సన్నద్ధపఱచుట.

డంతటనలగాముఁ డధిక మోదమునఁ
గొల్వునకేతెంచి గురురత్నమయత
నలరుపీఠంబున నాసీనుఁడగుచుఁ
దనమంత్రివరుల హితప్రకరమును
బాలెగాండ్లదొరల బంధువర్గమును
బడవాళ్ళఁబిలిపించి సైనముల్ చెప్పి
రేవంతతుల్యులౌ దృఢశౌర్యయుతుల
రాహుత్తనిచయముఁ రమ్మని చెప్పి
విజయునికీడైన విలుకాండ్రగములు
బంతినిభుజియించి పావలుదొడిగి
గ్రురునఁదేన్చుచుఁ గరములపైనిఁ
బిగిలిపిట్టలునుండఁ బెద్దసావళ్ళఁ
జేరిభాషింపుచుఁ జెలఁగిదుప్పటుల
సొగసొప్పఁగప్పుక సూరెలనుండ
బొట్టెలువిడియముల్ పొందించియివ్వ
మీసముల్ మెలిపెట్టి మీదికెత్తుచును
గడ్డముల్ నివురుచు గంభీరమొప్పఁ
గదనంబుచేసెడు కథలుసెప్పుచును
మూఁకలైయుండెడు మూలబలమును
ధాన్యముల్ గొనువారి ధనవేతనముల
నెలగోలుప్రజలను హెచ్చువంటర్లఁ
బిలిపించివారికిఁ బ్రియములుచెప్పి
సైనంబుగమ్మని పల్కెనంతటను
వారెల్లరోసంబు ప్రకటముగాఁగఁ
బంతముల్ మీఱంగ బలువిడిమెఱసి
సురియలుపరిఘముల్ శూలసంఘంబు
ప్రాసముద్గరములు పటుఖడ్గచయము
పేరైనచక్రముల్ భిండివాలములు
పరశువుల్ బల్లెముల్ బాఁకుకటార్లు
శార్ఙ్గముల్ ధనువులు శరధులుదాల్చి
నియతిచేనందఱు నిజశక్తి మెఱయ
నలగామరాజుకు నమ్రులై నిలిచి
గటుమీదభూపాలుఁ డానందమొప్పఁ
దోడువచ్చినయట్టి దోర్బలఘనులఁ
బటుపరాక్రములను బార్ధివేశులను
బిలిపించివారికిఁ బ్రియములుసెప్పి
మనముచేరఁగవలె మనవారితోడ
గరిమఁగార్యమపూడి కదనరంగంబుఁ
బైనమైరావలె వడితోడమీరు
ఘనతరసుముహూర్తకాలమునందు
భేరీనికరమునుఁ బెద్దడమాయి
నిచయంబుమ్రోఁగింతు నిఖిలంబెఱుంగ
ననుచుఁజెప్పినరాజు లరిగిరందంద
యితరభృత్యసమూహ మెల్లనువేడలఁ
జయ్యనఁబురిలోనఁ జాటఁగాఁబంచి
నలగాముఁడంతట నాగమతోడ
ఘనవాజిశాలల కడకునేతెంచి
వాజులనెల్లను వరుసనుజూచి
సాహిణిజనములఁ జయ్యనఁబిలిచి
పరఁగగుఱ్ఱాలను భద్రంబుచేసి

సైనమ్ముగమ్మని పలికెనంతటను
గాంచనవరత్న ఖచితమైనట్టి
పక్కెరల్ పైఁగట్టి బంగారుకుప్పె
కుచ్చులుజల్లులు కూడిగ్రేలాడ
శార్ఙ్గశరధిఖడ్గ శరములనున్న
వజ్రాలురత్నముల్ ప్రభలదీపింప
ముఖమాలుపట్టులు మొగములఁగట్టి
యందెలుపదముల నాయత్తపఱచి
పుత్తడిగజ్జలఁ బొందికచేసి
కంఠదేశములందుఁ గట్టియీలాగు
సకలజాత్యశ్వాల సవరణచేయ
రాతులఁబిలిపించి రమణీయమైన
వస్త్రంబులిప్పించి వారలందఱికి
వాజులరౌతుల వన్నెగాఁదీర్చి
కుంజరతతులను గుంపులుచేసి
పట్టుబొందులజోళ్ళ బలుసైనయట్టి
గజ్జలపేరులు గంటలుదెచ్చి
గజములకెల్లను గట్టంగఁజేసి
యంకుశంబులఁబట్టి యలరుమావంతుల
గొనకొనిరమ్మని కోపించిపలికి
ఘనమైనశూలాలు గట్టినయట్టి
శకటసమూహంబు సాగించిపిదపఁ
బలుగుడారంబులు బరువులుమోయ
నెద్దులనొంటెల హెచ్చైనయట్టి
వేసడంబులనెల్ల వేగంబపూన్చి
తర్లించికొనిపోవఁ దగిలియున్నట్టి
కొట్టికాండ్రనుబిల్చి గొబ్బునఁజెప్పి
తరువాతనలగామ ధరణీశ్వరుండు
జోస్యులఁబిలిపించి సుముహూర్తమడిగి
భేరీఘుమామికల్ పెల్లుగామ్రోఁగఁ
జేయింపుమనియంతఁ జెప్పిపంపించె
వానిమ్రోయించెడు వారలుపటిమఁ
జఱచినభేరుల సాంద్రనాదంబు
విన్నవారలకెల్ల వీనులుపగిలె
నాకాశమంతయు నదరంగఁగడఁగె
ధరణీధరంబులు తల్లడంబంది
గుహలనునోళ్ళతోఁ గూయంగసాగె
ఘనముగాభూస్థలి కంపింపఁదొడఁగె
దిగ్దంతులుముడింగె దిక్కులుమ్రోసెఁ
దపనతురంగముల్ తప్పెమార్గంబు
నెటువచ్చెనోయని యెల్లదిక్పతులు
తెలియకభ్రాంతిచేఁ దికమకపడిరి.
అప్పుడునగరున కరిగియారాజు

## నలగాముఁడు గజారోహణంబొనర్చి యుద్ధభూమికిబయలుదేరుట.

కాలోచితములైన కర్మముల్దీర్చి
పూసియుఁదొడిగియుఁ బొందించికట్టి
సకలశృంగారంబు సమ్మతిఁజేసి
సర్వబలంబులు చనుదెంచినిలిచి
తొలఁగిరినృపతికి దూరంబుగాను
మావంతులప్పుడు మదముననిలిచి
పరవారలకునెల్ల భయములుసేయు
బహుతరోన్నతమైన భద్రగజంబు
పైనిఁబల్యాన్నెలు పరఁగుచునున్న
తగటుపటంబులు దంటగాఁజేసి

కూర్చినగంతలు కదురుగా వెన్ను
పైఁగప్పిముఖమాలు పఱుపులు వేసి
పదునాఱువన్నియ బంగారుతోడ
రచియించిదానికి రత్నముల్ తాపి
తీర్చిన * చాడోలు తెచ్చియాఁగట్టి
మణిగణతపనీయ మయమైనయట్టి
చప్పరంబొక్కటి సమకూర్చిమీదఁ
బద్మరాగప్రభా పటలిచేమించు
బంగారుశిఖరంబు బాగుగనిలిపి
గంటలుమువ్వలు గట్టిగాఁగట్టి
చుట్టుముత్యపుచేర్లు శోభిల్లఁజేసి
మణిమయమంజరి మధ్యవ్రేలాడఁ
జిఱుతగంటలపేర్లు చెలువైనకరికిఁ
గరమునందునఁజేర్చి ఘంటసంధించి
పంచవర్ణాల్ ఫాల భాగమందుంచి
ముత్యాలజల్లుల మొనసినపటము
కుంభస్థలంబునఁ గొమరొప్పఁజేసి
శుభ్రదంతంబుల శోభిల్లునట్టి
తపనీయవలయముల్ ధట్టించిమొనల
ఘనశితశస్త్రముల్ ఘటనగావించి
బంగారుగొలుసులు పదములఁగట్టి
గంటలుప్రక్కల గణగణమ్రోయఁ
దొండంబుగొలుసుల తోడగంజిల్ల
శృంగారమీరీతి శీఘ్రమెచేసి
మావంతుఁడెక్కియా మనుజేశునకును
జేయించెవినమతఁ జెలువంబుమించఁ
గూర్చుండఁగాఁజేసెఁ గుంభిణినప్పు
డంతటపరిచరుల లతివేగమునను
బుత్తడినిచ్చెనఁ బొంగిక సేయు
సేవకుఁడొక్కఁడు చేదండయివ్వ
ఘనకరీంద్రమునెక్కెఁ గామభూవిభుఁడు
వెనుకనొక్కరుఁడుండి వినయంబుతోడ
విడియంబొసంగుచు వింజామరములు
వీచెశీతానిలా న్వితునిఁజేయంగఁ
దరువాతలేచెను దంతావళంబు
హేమదండంబుల నెసఁగుచునుండు
మౌక్తికచ్ఛత్రముల్ మనుజేశునెడుటఁ
బట్టిరిబహుకాంతి పటలిమిన్నడర
ధ్వజములు టెక్కెముల్ తఱచుగానొప్పె
నయిదువిధంబుల నమరువాద్యంబు
లధికరవంబుల నానందమొసఁగ
దళములతోఁగూడ ధరణీశవితతి
దిక్కులెల్లనుగ్రమ్మ తిన్నఁగానడిచెఁ
దరువాతనెలగోలు దళములుగదలెఁ
గదలిరదండును గైజీతగాండ్రు
బలమునల్దిక్కులఁ బటిమతోనడిచె
బహుమిత్రవర్గంబు బంధుజనంబు
మంత్రిపురోహితా మాత్యులతోడఁ
బచ్చలుతాపిన పాలకినెక్కి
నరసింగుఁడరిగెను నాథునివెనుకఁ
బడవాళ్లుబలములు పదపదమనుచు
బహుతరధ్వనులచేఁ బలికిరిహెచ్చి

---

* ఏనుఁగువీఁపుపైఁ గూర్చుంచుటకై యమర్పఁబడు తొట్టి.

వేత్రహస్తులుచేరి విదళింపగాను
సందడియెడగల్గి జరుగంగసాగె
సరిచుట్టుశతదండ సంఖ్యనూగంబు
పొతుటీఁగన్నైనఁ బోవీలులేక
యధికమహాబలమెల్ల నరుగుచునుండె
గుఱ్ఱముల్ గజములు గుంపులుగూడి
పక్షభాగంబుల వచ్చుచునుండె
మధ్యరాజెక్కిన మత్తగజంబు
సందుగానివ్వక జరుగంగసాగెఁ
దురగ హేషారవ స్ఫూర్తులుమించె
గజములుఘీంకార ఘోషంబులాయె
ఘనతరోత్సాహులు కాలిమానుసులు
నట్టహాసంబుల నమరిరావేళ
గొప్పగుఱ్ఱంబెక్కి నడిభాగమందు
జగడంబుచేసెడు చాతుర్యమెల్ల
నయగతిఁదెల్పుచు * నాగమనియె
నగరంబువెల్వడి నలగామరాజు
దక్షిణదిశయందుఁ దనరెడుబయల
† మాబచెఱ్వనెడును తుంగభూస్థలిని
నిలిపెంచెగజమును నిండినవేడ్క
వెంబడివచ్చిన విప్రులనెల్ల
వినయతఁబొమ్మన్న వేడ్కతోవారు
పగవారినెల్లను బలిమిమైగెల్చి
సకలరాజ్యములు వశంబుచేసికొని
యేకాధిపతివౌచు నేలుభూస్థలము
ననుచుదీవనలిచ్చి యరిగిరివేగ
నిజమనోవిశ్వాస నీయులైనట్టి
బలములోఁజేరిన ప్రౌఢనాయకులఁ
బిలిపించివారికిఁ బ్రియములుపలికి
కస్తూరికాగంధ కలితులఁజేసి
తాంబూలములనిచ్చి ధైర్యంబుసెప్పి
నగరంబుకోట క్రన్ననమీరలంత
పగలురేయియుఁ బారపాటులులేక
కాపాడవలెమీర కలవారుమాకుఁ
గదయనిపొమ్మన్నఁ గదలిరివారు
పిమ్మటనాగమ పేరుపేర్వరుస
నధికారులనుబిల్చి యనియెవారలకు
గొల్లెనల్ మొదలైన గురుతరభార
నిచయంబులెల్లను నించినబండ్లు
శస్త్రాస్త్రచయమయ శకటసంఘంబు
సకలవస్తువులచే సాంద్రమైనట్టి
నానావిధంబుల నాణెంబులుండు 7/10
మందసంబులుగట్ట మసలకమోయు
వేసడంబులనిచ్చి వీరసేవకుల
జీతపురోగముల్ చేతిలోవేసి
వెంటనెపంపుఁడి వేగంబెమీర
లనవిని వారలు నరిగిరివేగఁ
దరువాతఁగాముఁడు తగలించెఁగరిని

---

* ఈమెనే నాయకురాలనిచెప్పుదురు. ఈమె నలగామరాజుయొక్క ప్రధాని. అతి శూరురాలు.

† ఇప్పటికి నీచెఱువు గురిజాలకు దక్షిణభాగమునఁ గలదు.

హయములుకాల్బలం బాజ్ఞతోనడిచె
బలపాతసంఘాత భవధూళిచయము
మేఘమార్గంబందు మేదురంబాయెఁ
దపనునిహయములం థతవహియించె
నఖిలదిక్కులయందు నమరెఁజీఁకట్లు
బలములునడుచుట బహుకష్టమాయె
ఝళిపించుకత్తుల సాంద్రతేజంబు
మణిగణభూషణ మంజుదీధితులు
నంతటంతట మార్గమట్టెచూపించె
నవనీస్థలముగ్రుంగ నాదిశేషాహి
సిగ్గుచెందినయట్లు శిరములువంప
దిగ్గజంబులుగ్రుంగ్గ దిశలుగంపింప
భటులుబిరుదముల పద్యముల్ చదువ
నఖిలయాచకకోటి కానందముగను
దానంబులిచ్చుచుఁ దరలియాప్రొద్దు

నలగామునికి గజాయాధుఁడై సేన
తోఁగూడి కార్యమపూడికేగుచుం
డఁద్రోవలోఁగోదమగుండ్ల పౌరులు
విన్నపంబొనర్చుట.

కోదమగుండ్లకుఁజేరఁ గుంభిణీశుండు
పేర్లైనపల్లెలఁ బెద్దలౌరిష్టు
కోమటిజనములు కూడియేతెంచి
కామభూమీశునిఁ గనుఁగొనిమ్రొక్కి
విన్నవించిరిమహా వినయంబుతోడ
మామాటవినఁదగు మైలమ్మసుతుఁడ
వైరంబుమీకేల వసుధాధినాథ
అన్నదమ్ములుపూర్వ మవనియేలుఁగఁ
గలహించిమడిసిరి కదనంబులోనఁ
బగలేకయేలుట బలిమిమీకెల్లఁ
బ్రజలకుసుఖమౌను బరులుతగ్గుదురు
బిడ్డలవిధమునఁ బ్రీతితోమమ్ము
రక్షింపుచున్నారు రాజులుమీరు
కలహించిమడిసినఁ గదనంబులోన
నితరరాజులుమాకు నేరునచ్చెదరో
మీరురాజ్యముసేయ మేదినియందు
దుష్టులనిర్భయా త్సుకతనశించె
శిష్టులకును మేలు చేకురుచుండెఁ
బ్రాణముల్ భద్ర ముపద్రవమడఁగెఁ
గరములు హెచ్చుగఁ గైకొంటలేదు.
అనుకూలులైమీర లవనియేలంగఁ
గనుఁగొన్నమాకెల్లఁ గలుగుశుభంబు
హితులముగనుకమీ కిటుగఁజెప్పితిమి
శక్తిచాలదుమాకు సారెకుఁజెల్ప
నవిన్నవించిన నవియెవారలకు
మదమునగర్వించి మలిదేవరాజు
రణముసేయఁగఁదర్లి రమ్మనిమాకు
భట్టునుబంపించె బలిమెఱుంగకయు
పైనమైవచ్చితి బవరంబుచేయ
వీరులనాయుని వెసమలిదేవు
బంధుమిత్రాదులఁ బారిపోఁద్రోలి
వేగమెవత్తుము విభవంబుమెఱయ
నెలమితోనుండుఁడి యిండ్లలోనిలిచి
యీరీతివారికి హితములుచెప్పి
పొమ్మన్నవారలు పోయిరావేళ

మరునాఁడు నలగామ మండలేశుండు
మనమున రోషంబు మల్లడిగొనఁగఁ
గాలోచితంబైన కర్మముల్ దీర్చి
ఘనతరశృంగార కలితుఁడై వెడలి
భద్రదంతావళి నైనఁగూర్చుండెఁ
దమ్ముఁడు నరసింగ ధరణీశ్వరుండు
వెలమిగోఁ బాలకి నెక్కి వెంబడిని
స్థిరగతి బలములు చెలఁగఁగ వేగ
నాల్పులబొబ్బల నవనికంపింప
సాగరము పొంగి చను దెంచినట్లు
మేసముల్ వినువీధి మేదురంబగుచుఁ
బరువులు వెట్టెడు భంగిని దోఁపఁ
గ్రమ్మక కార్చిచ్చు కదిసినరీతిఁ
బవనుఁ డుద్దిష్టమై పాఁగినమాడ్కి
వివిధబలంబులు వేగ మెనడిచెఁ
జక్కఁగా మిరియాల సరిహద్దు దాఁటి
ప్రజల మేలిమి చింత పల్లెయు దాఁటి
కౌరవుల్ పాండవుల్ కలహంబొనర్చి

### నలగాముఁడు కార్యమపూడిఁ జేరుట.

కూలి వచ్చినయట్టి కురుభూమిరీతి
రౌద్రగుణోద్రేక రక్తసిక్తంబు
పావనచరితంబు పలునాటి పేరఁ
బొలుపొందు నుండెడు పుణ్యదేశమునఁ
గాశీసమమైన కార్యమపూడి
రణరంగ భూమిని రాజు దానిల్చి
భద్రదంతినిడిగ్గఁ బదిలంబుగాను
జవ్వాక మేర్పడ సరసంపుభువిని
హేమకుంభంబుల నెసఁగుచునున్న
పలుకుటీరంబులు పన్నగఁ గట్టి
మూలబలంబులు మొనగాండ్రు వచ్చి
కూర్చున్న, ఘనమైన గొల్లెనల్ నిలిపి
హేమసింహాంకంబు నెసఁగఁగానట్టి
బలుధ్వజస్తంభంబుఁ బట్టిరి మోలఁ
గప్పురపు విడెంబుఁ గావించివచ్చి
కొల్వుకూటంబునఁ గూర్చుండె రాజు
దాపటనగ సభాధవుఁడును దొరలు
కొండమన్మెమరాజు కోటకేతుండు
కుడిదెస రెడ్డియు గురిదైనయట్టి
చేరువకాండ్రును జేరికనలఁ
వీరఘంటలుగట్టి విలసిల్లుచుండు
సోమదేవరరాతు శూరులైనట్టి
వీరరాహుత్తులు వెలయమున్నాట
యాలువదిసంఖ్యలై యట్టహాసముల
రణశూరులైనట్టి రాజపుత్రులును
బోటుబంట్లను బట్టి పొడిచెడువారు
నూఁడిగలందంద యొనరి కొల్వంగ
దేవతాగణయుత దేవేశురీతి
భూపతిసభయందుఁ బొల్పొందుచుండె
రాజు వెన్కంజేర రమణి నాగమ్మ
కార్యఖడ్గముల ప్రజ్ఞావిశేషములఁ
దెలుపుచుఁ గూర్చుండె ధీరతతో డ
నితర బలంబులు హెచ్చు వేగమునఁ
దగ్గెడువారునుఁ దగనడ్చువారు

విడిసెడువారలై విరివైనచోట్లఁ
దగినతావులయందుఁ దప్పకనిల్వ
మూఁడుసహస్రముల్ ముఖ్యులౌబంట్లు
సమరకంఖాణముల్ సప్తశతములు

### వివిధదేశ రాజులువచ్చి నలగాము భూపతిని గలిసికొనుట.

లలిమీఱ వీరఘట్టాణుండు వచ్చెఁ
ఉరువిక్రమాఢ్యులు పంద్రెండువేలు
గడలవారొకవేయి గజచయమమరఁ
బొన్నాళ్లవిభుఁడు సముద్వృత్తివచ్చెఁ
బదినాఱువేలకాల్బలములతోడఁ
గూడిముప్పదివేల కుంజరావళులఁ
గదిసెమాళవపతి కామభూవిభునిఁ
గడఁగితొమ్మిదివేల కాలరిబంట్లు
నమ్మఁదగినయట్టి నాయకచయము
నొకవేయియశ్వాల నొనగఁ * ప్రతాప
రుద్రుఁడుపంపించె రూఢసంగతిని
బదివేలకాలరి బలములతోడ
ముదమునఁ బ్రాచిదేవుండునుఁగలసె
నీలిపెక్కెంబుల నేర్పైనబంట్లు
వెంటరాబంగాళ విభుఁడునుగలసె
గజములుపదివేలు ఘనమైనబలము
నిరువదివేలతో నేతెంచె § నొడ్డె
భువి నేలు † బలదేవపురుషోత్తముండు
పదివేలతురగముల్ బంట్లొకలక్ష
కూడిరాఁగల్యాణ ఘూర్జరపతులు
కామునిఁగదిసిరి గౌరవమెసఁగ
ధనధాన్యుఁడువచ్చె దర్పంబుమీఱ
మహిదేవిదాసుఁడు మదకరుల్ వేయి
శకటసహస్రముల్ చనువునఁగొలువ
నేతెంచెసాహస మెల్లవారెఱుఁగఁ
బదిలక్షబలము త్సవమునఁగాఁగ
ద్రావిడకేరళ ధరణీశవరులు
వచ్చిరినలగామ వసుధేశుకడకుఁ
బద్మసేనుండునుఁ బరువడివచ్చె
గురుసహస్రద్వయ ఘోటకయుతుఁడు
గుండమదేవుఁడు గొబ్బూరిరాజు

* ఇతఁడు, ప్రతాపరుద్రీయకృతిపతియై క్రీ. శ. 1295 సం॥ మొదలుకొని 1323 సంవత్సరమువరకు రాజ్యముచేసి, రుద్రమదేవికి దౌహిత్రుఁడై ప్రఖ్యాతివడసిన ప్రతాపరుద్రుఁడు కాక, కాకతిప్రళయునితరువాత సింహాసనమెక్కి క్రీ. శ. 1140 సం॥ మొదలుకొని 1199 సం॥ వరకు రాజ్యముచేసి మొదటి ప్రతాపరుద్రుఁడని చరిత్రయందుఁ బేర్కొనఁబడు రుద్రదేవరాజై యుండవలయును.
Vide "Somadevarajeeyam"

§ ఓఢ్రశబ్దభవము "ఒడ్డె" దీనినిప్పుడు "ఒరిస్సా" యందురు.

† ఓఢ్రదేశమునుఁబాలించిన గజపతిరాజులలో నితఁడొకఁడు.

మొదలయినరాజులు ముఖ్యులౌబంట్లు
నేనూఱుతోఁగూడ నెనుబదిమీద
నెనుబదివేలతో నేతెంచిరపుడు
తక్కినరాజులు తమతమబలము
లెసఁగఁగ నేతెంచి రివ్విధంబునను
వచ్చినబలముల వరుసగణింప
బుద్ధిమంతులకైనఁ బొందదు నేర్పు
సంతోషములచేతఁ జనుదెంచినట్టి
మనుజేంద్రులనునెల్ల మంచికట్నములు
తెప్పించియిచ్చెనఁ దిన్నగానండి
గంతటనాగమ్మ గర్వంబు నెక్కి
తగినయీవులు చేసె ధరణీశతతికి
మిగిలినవారికి మేలైనతావు
లమరిచి విడియించె నానంద మొంద
నెక్కుడమాచిన నెడలేక కగిసె
నిసుకఁ జల్లిననైన నిలమీదఁ బడదు
చోరదు వాయువు దండుఁ జొచ్చినగాదు
సుపథంబు దోఁకదు చోద్యమైయుండు
నాదండులోపల నఖిలవస్తువులు
సకలధాన్యంబులు సకలరత్నములు
బంగారువెండియు బహుధనవితతి
సరిగవస్త్రంబులు సరసపుంబట్టు
పటములు ఘనతంతుపటములు మఱియుఁ
గాంస్యగజతతామ్ర కలితభాండములు
రసవర్గములనెల్ల రంజకంబొప్ప
విక్రయాక్రయముల వెలయింతురపుడు
సౌందర్యసునతచే సంపన్నమైన
వేశ్యవాటికలొప్పు విశదంబులగుచు
దారిద్ర్యమనునది దండులో లేదు
ధనధాన్యవృద్ధిచేఁ దనరెడులక్ష్మి
వేలంబులోపల విలసిల్లుచుండు
నంతటబహువిక్రమాఢ్యమానసులు

### వీరులు తమకు యుద్ధమునకాజ్ఞ నిమ్మని బ్రహ్మనాయునిఁ దొందరించుట

ఖండనవిజయులు పటుపరాక్రములు
వీరులుతత్సైన్యవిధమెల్లఁ జూచి
బ్రహ్మనాయునితోడ వాక్రుచ్చిరట్లు
నలగామభూతల నాయకుండుమదినిఁ
దనకెవ్వరెదురని ధైర్యంబుపూని
ఖండనవిజయతఁ బ్రబలుదునంచు
భువనభయంకర భూరిప్రతాప
వంతుఁడవైనట్టి బ్రహ్మనినున్ను
విజయోద్ధతాటోప వీరులమమ్ముఁ
దలఁపకమాత్సర్య దర్పముల్ మీఱ
వీపునెదురెక్కె వెఱవకనిలిచెఁ
గనియూరకుండుట కార్యంబుగాదు
పందలవలెనుంట పంతంబెమనకు
ననివార్యమైనమీ యాజ్ఞాధీన
బద్ధులమైనిల్వఁ బడితిమిగాక
కత్తికిమొక్కక కండనుఁదీసి
పరిపంథిగణములఁ బట్టిమర్దించి
నమ్మగామునునందుఁ గుటిలతఁగచ్చ

ఫలము వేసినభాండ పటంబువగిలి
పెంకులై పడ్డట్లు పెనుకంప మొంది
విడిబడియేనుఁగుల్ వీధులఁ బార
సకలబలంబుల సమయించి యముని
పురికంపియుండ మే భుజశౌర్య మొప్ప
నేమివిచారించి యిటులుంటిరయ్య
శెలవిచ్చి పంపుము శీఘ్రమె మమ్ము
నావుఁడు శీలమ నాయఁడు వలికె

## బ్రహ్మనాయుఁడు వీరులతోఁ దొందరపడవలదని నీతులుపదేశించుట.

వినరయ్య వీరులు విశదంబుగాను
విదితస్వశక్తినై విశ్వాసమున్న
నెదిరిసామర్థ్యంబు తృణముగాఁ దోఁచు
(సహజగుణంబది జంతులకెల్లఁ)
గానఁగా మేకుండు గదిసెనుమనల
నలగాముని నిందింప న్యాయముగాదు
రణకేళిసల్పుట రాజధర్మంబు
మనకున్న బలముల మనముగూర్చికొని
పోయిశత్రువులనుఁ బోరిగొనవలయు
సాహసంబొనరింపఁ (జనదన్ని పట్ల
సర్వకార్యములొక్క చాయనరావు
హెచ్చైనతనబల మెదిరిబలముల
కొలఁదులుపరికించి కొఱఁతలుండినను
సవరించిసకలంబు సన్నద్ధపఱచి
చిత్తంబునందన్య చింతలుమాని
కార్యైకబుద్ధితోఁ గదనరంగంబుఁ
జేరంగబోవుట స్థిరవిచారంబు
నేనుమీయుత్సాహ నిర్మలస్ఫూర్తి
తగ్గించినానని తలఁపఁగవలదు
తమకింపఁగూడదు తటియగుదనుక)
నావుఁడుకొమ్మ భూనాథుండుపలికెఁ
బలికెదుచల్లని వాక్యంబులిపుడు
కొడుకునుఁబగఱచేఁ గోల్పోయినట్టి
దుఃఖంబుమదిలోనఁ దొరలుచునుండ
నలగాముఁజంపక నామదిచింత
వాయదునీవెన్ని పలికిననైన
నెవ్వరుతనకెదు రీభూమినంచు
జగడంపుడేగాలు సరవినెత్తించి
యున్నాఁడుమనమీద నుగ్రతేజమునఁ
గమలబాంధవవంశ కర్తయైనట్టి
* బలభద్రరఘుపతి పంపుననిప్పు
డలచియునొకశరం బారాజుకడకు
నంపిననిలిచిన నతఁడు నాసాటి
చెడినిగ్గిపడెనేని క్షితిభర్తగాను
నుమ్మనియాకొమ్మ శూరుఁడుపలికి
గాండీవసమమైన ఘనచాపమెత్తి
వాసుకికోరల వాఁడిగలట్టి
దొనలను మెఱయఁగఁ దూణంబెతివిచి
వెలయంగముత్యాల పేరులల్లాడ
నలుగునమణిగణం బమరంగముఖము
మధ్యాహ్నభానుని మాడ్కిఁగన్పట్టి

* ఇతఁడు కొమ్మరాజుయొక్క ధనుర్విద్యాగురువై యుండును.

శరముఁజాపంబునఁ జయ్యనఁదొడ్గి
కర్ణపర్యంతంబు గ్రక్కునలాగి
కోపంబుమించఁగాఁ గోయనియార్చి
కనుగవదృష్టినిఁ గదలకనిలిపి
వీఁకతోమంటలు వెళ్ళఁగాయుచును
బాణమువిడిచెను పటిమకావేళ
నక్షత్రములుడొల్లె నాగేశుఁడళికె
నవనియుఁగంపించె నాకాశమదరెఁ
గనురెప్పపాటున కంటె వేగమునఁ
బిడుగుపడ్డట్లుగాఁ బృథ్వీశుఁడట్టఁగ
ఘనమైనగొల్లెన కంబంబుఁదాఁకె
నదియంతతునకలై యవనిపైఁబడెను
బసిఁడికుండలుదొల్లి పడెగుడారంబు
లానందమునవార లఱచిరిమించి
విడిబడియేనుఁగుల్ వీనులఁబాఱె
నశ్వముల్ రంహతుల్లరిగిరిచెదరి
బండ్లతోనెద్దులు పరువిడసాగె
సాలగుఱ్ఱంబులు సరభసమంది
కట్లుతెంచుకపారి గట్లపాలాయెఁ
గోల్పడిగాలుపట్టు గొడుగులనెల్లఁ
బట్టెడువారలు పడవైచిచనిరి
కల్లోలమందుచుఁ గామునిబలము
భయమునఁజనిచింత పల్లియుఁదాఁటె
వీరకామేంద్రుండు వేత్రపాణులును
పడవాళ్ళనంపించి భయములఁదీర్చి
జనులనుఁబిలిపింపఁ జయ్యనవచ్చి
తమతమతావులఁ దగనుండిరపుడు
వీరులందరుతమ వేలంబులోన
నిలిచిరిసంతోష నిర్మలమతుల
ధీవరులైన జ్యోతిషికులనపుడు
పిలిపించిబ్రహ్మన్న ప్రియములుచెప్పి
సమరముచేయఁగ సరసమైనట్టి
సుముహూర్తమొక్కటి శోధింపుఁడన్న
నారీతిచూచెద మందులకేమి
క్షీరాబ్ధిశయనుఁడు శ్రీసతీధవుఁడు
దాసరక్షణమందు దయగలవాఁడు
చెన్నుఁడుమీవెంటఁ జేరియున్నాఁడు
సకలకార్యంబులు సమకూరుచుండు
నని చెప్పిదీవించి యరిగిరివార

## ఈసమయమున మేడపిలో జరిగిన వృత్తాంతము.

లంతట మేడపినైనవార్తలును
†దెలుపుమజనులకుఁ దెల్లముగాఁగఁ
బగమోత్సుకతచేత ¶బాలచంద్రుండు
సంగడిబాలుర దనువునఁగొలువ
రమణీయమైనట్టి రాచిల్కచదువు
వినుచువేడుకపుట్టి విచ్చలవిడిని
గుమ్మడికాయలు కొంతసేపాడి

† ఇది కవివచనము.

¶ బ్రహ్మనాయునికొడుకు.

చెలువలపందెంబు చెల్వొప్ప గెలిచి
తనసంగడీలకు దయతోడ నిచ్చి
తమ్ములు వెంటరా ధామముఁ జేరెఁ

### అనుజులతోఁ గూడి బాలచంద్రుఁడు తల్లియైన ఐతమ్మవద్దకు వచ్చుట.

దల్లినీఁ గనుఁగొని తనయులందరును
మ్రొక్కినదీవించి ముదమునఁ దల్లి
పలికె నీవిధమున వారలతోడ
నాయాత్మసుతులార నాయన్నలార
పద్మనాభునిగర్భ పాథోధియందుఁ
బూర్ణచంద్రులరీతిఁ బుట్టినవారు
ఘనమైనభూషణ కాంతులుమీఱ
మీరన్నదమ్ములు మేలిమినాడు
నెదుటనునిల్చి నన్నేమివేడెదరు

### ఐతమ్మ బాలునిమనోరథముఁ దెల్పుమనియడుగుట.

చిత్తంబులోఁగోర్కెఁ జెప్పుఁడియనిన
నవ్వుచుబాలుఁడు నాతికిట్లనియెఁ
దగుణిరో మేమునీ తనయులమగుట
సకలవైభవములు సమకూరెమాకుఁ
బ్రియముతో మమ్ములఁ బెంపుసేయంగఁ
బ్రొద్దుపోదేమిటఁ బోసఁగగనన్న
ముద్దులకొమరుని మోమువీక్షించి
ప్రొద్దుపోవకయున్నఁ బుత్రరత్నంబ
పోఁకలాటలచేతఁ బుచ్చుముప్రొద్దు
నాడుఁడిముత్యాల నమరుబంతులును
గుంతమాపలనాడి కొనిగెల్చికొనుము
పైటనాడఁగవద్దు బడలెదుసుతుఁడ
కుటిలజంతులఁదెచ్చి గుడిలోననుండి
విడిపించిపోరాడు విధమునుఁ జూడు
రూఁకలకుప్పలు గూఢిగనాడు
మనినతల్లిరొవాని నాడితిమమ్మ
వానిపైనిష్ఠాస పడదుచిత్తంబు
క్రొత్తలపైన మక్కువగల్గియుండు
ననిబాలుఁడాడిన నైతమ్మపలికె

### భారతయుద్ధాదికథల వినుమని యైతమ్మ బాలచంద్రునికిఁ జెప్పుట.

నాటపాటలపైన నలసితివేని
వినవయ్యబాలుఁడ విశదంబుగాను
విద్వాంసవిప్రులఁ బిల్వఁగఁబంచి
వినుముభాగవతంబు విజ్ఞానమొదవ
భారతరణకథఁ బాటించివినుము
భీష్ముఁడొనర్చిన వివిధశౌర్యముల
నచలితబుద్ధితో నాలింపుపుత్ర
ద్రోణుండు నెఱపిన దోర్బలగరిమ
మనమునఁబట్టింపు మానితసుతుఁడ
కర్ణుండుచూపిన ఘనపరాక్రమము
సూక్ష్మంపుబుద్ధితోఁ జూడుముతనయ
శల్యునియందున్న శస్త్రనైపుణియుఁ
జాగరూకతమెయిఁ జర్చింపుకొడుక
దుర్యోధనునిమాన ధూర్వహాపటిమ
యాసక్తితోడుత నగయుమాత్మజుఁడ

చాపంబువిడిచిన సవ్యసాచికినిఁ
గృష్ణుఁడు చెప్పిన గీతలయందుఁ
గర్మగహాస్యముల్ గాంచుకుమార
నేర్చినవానిని నేరుపుమీఱ
ధృష్టధైర్యమున నాచరింపఁగవలయు
ననినమాటలువిని యెత్తమ్మతోడ
బాలుఁడిట్లనియెను బకపకనవ్వి

### బొంగరములాడుట నిజమనోరథం బని బాలుఁడు తెల్పుట.

వినవమ్మతల్లిరో విమలేందువదన
ధర్మార్థకామ తత్వంబెఱుంగుదును
శాస్త్రజాలంబులఁ జాలఁగవింటి
మనమునఁదెలిసితి మర్మంబులెల్లఁ
బ్రస్తుతబాల్య చాపల్యంబుకతనఁ
జిత్తవిశ్రాంతికై చేరియీవేళ
బొంగరాలాడఁగ బుద్ధిజనించె
సెలవిచ్చిపంపుము శీఘ్రమెయమ్మ
నీరీతిఁబలికిన నేణాక్షికలఁగి
వెఱచియువెఱవని విధమునననియె

### బొంగరాలాడవలదని తల్లి బాలునికిఁజెప్పుట

విశదంబుగాబాల వినుముద్దతనయ
ఈబుద్ధితలఁపఁగ నిచ్చలోవలదు
వలసలోనున్నాము వడిబొంగరాల
నాడినఁజేతప్పి యతివలకైనఁ
దగుబాలురకునైనఁ దాఁకునుబోయి
పడఁతులుకోపించి పలుతెఱంగులను
శపియింతురీమాట సత్యంబుపుత్ర
శాపింపఁబడుటను సాహసమేల
నామాటఁగడచుట న్యాయంబుగాదు
నాథుఁడుబాలుఁడు నాతికిట్లనియె

### బాలుఁడుతల్లిమాటలకుఁ బ్రత్యుత్తరంబు సెప్పుట.

ముదితరోనావంటి ముద్దులసుతులు
పుట్టరాభూమినిఁ బుణ్యాంగనలను
వారేలశపియింత్రు వనితరోనన్ను
నలిగితిట్టినఁబాప మనుభవమగును
బూబోఁడినాదేహ పోషణార్థంబు
పెట్టనితావులఁ బెట్టిదాఁచెదవు
కొదమసింహముతన గురుశౌర్యమమర
ధరవిజృంభింపక దాఁగునాయొదిగి
యేటికిభయమంద నింతిరోనీవు
ననవినియబ్జాక్షి యాత్మలోఁగలఁగి

### బొంగరాలాటకూడదని తల్లి మరలఁజెప్పుట.

యేలబాలుఁడనీవు నింతధైర్యంబు
శాపింపఁబోగని సంశయమేల
దుష్టులుతులువలు దుర్వాచకలును
దారతమ్యంబుల తగవెఱుంగకయె
కచ్చెసముందుగఁ గాలుదువ్వెదరు
భావంబులిట్టివి పడఁతులకెల్ల
నీమేలుగనుఁగొని నేనోర్వలేక

పలుకుటకాదోయి బాలచంద్రుండ
యని చెప్పినంతట నా బాలుఁడనియె

### బాలుఁడు తల్లిమాటలకుఁ దగు సమాధానము చెప్పుట.

దుష్టభావుఁడఁగాను ధూర్తుఁడఁగాను
వెలఁదులకెల్లను వినతిచేయుదును
దయసేయుదురువారు తనయునిమాడ్కి
తడవాయ నేవచ్చి తల్లిరోయిటుకుఁ
బుత్రునిమాటలు బుద్ధిలోనుంచి
నాకాంక్షలీడేర్చి నన్నంపవమ్మ
బాలచంద్రుండిట్లు పలికినవేళ
నైతమ్మనవ్వుచు నపుడు నేర్పరుల

### బాలచంద్రుఁడు తల్లియొక్క లోభత్వమును దూలనాడుట.

నొజ్జలఁబిలిపించి యొప్పగామీరు
బొంగరంబులుకొన్ని పూనిచేయుఁగఁ
దగునన్న బాలుండు తనలోననవ్వి
తల్లితోననియెను దయవచ్చునట్లు
శత్రువులబొంగు సాంద్రవిక్రముఁడు
గండుభీమనగర్భ కంధిరత్నమవు
లోభత్వమేలమ్మ లోలాయతాక్షి
యేడుకోటులసంఖ్య నెసఁగినధనము
కలిగినయాగండు కన్నమనేని
చెల్లెలవైయుండి సిరులు చెన్నొందఁ
జెనఁటిబొంగరములు చేయించుకొఅను
నేరిలిమనసొప్పె నేణాక్షినీకు
లేమిడివాక్యముల్ లేపకునోటఁ
లేరాదుపెద్దల తీరుకు వెలితి
భావంబులోలోభ పటిమమీఱంగ
సంసారకార్యంబుఁ జరుపఁజూచెదవు
నీవంటిదానికి నీతియె యిట్లు
నీవెయుంచికొనుము నీతండ్రిసొమ్ము
సకలదేశాధీశ సంఘంబునెల్ల
సమరరంగంబున సాధించిమించి
వారిచేమాతండ్రి వలసినయట్టు
లప్పనంబులుగొన్న యధికధనంబుఁ
బొందుగాఁదెప్పించి పుటము వెట్టించి
పైఁడిబొంగరములఁ బరఁగఁజేయింపు
వెండిచేములుకులు వెలయఁబెట్టింపు
పట్టుచేజాలెలు పన్నిపేనింపు
ముత్యాలకుచ్చులు మొదలఁగూర్పింపు
తెప్పించియిప్పింపు తీవ్రంబుగాను

### బాలుఁడు నిజౌదార్యమును దెల్పుట.

దండివిక్రములైన తమ్ములు నేను
నాడుకోవలెనంచు నభిలాషవొడమె
నావంటిబాలుండు న్యాయంబుతప్పి
హీనబొంగరముల నెట్లాడఁగలఁడు
మాచినవారలు చోద్యమందుదురు
ప్రజలుదూషింతురు పరిపరిగతుల
సకలరాజులగెల్చి జయముచేకొన్న
బ్రహ్మనాయునిగర్భ పాథోధియందుఁ
జంద్రునివిధమున జనియించినట్టి

బాలుని కీలేమి ప్రాప్తమాటహహా
కాలవిషమమని గ్రహింపఁగలరు
కావునలోభత్వ కలననీకేల

### బాలచంద్రుఁడైతమ్మకు వైరాగ్యముపదేశించుట.

కలుములు నిత్యంబుకావు మాతల్లి
మెఱపు మెఱయురీతి మేఘంబులట్లు
బుద్బుదంబులభంగిఁ బోవును జెదరి
యీరీతిఁదలపోసి యెఱుకచేమించి
సంపదవేళనే సకలభోగములు
పొందంగవలె ధర్మములు సేయవలయు
భోగానుభవముచేఁ బుట్టిసంతృప్తి
వేసటజనియించి వెగటుగాఁదోఁచు
నటుమీద వైరాగ్య మమరుచునుండు
ధర్మముల్ చేసినఁ దనరుఁ బుణ్యంబు
సజ్జనసహవాస సంప్రాప్తికలుగు
వైరాగ్యమధికమై వతిలంచుఁబిదప
భోగధర్మంబులు పుట్టినయపుడె
సరవివిరాగత సంసారమెడయు
సద్గురు పదసేవ సయ్యనఁగలుగు
నందుచే నిర్వాణమందికయగును
గావున భోగముల్ గైకొనవలయు
శాస్త్రంబులీలాగు చాటిచెప్పెడిని
ధనమందులోభంబు తగ్గింపుతల్లి
ప్రాణంబనిత్యంబు భవమనిత్యంబు
ద్రవ్యంబువచ్చు నాతవిలి వెన్వెంట
* నిటువంటి మానవుఁడీదేహమెడలి
పోయికొన్నాళ్ళకుఁ బుట్టునుమఱలి
కర్మరహస్యముల్ గాంచినవారు
ద్రవ్యంబునపునవస్థాద్వయమిట్లు
తనరింపుచుందురు తజ్ఞులుగనుక
నీవెఱుంగని మర్మమే నెఱుంగుదునె
చనినభూపతులెల్ల సమకూర్చినట్టి
చిత్రమౌధనములోఁ జిన్నమేమైనఁ
గొనిపోయిరా వెంటఁ గూర్పంగనేల
యాశచాలించుటే యానందపదవి
చెలిమినామాటలు చిత్తమందుంచి
మాకోర్కె లీడేర్చి మమ్మమన్నింపు
ధనలోభమందిన దానవుకనుక
నింతగాఁజెప్పితి నేణాక్షినీవు
నీలోభగుణమును నేవిన్నవింతుఁ

### బాలచంద్రుఁడైతమ్మయొక్క వెనుకటి లోభ కార్యంబుఁ బేర్కొనుట.

దప్పక మదికినిఁ దార్కాణగాను
నీమేనగోడలి న్నీవడ్గినపుడు
నామేనమామలు నాపెండ్లినాఁడు
మా కులంబుననోలి మాడలుగలవు

---

* "దేహినోఽస్మిన్ యథాదేహే కౌమారంయౌవనంజరా। తథాదేహాంతరప్రాప్తి ర్ధీరస్తత్రనముహ్యతి" అని యర్జునునకు శ్రీకృష్ణుఁడుచేసిన యుపదేశముకూడ నిట్లేయున్నది.

తగినధనంబీక తామీయమనిరి.
ఆమాటమీదట నమ్మరో నీవు
ముట్టడి వేసితి మూర్ఖతతోడ
నయిదురో జాలదాఁక నంతమామామ
యక్కవైనను నేమి యలిగిన నేమి
యడిగినధనమివ్వ కతివ నేనివ్వ
బ్రహ్మవచ్చినఁగాని భయపడఁబోను
నియమంబు నాకిది నెలతరో యన్న
నేమికావలె నీకు నిప్పింతునిప్పు
డన్న సందేహింపకడుగవే యనిన
మాడలు తూమెఁడు మాకుఁగావలయు
నిప్పింపు వేగమె యింకొక్కమాట
అఖిలరాజులొసంగినట్టి యుప్పనము
లందుఁదాలువిగల వతివరో వినుము
బొల్లునుదాలును బొసఁగవుమాకుఁ
దీక్షైనమాడలఁదెచ్చి యిమ్మన్న
మదిలోననొవ్వక మగువనీవప్పు
డూడిగీలనుఁబంపి యొప్పైనధనము
తెప్పించిరాసిగాఁ దీర్చిపోయించి
కొలిపించికొమ్మన్నఁ గోరిమీయన్న
మెట్టొండు కట్టించి మీదఁదానెక్కి
హెచ్చుగాఁదూర్పార నెత్తెనుభువినిఁ
జిందిపోయినవెల్లఁ జెడుతాలుపొల్ల
యనిరోసి మిగిలిన యర్ధమంతయును
నధికమౌ తూమొకటపుడు తెప్పించి
యెలమిఁదూమునకంటె హెచ్చుగాఁగొలిచి
కళ్ళమడ్గువితానె కావలెననుచుఁ
దాలునుబొల్లును దానెగోరుచును
నివ్వఁడిమాకని హెచ్చినకాంక్షఁ
గట్టించిమూటలు కైకొని తర్లె
నేనెఱుంగుదుఁదల్లి నీమనోభంగి
మించినకీర్తికై మెలఁగితివప్పు
డన్న పుత్రునిమాట కైతమ్మనవ్వె
హెచ్చుగా నవ్వెరి యెనమంద్రుసుతులు
గారాబుతనయులఁ గడుప్రేమయడరఁ
గూర్చుండఁబెట్టియుఁ గూరిమితోడ
మొదలురప్పించిన ముఖ్యులైనట్టి
యొజ్జలుతనమ్రోల నుండంగఁజూచి
బొంగరంబులుచేయఁ బొసఁగునుమీకుఁ
బైఁడియిప్పించెదఁ బట్టినయంత

## ఐతమ్మ బొంగరంబులు చేయఁ బంచుట.

పనిముట్లుదీసుక వడిరమ్మటన్న
వారలిండ్లకుఁబోయి పట్టెడకారు
కమ్మచ్చులును నీరుకార్లు సుత్తెలును
ఘనమౌపడచ్చులు కత్తెరల్ మఱియు
నలరునుచ్చులుగుదులాదియైనట్టి
పనిముట్లుగొని తెచ్చి భామకన్నెదుర
భక్తితో నిలిచిరి పటిమదీపింప
నైతమ్మసెలవిచ్చె నంతటవారు
చదు రేర్చికూర్చుండిసరి పనిముట్లు
పఱచిముందఱకడఁ బావన్నిలిపి
పుష్పగంధంబులఁ బూజకావించి
నైవేద్య తాంబూలనతులొనరించి

కనకలక్ష్మికిఁదగు కమఠంబు నిలిపి
కడుగొప్పమూసలుఁగట్టిగాఁజేసి
నిజమైనబంగారు నిండించిమంచి
పలుకులఁ గరఁగించి పరికించు వేళఁ
గాలహేతువదేమొ ఘనలక్ష్మిమహిమఁ
గరఁగు వేళలవన్నె కదలక నిల్చెఁ
దరువాతనాశ్చర్య దంబై వెలయఁగఁ
జిందురులగుచును జీకాకునొంది
చిదురుపలాయె విచిత్రంపుభంగి
నొగిఁజుట్టునున్నట్టి యొజ్జలందఱును
గనుఁగొనిభీతిల్లి కంపితులైరి
బాలుఁడావేళను బటుశౌర్యమొప్పఁ

## బాలచంద్రుఁడు
## భౌతిక రహస్యములఁ దెల్పుట.

దల్లితోననియెను దననేర్పుమీఱఁ
గడవన్నె చిదురలై కరఁగినసేమి
కరఁగినవేళలఁ గళలేమిచెడక
నిలుచుటే కనకంబు నిశ్చయంబిదియ
అటుమీఁదనగుకార్య మదియేమిలెక్క
చెడని పదార్థముల్ సీమలోలేవు
చెడునుగట్టును నదుల్ చెట్లును లతలు
సంచార జీవముల్ సమయుచునుండు
సమసినజీవముల్ జనియించుమరల
జడపదార్థంబులు చైతన్యమొందుఁ
* బాలికదొక్కటివిను బొత్తిగానెపుడు
పుట్టదుక్రొత్తది భూమిలోపలను
బోయినదానినిఁ బోయెనఁటంచు
నున్నదానినిఁజూచి యున్నదఁటంచు
భావింపఁగారాదు పడఁతిలోకనుము
కాలవశంబునఁ గలపదార్థములు
రూపభేదంబుల రూఢిగాఁబొందు
ధరబ్రహ్మవ్రాతలు తప్పింపరాదు
కావుననాశ్చర్య కారణంబేమి
మాయాభవంబిది మాసిపోఁగలదు
హృదిలోన ననుమాన మేల నేతల్లి
కావింపుమమ్మ బొంగరములనెను
వేయిమాడలచేత విరచించియపుడు

## సిద్ధమైన బొంగరమాల
## బాలచంద్రాదుల కొసంగుట.

మంగలకులుఁడైన మాధవునికిచ్చెఁ

---

* నాఽసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః । ఉభయోరపి దృష్టోఽన్తస్త్వనయో స్తత్త్వదర్శిభిః॥" అని శ్రీకృష్ణుఁడు గీతాశాస్త్రంబున నీయభిప్రాయము నే కనుపరచినాఁడు. మరియు "నిత్యం పరమాణురూపం। అనిత్యం కార్యరూపం" అని తార్కికుల మతముకూడ నైయున్నది పాశ్చాత్య భౌతికశాస్త్రవేత్తల "Matter is indestructible" [ద్రవ్యమునకు వినాశములేదు] అను సిద్ధాంతముకూడ నిదియే.

గుమ్మరపట్టికి గుఱుతుగా రెండు
వేలకుఁ జేయించి వేగమె యొసఁగె
సరిమాడు వేలతోఁ జాకలచందుఁ
బొంగరంబమరించి పొసఁగనిప్పించె
నలరునాలుగు వేల కమరిక చేసి
కంసాలిచందుకుఁ గరుణతో నిచ్చె
నయిదు వేలకుఁ జేసి యాకమ్మరికిని
నిప్పించె మదిలోన నెన్నికొనంగ
వెలమపట్టికి నాలు వేలకుఁ దీరెఁ
బదివేలతోఁ జేసి బాపనికిచ్చె
నారాయణుండైన నాయునికొడుకు
బాలుని చేతికిఁ బండ్రెండు వేలఁ
దీరిచి కన్నులు దీరిచి పైన
సకలరత్నంబులు సంఘటియించి
ములుకులు వెండితో మొనలఁగదించి
యిచ్చెను సంతోషమిం పెసగంగఁ
బిమ్మట నొజ్జలఁ బ్రియముతోఁ జూచి
తగినకట్నంబుల దయమీఱ నొసఁగి
పొమ్మని సెలవీయఁ బోయిరివార
లంతట నైతమ్మ యానందమునను
జారువర్తనవాఁడ చక్రనివాఁడ
గురుతర కేచర్ల కులవార్ధిసోమ
బాలుఁడ నీమది పరిణామమాయె
షడ్రసోపేతమౌ సకలవస్తువుల
వంటసమైయున్నది వచ్చి మీరెల్ల
భుజియించి పొమ్మన్నఁ బొందుగా లేచి
బాసనశాలలోఁ బక్వవస్తువుల
గరిమతో భుజియించి కరములుకడిగి
వాసశాలకువచ్చి వసియించిమించి
కాశ్మీరకర్పూరకస్తూరిఁగలిపి
తెచ్చినగంధంబుఁ దిన్నగాఁబూసి
చిత్రవర్ణంబులఁ జెలఁగుచునున్న
తగుపట్టువస్త్రముల్ దవిలిధరించి
బహువిధమణులచే భాస్వరమైన
యాణిముత్యంబుల నమరినయట్టి
మెఱుఁగుభూషణములు మేనులఁదాల్చి
బాసిల్లి శృంగారభరితులై వచ్చి
తప్పక నిలచిన తనయులఁ జూచి
యెలమితో నైతమ్మ యిట్లనిపలికె

## ఐతాంబ కుమారులకు బుద్ధులు గఱపుట

మేడపిలోపల మేలైనయట్టి
రచ్చకొట్టంబుల రాజవీధులను
విపణిమార్గంబుల విబుధగేహముల
బొంగరాలాడఁగఁ బొసఁగదుసుమ్ము
కరుణతో నాబుద్ధి గైకొనిమీరు
మేడపిలోనుండి మేలుగా వెడలి
యుత్తరదిశయందు నొప్పుచునున్న
చాలురావులకాడ సరసమైనట్టి
రమణీయమగు మొల్ల రావిక్రిందటను
నాడుఁడి బొంగరాలానంద మెసఁగ
బొందుగా నీరీతి బుద్ధులు చెప్పి
చక్రనిముత్యాల జాలెలఁదెచ్చి
యందించి చేతుల కాశీర్వదించెఁ

సేవకుల్ తగరుల శృంగారపఱచి

### బాలచంద్రాదులు బొంగరము లాడఁబోవుట.

పసిఁడిపళ్లెంబులు బాగుగాఁగట్టి
పట్టుజాలెలుదెచ్చి పరువడిఁగప్పి
ముందఱనిలిపిరి ముద్దుపొట్టేళ్ళ
బాలచంద్రుండును భ్రాతృసంచయము
వేడ్కమీఱఁగవాని వీపులనెక్కి
కమ్మ్రరగఱితలు గణములుప్పొంగి
వింజామరలఁబట్టి విసరుచునుండ
గచ్చకాయలుకొన్ని కలిగినయట్టి
తిత్తులు చిఱుతలు తీరైనగోడెలు
జూదమాడుటకయి సోగటాలుకొన్ని
బంతులుపిట్టలు పంజరచయము
పేరైనడేగలు పిగిలిపిట్టలును
శారికావళి కీరసంఘంబు మఱియు
నాటలసాధనాలవి వెంటరాఁగ
రయమునఁజనిచాలు రావులసరస
మొల్లపేరిటిరావి మొదటనుజేరి
తీరైనతగరుల డిగ్గివేదికలఁ
బైనఁబఱచినట్టి పలువన్నెలమరు
రత్నకంబళముపై రంజిల్లనుండి
బొంగరాలాడఁగఁ బూనిరావేళ
సరసమేడపిజనుల్ సంతసంబొప్ప
బొంగరాలాడెడు పొంకమంతయును
బోయిచూడఁదలంచి బుద్ధులునిలిపి
వనితలుతనయులఁ బతులఁదండ్రులను

### అమ్మలక్కలు బొంగరాలాటఁ జూడఁబోవుట.

నత్తలమామల నడుగుటమాని
సంసారభారంబుఁ జాలించివెడలి
యొక్కరినొక్కరు నొగిఁబిల్చికొనుచుఁ
దమలోనముచ్చటల్ దగఁజెప్పికొనుచు
రయమునఁబోయిరి రావులకడకు
నాపురవరమున నలరుచునుండు
వరవిప్రకామిని వైశ్యకామినియు
నెడలేనిపొందుచే నెసఁగెడువారు
అఱివిచారించిరి తమలోనఁదాము
నాయునిపుత్రుండు నవమన్మథుండు
బాలుఁడు సంతోషభరితుఁడైయిపుడు
తమ్ములుతానును దననేర్పుమీఱ
బొంగరాలాడఁగఁ బూనియున్నాఁడు
కనుఁగొనివత్తము గ్రక్కునఁబోయి
యని విప్రసతిపల్క నాపెతోనపుడు
నేర్పుమీఱఁగ వైశ్య నెలఁతయిట్లనియె
నోయమ్మబాలుండు నుఱుమనిపిడుగు
పాపపుణ్యంబుల భావింపఁడతఁడు
శకట సమూహంబు చనియెడువేళఁ
జీలలూడఁగఁదీయుఁ జేతులఁబట్టి
యాడెడుపాపల నదరంటఁగొట్టు
వెంగలిదుష్టుండు వీతధర్ముండు
వానిఁజూడఁగనేల వాంఛజనించె

నావుఁడు బ్రాహ్మణనారి యిట్లనియె
నేఁబోయివచ్చెద నెలఁత నీవుండు
మనఁగను గోమటి యంగనామణియు
పడఁతి నీదగు పొందు పట్టుట మొదలు
నెడఁబాసియుండుట యెన్నఁడు లేదు
నేఁడు నిన్నెడఁబాసి నే నెట్టులుందు
వచ్చెదఁ బదమని వనిత తా లేచి
నీరాడికడవ ను నేర్పుగాఁ బట్టి
యుత్తమమామను నతిభక్తి మ్రొక్కి
కనుఁగొని వత్తుము గ్రక్కునఁ బోయి
యనవవి పెద్దలు నతి వెలనంపఁ
గదలిరి కర్పూర గంధులు చెలఁగి
చనిదీర్ఘికను డిగ్గి జలములనంత
కప్పిననాఁచును గడకేఁగఁ జేసి
నిర్మలోదకములు నించి కడవల
శృంగారమొప్పఁగ శిరములఁ బెట్టి
దురితబంధంబులఁ దొలఁగింపలేక
కర్మఫలంబును గడవఁగ లేక
నెలఁతలు చనుదెంచి నిల్చిరచ్చోట
నాశ్చర్యవాక్యాల నప్పుడిట్లనిరి
యీతఁడే పలనాటి నేలెడు బ్రహ్మ
తనయుఁడు సౌందర్య దర్పకుండితఁడె
మార్తాండతేజుండు మహితశౌర్యాఢ్యుఁ
డీచొప్పనీయొప్పు నీచక్కదనము
నలవియె పొగడంగ నజునకునైన
బంగారుకలశాలఁ బన్నీరు తెచ్చి
మదనారి నభిషేక మాడించెఁ దొల్లి
* మంచాలకాపున్న మానితయశుఁడు
కలితసౌందర్యుండు కందర్పసముఁడు
పతియేలయానని పాయని వేడ్క
ముచ్చటలాడిరి మూఁకలై చేరి.
† ఆసమయంబున ననపోతు లేచి
పట్టుగాగిత్రివాసిపైఁ డిటంకంబు
నిల్పి బాలునిఁ జూచి నెనరొప్పననియె
నూరకయున్నాఁడవో బాలచంద్ర
బొంగరాలాడెడు బుద్ధితోఁ దప్పు
లెల్లను గనిపెట్టి యిపుడున్నవారు
నీవుముందాడక యెవరాడరాదు
గదయనబాలుండు కౌతూహలమునఁ
దోరంపుసందడి తొలఁగింపుమనెను
బద్దలవారంత పరుగున వచ్చి
చెలఁగి బరాబరుల్ చేసిరి మ్రోలఁ
దంత్రజ్ఞులగు మేటి తమ్ములు లేచి
చేరియాటలనాడ చిఱునవ్వునవ్వి

## బాలచంద్రుఁడు బొంగరమును ద్రిప్పుట.

బలపరాక్రముఁడైన బాలచంద్రుండు
ఘనతరమాణిక్య ఖచితమైనట్టి
బొంగరంబగ చేతఁ బూనుకయుండి

* బాలచంద్రుని భార్య.
† బాలచంద్రుని యన్న. బ్రాహ్మణక్షేత్రసంజాతుఁడు.

నేరుపుచూడుఁడి నిలిచిమీరెల్లఁ
దిరిగింతుఁజేతిలో దీటులేనట్లు
లవనిపైఁబడకుండ నంతరమందె
పట్టియాడించెద బహువిధగతుల
ననిచుట్టునున్నట్టియతివలఁజూచి
యుత్తమామలభక్తి నమరినవారు
పతిమాటలకెదురు పలుకనివారు
వినయమొనామాట వినుఁడిమీరెల్ల
దూరాననుండుఁడి తొలఁగికన్గొనుఁడి
యనిచెప్పిబొంగరం బరచేతఁబట్టి
ముత్యాలజాలెను ముదమునఁజుట్టి
చేయెత్తిహుంకించి స్థిరబలంబునను
వేసినవడిమీఱ వేగమెపోయి
సంయమీశుండను చత్రాతిఁదాఁకి
మింటిమీదికెగసి మెఱుఁగులుగ్రమ్మ
* నన్నమ్మయనుపేర నలరుచునున్న
చక్కనికోమటి జలజాయతాక్షి
మీఁగాలికిందాకి మించినములికి

## అన్నమ్మయను వైశ్యకాంతకు బొంగరము దగుల నామె మూర్ఛిల్లుట.

యరకాలుదిగివచ్చి యవనికిఁదాఁకెఁ
దాఁకినయావైశ్య తరుణిభీతిల్లి
గగనంబుపైఁబడ్డ గతిఁగంపమొంది
తటిగినఖర్జూర తరువుచందమునఁ
దటుకునమూర్ఛచే ధరమీదనొరిగెఁ
జెదరికుంతలములు చిక్కులనొందె
మిక్కిలిచెమటచే మేనివస్త్రంబు
తడిసెనుగుండియ దడదడమనియె
మేదినీరేణువుల్ మేనెల్లఁగప్పె
నీరీతిఁబడియున్న యేణాక్షికడకుఁ
బోక్కుచుఁజేరెను బొలఁతులగుంపు
కప్పిరివలువలు కర్ణంబులందుఁ
గర్పూరజమును గలయంగ నూఁది
పదతలంబులయందుఁ బాణులయందుఁ
గస్తూరిగంధంబుఁ గలిపిపట్టించి
సతులెల్లశైత్యోప చారముల్ సలిపి
చింతింపఁబోకుఁడి చెలిలేచునిపుడె
యనిపల్కునంతలో నామూర్ఛదెలిసి
ముకుళితహస్తుఁడై ముందఱనున్న

## కోమటియన్నమ్మ బాలుఁనిదిట్టుట.

బాలునిఁగనుఁగొని బలుకోపమునను
గన్నులెఱ్ఱఁగఁజేసి కాంతయిట్లనియె
నోరిదురాత్మకుఁడ యోరిదురాగ్ర
క్రిందుమీఁదెఱుఁగక కెరలుచున్నావు
గర్వమేటికినీకుఁ గాంతలయెడను
గలిగినఁదినవలెఁ గట్టంగవలయు
నెఱుకమాలినచేష్ట లేలచేసితివి
మురియంగ నేలనీ పొంగెల్లనణఁగ
ముదిరెమదంబునీ మురిపెంబుగ్రుంగఁ
దగమల్లభూపతి ధనమెల్లనీదు

సదనంబుఁజేరిన సత్తువనుండి
త్రుళ్లుచున్నావు దుష్టమానసుఁడ
సమరంబులోనిన్ను శత్రులుగ్రమ్మ
నడిచెడుపదముల నారసాలేయఁ
జూచెడుకనులకు సూదులుగ్రుచ్చ
మీయయ్యలెల్లను మించినబలిమిఁ
జేరివైరులతోడ శ్రీయుద్ధభూమి
నుప్పొంగుచున్న వా రుర్వీశునెదుట
వారిలోఁగలయు నీవడికానవచ్చుఁ
బోతుసింహమురీతిఁ బొదలుచున్నావు
మదమువట్టినగిత్త మాడ్కి మేడపిని
నున్నావుకావర ముడిగెడుఁగాక
యనితూలనాడిన నతిరోషమునను
గలుషించియనపోతు కనులెఱ్ఱసేసి
పట్టుజాలెనుబూని భామలనెల్లఁ
బరమసాహసమునఁ బాఱంగఁదోలె
నప్పుడాయనపోతు సమరంగఁజూచి
పలికెబాలుఁడునీతి పటిమసెలంగ
వనితలనదలింప వచ్చునామనకు
నందుచేఁబాతక మంటునుమనల
నని చెప్పితరువాత నావైశ్యసతికి

## తప్పుక్షమింపుమని బాలచంద్రుఁ డన్నమను బ్రార్థించుట.

నాదరమొప్పగ ననియెబాలుండు
"నొప్పికల్గుటచేత నోరాపలేక
యనరానిమాటల నాడితిగాని
నీమీదఁబగచేత నేనేయలేదు
బాలులకాటలు పథ్యంబుగనుక
నాడితిబొంగరం బదినిన్నుఁదాఁకె
దైవకృత్యంబని తలఁపకాడితివి
నిశ్శంకనేమందు నీరజనేత్ర
యబలవునిన్నేమి యనవలదైన
నాతప్పుమన్నింపు సయభావమునను
గణింపు"మనుచును గాంతకావేళఁ
బచ్చవన్నెలపట్టు పటములేచించి
ఘనమైనమందులే కాఁగట్టించి
మాన్పికొనుటకును మాడలేనూఱు
ప్రియమునవిప్పించి వెలఁదితోననియె
నమ్మమాతల్లి నీనైతమ్మమాఱు
* మాయయ్యలెల్లను మలసిదండెత్తి
పోయియేదిక్కునఁ బూనియున్నారు
తలపోసిచెప్పవే తరుణిగోనేఁడు
నావుఁడుకోమటి నారియిట్లనియెఁ
గదలింపకుమునన్నుఁ గన్నమాయయ్య
కాలికయినవొప్పి ఘనమాయెఁగనుకఁ
గోపించిపలికితి గుఱుతెఱుంగకయె

---

* "మీయయ్యలెల్లను మించినబలిమిఁ । జేరివైరులతోడ శ్రీయుద్ధభూమి । నుప్పొంగుచున్న వా రుర్వీశునెదుట । వారిలోఁగలయుని వడికానవచ్చు" అని యీ కోమటిస్త్రీ యన్నది గనుక బాలచంద్రుఁ డీప్రశ్న నడుగుచున్నాఁడు.

మాయయ్యయనిన సమ్మదంగమరయ
నిలమీాద నెచటనో యేనునెఱుంగ
నైతమ్మయెఱుఁగు నన్నడుగవమన్న
నాటలఁబాలించి యానుజాలుఁదాను

### బాలచంద్రుఁడు తల్లివద్దకేగి బ్రహ్మనాయుఁడు పోయిన యుద్ధరంగమేదియో యడుగుట.

మేలైనవీథుల మేడకుఁజేగి
వేగమె యిలుసొచ్చి వినయంబుతోడఁ
దల్లికిమ్రొక్కి తనయులందఱును
మ్రొక్కినదీవించి మురియుచున్న
తల్లితోబాలుండు తానిట్లుపలికె
వేలఁదిరో మేడపి వెలవెలఁబోయి
కళదప్పియున్నది కారణంబేమి
నయమొప్పనాయఁడు నాయకులెల్ల
నెక్కడికరిగిరో యెఱిఁగింపవమ్మ
యనుడు నావాక్యంబు లతివకర్ణముల

### బాలునిమాటలువిని యైతమ్మ మూర్ఛిల్లుట.

సునతరశరముల గతి నేఁచనులికి
తటిగినకదలికా స్తంభంబురీతి
గుండెలుపటియలై కుంభినినొరగెఁ
జంద్రమండలమందు సాంద్రంబుగాను
జలదంబుకప్పిన చందంబువెలయ
సులలితకుంతల జాలంబుచెదరి
కప్పినవదనంబు కనుపింపదాయెఁ
గన్నులనీరాని కాటుకచెదరి
గళబద్ధనవరత్న కాంచనయుక్త
హారజాలములెల్ల నటునిటుఁదొలఁగె
జమిలిముత్యపుచేర్లు చక్కనైయున్న
పాపటబొట్టూడి ప్రక్కనఁబడియె
వేనలిఁదురిమిన విరులెల్లజారి
పడెనుభూస్థలిమీదఁ బఱచినయట్లు
కొంతసేపునకామె గొబ్బునలేచి
ఘనమైనదుఃఖంబు గ్రమ్మంగఁబలికెఁ

### ఐతమ్మ యుద్ధవిముఖములైన మాటలు బాలునికిఁ జెప్పుట.

జేసినధర్మముల్ సెడిపోయెనిపుడు
వరపుణ్యజాలంబు పఱదనుగలసె
నాభాగ్యమునకెల్ల నష్టంబుదోఁచె
నిటువంటికార్యంబు నిచ్చలోఁదలఁచి
నాలుకెట్లాడెను నన్నడ్గనీవు
బాలుఁడానీకేమి భారంబువచ్చె
వినఁగననిటువంటి వెట్టినెక్కడను
గాలంబుననవలెఁ గానినిన్నన్న
ఫలమేమియని చాలభయమునుబొంది
పుత్రుఁడువిడనాడి పోవకయుండు
బొంకుమాటలఁదల్లి పొరిపొరిననియెఁ
దనయుఁడావినునీదు తండ్రులుమామ
లెల్లవిచారించి యేకభావమున
మలిదేవుమన్నన మట్టాయెఁగనుక
నిచ్చోటువిడనాడి యేఁగిరివార
లేదికఁబోయిరో యెఱుఁగనుసుతుఁడ

యనినబాలుఁడు తల్లి కప్పుడిట్లనియె
నెన్నఁడసత్యంబు లెఱుఁగ ననీవు

### బాలుఁడు నిజధర్మముల వివరించుట.

తగవఁటే నాతోడ దబ్బరలాడఁ
జెలఁగి కార్యమపూడి శ్రీయుద్ధభూమి
మలిదేవసహితులై మాయయ్యలెల్లఁ
జలమువనున్నారు సమరంబు సేయ
నవలశాత్రవచయ మతివిక్రమమున
మూఁకలై బ్రహ్మన్న మొదలైనవారి
గహనముల్ దావాగ్ని కాలిచినట్లు
దగ్ధంబు సేయంగఁ దలఁచినవార
లీసమయంబున నే నేగకున్న
నపకీర్తి పాలౌదు హానియువచ్చుఁ
దండ్రికష్టంబును దప్పింపలేని
పుత్రుఁడుండిననేమి పోయిననేమి
* జనకుఁడే పుత్రుఁడై జనియించునంచు
గొల్లున వేదముల్ ఘోషింపుచుండఁ
దల్లిరో కావునఁ దనయునిబలిమి
తనబల్మియేయని తండ్రిదలంచుఁ
బితృపుత్రులకునింత భేదంబులేదు
కార్యమపుడికేను గదలంగవలయుఁ
గదలిననీవల్లఁ గానున్న దేమిఁ
యనివిచారించుట యబ్బబ్బతగదు
తల్లిరో నాకసాధ్యంబిలలేదు
బ్రహ్మాండములఁబట్టి బంతులాడుదును
మృత్యుదేవతనైన మెదిపివేసెదను
హరిహరుల్ మెచ్చగా నని చేసిమించి
కామభూవిభునకుఁ గలబలంబెల్ల
ఖండించి పైచెదఁ గలియుగమందు
వీరచరిత్రలు వెలయఁజేయుదును
దల్లియంపుమునన్నుఁ దడయంగనేల
చిత్తంబు చెడిపోవఁ జింతింపబోకు
మనినపుత్రునిమాట నైతమ్మవలికెఁ
దమకంబు కూడదు తాళుము తనయ
తెలిసి విచారించి తెలిపెదనీకు
నుండుమీవని చెప్పి యొయ్యన నేగి

### ఐతమ్మ శీలమ్మనాలోచనయడుగుట.

యత్తయౌ శీలమ్మ నతిభక్తిఁ జూచి
కరములు ముకుళించి కార్యమంతయును
వినిపింపఁ జిత్తంబు వెరఁగునుబొంది
తరుణియౌ శీలమ్మ దైవజ్ఞతతిఁ
బిలిపించి బాలుని పేరటలెస్స
గ్రహగణభావంబు గ్రహియించిపిదప
నైతమ్మతోడుత ననియె నీరీతిఁ
బటుపరాక్రముఁడైన బాలచంద్రుండు

### శీలమ్మయుపాయంబు సెప్పుట.

పదునేనుదినములఁ బరిణామమొందుఁ
జెప్పంగఁబడెనిట్లు సిద్ధాంతమందు
నెడలేక యడలెద వింతిరో నీవు

* "అంగాదంగాత్సంభవసి" "ఆత్మావై పుత్రనామాసి" అనియు శ్రుతిప్రమాణములు.

నీవెంతయడలిన నిల్వఁడాతండు
కాలమెవ్వరికైనఁ గడవంగరాదు
బ్రహ్మవ్రాసినవ్రాలు వశమెతప్పింప
నీమాటకాతఁడు నిలువఁగఁబోఁడు
కన్నకడుపుగానఁ గాంతరోనీవు
పడవలసినపాట్లు పడవలెఁగాని
ఊరకయుండుట యుచితంబుగాదు
శంబరాసురవైరి సతిచేతియందుఁ
జెలువందనిల్చిన చిలుకవుసమము
* మంచాల, తద్రూప మహిమఁగన్గొన్నఁ
జాలింపఁగలఁడమ్మ సకియనీసుతుఁడు
నావినివైతమ్మ నాఁటికిమొక్కి
పీడనిచింతచే వెడలితావచ్చి
తనకుమారునిఁజూచి దయనిట్టులనియె

## భయంకరరణరంగవర్ణనతోనైతమ్మ బాలుని భయపెట్టుట.

నోయయ్యబాలుఁడా ఒప్పుగవినుము
పరరాజదళములు పైకొనిరాఁగ
వాద్యసమూహంబు వడితోడమ్రోయ
ఘనగజఘీంకార కలితరావంబు
సాంద్రతురంగహేషా విజృంభణము
రథనేమిఘంటల ప్రబలశబ్దంబు
లమితపదాతిచయాట్టహాసంబు
భేరీఢమాముల ఘోర్ణనమ్రోఁత
ఏకమైమించిన నెట్లుతాళెదవు
విలుకాండ్రు చెలరేఁగి విచ్చలవిడిని
ఒడిశానపట్టిన చందంబుతోఁప
దట్టమౌశరవర్ష ధారలుగురియఁ
దప్పించికొనలేవు ధైర్యంబుమీర
నలుగుల మెఱుఁగులు నవనిపైనిండఁ
గన్నులంజీఁకటి గ్రమ్మఁగఁజేయ
బద్దలునీఁటెలు పట్టుకతూరి
పైఁబడ్డధైర్యంబుఁ బట్టఁగలేవు
కత్తులుఝళిపింపఁ గనుఁగొనినీవు
తాళెదవేరీతిఁ దడఁబడక
నీవేడరణమేడ నీబలిమేడ
బాలులతోనాడు పగిదిగాదోయి
చెక్కిలుమీటినఁ జిందునుబాలు
నుదురుమీటినఁగడు నూనెవెళ్లెడును
గండ్రతనంబులఁ గైకొనకుతనయ
పిన్నవునీకిట్లు బిరుదులువలదు
ననువిడ్చిపోవుట న్యాయంబుగాదు
నావుఁడుబాలుండు నాతికిట్లనియె

## బాలచంద్రుండు నిజబలోన్మేషంబుఁ దల్లి కెఱింగించుట.

భయమేలచెప్పెదు భామనాకిపుడు
పుత్రమోహంబున బొంకెదుకాని
యెఱుఁగవేనాబల్మి యిందీవరాక్షి
నలగాముఁడెఱుఁగును నాదుశౌర్యంబుఁ
బ్రళయకాలమునాఁటి భైరవురీతి

* బాలచంద్రునిభార్య, గండు కన్నమనాయని కూఁతురు.

సైంధవవధవేళ సాహసస్ఫూర్తిఁ
విజయుఁడు రణములో వెలసినకరణిఁ
గౌరవసేనలోఁ గదఁబట్టితూరి
వడముడియనిలోన వ్రాలినవిధము
వాయుపుత్రుఁడు లంకవడితోడఁజొచ్చి
భస్మంబుగాఁగాల్చి ప్రబలినభంగి
రాక్షసరణములో రామచంద్రుండు
వీరపరాక్రమ విధిఁజెందినట్లు
జలధిమధ్యంబునఁ జరియించినట్టి
భూరిమందరనామ భూధ్రంబుమాడ్కి
ఫాలాక్షుఁడతిరౌద్ర పటిమమీఱంగఁ
త్రిపురంబులను సంహరించిన గరిమఁ
గాలాగ్నిలోకముల్ గాల్చినపోల్కి
జంగమస్థావర సకలవస్తువులఁ
బ్రళయంబుమూంపంగఁ బరిగినగతిని
గామభూపతిసేన గడగడవణఁక
విక్రమక్రమశక్తి విడివడఁజొచ్చి
పృథివిపైఁబీనుఁగు పెంటలుగాఁగ
విహరింతుమదిలోన వేడుకకొలఁది
నుర్వీశుదళముల నుఱుమనిపిడుగ
గర్వించుపగవారి కంటిలోనెరస
నెదురెవ్వరేనాకు నీభువిలోన
నలగాముబలముల నలినలిచేసి
వండంగఁదఱిగిన వడువుననటికి
నెత్తురుమడుఁగులు నిండనొనర్తు
దహనునికడ్డంబె దట్టవకావనము
బడబాగ్నినార్చునే పాథోధిజలము
భయదంపు పులికిని బశుగణంబెదుర
జింకలకదుపులు సింహముకీడె
బాలుఁడననినన్ను భావింపవలదు
చిన్నమిర్యమునందుఁ జెడునెకారంబు
నావిని సుతునకు నాతియిట్లనియె

## సంతానముకై పడ్డకష్టములనోచిన వ్రతములనైతమ్మ వేర్వేరఁ జెప్పుట.

వినవయ్యబాలుఁడ వీరశేఖరుఁడ
(కన్నకడుపుగానఁ గాఁచుమిక్కుటము
పుత్రమోహమువంటి మోహంబులేదు
దశరథప్రముఖ భూతలనాథవరులు
పడిరిపుత్రులకయి పడరానిపాట్లు
పుత్రులులేనట్టి పురుషభాగ్యంబు
విపినంబులోఁగాయు వెన్నెలరీతి
కొడుకులులేనట్టి కోమలిబ్రతుకు
పూచికాయనియట్టి భూజంబువిధము
* పున్నామనరకంబుఁ బొందకుండంగఁ
దల్లిదండ్రులఁగావఁ దనయుఁడేకర్త
బాలుఁడానునీవు పాయుదువేని
నిమిషకాలంబైన నిల్వంగనోప)
సంతానమేలేక చాలకష్టించి

* పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్రః అని పుత్రశబ్దమునకు వ్యుత్పత్తి.

యవనిలోఁగల నోములన్నియునోఁచి
తఱచుగాఁజేసితి దానధర్మములు
దక్షిణతాంబూలతతులు సద్భక్తిఁ
గూర్చిచూఱవిడిచి కుమ్మరావముల
సాడెడుగానుఁగ లవిఁగొల్లపెట్టి
పెండ్లిండ్లుసేసితిఁ బేదవిప్రులకుఁ
బాడైనదైవత భవనంబులందుఁ
బొందించి నైవేద్య పూజలభక్తి
నామడామడమీద నన్నసత్రముల
వెలయంగఁజేసితి విస్తారమైన
వనములోపల జలిపందిళ్ళనుంచి
శ్రీగిరికేగెడు శివభక్తతతికి
నిచ్చితిరాగిచే నిర్మితంబైన
ఘన కమండలువులు గర్పరచయము
శ్రీభ్రమరాంబకు శ్రీశైలపతికి
రజతకాంచనముల రంజిల్లునట్టి
కూష్మాండఫలములఁ గూర్చిదక్షిణలు
కానుకలిచ్చితిఁ గడుభక్తితోడ
గౌరీమహేశ్వర ఘననామశిఖరి
నెక్కియునోమితి నేలేశ్వరంబు
దిగివచ్చినోఁచితిఁ దిలపర్వతమున
మొగివిష్ణుకాంత నోమును సలిపితిని 12 / 10
వారకయాసంధ్య వత్తినోమితిని
దప్పకనోమితిఁ దగుజగజ్జ్యోతి
నే గురువని తలనింపుగఁగూర్చి
యేకబాణపునోము నెలమినోఁచితిని
బదుగురువనితల బాగుగఁగూర్చి
పచ్చవిల్తునినోముఁ బట్టినోమితిని
నందికిఁబులగంబు నయతనిచ్చితిని
శ్రీశైలపథమునఁ జెలువంబుమీఱ
నశ్వత్థపత్త్రుల నభివృద్ధిచేసి
రమణీయకాంచన రజతతంతువుల
నశ్వత్థతరువుల కలరఁజుట్టించి
పెంటిపోతులకును బెండ్లిచేసితిని
చీఁకటింటనుమోము సేసితిభక్తి
నియతికేదారేశు నిల్పినోమితిని
గొనకొనికనుఁగొన్న గుంటికినెల్లఁ
జేయెత్తిమ్రొక్కితిఁ జెప్పనేసిగ్గు
కరమెత్తిమ్రొక్కితి కాటేనికేను
బలునోములీరీతి భక్తితోఁజేయ
నేదేవుఁడైనను నిచ్చలోమెచ్చి
వరమీయఁడాయెనా వ్రాతకేమందు
ననిచింతసేయుచు నసురుసురంచు
దైవంబుఁదూఱుచుఁ దలఁకెడువేళ

## బాలచంద్రుని జన్మప్రకారము.

వింటినివచనంబు వినువీధియందు
గజనిమ్మనోమినఁ గలుగుసంతాన
మనువాక్యమునకప్పు డానందమొంది
పెద్దలౌవిప్రులఁ బిల్వఁగఁబంపి
ముకుళితహస్తనై మ్రొక్కియామీద
వారితోఁజెప్పితి వాక్యలక్షణము
వినివారుసంతోష విశ్రాంతమతిని
వ్రతకల్పజాలముల్ వరుసఁదెప్పించి
శోధించిచెప్పిరి శుభముహూర్తమున

శాస్త్రమందున్నది చానయీవ్రతము
సంవత్సరమునిండ సల్పఁగావలయు
నిదివిష్ణుదేవుని కింపైనవ్రతము
శాస్త్రోక్తదినమున స్నానమాడంగ
వలెనంచునున్నది వ్రతకల్పమందుఁ
జంద్రభాగానది సదృశశైవలిని
కలుగదుపలునాటి గడ్డయందెల్లఁ
గృష్ణరసమునిది కీర్తనీయంబ
ఎడమభాగమ్మున నెనయుఁజెన్నునికి
దాపుగఁబాఱు నుత్తరముఖంబుగను
స్నానమానదిఁజేసి సరిగంచుపట్టు
కోఁకలుధరియించి కుంకుమపసుపు
దాల్చిగంధంబును దనువునఁబూసి
సంతోషమునఁబోయి స్వామియైనట్టి
చెన్నకేశవునకుఁ జేసిజోహారు
నైవేద్యదీపముల్ నమ్రతనిచ్చి
వైకుంఠశృంగార వనములోపలను
జెన్నారునానిమ్మ చెట్టునకేగి
చుట్టులెస్సగఁజేసి శుద్ధిచేయించి
అలికించిముగ్గుల నచటఁబెట్టించి
వనదేవతనుభక్తి వర్ణనచేసి
నయముగనావాహ నంబుగావించి
* పలకలబావిలోపల నీరుముంచి
పాదులోపలఁ గడుభక్తితోఁబోసి
సకలప్రకారోప చారముల్ చేసి
భూసురులందఱు భుజియించుకొఱకుఁ
దగినవస్తువులిచ్చి తప్పకయుండ
ఫలములనాహార పటిమతగ్గించి
పరమేశుఁజెన్నుని భావించికొనుచు
నెడపకదినముల నీలాగుజరుపఁ
గొన్నాళ్ళకానిమ్మ కొమ్మలిగిర్చి
ఫలతతుల్గన్పించి పరిపక్వమౌను
వర్షాంతమందని వార్యంపుభక్తి
జెట్టుఫలంబులఁ జెన్నునికిమ్ము
సంతానమబ్బును సంశయపడకు

* ఈ బావినిగురించి విచారింపఁగా నచ్చటి నా మిత్రులొక రీతిగనఁ దెల్పినారు పలకలబావియని పిలువఁబడు బావి యిప్పుడు మాచర్లలో లేదు. కాని చెన్నకేశవుని యాలయములో నీశాన్యభాగమం దొక బావిగలదు. అది బ్రహ్మనాయుని కాలమునఁ ద్రవ్వఁబడినదని ప్రతీతికలదు. తత్కూప శిలాదర్శిత పౌరాతన్యంబా ప్రతీతిని స్థిరీకరించుచున్నది. ఈబావిలో మఱియొక చేదుడుబావి గలఁదట. నీళప్పుడు నిండిపోవుటచేఁ దానినిఁజూచినవా రెరును లేరు. అగాధమై జనోపద్రవకరముగ నుండ రాతిపలకలతో మూసి వేసియుందురు. బహుశః దానివలన నీ బావికిఁ బలకలబావియని పేరువచ్చినదేమో. మఱియుఁ జంద్రవంకమధ్యభాగమం దొక తలుపులబావియున్నట్లు చాలమంది జనులు సాధారణముగాఁ జెప్పుదురు. ఈ తలుపులబావి నే యొకప్పుడు పలకలబావియని పిలుచుచుండిరేమో!

మనుచుభూసురులెల్ల నాడిరిగనుక
సంవత్సరమునిండ సల్పితివ్రతము
కడపటిదినమున కడుమోదమునను
దినచర్యపూజలఁ దిన్నగాఁదీర్చి
విప్రభార్యలనెల్లఁ బిల్వఁగఁబంచి
సకలోపచారముల్ సమ్మతిఁజేసి
చెట్టుఫలములను జిదిమి తెప్పించి
పసిఁడితోఁజేసిన పళ్ళెరంబందుఁ
బోయుంచి భయభక్తి పూర్వంబుగాను
జేతులఁబట్టుక చెన్ననికడకు
వెడలితిఁజెల్లెండ్రు వేడుకతోడఁ
గానుకల్ మొదలగు కలవస్తువులను
గొనివెంటఁజనుదేరఁ గూరిమిమీఱ
సర్వవాద్యంబులు సాంద్రతమ్రోయ
వారకాంతలునాట్య వశతచేఁజనగ
బహువిధగీతముల్ పాఠకుల్ చదువ
వివిధవిద్యలవారు వెన్వెంటరాఁగఁ
* జనిజమ్మివృక్షంపు సవ్యభాగమునఁ
జెన్ననికెదుటను జిత్తముప్పొంగ
నిలిచితిమపుడేము నిశ్చలమతిని
బూజారిసంఘ మప్పుడుసనుదెంచి
తలుపులుదెఱచెను దాళముల్ దీసి
చిత్రజాజనకుని చెన్ననిరూపు
కన్నులపండువు గాఁగఁజూచితిమి
ఫలములుంచినజాల పల్లికస్వామి
కర్పించిశరణంబు నందెదమనుచుఁ
జనువేళఁజెన్నుఁడు సత్కృపమాని
పడమటిముఖమాయె భావమెట్టిదొకొ

* ఈ చెట్టునుగుఱించి యీక్రిందిసమాచారము తెలియవచ్చుచున్నది. ఈ జమ్మివృక్షమిప్పటికి 10 సంవత్సరములక్రిందటివరకు చెన్నకేశవస్వామికోవెలలో 'ధ్వజస్తంభమునకు నైఋతిభాగమున నైదుగజములదూరమున'' నున్నదని చూచినవారు చెప్పుచున్నారు. 20 సంవత్సరములక్రిందటనే యిది నశించినది. "ఆచెట్టు చుట్టు వలయమేర్పడి మధ్యభాగముక్రిందినుండి పైభాగమునకుతొఱ్ఱ" యయుండునదఁట. ఆతొఱ్ఱపైన కొద్దికొమ్మలుమాత్ర ముండునవియఁట. దీనిని జూచినవారందఱు తమ తండ్రులు తాతలు ముత్తాతలెఱుఁగని పూర్వకాలమునుండియు నావృక్ష మచ్చటనున్నట్లు చెప్పఁబడుచుండెనని వక్కాణించుచున్నారు. బ్రహ్మనాయఁడు మాచర్లకురాకముందే యీచెట్టు చిన్నమొక్కగా నచట నుండెననియు, వచ్చినతరువాతఁ జెన్నకేశవుని యాలయము విస్తరముచేసి కట్టించుచు నీచెట్టును గొట్టివేయక కడుమక్కువతోఁ బెంచి దానియందు మిక్కిలి యనురాగముగల వాఁడై యుండెననియు నచ్చటి జనులు పూర్వకాలమునుండి పరంపరగాఁ జెప్పుకొనుచున్నారు. "చెట్టు పూర్వమందున్నట్లు పాఁదు మొదలయిన యస్ఫుటమయిన చిహ్నములు కాన్పించుచున్నవి."

ఆవేళమానస మతిఖేదమంది
సంచలించెనుగుండె ఝల్లునఁగదలె
గద్గదస్వరములు గళములఁగలిగెఁ
దడఁబాటునడలకుఁ దార్కొనె మేనఁ
జెమటలుజాఱఁగఁ జీఁకట్లుగప్పెఁ
బరవశంబునమహిఁ బడితిమావేళఁ
దెలివొందియంతలో ధీగతనిల్పి
బటుతరకాద్రంబు భావమందలరఁ
బలికితినిబ్భంగి భయమింతలేక
అదియేమిస్వామి మాయపరాధమేమి
తల్లియుఁదండ్రియు దైవంబుగురువు
నీవకాకితరంబు నెఱుఁగ మెవ్వారి
నిహపరంబులకెల్ల నింటిదేవతవు
తనువులుప్రాణముల్ ధనధాన్యవితతి
పశుపుత్రమిత్రాది పరిజనంబెల్ల
నీయధీనములేము నీసేవఁజేయు
వారముమాకెల్ల ప్రభుఁడవునీవు
మఱవవుదాసుల మదిలోన నెపుడు
నీవాఁడననుచును నిశ్చలబుద్ధి
శరణన్నమాత్రన సంరక్షసేయు
* వ్రతమునాకంచును రామరూపమున
నానతియిచ్చితి వఖిలమువినఁగ
§ సకలధర్మంబుల సరవిఁద్యజించి
నన్నొక్కనినె శరణంబందితేని
సర్వపాపంబుల సమయఁజేయుదును
వగవకుమదిలోన వలదుభయంబు
సత్యమిామాటని సవ్యసాచికిని
దయతోడఁ గృష్ణావతారంబునందుఁ
బలికితివటుగాన భక్తితోనీవె
శరణనియంటిమి సతులము మేము
పడఁతులు మొఱపెట్టఁ బాలనగలదు
వనితలరక్షించు వాఁడవునీవు
† గౌతమభామిని ఘనమైననీదు
పాదరేణువుచేతఁ బావనంబాయెఁ

* విభీషణుఁ డన్నచే పరిభవింపఁబడి శరణార్థియై రామునివద్దకు రాఁగా లక్ష్మణుఁడు రాక్షసమాయలు నమ్మరాదని శ్రీరామునితోఁ జెప్ప నతఁడు "అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతంమమ" అని వాక్రుచ్చినట్లు రామాయణములో యుద్ధకాండమునందుఁ జెప్పఁబడినది.

§ సర్వధర్మాన్ పరిత్యజ్య। మామేకం శరణంవ్రజ। అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥ అని గీతాశాస్త్రంబున మోక్షసన్యాసయోగమునందు శ్రీకృష్ణుఁడు సెప్పిన వాక్యములనే శ్రీనాథుఁ డిచట సూచించియున్నాఁడు.

† ఈమె పేరహల్య. దేవేంద్రునితో సంగమించినదని భర్తయైన గౌతముఁ డీమెను శిల యగునట్లు శపించెను. తరువాత శ్రీరాముఁడు సీతను వివాహము చేసికొనుటకయి మిథిలాపట్టణమునకుఁ బోవుచు గౌతమాశ్రమమున నున్న యా శిలను దన పాదముతో స్పృశింపఁగనే శాపవిమోచనమై యహల్యశరీరము దాల్చెను.

కరుణచేఁగుబ్జకుఁ † గాంతఁదీర్చితివి
వల్లవీజనముల వాంఛఁదీర్చితివి
§ ద్రౌపదిమానముఁ దక్కఁజేసితివి
‡ కాచితివుత్తరఁ గడుప్రేమతోడఁ
బూనికాంతలనిట్లు పోషించినావు
ప్రాణులఁబోషింప భారంబునీది
మిక్కిలిదయగద్దు మెలఁతలయందు
నీపట్లనీమది యినుమాయెనేమి
కటకటానీకింత కాఠిన్యమేల
నీచరణంబులె నెఱనమ్మినాము
తిరిగిచూడవుమాకు దిక్కెవరయ్య
కరఁగదునీమది కాసంతయైన
నీజీవనంబేల యీదేహమేల
నీకైనప్రాణముల్ నీకర్పింతు
మబలలమనియెంచ న్యాయంబుగాదు
నెత్తురునీమీద నిండఁజల్లెదము
చూడుమాసాహసకృత్యములనుచు
నాఁగకరోష సమావేశమునఁగ
నొఱలమట్టుక కత్తు లురవడిదూసి
వక్షదేశంబుల వదలకయుంచ
మాఱుముఖంబాయె మగిడిచెన్నుండు
ఫలములపళ్ళెంబు స్వామిసన్నిధిని

---

† ఈమె కంసునికి గంధము మొదలగు పరిమళద్రవ్యములు దెచ్చియిచ్చెడు పరిచారకురాలు. ఈమెయుగుబ్జయై వక్రదేహము గలిగియుండెను. శ్రీకృష్ణుఁడును బలరాముఁడునుగలసి వ్రేపల్లెనుండి మధురకుఁబోవునప్పుడు వివిధగంధద్రవ్యములపాత్రను గంసునివద్దకుఁ గొనిపోవుచున్న కుబ్జనుఁజూచి యామెవద్దనున్న కలపములపాత్ర నడిగి తీసికొని వారిద్దరుపూసికొనిరి. శ్రీకృష్ణుఁడు కుబ్జనుమెచ్చికొని యామెకుబ్జత్వము పోవునట్లను గ్రహించెను.

§ కపటద్యూతమున ధర్మరాజు పరాజితుఁడైనతరువాత సభాంతరమున కీడ్చితేబడ్డ ద్రౌపదియొక్క పుటంబులు దుర్యోధను నిశాసనమున దుశ్శాసనుఁ డొలుచునప్పుడు శ్రీకృష్ణుఁడుకరుణించి యొకవస్త్రమువిడువఁగనే మఱియొకవస్త్ర మామెజఘనమండలమునఁ బాయకయుండునట్లుచేసి యామెమానముఁగాపాడెను.

‡ పాండవసంతాన సకలగర్భవిషయంబుగ నశ్వత్థామ యస్త్రప్రమోచనంబుచేసినప్పుడయ్యస్త్రముత్తర గర్భంబుననున్న పిండమును హింసింప శ్రీకృష్ణుఁడాపిండమును రక్షించెను.

నుత్సాహమునమంచి యొయ్యన మ్రొక్కి
చేతులుదట్టించి శిరములుబంచి
కమలామనోహర గజరాజవరద
కాంచనాచలధీర కందర్పజనక
పక్షీంద్రవాహన పన్నగశయన
శశిరవిలోచన జలజాతనాభ
పరమదయాకర పాపవిదూర
కామితమందార ఘననీలవర్ణ
మాకాంతుఁడీడేర్పు మాచన్న చెన్న
అనిసన్నుతులుచేసి యబలలమెల్లఁ
గనుమూపుపదములఁ గట్టిగానిలిపి
నియమంబుతోడుత నిల్చినవేళ
నర్చించువైష్ణవు నంతరమందు
నావేళమైపల్కె నందఱువినఁగ
గోపింపమామీదఁ గూరిమికలదు
మనములనిల్కడ మర్మంబుదెలియ
నరయంగఁదలఁచి నేనటుమళ్ళినాఁడ
భక్తికిమెచ్చితి భయమందఁగూడ
దనిపల్కనంతలో నతివేగమునను
బళ్ళెంబులోపలి ఫలమొకటెగిరి
వచ్చినాచేతుల వ్రాలినచిత్త
ముప్పొంగిజోహారు లొయ్యనఁజేసి
గుడినుండివెల్వడి కోర్కెలుమీఱ
విజనమౌదెసకేగి విప్రాంగనకును
ఫలమిచ్చిమాకెల్లఁ బంచియిమ్మన్న
నెనిమిదిఖండంబు లేర్పడఁజేసి
యొర్వురుసతులకు నారుఖండములు
మేగతోడుతనిచ్చి మేలైనదొకటి
నాచేతికందిచ్చి నాఁతితానొకటి
పుచ్చికొన్నప్పుడు పొలఁతితోనంటి
బ్రాహ్మణకులమునఁ బ్రభవించినావు
సకలజనుల్మీకు సాటిరాఁదగదు
పొలఁతిముందఱనీవు భుజియింపకమ్మ
యటుమీద మేమెల్ల నారగించెదము
నావినిబ్రాహ్మణ నారియారీతిఁ
జేసినతత్ప్రాతఁ జెలఁగి మేమంత
ఫలఖండములఁగొని భక్షణచేసి
కరముఖపాదముల్ కడిగియామీదఁ
బోయిస్వామికిమ్రొక్కఁ బూజరివచ్చి
తీర్థప్రసాదముల్ తిన్నఁగానిచ్చి
చెలువైనపదపీఠి శిరములఁబెట్ట
వెనుకనునడచుచు వేడుకతోడ
మామాగృహములకు మరలినయప్డు
గర్భంబులాయెను గంటిరినిన్నుఁ
బాలకష్టముమీద జనియించినావు
ననుఁబాసిపోవుట న్యాయమానీకు

## ఐతమ్మ శోకభరంబునఁ బలవించుట.

నెలమితోనొకనాఁడు నెదుటలేకున్న
ప్రాణంబులేభంగిఁ బట్టఁగఁగలను
జనియెనుమీతండ్రి సమరంబొనర్పఁ
దోడునీవుండిన దుఃఖంబులేదు 13/10
పోషింతువీవని బుద్ధినమ్మితిని
బడ్డకష్టంబెల్లఁ బరులపాలాయె

సంతానహీనసై చాలదినములు
బహుతరదుఃఖంబు పాలైతిఁగొడుక
స్వామిసత్కృపచేత జనియించినాఁడ
వానాఁటనుండియు నడఁగె ఖేదంబు
వేములుపూసెను వేములుకాసెఁ
గడసారిఫలములు కాములకాయె
మనుజరక్షణలేని మల్లెపూఁదోట
కడిఁజూఅపోయిన వసుపయ్యెఁదండ్రి
జలముదుక్కెనముసైఁ జల్లినభంగిఁ
గప్పినకుంపటిఁ గాల్చినరీతి
నణఁగినవగపెల్ల నధికమైపొరలె
నీడనిధానంబు నిలిచికన్నట్లు
వడ్లలోవజ్రంబు వడిఁగన్నమాడ్కి
గుడిఁజొచ్చి దేవుఁ గన్గొనినవిధంబు
కంటినిబుత్రుఁడ కాంతుతోనిన్నుఁ
దాడెక్కుపురుషుని తల్లియౌ నతికి
గడమీదవాడు శరక్కులితల్లికిని
శూరునితల్లికి సుఖమేమిలేదు
పండ్రైపుట్టిన బ్రతుకంగఁగలరు
ముందఱనీవున్న ముత్తెంబుమాఱు
దూరాననిల్చినఁ దొడరునుజాలి
కుంతాలవారికి గురుదేవకృపను
సంతానమాయెను జక్కఁగనంచు
సకలభూములజనుల్ సంతోషపడిరి
తప్పఁజూచెనుగదా దైవమీవేళ
బవరంబునకునేగఁ బైనమైనావు
వీరమాతలకును వీరభార్యలకు
విషమిచ్చిరోఁగుట విహితంబునీకుఁ
దరువాతమీతండ్రి దగ్గఱకరుగు
మనియిట్లువగచెడు నైతమ్మఁజూచి
బాలుఁడీగతిఁ బల్కెఁబటుశౌర్యమలర
నమ్మరోయిబ్భంగి నడలఁగనేల

### బాలచంద్రుఁడు వీరధర్మప్రభావంబు దల్లికిఁ జెప్పుట.

కార్యమపురమందు ఘనపరాక్రమతఁ
దండ్రులునిల్చుండి దండుసేయంగ
నేనిటనుండుట నీతియేతల్లి?
యుండుమంటకునీకు నొప్పునామనకు
నీవెఱుంగనిధర్మ మేమెఱుఁగుదునె
ప్రాకృతభామల పగిదిఁబల్కెదవు
వెఱ్ఱితనంబేల వీరునిసతికిఁ
గాయమనిత్యంబు కల్మిహుళక్కి
జలబుద్బుదవిధంబు క్షణభంగురములు
షట్చక్రవర్తులు సకలభూపతులు
చనిరిబ్రహ్మేంద్రాది సర్వదేవతలు
భూతంబులైదును బొలియుచునుండు
శౌర్యసత్కృతులు సమయవెన్నటికి
సకలపురాణముల్ సద్ధర్మకథలు
నీతిశాస్త్రంబులు నీవెఱుంగుదువు
పౌరుషాధికతచే బ్రతుకుట లెస్స
జననమరణములు జనులకునిక్క
మాలయంబుననున్న నడవిలోనున్నఁ
దప్పకతారొక్కఁ దథ్యంబుగాను

పుణ్యలోకంబునుఁ బొందుమార్గముల
వినిపింతు నేతల్లి విశదంబుగాను
* సజ్జనసంగతి సంసారమెడల
గురువుబోధించిన గుణిమీఁదమనను
నిలిపిమరణమొందు నిశ్చలుండొకఁడు
ప్రాజ్యసామ్రాజ్య సంరక్షణమందు
ఘనరణమ్మునఁ బొమ్మ గాయాలనొంద
మనసుచలింపక మరణంబునొందు
శౌర్యపరాక్రమ సంపన్నుఁడొకఁడు
వీరలిద్దఱు లెస్స వినువీధికేఁగి
యాదిత్యమండలం బరుదారఁజించి
పోయి పుణ్యంబుల భూమిఁ బొందుదురు
మొదటికార్యముఁబూను ముఖ్యతలేదు
శౌర్యంబుచేమాను సంపాద్యమగును
వినిపింతు నింకనొక్క విహిత ధర్మంబు

## బాలచంద్రుఁడు స్వధర్మ నిరూపణంబు సేయుట.

చిత్తంబునిల్పియుఁ జెవియొగ్గివినుము
ప్రప్రథమంబున బ్రహ్మనిర్మించె
వరవిప్రరాజన్య వైశ్యశూద్రులను
వేదవిద్యలయందు విప్రులనుంచె
రణకార్యముల యందు రాజులనుంచెఁ
గ్రయవిక్రయాది కార్యంబులయందు
వైశ్యులనియమించి వశులగాఁజేసెఁ
జర్చింపనీమూఁడు జాతులవారి
శుశ్రూషకులఁజేసె శూద్రులనెల్ల
సరవి నాలవజాతి జననంబునాను
వెలమలమైతిమి వీరజీవనత
విప్రులసేవింప విజ్ఞానమొదవు
క్షత్రియసేవచే శౌర్యంబుగలుగుఁ
గడువైశ్యసేవచేఁ గలుగుసంపత్తి
మేము రాజులఁగొల్చి మెఱయుచుండుదుము
విక్రమక్రమరూఢి వెలయుటఁజేసి
తమసరిగా మమ్ముదయచేయుచుండ్రు
తప్పినమమ్మట్లు దయసేయఁగలరు
శస్త్రధారులకెల్ల సమరంబు † కూడు
శౌర్యంబుచాలించి సకలధర్మములు
సేసినసత్కీర్తి చెందదుమాకు
మనువుబోధించిన మార్గమేయిదియుఁ
బరమాత్మకృష్ణుండు భండనభూమి
సవ్యసాచికిఁదెల్పి సకలధర్మముల
నటుమీఁదఁజేయించె నధికరణంబు
జనులకుఁగష్టంబు సమకూరునప్పుడు
శ్రీవీరవీర్యంబు చెదరంగఁజేయు
దేశంబు పరనృపాధీనమౌనప్పుడు
శ్రీవీరసత్వంబు చిక్కంగఁబట్టు
సామ్రాజ్యతను వెండి చచ్చెదునప్పుడు

* ఈ విషయమే శుక్రనీతియందుఁ జతుర్థాధ్యాయములో సేనానిరూపణనామ సప్తమప్రకరణంబునఁ జెప్పఁబడియున్నది.

† ఆహారము.

శ్రీవీరరక్తంబు చిగిరింపఁజేయు
రాజసేవకులకు రణసుఖంబు.
ఇదిగాక యింకొక్క హేతువువినుమి
* యలరాజుకామచే హతుఁడైన వెనుకఁ
గొమ్మభూమీశుండు కోపించినపుడు
ననఘుడు నాతండ్రి నా చెయ్యిఁబట్టి
కొనిపోయియొప్పించెఁ గొమ్మభూపతికిఁ
దీర్చునుమనపగ ధీరుఁడితండె
యిల్లడచేసితినే బాలచంద్రు
ననిపల్కెనోయమ్మ యటమటలేక
యీనాఁటనుండియు నాయొప్పగింత
నాటియున్నది నామదియందు
నాహారనిద్రల కరుగదుమనకు
కార్యమీవేళను గడిసియుండెఁ
బ్రాణమైననునిత్తుఁ బగయైనఁదీర్తుఁ
† దప్పితేవారికి దాసుండనగుదు
మనసొప్పదిందుకు మముఁగన్నతల్లి
యటలేక చెప్పితి నంతరంగంబు
బిరుదుశూరుఁడఁగాని పిన్నను గాను
మగువలుండెడు నట్టిమందిరంబందు
నుండుటశూరుల కుచితకార్యంబె
యెక్కువతల్కకయిఁక నూరకుండు
జననమరణములం చాలుపుమనకుఁ
బుట్టుపుట్టువునకుఁ బుత్రులునీకు
జన్మజన్మంబున జననులు నాకుఁ
గలుగుచుండుదు రిదికమలజునియతి
దుఃఖింపఁబనిలేదు తోయజగంధి
దీవించినన్నంపు ధీరతతోడ
భయమందకీలాగు బాలుఁడుపలుక

### భార్యకుఁజెప్పి యుద్ధమునకేగుమని బాలచంద్రునితో నైతమ్మ చెప్పుట

నైతమ్మకొడుకుతో ననియునీరీతి
సమరంబునకు నేఁగు శౌర్యవంతులకుఁ
దల్లిదీవనఁబొంది తగసతిచేత
దీవనఁగొనిపోవఁ దేజంబుసుమ్మ
నడచిరి పెద్దలీనయ మార్గమునను
మనసుంచి నామాట మన్నింపుసుతుఁడ
యనవుఁడు నైతమ్మకనియె బాలుండు
తల్లి నీదీవన తలఁగదుమాకుఁ
గులసతిదీవన కొనుటయేలాగు
నాగుర్తలుంగదు నాతిమాంచాల

* Vide foot note in page 3.

† అయితే, పోయితే, వచ్చితే ఇత్యాదిరూపంబు లసాధువులని కొందఱి యాశంబుకాని భారతమునందట్టి ప్రయోగములుకలవు. సోమయాజి విరాటపర్వంబునఁ జతుర్థాశ్వాసములో " దవ్వులనిటిగినఁబోరులు । నవ్వుదురఁటె మేలు మేలు ననునాఁగమనీ । క్రొవ్వఱుగ దేనిఁదలపడు। మివ్విధిఁజని తేమి యనుచుమత్తినభీతిన్॥" అనుపద్యమునందుఁ జని నఁనేమియనుటకుఁ జని తేమియని ప్రయోగించినాఁడు.

యేనాపెపోలిక యెట్టిదోయెఱుఁగ
మనయిల్లెఱుంగదు మగువమాంచాల
చానయింటికి నేను జనుటయే లేదు
నీమాటవినకున్న నీతికాదనుచు
వేగంబపోయినఁ బ్రియురాలుకినిసి
యెగ్గులెన్నును నాకు హీనతకాదె
సాహసల్ మూర్ఖులు సకియలెల్లెడల
మాటమంచిది గాని మనసుకత్తెరయు
పూర్వజన్మఫలంబు పొందికఁబట్టి
యాలుమగలఁ జేసె నజుఁడుమమ్ములను
నాభాగ్యమేమియు నాతియెఱుంగ
దింతికిదుఃఖంబు హెచ్చుగనుండె
నపరాధమధికంబె యమ్మనాయందు
నీసమయంబున నేనేఁగరాదు
నాతులభావముల్ నమ్మగలేను
నావినిసుతునను నాతియిట్లనియె

### ఐతాంబ మాంచాలదగ్గర కేఁగుట

నటఁజనివృత్తాంత మారసివత్తు
నిచ్చట నేయుండు మెచటికిఁబోక
యనుచు నేరాంద్రుఁడు తానందలాలెక్కి
§ గండువారింటికి గ్రక్కునఁజనిరి
ముత్యాలలఘువమ్మ ముందఱనేఁగ
ఘనరైనపేర్మిని గౌరమ్మయరిగ
దంటగా వెన్వెంట దాదులువెడలి
రైతమ్మయీరీతి నానందముగను
వచ్చుటగ్రహించి వారని ప్రీతిఁ
† జెలువొందరేఖాంబ చెల్లెంద్రవెల్ల
వివరించిపిలిచెను వేడుకతోడ
వెలమనాయునిభీమ వేగమేరమ్మ
మలినేనియాచమ మముఁజేరరమ్మ
పినమలినాయుని ప్రియురాలవైన
చందమ్మయిచటికిఁ జయ్యనరమ్మ
గోపినాయునికూర్మి కులకాంతలక్ష్మి
నముఁజేరరావమ్మ నాతియటంచుఁ
బిలిచిన వచ్చిరి ప్రియమెలరార
వారునుదానును వాంఛలుమీఱ
నైతమ్మకెదురుగ నఱిగికొంపోయి
కనకపీఠంబుల గరిమతోనుంచె
నప్పుడుమేడపై నలరుచునున్న
మంచాలదిగివచ్చి మర్యాదయొసఁగ
నత్తలకెల్లఁదాన మరంగ్రొక్కి
కస్తూరిపునుగును గలిపినయట్టి
యగురుగంధముఁబూసె నంగనలకునుఁ
జేకట్లుకడియముల్ చెలువుగనిచ్చె
మఱియును మాణిక్యమయమైనభూష
లందఱికినొసంగి హర్ష మొందింపఁ
గోమలులందఱు కూర్చున్నవేళ
వదినెయా నైతమ్మవదనంబుసూచి
వినయంబుతోడుత వెలఁదిరేఖాంబ

---

§ బాలచంద్రునిమామయైన కన్నమనేనియింటిపేరు.

† ఈమె కన్నమనేని భార్య. బాలచంద్రుని యత్త, మంచాలయొక్కతల్లి.

అక్కలుచెల్లెండ్రు నత్యంతకరుణ
నాందోళికా రూఢులగుచుమీ రెల్ల
మముఁజూడవచ్చుట మాభాగ్యమరయ
మీరువచ్చినపని మీకోడలైన
మరునిపట్టపుదంతిమాంచాలయెఱుఁగు
దక్కినవారికిఁ దరముకాదనెను
దనతల్లిమాటకుఁ దనయమాంచాల
నవ్వుచువాక్రుచ్చెనయ భావమునను
మాయత్తతనకొడుక్కు మగటిమిసెలఁగ
నాజిరంగంబున కరిగెదనన్న
నాలుదీవనగొని యరుగుమాయనెను
మొగముచెల్లమిరాక మొగిఁదలవంచెఁ
బిలిపింపుమనివచ్చె వేగనాకడకు
బ్రహ్మగార్చెనుమమ్ము బాల్యంబునందు
సమరాననాతఁడు సమసినవెనుక 14/10
వెంటనేఁగెదనత్త విడువుమీమాట
పంపుము పుత్రుని బవరంబు సేయ
ననినభీతిల్లుచు నైతాంబవలికెఁ
బరమపాతివ్రత్య పావనమూర్తి
పతిభక్తిగల్గిన పద్మాయతాక్షి
నేనువచ్చినకార్య మీ వెఱింగియును
నిబ్బంగిఁబల్కుట యేటిక్రమంబు?
పతినడఁబాయుట భావ్యంబెనీకు
నేరంబులతనివి నిలుపకుమదిని
గట్టుచేసితివేని గాఁడువాఁడిటకు
నిన్నుఁజూచినయప్డు నిలువంగనోపు
ననియిట్లువలికిన నత్తకుమ్రొక్కి

వాక్రుచ్చెమాంచాల ప్రౌఢిమమీఱ
నిసుమంతనాసౌఖ్య మెఱుఁగఁడునీదు
తనయుఁడో యుత్తరోద్వైవంబుకెఱుక
పాపపుమాటలు పలుకంగవలదు
వెలయభుజించుట వేశ్యగేహమున
విడియంబు సేయుట వెలయాలియింట
సౌఖ్యంబుపొందుట సానిధామమున
నానోముఫలమేమొ నలినజునియతిఁ
జేసినక విడిపింపఁ జేసెనానాతి
భోగంబునొందెను పొలఁతులువారు
నావనోచినయట్టి సకియను నేను
సరిచేసియీమాట సభనెన్నరాదు
నీపుత్రునడవడి నీచిత్తమెఱుఁగు
నీవుకర్తవుమాకు నేమివాక్రుత్తు
నాడవలయుమాట లాడితిఁగాని
నీబుద్ధికెన్నఁడు నే వెలిగాను
దెలవరో మదిని సందియమునువదలి
పంపుముబాలునిఁ బగతీర్చుటకును
బోయెదుపయనంపు బుద్ధిమాన్పింతు
నేడేండ్లనుండితా నేమాఱనట్టి
వేశ్యపైమోహంబు విడువనోనతుఁ
నీయానసిద్ధంబు నేకల్లలాడ
ననిపల్కి కోడలి నాలింగనంబు
చేసిపుత్తడికమ్మి చీరలురత్న
కాంచనమయమైన ఘనభూషణములు
పెట్టికోడలికప్డు ప్రియమేపుమీఱఁ
గొల్పులోపలినుండి గొబ్బునలేచి

వియ్యపురాలిని వేడ్కఁ గౌఁగిలించి
కోర్కెతో శీలాంబ కోడండ్రుతిరిగి
యందలంబుల నెక్కి యతిమోదమునను.
దమతమయిండ్లకుఁ దారేఁగి రప్పు
డైతాంబసుతుఁ జూచి యనియె నీరీతి
నావయ్య బాలుఁడ రాజులదిగుల
గండు వారింటికిఁ గదలంగ వచ్చు
వాలి చేదీవన నందంగ వచ్చు
నని చెప్పి పుత్రుని కధిక ధనంబు
మాడలు చీరలు మణిభూషణములు
కస్తూరి కర్పూర కలితగంధంబు
బాగాలు చక్కని పక్వపర్ణములు
తగువారి చేనంపెఁ దనయుని వెంట
"బ్రాహ్మణజనులకు భట్రాజులకును
నాటపాటలవారి కఖిలార్థితతికి
దాసజనాళికి దాదులకెల్ల
దానంబొసర్పుము తగినమార్గమున
నత్తలు మొదలుగ నంగనాతతికి
వినయంబుతో నిమ్ము వేర్వేర సొమ్ము
రాజుకు మంత్రివై రంజిల్లుచున్న
బ్రహ్మన్న సుతుఁడవు బహుదాతవగయ
నర్థంబుగలవారి కల్లుఁడవీవు
కీర్తిసంగ్రహబుద్ధిఁ గీలింపుమదిని
నని చెప్పి చనుమన నధికసాహసుఁడు
పొమ్మన్న మాటకుఁ బూనె హర్షంబు
వృద్ధశీలాంబకు వేడ్కతో మ్రొక్కి
రైతాంబ మొదలైన యత్తలకెల్లఁ
దిన్నఁగ సేవించి దీవనలంది
యొలమినిఁ దమ్ములు నిరువంకఁ గొలువ
బ్రాహ్మణుల్ దీవింప భట్టులు పొగడఁగ
నాటపాటలవార లాడుచు రాఁగ
సాని గేహమునకుఁ జయ్యన నేఁగి
వాకిటిముంగల బాలుండు నిలిచె
§ శ్యామాంగి యప్పుడు సఖియను జూచి
బడలియున్నదటంచుఁ బలుకుము పోయి

## బాలచంద్రుఁడు వేశ్యయింటికిఁ జనుట.

యనఁగ నా సఖియు బయటికి నేతెంచి
తలనొప్పి చేఁజిక్కి తమ మొక్క నేఁడు
పాన్పుపైఁ బొరలుచు బాధనొందుచును
న్నదియంచును నొయ్యనఁ జెప్ప
బాలచంద్రుఁడు విని పలికె నీరీతి
గరిమఁ గార్యముపూని కలనికి నేను
బోవుచు ధనమిచ్చి పోవ తెనంచు
వచ్చితి నింతలో వనితగర్వించి
ప్రేమమైసిరి రాక వెడచేతఁ ద్రోసె
భామకిప్పట్టున భాగ్యంబు లేదు
దైవమీయఁడు సొమ్ము తరుణికి నేఁడు
ననవిని చనియాపె యావార్తఁ జెప్ప

§ బాలచంద్రుని వేశ్య పేరు. మూలప్రతులయందు శ్యామయనియు శ్యామాయి యనియుఁ గలదు.

శ్యామాంగి తత్తఱమందితాలేచి
త్వరగ నాయతమాయె బాలునిఁబిల్వఁ
గస్తూరిజవ్వాజి కలిపినయట్టి
మలయజగంధంబు మైనిండనలఁది
చెలఁగుచుజాళువా చీరధరించి
రాజిల్లుహొంబట్టు రవికనుదొడిగి
కుంతలంబులదువ్వి కొప్పును బెట్టి
యలరుచునవరత్న హారచయంబు
వక్షోజయుగళంబు పైఁ జిందులాడ
గళమునఁదాలిచి కరములయందు
హేమకంకణములు హెచ్చుగ మెఱయఁ
జక్రిముత్యాల జల్లులునమర
సౌందర్యఖనియైన శ్యామాంగియపుడు
వివిధచిత్రంబుల వెలయుచునున్న
సౌధంబుపైకెక్కి స్వప్రతిబింబ
మద్దంబులోఁజూచి యటునిటుదిద్ది
యంతటదిగివచ్చి హర్షముప్పొంగ
వీరులందరికిని విడియముల్ గొనుచుఁ
గడువేడ్కబాలునిఁ గానఁగఁబోయి
పన్నీరుదెప్పించి పదములఁగడిగి
యొనమంద్రకప్పుడ యిచ్చివిద్యములు
వెలఁదిబాలునిరెట్ట విడువకపట్టి
మేడపైకెక్కించె మెలఁతసౌందర్య
మహిమనూచిరణంబుమఱచెబాలుండు
ద్వారసమీపానఁ దమ్ముల్లందఱును
గని పెట్టియుండిరి కడుభక్తిమీఱ
బాలుఁడుపవళించెఁ బట్టెమంచమునఁ

## బాలచంద్రుఁడు వేశ్యమాయలకు లోఁబడుట.

జెలియప్రేమఁ బరీక్ష సేయుటకొఱకుఁ
దలవాంచియుండెను దరుణినంటకయె
బాలునిభావంబు పల్లటంబగుట
తెలిసియాశ్యామాంగి తిన్నఁగననియె
నినుఁ బాసిదినములు నేఁటికైదాయె
నైదేండ్లవలెఁదోఁచె నక్కటనేను
నీకుసంతసమిచ్చు నెలఁతనుగాను
గరుణమాపైఁదప్పెఁ గాంతుఁడనీకు
దయదప్పినప్పుడెంత గవచించినను
నీమదికెక్కదు నేనేమొనర్తు
నామనంబెఱుఁగును నావికారంబు
విరహతాపముదొట్టి వేసటపుట్టి
† పదియవస్థలు మేనఁ బ్రాప్తించిమించ
బహువేదనలఁబడి పారంబులేక

---

† ఈ యవస్థలు మన్మథావస్థలనఁబడును. కామశాస్త్రనుసారము గానివి పంద్రెండుకాని యాలంకారికులుమాత్రము పదియని యేవిశేషించి చెప్పియున్నారు భావప్రకాశకారుఁడీ తీరునఁజెప్పియున్నాఁడు. "దశధామన్మథావస్థా భవేద్వాదశధాపివా । ఇచ్ఛోత్కంఠాభిలాషాశ్చ చింతాస్మృతి గుణస్తుతీ । ఉద్వేగోథప్రలాప

(P. T. O.)

యుసురుసురంచు నునుడుగనిజాలి
భావంబులోనుండి భయమునుబొంది
తనువుకంపింపంగఁదగు మాటమఱచి
యెప్పుడునీరూపు నేఁజూతునంచు
వాక్యంబుపల్కన వగరుపువుట్టు
నిట్టూర్పువిడుచుచు నిన్నె చింతించి
పారిసిగ్గువిడిచియు భుజియింపమాని
తపియింపదేహంబు తఱచైనకాకఁ
దడఁబడవాలుక తల్లడంబంది
జీవంబుఁదొలఁగంగఁ జింతయొనర్చి
పరవశంబుననుంటిఁ బానుపుమీఁదఁ
దలనొప్పిఘనమాయెఁ దాపంబు హెచ్చె
నీవువచ్చుటఁజేసి నీమాటవింటి
నడఁగెనుదలనొప్పి యానిమేషమున
కొంతగనీమీదనే మోహపడిన
నీమదిదయలేదు నేనేమిసేయ
ననితలవాలిచి శ్యామాంగియపుడు
కన్నీటిబిందువుల్ గ్రక్కనజారి
వక్షదేశంబున వఱదలైపాఱ
విహ్వలభావయై విలపింపఁదొడఁగ
బాలుఁడుముందటి పాటెఱుంగకయు
పట్టిదుఃఖంబని భావింపలేక
కామాంధకారంబు కన్నులఁదట్టి
శ్యామాంగినతిప్రేమ నక్కునఁజేర్చి
కాటుకచెదరంగఁ గన్నీరుతుడిచి
చెదరినకెన్నెరుల్ చిక్కులుతీసి
సీమంతమొగిఁదీర్చి చేర్చుక్కనిలిపి
కౌఁగిటబిగియించి కాంచనరత్న

---

స్యాదున్మాదోవ్యాధిరేవచ। జాడ్యంమరణమిత్యాద్యేద్వ్యేకశ్చిద్వర్ణితేబుధైః" [మన్మథావస్థలు పదిలేక పంద్రెండువిధములు. 1 ఇచ్ఛ (కోరిక) 2 ఉత్కంఠ (కోరినవానినిఁ బొందుట యందలి తహతహ) 3 అభిలాషము (సర్వాంగ సుందరుఁడైన పురుషునిఁ జూచినప్పుడుగాని విన్నప్పుడుగాని జన్మించు స్పృహ) 4 చింత (విచారము) 5 స్మృతి (తలఁచుకొనుట) 6 గుణస్తుతి (గుణములనుతించుట) 7 ఉద్వేగము (భయము) 8 ప్రలాపము (ప్రియసంశ్లిష్ట గుణములఁ బలవరించుట) 9 ఉన్మాదము (చేతనాచేతనములయందుఁ దుల్య వర్తిత్వము) 10 వ్యాధి (తాపాధిక్యము) 11 జాడ్యము (శూన్యాంతఃకరణత్వము 12 మరణము (మరణార్థమై ప్రయత్నము) అని పంద్రెండు మన్మథావస్థలు. వీనిలో మొదటిరెంటినిఁ గొంతమందిబుధులు విడిచిపెట్టెదరు. (కనుక అభిలాషము మొదలుకొని మరణముకరకుఁ బదియవస్థలగును)]. ధనంజయుఁడు పదియనియే చెప్పినాడు. "దశావస్థః సతత్రాదావభిలాషోఽథచింతనం। స్మృతిర్గుణకథోద్వేగప్రలాపోన్మాద సంజ్వరాః। జడతామరణంచేతి దురవస్థం యథోత్తరం"—దశరూపకము.

హారంబు లెదమీఁద నమరిక చేసి
కరలిమోహమునఁ జెక్కిళ్లు ముద్దాడి
యేనూఱుమాడల నిచ్చెఁ గామినికి
బాలునిఁ గనుఁగొని పల్కె నాలేమ
పైనమై వచ్చిన భావంబుతోఁ జెం
దెలుపఁగావలె నాకుఁ దిన్నని కరుణ
నన విని వాఁడు వచ్చె నపుడు బాలుండు
చెలఁగి కార్యమపూడి శ్రీయుద్ధభూమి
వీరులఁ గలయంగ వెసఁ బోవు చుంటిఁ
బ్రియురాలివని నిన్నుఁ బిలువ వచ్చితిని
బరువడి నీవును బైనమై రమ్ము
జాగు సేయకుమన్న సకియ తానవ్వి
బాలుఁడ నీకేల పట్టెను వెఱ్ఱి
యెక్కడి మోహంబ దెక్కడి పొందు
సరసుఁడవౌదువు సాటి నీకెవ్వ
రీయెడ నీబుద్ధి యెక్కడికేఁగెఁ
గాని సొమ్మునకీవు కాంక్ష చేసెదవు
జగములో నిటువంటి సమయంబు గలదె
యడవిలోఁ గాసిన యామ్లఫలంబు
నుదధిలో లవణంబు నొగిఁ గూడినట్లు
జరిగె నీకును నాకు సరససాంగత్య
మిహసౌఖ్య మొసఁగుట కేము కర్తలము
పరసౌఖ్య మొసఁగ నీ పడఁతి యొకర్త

### బాలుఁడు వారకాంతల దూల నాడుట.

యని పల్కు విని బాలుఁ డాగ్రహమొప్ప
నరవిముందఱనున్న శ్యామాంగిఁ జూచి
కుటిలాత్మ రాల నీ గుణములు తెలిసె
మటుమాయ చేఁ జిక్కి మానముధనము
నీపాలు చేసితి నేఁగానష్టైతిఁ
గామాంధకారంబు కష్టపువిద్య
నీతిమాలినచర్య నేఁటికిఁ దెలిసె
నింటిలో భోజనం బిచ్చుకు రాక
పతులయెంగిలి కాస పడితిని గాదె
యనిదూరికోపించి యామహామహుఁడు
కాలాగ్నిరుద్రుఁడై కనలుచు లేచి
పోవఁగ శ్యామాంగి పోనీక పట్టి
పకపక నవ్వుచు బాలునికనియె
నీబుద్ధి పేదది నినునమ్మరాదు
నీమదినిల్కడ నేఁగాంచఁగోరి

### శ్యామాంగి మాయాలాపంబు లాడుట.

పలికితిఁ దప్పుగఁ బట్టఁగ నేల
పురుషులనమ్మంగఁ బోసఁగదటంచు
మాటికిఁ జెప్పిరి మా పెద్దలెల్లఁ
బర్ణాగ్రములయందుఁ బట్టుకవేలు
జలబిందుతతివలెఁ జలనంబునొందు
మనసాక చందంబు మాటాకతీరు
నతివద్దనున్న పై స్వాధీనుఁడరయ
నిల్లువెళ్ళినవాని నెవరుపట్టెదరు
క్రొత్తలపైఁ లెస్స కూరిమినిలిపి
ప్రాఁతలవిడనాడు భావముంచుదురు
తమతప్పు లేమియుఁ దలఁపరులోన
నొకరితప్పులనెన్న నోడరునుమ్మ

కరుణకుమూలంబు కాంతకోపంబు
సాహసంబానరింత్రు శౌర్యసంపన్ను
లందుచేమనమున నలుగంగరాదు
మనలోనభేదంబు మానుటనీతి
నతికితేజలములు నడిమికిఁదెగవు
తరువును లతయును దంటగానుండఁ
జెట్టువినాశంబు చెందినయపుడు
తీఁగెకాధారంబు తిన్నగఁజెడును
దీఁగెనాశంబునఁ జెడిపోదుచెట్టు
మనసున నీభంగి మఱవఁగవలదు
తగఁదీఁగె నేనాదుఁ దరువవునీవు
భూమిలోఁగాంతకుఁ బురుషుఁడాదరువు
* మాయక్కకంటెను మతివేగమునను
నీతోడనైయుంత నిలయంబునూతు
ననిన బాలుఁడుమెచ్చి నప్పుడంగనను
జయ్యన నగసాలచంద్రునిఁ బిలిచి
వేయిమాడలనిమ్ము వెలఁదికిననిన
నిచ్చెను గైకొని నిందీవరాక్షి
మాపెద్దలకునీవు మక్కువనోలి
యిప్పింపుమనిచెప్పి యింతిశీఘ్రముగ
దానిచేఁబిలిపించెఁ దమతల్లి నపుడు

## వేశ్యమాత బాలునిఁ గదియుట.

కోఁతివంటిది వృద్ధ గురుతరకోపి
కోలపట్టుకవచ్చెఁ గూఁతుదగ్గఱకు
విరిగినరొండియు వ్రేలుచన్దోయి
ముశిచిపోసెనముక్కు నూఁచలుకాళ్లు
వంగిననడుమును వదలినపండ్లు
పీలచేతులుగూని పీనుఁగుమోము
చిక్కఁగనరిసిన చింపిరితలయు
వ్రాలినబొమముడి వదలినమేను
మెడనిండఁగణఁతియు మీఁగాళ్ళఁబూఁత
పలుచనిగడ్డంబు పైనఁబుల్పిరియు
మూఁతిమీసపువెల్క ముక్కురోమములు
తల వడంకును మాట తబ్బిబ్బుమఱపు
చొల్లుగాఱెడునోరు గళుగ్రంథుకంపు
కన్నులఁబుసులును గొంతుమిక్కుటము
సొక్కుచునీల్గుచు సోలుచువచ్చి
చేవెలుంగునబాలుఁ జెచ్చెరఁజూచి
యొఱగువోయిననోటి నోర్వనఁదెఱచి
పలికెఁగంపముమీఱ బాలునితోడ
దొరలఁజూచినయంత తొలగంగవలయు
వారితోఁబొందైన వడినుడివచ్చు
మాసరివారితో మాలిమిమేలు
తగినయాతఁడుమాకుఁ దక్కినయెడలఁ
జేనికిఁగాపగుఁ జెప్పినపనులు
భక్తిమైఁజేయును బశువులుసెఱయు
నలసిసొలసినప్పు డాదరుపగును
ముక్కుఁకుఁగానట్టి ముత్యంబువలదు
నామాటవినుమని నాశక్తికొలఁదిఁ
జెప్పినవినదాయెఁ జెలియనేమందుఁ

---

* బాలచంద్రుని భార్యయైన మాంచాల.

గడసారిదయసేయఁ గలవారిపొందు
నీవేమిచేసితో నీకేమరగెను
నిశ్చయించెనుభామ నీవెంటఁజనఁగ
బ్రతుకుమావద్వేరి పాలుచేసెనొక్కొ
యొకనాఁడుమాయింటి కొయ్యనవచ్చి
వేఁడినసొమ్మిచ్చి పిటకానిన్నేనఁ
జిక్కులఁబెట్టుదుఁ జీకాకొనర్తు
సంప్రదాయంబిది సకలవేశ్యలకు
మనసునీపాలాయె మమ్మెల్లవిడిచె
ననుకొన్నఫలమేమి యాపెకెతెలియు
మెల్లనిమాటకు మీఱకునీవు
నేనుగద్దించిన నిలువక్రమోలఁ
దెలిసియేయుండు నాతీరులోకమున
సాధకాలము నేను సాఁకినదాన
సత్యంబునీవెంట సాగిపోనీయఁ
గెరలిననాతోడఁ గెల్వరెవ్వారు
ననుచుఁదొడచఱచి యాగ్రహమంది
యడిగినద్రవ్యంబు నలగనాకిమ్ము
నీవెంటఁబంపింతు నెలఁతనునేను
సమ్మతిదీవింతు సర్వేశునాన
వెలయఁగఁబంద్రెండు వేలరొక్కంబు
నెలమినుంకువగాఁగ నిప్పింపుమన్న
నవిచారముగబాలుఁ డందుకునొప్పి
వెలమలదోర్నని వేగంబపిలిచి
యేడువేలధనంబు నింతికినిమ్ము
కూరిమితమ్ముఁడ కమ్మరిపట్టి
మూఁడువేలధనంబు ముదిదానికిమ్ము
కంసాలిచందన్న కడమవిరెండు
వేలమాడలనిమ్ము వృద్ధభామినికి
నని చెప్పియిప్పింప నతివదాఁగొనియుఁ
గరములుముకుళించి గ్రక్కునమ్రొక్కి
ముదినానరముకంటి ముదుసలిపలికెఁ
జక్కదనముకుప్ప సరసంపుతెప్ప
మదనునిబాణంబు మాకుఁబ్రాణంబు
దక్కించికొంటివి దగనిటువంటి
పుత్తడిబొమను నీపుణ్యముకతనఁ
జేరినదూరక సిద్ధించునట్లు
పట్టుపచ్చడమిమ్ము భక్తితోనాకు
నీమారుగాఁజూతు నేఁ బెద్దదాన
ననుచు వేఁడినవిచ్చె నప్పుడునవ్వి
యింతిదాఁబుచ్చుక యింటికినేఁగ
నీరీతిఁదనతల్లి యేఁగినవెనుక
బాలచంద్రునితోడఁ బల్కెశ్యామాంగి
యుల్లంబుచల్లనై యుత్సాహమొదవె
నెల్లికార్యమపూఁడికేఁ గంగవలయు
మల్లభూమీశుని మన్ననవడసి
గొల్లెనలోపలఁ గొలువులోనుండి
మదిలోననన్గూర్చి మఱచిపోయెదవు
రాజులుసెలవీక రారాదుమఱలి
యెన్నినాళ్ళగునొకో యీకార్యసరణి
యన్నపుఖర్చునకాకుపోకలకు
నీనున్నదేమైన నిపుడెయిప్పింపు
మనినబాలుఁడువిని హర్షంబునొంది
చయ్యనఁగంసాలిచంద్రునిఁబిలిచి

యీపెనునాల్గువేలిత్తు తమ్ముండ
యనినమంచిదియంచు నందఱివద్ద
నరసియాద్రవ్యంబు నంతయునిచ్చెఁ
దరువాతబాలుండు తరుణినిఁజూచి
హైనమైయుండుము పద్మాయతాక్షి
ఘనతఁగార్యమపూడి కదనరంగంబు
చూపింతునీమది చోద్యమందంగ
ననిచెప్పిరొప్పించి యనుజులుఁదాను
శ్యామాంగిసదనంబు సయ్యనవిడిచి
పంచవాద్యంబుల పటలిమ్రోయంగ
బ్రాహ్మణుల్ దీవింప భట్లుపొగడఁగ
నానందమునవీధి కపుడరుదెంచి
గుంపులైయున్న భిక్షువులనుఁగాంచి
వీరికందఱికిని వేఁడినధనము
కూరిమినొసఁగుము కుమ్మరపట్టి
యనిపల్కబాలుని నాతఁడుచూచి
తల్లియిచ్చినయట్టి ద్రవ్యమంతయును
వ్యయమయ్యెనేభంగి నర్థులకిత్తు
ననిచెప్పఁదమ్ముల నందఱఁబిలిచి
యడిగినవారెల్ల ననిరివ్విధమున
నాసమయంబున ననపోతులేచి
పటుకోపమునఁబల్కె బాలునితోడ
నింతగర్వంబేల యీమదమేల

## అనపోతు బాలచంద్రుని పరివర్తనను దెగడుట.

కామాంధకారంబు కన్నులఁదట్టి
క్రిందుమీఁదెఱుఁగక కేరుచున్నావు
కలధనమెల్ల భోగముదానికిచ్చి
చేసితిపాపంబు చెడ్డవెచ్చంబు
నిహపరదూరపు టీనడకేమి
శ్యామాంగిపైఁబ్రేమ సర్వనాశంబు
సోలిదానికిమ్రొక్కి సొమ్మెల్లనిచ్చి
యిందఱినడిగిన నేమిలాభంబు
వారకాంతలరీతి వర్ణింపరాదు
బిడ్డలకొసఁగక ప్రియురాలికీక
చీమలుగూర్చిన చెలువునఁగూర్చి
ధనవంతులగువారి ధనమెల్లదోఁచి
‡ ముంజికాండ్రనుజేసి మురిపెమడంప
వ్యర్థులైవిటవృత్తి వసుమతిమీదఁ
బోయిరిబ్రతికెడు పొందికలేక
యుర్విపై వేశ్యలకొలియిచ్చుటలు
వినలేదుకనలేదు వేడబంబిద్ది
యనిమాటిపలికిన నాబాలుఁడరసి
తలవంచిమఱుమాట తానాడలేక
వెలమలదోర్నని వేగమెపిలిచి
మలిచుట్టుతప్పించి మాణిక్యఖచిత
కనకమయాంచిత కటిసూత్రమపుడు

‡ బ్రహ్మచారులు

తీసిచేతికినిచ్చి దీనిమూల్యంబు
బ్రాహ్మణులకునిమ్ము భట్టులకిమ్ము
బీదవారికినిమ్ము భిక్షులకిమ్ము
నావుఁడాతండు ధనంబు తెప్పించి
సకలార్థులకునిచ్చె సంతోషమలరి
తరువాత బాలుండు తాత్పర్యమెంప్ప

## బాలచంద్రుఁడు గండువారింటి కేఁగుట

వైభవంబునగండు వారింటి కేఁగ
విపణిమార్గంబుల వెలయుచు రాఁగ
నగరప్రకాంతలు వడితోడవచ్చి
హారతులిచ్చిరి యానందమొదవ
పలుకానుకలొసంగె బ్రాహ్మణజనము
బాలుఁడుశృంగారభరితమైయొప్ప
గండువారిగృహము గదిసియావేళ
మాణిక్యతోరణ మండితంబైన
ద్వారమునందొచ్చి దాఁటుచుఁజూచె
ఘనచిత్రకర్మ సంకలితపటాలి
గోడలుకనరాక గుప్తమౌనట్లు
చేసివితానంబు చెలువొప్పఁగట్టి
సరసంబొనర్చిన చవికెలోపలను
రక్తకంబళముల రామణీయకము
నరసిచూచుచు బాలుఁడాసీనుఁడయ్యె
తమ్ములందఱువచ్చి తగినతావులను
వసియించిరచ్చట వైభవంబలర
ద్రాక్షాగుళుచ్ఛముల్ దాడిమ్మపండ్లు
నారికేళాదులు నారింజపండ్లు
జాలవల్లికలతో సరసునఁదెచ్చి
ముందఱనిల్పిరి ముదముమీఱఁగ
వింజామరంబులు విసరిరిలెస్స
బాలుఁడు సురరాజు భంగిఁగన్పట్టెఁ
గనుఁగొన్న వారల కన్నులకప్పు
డలరంగఁజెలికత్తె లతిమోదమునను
మంచాలననుపుగ మక్కువతోడ
శృంగారమొనరించు చిత్రంబులుంచి

## చెలికత్తెలుమంచాలనలంకరించుట.

సంపెంగతైలంబు చయ్యనఁదెచ్చి
మగువకుశిరసంటి మంచిగంధమున
నటకలిరాఁచిరి యానూనెపోవ
బంగారుబిందెలఁ బన్నీరుతెచ్చి
స్నానమాడించిరి సంతసంబొప్పఁ
దడితీర్చిరప్పుడు తగినవస్త్రమున
నొకపాడివసనంబు నొప్పుగఁగట్టి
కూర్చుండఁబెట్టిరి గురుహేమపీఠి
బంభరచయమును భయమందఁజేసి
కాటుకఁగాకచేఁ గందఁగఁజేసి
చీఁకటిగుహలలోఁ జేరఁగఁదించి
కాలాంబుదంబులఁ గట్టులఁజేర్చి
దీర్ఘమైనునుపైతీరైనకురులఁ 1/10
గూర్చినున్నఁగదువ్వి కొప్పుఁగీలించి
బంగారుపూచేర్లు బాగుగఁజుట్టి
మదనుసుంగముకు సమంపుపాపటను
మణిహేమమౌక్తిక మండితంబైన

చేర్చుక్కఁ జేరిచి చిత్రంబుగాను
బొలుపొందళశిరవి భూషణయుగము
పాపటకిరువంక భాసిల్లనిలిపి
మాణిక్యహాటక మయబింబమొకటి
తలవెన్కఁ మెఱయఁగ దట్టించిరెలమి
నగముచంద్రునితోడ సమమైనయట్టి
ఘనఫాలదేశంబు కాంతులుగ్రక్కఁ
గుంకుమరేఖచేఁ గుదురుగాఁజేసి
కందర్పువిండ్లను ఖండించివైచు
బొమలురెంటికిమధ్యఁ బొందికగాను
గస్తూరిబిందువు ఘటనగావించి
ముక్కునముత్యంబు ముంగరనిలిపి
చంద్రఖండంబుల సారెకుదూఱు
గండభాగంబులఁ గస్తూరితోడ
మకరికాపత్రముల్ మానుగవ్రాసి
శ్రీనవసంఖ్యలఁ జిఱునవ్వునవ్వ
వీనులు మితిలేని విభవంబునొంద
నవరత్నమౌక్తిక నవహేమయుక్త
తాటంకభూషణ ద్వయముగీలించి
ముత్యాలకుచ్చులు మునుకొనివ్రేలు
§ భవిరెలు || కుంటేండ్లు పసమీఱఁబెట్టి
కర్ణాగ్రదేశముల్ కాంతులుగ్రమ్మ
కుప్పెలముత్యాల కుచ్చులురెండు
ఘనకుంతలంబులఁ గదియించిమఱియు
కాశ్మీరకస్తూరి కర్పూరకలిత
మలయజంబలర హిమసమంపుమేన
విశదంపుగాఁబూసి విసరిరంగటను
బుప్వ్యాలబంతుల బొంగరంబులను
మహనీయకందుక మాలూరతతులఁ
జయ్యనిరసించు చన్నులపైన
బంగారుపువ్వుల పట్టుకంచుకము
తొడిగినేరుపుతోడ దూముడివేసి
ముత్యాలరత్నాల మురిపెంపుపేర్లు
పతకాలుపవడాలు భన్నస్వరాలు
వక్షమునందున వరుసగవేసి
కంబుసన్నిభమైన గళభాగమందు
ముత్యాలపట్టెడ ముదముతోఁబెట్టి
మట్టియూడలతోడ మార్కొనిగల్చి
సుమమాలికలసొంపు చూఱలువుచ్చి
చెలువొందుచుండెడు చేతులరెంట
కీలితనవరత్న కేయూరములను
దండకడియములు దంటతాయెతులు
మసకవతోఁగట్టి మనికట్టునెగువ
నీలాలగాజులు నేర్పునఁదొడిగి
పచ్చలకంకణాల్ భాసిల్లఁబెట్టి
† చామలాకడియముల్ సంధింపఁజేసి
సొబగైనచేకట్లు సొమ్ములుదాల్చి
మాణిక్యతపనీయ మంజోర్మికల

§ ఒక విధమైన కర్ణాభరణము.

|| ఒక విధమైన పూర్వకాలపు సొమ్ము. ఇవి యిప్పుడంతగావాడుకలోలేవు.

† కంకణవిశేషము.

నంగుళీంబులకెల్ల నమరంగఁగూర్చి
పాపటనవరించి బంగారుతగటు
ముయ్యంచుచేలంబు మోహనమొప్పఁ
గటియందుసంధించి గజ్జలువ్రేలు
తపనీయకాంచిని దట్టించిముడిచి
పయ్యెదరొమ్మున బాగుగఁజేర్చి
యందెలుగొలుసులు నమరఁగఁబెట్టి
ధర్మవినిర్మిత బహువిధదీప్త
* భూషణంబులువ్రేళ్ళఁ బొందుగఁబెట్టి
పదములలత్తుక ప్రకటంబుచేసి
పాఠీనపద్మాళి భ్రమనొందఁజేయు
కర్ణాంతవిస్తార ఘననేత్రములను
గాటుకవెలయించి కాంతలీరీతి
శృంగారమొనరింపఁ జెలఁగిమాంచాల
తల్లికిమ్రొక్కిడి దయరాఁగననియె
నమ్మనీయల్లుని నసలేనెఱుంగ
నేరీతిఁదలియుదు నేయుపాయంబు
పతియనియితరుల భావింపఁగూడ
దాథంగిఁజేసిన నపరాధినగుదు
హాస్యంబుసేయుదు రక్కడివారు
పంపింపుగుఱిచెప్పి పణఁతిరోయనిన
మంచాలకప్పుడు మాతయిట్లనియె
నీవటుపోయిన నినుఁజూచినపుడు
లేతురుమఱఁదులు లేవఁడువరుఁడు
గుఱుతుచెప్పితినేగు కూతురాయనినఁ
దల్లినిసేవించి తానేఁగనపుడు

మాంచాలభర్తదగ్గర కేగుట.

భూదేవితనరూపు పొలఁతినిఁజేసి
బాలునిభ్రమియింపఁ బంపెనోయనఁగ
సౌందర్యఖనియైన చానమాంచాల
నిల్చివారలఁజూచి నివ్వెఱపడఁగ
మఱఁదులాఱ్వురుగూడి మక్కువతోడ
వేగమేలేచిరి వెలఁదినిఁజూచి
పతిలేవకుండెను బ్రాహ్మణోత్తముఁడు
లేచినఁబాపంబు లేనుకుఁజెందు
ననుచులేవకపోయె నపుడుమంచాల
యిద్దరిలోభర్త నెఱుఁగఁగలేక
కాంచనవర్ణ ప్రకాశుఁడైనట్టి
బ్రాహ్మణుఁడనపోతు పాదంబుపట్టి
పన్నిటఁగడుఁగంగ భావనసేయ
భయమునవపోతు పలికెవేగంబ
నేనుబాలుఁడగాను నిజముమాతల్లి
మఱఁదిబ్రాహ్మణుఁడను మగువనానామ
మనపోతునాఁబిల్తు రందఱుజనులు
విప్రుఁడీరీతిని వెలఁదితోఁబలుక
ననవోతుతోననె నపుడుమాంచాల [గ
మఱఁదినౌనాయెఱుఁగను మగఁడొకోయెఱుఁ
భయమొందనేటికి బ్రాహ్మణోత్తముఁడ
యనిపల్కుమాంచాల కావిప్రుఁడనియె
నమ్మనీపెనిమిటి యతఁడు; నామంబు
బాలుండు; శాత్రవ భయదుండునుమ్మ

* కాలివ్రేళ్ళకని యర్థము.

నీమనోహరు సేవ నిరుతిమైఁజేసి
తరువాతమమ్మెల్ల దయనాదరింపు
మనినంతనతనితో నాలేమపలికె
వినవయ్యవిప్రుఁడ విన్నపంబొకటి
యిద్దఱికినిమీఁద లెలమితోఁబెండ్లి
చేసెదునాఁడొక చెనఁటివిప్రుండు
చూడఁగనోపక సూయమెంపొంద
సౌందర్యమన్నది చానకున్న
యెట్లుగావించిరి యీవివాహంబు
ననిపల్కెనోయేమొ యటుకాకయున్న
బాలుఁడివ్విధమున భావంబువిడిచి
నన్నేలవిడనాడు నయమార్గమెడలి
పతికినినాకును బ్రాప్తమేలేదు
బాలచంద్రుండిప్డు వచ్చెనుగనుక
నేనుపూర్వమునందు నియమంబుతోడఁ
జేసినతపమంత సిద్ధించెననుచు
హర్షంబునొందితి నాత్మలోపలను
బాలుఁడుమమ్మేఁకఁ బాయకయున్న
మాభాగ్యమిల నసమానంబుగాదె
బ్రహ్మకులంబునఁ బ్రభవించినావు
వేదాదివిద్యల విజ్ఞానివనుచు
నీచరణంబులు నేనుబూజింపఁ
బట్టితినాకన్య భావంబులేదు
మనసునిశ్చయమిది మఱిదినాకంచు
ననువొప్పఁగాబల్కి యాత్మేశుఁజూచి
పన్నీరుదెప్పించి పాదముల్గడిగి
వచియించెనిబ్బంగిఁ బ్రౌఢిమమీఱఁ
బ్రాణాంగనలఁగన వచ్చెదునప్పు
డితరులఁదెచ్చుట యేపాటినీతి?
యనినబాలుఁడుపంపె ననుజాలనెల్లఁ
బోవుచుఁజెప్పిరి పొసఁగనవ్వచను
బవరంబునకు నేగ పయనంబునిలిచె
మనకుభయంబండె మఱ్ఱవమీఱెఁ
గులవైరమునుదీర్చ కోరికేమాకు
బవరంబునకు నేగ పైనమేమాకు
నవ్వరాయీమాట నాయకుల్విన్నఁ
గలనిలోనున్నట్టి ఘనులెవ్వరయ్య
యీసుఖమేదక్క నెవరునాకేల
యనిమాడఁగూడునా యపకీర్తిఁవచ్చు
ననిపల్కవాక్యంబు లాలించియపుడు
బాలచంద్రుఁడుపల్కె భ్రాతలతోడ
నింత గానాకుమీ రేల చెప్పెదరు
బవరంబునకు నేగ పైనంబుమఱఁ
గులవిరోధములోనఁ గుములుచుండెఁ
గాయుమిచ్చుటబుద్ధి కలనిలోపలను
నివసించియున్నది నిశ్చయంబిదియు
శ్రీగిరీశునియాన చెన్నునియాన
మాయమ్మమాటకు మాఱాడలేక
యిటువచ్చినాఁడమీ రేమిచెప్పెదరు
గయమునవచ్చెద రమ్మందు రేని
మీరెల్లనిలుమన్న మీఱక నిల్తు
నెన్నినాళ్లుండునే నెఱిఁగింపుఁడనిన
నేడుజాములదాఁక నిచ్చోటనుండు
మంతటమిఱవచ్చు నరగంగవలయు

సర్వజ్ఞుఁడవునీవు జడులము మేము
వచ్చెనాయపకీర్తి వచ్చునందటికి
నొత్తిచెప్పుటమాను నుచితధర్మంబె
యనుచునువాత్రఁబుచ్చి యాకొల్వుకెడలి
తమతమయిండ్లకుఁ దమ్ములుచనిరి
తరువాతమాంచాల తనభర్తయైన

### బాలచంద్రుఁడు నతనిభార్యయు సంతఃపురంబునఁ గ్రీడించుట

బాలచంద్రునితోడ బహుమోదమునను
మేడమీదికిఁబోయి మేలైనయట్టి
చిత్రర్వుఁజూపుచుఁ జిలుకలచదువు
వినిపించిశృంగార విపినంబుఁజూపి
పెద్దలుతనమీదఁ బ్రియమూనియుంగఁ
బ్రొద్దుపోవుటకునై పొందించినట్టి
ధర్మపాంచాలికా ప్రతతినిఁజూపి
యందులోనొకబొమ్మ నాడింగఁజేసె
నందుకునాబాలుఁ డానందమొందె
నటుమీదనిద్దఱు నధికమోహమునఁ
జిత్రర్వుమేడకుఁ జేరిబాలుండు
హంసతూలికపాన్పు నందుఁబరుండె
బ్రియురాలుముత్యాల పీఁటమైనుండి
తాంబూలమిచ్చుచుఁ దనమదిలోన
బాలునిభావంబు బాగుగనెఱిఁగి
యాయత్తపడివత్తు ననిమ్రొక్కిలేచి
జననియొద్దకుఁబోయి జలకంబులాడి

### మాంచాలతల్లిదగర కేగుట.

ముత్యాలుగూర్చిన ముంగొంగుమెఱయఁ
బ్రతిమలువ్రాసిన పట్టువస్త్రంబు
కటియందుధరియించి కనకమాణిక్య
నానాక్తికసంయుక్త మంజులంబైన
భూషణవితతిసొంపుగఁ బెట్టికొనియుఁ
జెలఁగిపాదముల మంజీరయుగంబు
సంధించిముత్యాల జల్లులువ్రేల
బహువిధశృంగార భరితురాలగుచు
బిడ్డలయాశలఁ బ్రియమునఁదీర్ప
జననితోసమమైన జంతువులేదు
గావునఁదనకున్న కష్టంబులెల్లఁ
బోగొట్టుననియెడు బుద్ధితోనాపె
తల్లితోడుత నివ్విధంబునఁబల్కెఁ
గాంచకకాంచక కాంచితిఁబతినిఁ
గాంచితినేకాని కలలోనివాతఁ
కదనరంగమునకుఁ గదలుచున్నాఁడు
చిరవియోగముమాకు సిద్ధించునొక్కొ
దైవమీలాగున దయదప్పినన్నుఁ
బుట్టింపఁగానేల (భూస్థలిమీద)
నడవిగాసినవెన్నె లాయెనాబ్రతుకు
తల్లిరోనేనెట్లు తాళఁగలాను
(బాలునిఁబోకుండఁ బట్టుటయెట్లు
దరియేమినాకని తల్లడంబందఁ
దరుణియిట్లనిపల్కెఁ దనయనుఁజూచి

### రేఖాంబ తనకూతురైన మాంచాల కుపదేశించిన జ్ఞానప్రకారము.

ముద్దులమాంచాల ముదమున వినుము
జన్మవృక్షమునఁ జనిగలయట్టి
పటుతరకమనీయ ఫలములు రెండు
శరలుభోగములొందు కీర్తి రెండవది
తొలుపండు చవిచూచి తొలఁగునొకండు
మలుపండు చవిచూచి మలఁగునొకండు
వీరలిద్దఱికిని భేదంబు హెచ్చు
మొదటిఫలంబున మొనసెడురసము
క్షురభగురంబది సమసిపోఁగలదు
రెండవఫలమున రెక్కొనురసము
శాశ్వతంబౌచు దిశల్ గలదాఁక
సవితృఁడుగలదాఁక శశిగలదాఁక
తారలుగలదాఁక ధరగలఁదాఁక
వారిధిగలదాఁక వరలుచునుండుఁ
బ్రకటఫలద్వయ రసమునుగ్రోలి
యనుభవించెదు వారలరుదు భూస్థలినిఁ
బ్రాకృతజనములు ప్రథమఫలంబు
బ్రాపించిసంతృప్తి వడయంగఁగలరు
వీరాంశమునఁబుట్టి వెలయువారలకు
మొదటిఫలంబది ముఖ్యంబుగాదు
మహిమాస్పదంబయి మనసుజ్వలింపఁ
బరుగెత్తుదురు రెండవఫలంబుకొఱకు
వెలఁదిరో నీభర్త వీరశేఖరుఁడు
కీర్తికాముకుఁడయి కేరుచున్నాఁడు
నీవుభోగములపై నిరతిఁద్యజించి
బాలచంద్రుని మనోభావంబెఱింగి
భావిమానవుల హృద్భవనంబులందుఁ
దావకీనయశోల తావివర్ధనము
సేయంగఁగోరుము చెలువరో యిపుడు
బాలచంద్రుని నాఁగఁ బట్టంగవలదు
నావుఁడు మాంచాల నమ్రతతోడ
జననికిఁదా నమస్కారంబుచేసి)
భర్తదగ్గరకేగి భక్తితో నిల్వఁ
(దనమది బాలుండు తలపోసెనిట్లు)
లెక్కడిసౌందర్య మెంతయొయ్యార
మేమనియెన్నుదు నీచెల్వచెలువు

### బాలచంద్రుఁడు తనపూర్వప్రవర్తనకుఁ బశ్చాత్తాపమొందుట

నరలోకసురలోక నాగలోకముల
సరిలేరు భామను సౌందర్యగరిమ
నిటువంటికాంతపై నిచ్చఁబోవిడిచి
పశుబుద్ధితోడనే భావంబుమఱచి
నిందపాలైతిని నిఖిలరాజ్యములఁ
బరలోకసౌఖ్యంబు పాఱఁదోలితిని
మిత్రులుచుట్టాలు మేటిబంధువులు
తిట్టిదూషింతురు తెలియలేనైతి
నాశ్రితజనముల నగయుటమాని
పరియాచకులకిచ్చు భ్రష్టమానవుల
చందంబువాఁడనై సతిగోడఁబాసి
వెలయాలిఁ బ్రేమించి వీటఁడినైతి

నేఁగతిఁజింతింతు నేమందు విధిని
నాకర్మఫలమేమొ నాగతియేమొ
తరమెనా కెఱుఁగంగ దైవంబెయెఱుఁగు
ననితలపోసెడు నాబాలుఁజేరి
మాంచాలగూర్చుండె మక్కువతోడ
బాలుండు మోహంబు ప్రకటంబుచేయ

### బాలచంద్రుఁడు భార్యతో వినోదంబులు సల్పుట-

జేవేగమునఁజీర చెంగునునొడిసి
పట్టిననాచీరపై నున్నయట్టి
ముత్యాలచేరులు మొదటికిఁదెగెను
జెదరిరాలినఁగని చెలియభీతిల్లి
చిన్నవోయెను మోముచెలువెల్లదొలఁగ
కెలఁదివెల్వెలఁబోవ విభుఁడప్పుడనియెఁ
జింతింపఁబనిలేదు చిత్తంబులోన
నంతకుబాగుగ నమరింతుఁజీర
ననిలేచిసంభ్రమ మచ్చుపడంగఁ
జెక్కులుకరములఁ జెన్నుగ నిమిరి
దగునేర్పుతోడ ముత్యంబులనెత్తి
చీకాకుపడఁజేసి చిక్కులఁబెట్టి
కాలంబునీరీతిఁ గడుపంగమించి
జాములేదనుదాఁటెఁ దరుణిమాంచాల
బాలునితోననె భావంబెఱింగి
నాతోఁబెనంగిన నయమేమిలేదు
కడుపడిఁగలనికిఁ గదలఁడివీరు
పలహైరముండీర్చు గురుసాహసుండా
పరికించిచూడనె వ్వరుమీరుదక్క
ననిపల్కుచుండంగ నాసమయమున

### బాలచంద్రుని యనుజులు దుందుడుకు సేయుట-

నతిశౌర్యులైనట్టి యనుజులువచ్చి
గండువారింటిదగ్గఱఁ జేరినిలిచి
ధ్వనియొనర్చిరి హెచ్చు తమకంబుమీఱ
వినిబాలుఁడడిగెను వెలఁదినిఁజూచి
మేడపైచెన్నుని మేలైనసేవ
యనితెల్పఁగా బాలుఁడానక్తితోడ
వకాక్తికమాలల మరుపఁగఁడంగఁ
దమ్ములందఱునప్డు తత్తఱపడుచు
ఘనరౌద్రముగనుంచు కత్తులుదూసి
వెడలినకోపాగ్ని వీరులేద్వేసను
మారెఱుంగక కేరు మదకరులట్లు
నగరుతల్లడమంద నాతులుబెదర
భీకరంబుగనార్చి పెడబొబ్బలిడిరి
యదిబాలుఁడాలించి యాయూథమంది
గోడకోడకుమంచు నువిదలఁబలికి
పెనఁగొన్నకోపానఁ బెగికికటారి
యట్టహాసముచేసి ననుజులమీఁదఁ
బలికిరితమ్ములు బాలునితోడఁ

### బాలచంద్రుండనుజులపైఁ గవయ వారు లజ్జాకారంబులగు మాటలాడుట.

ద్రుప్పుపట్టినకత్తి దూయుటతగనె

ఘనమైనశౌర్యంబు గలవాఁడవార
ప్రబలుచునున్నట్టి వైరులవిడిచి
యనుజాలమీఁదనా? యౌద్ధత్యకలన
భోరునఁగార్యము పురమునకేగు
సమరకార్యమునీవు చాలించినావు
కొలువులోమామామ కొమ్మభూపతికి
నిల్లడచేసెని స్నెలమిబ్రహ్మన్న
యలరాజుపగఱచే హతుఁడైనవెనుకఁ
బెండెంబునందెయు భేతాళమనెడు
ఖడ్గంబుమొదలైన కలబిరుదముల
నొసఁగుమంచునునీవు నుర్వీశుఁడంపె
వినుమినుమునురాగి యిత్తడికంచు
పెట్టిచేసినయట్టి బిరుదులుగలవు
రజతజాంబూనద రచితమైనట్టి
వెలలేనిసొమ్ములు వెసనీవుఁదక్క
సన్నుతికెక్కనీ సరసత్వమెల్లఁ
గట్టేఁడివాఁడవు కరుణలేదాయె
మనయక్క వెలలేని మాణిక్యమరయఁ
జచ్చియాకైలాసశైలంబునందు
నలరాజుఁగలసెను నాశ్చర్యముగను
సరసిజలోచన చావువిన్నపుడు
దరికొనదా? మది దావాగ్నిరీతి
నన్నమెట్టులులోని కరుగునునీవుఁ
గంటికినిదురయే గలివచ్చునయ్య
బంటుతనంబునుఁ బాడియువిడిచి
కులవైరముందీర్చ కోరికవదలి
యింటికాసించుట యేనీతియగును?
బాలుఁడమమ్మంపు బవరంబునకును
గులవైరముందీర్చి గురుశౌర్యమమర
దక్కించెదమునీవు దరిలేనికీర్తి
ననినబాలుఁడువిని యడఁకువమీఱ
సిగ్గుచేఁదలవంచె శీఘ్రమెతిరిగి
మాంచాలమందిర మార్గంబుపట్టి
పురుషునిరాకడ బుద్ధిగ్రహించి
వాకిటిపొంతను వడినెదురేగ
నతివచేతికిబాలుఁ డాయుధమిచ్చె

### మాంచాల భర్తనుదీవించి ఖడ్గంబు చేతికిచ్చి యుద్ధమున కంపుట.

నవ్వుచుదీవించె నలినాయతాక్షి.
రతిరాజసౌందర్య రణరంగధీర
కమలబాంధవతేజ కరుణాలవాల
వినతాత్మజునిలావు వెసనీవుగలుగు
సామీరిసమమైన సాహసంబబ్బఁ
గృష్ణునికెనయైన కీర్తిఘటిల్లు
రవికాంతియుతుఁడవై రంజిల్లుచుండి
యలరాజుపగదీర్చు మనుజాలకోడఁ
బటుతరవిక్రమ ప్రౌఢిమ మెఱయ
శ్రీగిరిలింగంబు చెన్నకేశవుఁడు
వరములొసంగఁగ వర్ధిల్లఁగలరు
శాత్రవవిజయంబు సమకూఱువీకు
నీయాయుధము వడినిచ్చునుజయము
కలియుగంబునవీకు ఘనపూజలమరు

ననిప్రాణనాథుని నాశీర్వదించి
యాయుధంబిచ్చిన నతఁడుగైకొనియె
బాలునితోఁ బల్కెఁ బడఁతిమాంచాల
కలహంబునకుమీరు కదలుచునుంటి
రపజయజయములు హరునకుఁ దెలియు
విప్రుఁడాయనపోతు వెంటరాఁదలఁచు
బ్రహ్మహత్యసుటిల్లుఁ బాపమువచ్చు
బహుజన్మములకైన బాయదాకీడు
* పరమేశ్వరుండైన పార్వతీశ్వరుఁడు
పాపికోనఁగలేక పలుపాట్లువడియె
మనుజులెంతటివారు మదివిచారించి
మగుడంగఁబంపుము మారుచేనైన
ననినసమ్మతమొంది యపుడుబాలుండు

---

* శివునికి బ్రహ్మహత్యయెట్లు సంభవించెననగా ;—

తొల్లిబ్రహ్మ మేరుపర్వత కూటస్థలియందుఁ గొల్వుతీరియుండఁ బరతత్వంబెద్దియో తెల్పుమని సభాస్తారులైన మునీంద్రులతని నడుగ నేనేపరతత్వమనియు నేనొక్కరుండ నీశ్వరుండననియు నాకధీశ్వరుండులేఁడనియు బ్రహ్మవాక్రుచ్చె. అంతట నచటనున్న క్రతుపురుషుండు దర్పోజ్జృంభితుఁడై బ్రహ్మతో నీవు లేనిపెద్దతికంబు వహించెదవు. నేను సాక్షాన్నారాయణుండను యజ్ఞపురుషుండ, జగత్ప్రభుండనని పలికెను. వీరిద్దరిట్లు పరస్పరజయకాంక్షులగుచుఁ దమతారతమ్యంబు వేదంబులనడిగిరి. చతుర్వేదంబులును రుద్రుండద్వయతత్వం బన్యులయందాశబ్దవాచ్యత్వంబు సంప్రతిష్ఠితంబుగా నేరదని సాక్ష్యంబిడియె. వల్లకాటియందుఁ గాంతాసహితుఁడైయుండు రుద్రునకుఁ బరబ్రహ్మభావంబెట్లుకలుగునని విరించియు యజ్ఞపురుషుఁడును వేదంబుల సాక్ష్యంబంగీకరింపరైరి. పిమ్మటఁ బ్రణవంబుమూర్తిమంతంబై రుద్రుండే పరమాత్ముయని చాటిచెప్పెనుగాని ప్రణవ వాక్యంబులంగూడ నిరాకరించిరి. అప్పుడొకయఖండ దివ్యతేజో మధ్యంబున హరుండుద్భవించెను. అతనింజూచిబ్రహ్మ ఓయిశివుఁడా నీవు నాలలాటస్థలంబునఁ బుట్టితివిగాన నీవు నాపుత్రుఁడవు నన్నాశ్రయించి బ్రతుకుము నావుఁడు భర్గుఁడు నితాంతరోష సంరంభంబున విజృంభింప భైరవుఁడుపుట్టెను. భైరవుఁడు శివునాజ్ఞనొంది గర్వించుచున్న బ్రహ్మయొక్క పంచమవదనంబు నఖరధారంద్రుంచివైచెను. యజ్ఞపురుషుఁడు, విరించియునంతట భయపడి స్తోత్రంబుగావించిరి. శివుఁడు భైరవునింజూచి యిఁకనీకోపంబు చాలించి బ్రహ్మకపాలంబుదాల్చి, లోకాచార ప్రకటనార్థంబు భిక్షాన్నంబుఁగొనుచుఁగాపాలికవ్రతముతోఁ జరియింపుమని చెప్పెను. తరువాత శివుఁడు బ్రహ్మహత్యనుసృజించి భైరవుని వెంటఁబంపెను. బ్రహ్మహత్యతోడనవర్తింప, జగమ్ములు గ్రుమ్మరుచు నొక్కనాఁడు

### ఐతాంబ, కుమారుని దీవించి యుద్ధ రంగమున కంపుట.

మాంచాలవీడ్కొని మనసు చలింపఁ
దనయింటికేతెంచి దండిశూరుండు
తల్లిచేనన్నంబు తానారగించి
చందనపరిలిప్త సర్వాంగుఁడగుచుఁ
దగటువస్త్రంబులు తగఁజుట్టితొడిగి
భర్మమౌక్తికరత్న బహుభూషణములు
తగినయంగములందుఁ దాలిచిమించి
తల్లికిమ్రొక్కినఁ దనరదీవించి
సురనాథు విభవంబు సొంపొప్పఁగలుగు
వీరభద్రునిసాటి విజయంబుగలుగు
వినతాసుతునివంటి వేగంబుగలుగు
రఘునాయకులవంటి రాజసమొప్పఁ
పవనపుత్రునివంటి బలముసిద్ధించు
విచ్చేయుమనితల్లి వేడుకఁబలికెఁ
దగినట్టిదీవన తల్లిచేనంది
దట్టమౌకోపానఁ దనమొగసాల
కరుదెంచియాబాలుఁడానంద మొంది
§ భూమండలపుకోటఁ బొందుగఁగెలిచి
పాండ్యులఁజేకొనెఁ బటువిక్రమమున
‡ బలువైనజగజంపు భద్రసాళేయు
మదియంపుమని చెప్పియంపెఁదల్లికిని

భైరవుఁడు కాశీపట్టణంబుఁజొచ్చెను. చొచ్చినంతనే బ్రహ్మహత్య మొఱవెట్టుచుఁ బాతాళంబునఁబడియెను. కరంబుననున్న బ్రహ్మకపాలంబు భూతలంబునంబడియెను. ఈశ్వరరూపాంతరుండైన భైరవునికి బ్రహ్మహత్యా పాతకంబుతొలఁగిపోయెను. అనియివ్విధమున స్కాంద పురాణాంతర్గతంబైన కాశీఖండంబునం జెప్పఁబడినది. బ్రహ్మ పంచముఖుఁడైయుండిన కాలమున నొకనాఁడు త్రిమూర్తులు కొల్వుదీరియుండఁ బార్వతి యచటికివచ్చి పంచాననులైన శివబ్రహ్మలలోఁ దనభర్తయెవ్వరని తెలిసికొనలేక విభ్రాంతిచెంద శివుఁడు కనుసైగచేసెను. ఆకనుసన్న నెఱింగి పార్వతి శివుని వద్దకుఁబోయెను. తనభార్య కింతభ్రాంతికలుగుటకు బ్రహ్మకైదు ముఖములుండుటయే కారణమని గ్రహించి యాయైదు ముఖములలో నొకదానినిఁ దీసివైచి యతఁడు బ్రహ్మను జతుర్ముఖునిం జేసెను. అందుకు బ్రహ్మకోపించి శివునకుఁ గాపాలికత్వమును భిక్షావృత్తియుఁగలుగునట్లు శపియించెను ఈబ్రహ్మహత్యా పాపనివారణకొఱకు విష్ణుబోధితుఁడై శివుఁడుతీర్థయాత్రచేసెను. ఇట్లు తీర్థయాత్ర సల్పుచుఁ గాశీపురికిరాఁగా నచటనప్పాపమువలన విముక్తుఁడయ్యెను. అని మఱియొకగాథగలదు.

§ సత్తెనపల్లి తాలూకాలోని ధరణికోటయై యుండును.

‡ ఇది ఛత్రనామము.

దనయునివాక్యంబు తామీఱలేక
తెప్పించియిప్పించె దీవనతోడ
రాచబిరుదులంది రణరంగమైన
కార్యమపురిచేరఁ గదలఁగఁదలఁచి
మేడపివెడలెను మితిలేనిపటిమఁ

### అనపోతును వెనుక కంపుటకు బాలచంద్రుఁ డుపాయంబు పన్నుట.

దోడిఁబడి బాలచంద్రుండూహచేసి
తమ్ములకెఱిఁగించి తనమర్మమెల్లఁ
గనుచూపుమేరను గదలకనిలిచి
తమకంపువైనానఁ దగుమోసమాయె
నేమిచేయుదునింక నిటమీఁద నేను
మసలియీపైనంబు మానితినేని
దుశ్శకునంబగుఁ దోషమునుగీడు
కమ్మరపట్టినా కూర్మితమ్ముండ
వడిలోడఁజనుము మీవదినెనుగనుము
ముత్యాలగళమాల ముద్దుటుంగరము
మఱచివచ్చితిఁ దెమ్ము మసలకయిప్పు
డనినఁగుమ్మరిపట్టి యతనితోననియె
ననఘాత్మనాదేహ మలసటనొందె
నడవనోపఁగలేను నరకుంజరంబ
యెఱుకఁజాకలచందు నాలాగుపలికెఁ 18/10
గమ్మరపట్టియీ కరణివచించె
మేడపికేగద మెలఁతఁజూచెదను
రయమునమిముఁజేర రాలేననుమ్మ
వెలమలదోర్నీని వేడనిట్లనియె
నీప్రొద్దుతిరిగిరా నేనలసితిని
గలయవచ్చెదరేపు కలనిలోపలికిఁ
గోడువయిద్దఱివేడి కొనినంతవారు
పోలేమటంచును బొంకిరివేగ
నంతనవ్వుచుబాలుఁ డనపోతుకనియె
నమ్మినతమ్ముఁడ నయశాస్త్రవిదుఁడ
పేరమ్మతనయుఁడ పెద్దనపౌత్ర
ఒడ్డిమల్లపరాజు నొయ్యారిపట్టి
యందనితరువుల యాకులుదీసి
వ్రాయుదులెక్కలు వసుధేశతతికి
బ్రహ్మవంశజలోక పావనమూర్తి
నాయాత్మసఖుఁడవు ననుఁజేరరమ్ము
గ్రక్కునవదినెనుఁ గనుఁగొనివేడి
ముత్యాలగళమాల ముద్దుటుంగరము
కొనితెమ్ముతమ్ముఁడ గురునీతిపరుఁడ
యనననపోతు చిహ్నంబులనడిగెఁ
బెనఁగొన్న వేడ్కతోఁ బీఁటపైనుండి
ముత్యాలుగూర్చిన మొనచీరకొంగుఁ
జేపట్టియీడ్చినఁ జెదరెముత్యములు
కనికూర్పఁగాఁబోవఁ గనుపట్టదాయె
నిదియానవాలని యింతితోఁబలుకు
హితవొప్పసానివా రింటికిఁబోయి
యడుగువారానవా లడిగినఁజెప్పు
మరఁటిఫలంబుల నమరుచర్మంబు
ఫలమనియిచ్చెను బడఁతియావేళ
నిదియానవాలని యెఱుకగఁబల్కు
మనిచెప్పిపొమ్మన్న నప్పుడెకదలి

వడిఁబాదఘట్టన వశిమునధూళి
చనివేగవినువీధి సాంద్రమైపర్వ
నరహరియశ్వారుఁడయి యనపోతుపోయె
బాలుఁడుబ్రాహ్మణుఁ బలుసేర్పు మెఱయ
మాయామతంబున మగుడఁఖండించి
తమ్ములుదానును దాత్పర్యమునను
గడువడిఁ * త్రిపురాంతకమునకువచ్చి
యచటనాసక్తితో నాసీనుఁడగుచుఁ
దప్పించెఘంటంబు తీక్ష్ణనయాశు
గ్రాసినాఁడొకయుత్తరము స్వహస్తమున
నదిరావికొమ్మల కంటఁగట్టించి
వీరులేఁగినత్రోవ వెంబడినడచెఁ
బల్లెలవారల్లఁ బాలునిఁజూడఁ
జనుదెంచిరెంతయు సంతసంబొప్ప
ముటుకూరికాపులు మ్రొక్కుచునరిరి
విందారగింపుఁడు విశ్రమింపుండు
తరువాతఁదరలుట తగుకజనంబు
వినుమన్నవారితో వీరుఁడుపలికెఁ
గార్యమపురమునఁ గదిసెనుబోరు
నిల్వరాదిచ్చోట నిల్వుఁడిమీర
లీరీతిననిబాలుఁ డేగినవేళ
† గరికపాటనుగల కాపులువచ్చి
కని మ్రొక్కినంతట ఘనుఁడువారలకుఁ
బోఁకలాకులొసంగి పొమ్మనిపంపె
§ మేళ్ళవాఁగును జేరి మితిలేనియట్టి
పోటుమూఁకలు వెంట బొబ్బరింపంగ
ఘనశైలగహనముల్ కనుమలుగడచి
తార్క్ష్యుండుగిరులపై దాఁటినయట్లు

## బాలచంద్రుఁడు నలగొండను డాయుట.

భానునిపైరాహు పరువెత్తినట్లు
భయవర్జితుండయిన బాలుఁడార్చుచును
బరదళంబులువిన్నఁ బరుగెత్తిపోవ
నరసింగభూతల నాథుఁజిత్తమునఁ
గులవిరోధమునకై గుతిచేసినిల్పి
కోదమసింగంబులు గూడినభంగి
ననుజాలువెనువెంట నరుగుదేరంగఁ
¶ గురువకునేతెంచె గురుశౌర్యమమర
నెక్కినా ‡ నలగొండ యెదురేమిలేక

* మార్కాపురమున కీశాన్యముగ 2 మైళ్ళ దూరమునఁ గర్నూలు జిల్లాలోనున్నది. శ్రీశైలమునకుఁబోవు త్రోవలోనుండును.

† Vide foot note in page 8.

§ Vide foot note in page 8.

¶ దీనినే నాయకురాలి కనుమయని చెప్పుదురు. ఈ కనుమగుండ నాగులేఱు ప్రవహించును. ఇది కార్యమపూడికిని మేళ్ళవాగునకును మధ్యనున్నది.

‡ ఈకొండ నాయకురాలి కనుమవద్దనే యున్నది.

(కుంజర సైనిక ఘోటకావళుల
బృంహిత భాషిత హేషితంబులును
బటహారావంబులు ప్రబలుచునున్న)
కార్యమాపూడిశ్రీ కదనరంగంబు
(బాలుఁడంతశ్శక్తి ప్రజ్వలింపంగ)
నలగొండశిఖరంబు నన్నిల్చిచూచి
కుమ్మరపట్టిపైఁ గుడిహస్తముంచి
వెలమలదోర్శ్నిని వెసఁజేరఁబిలిచి
ప్రథితుఁడాయలరాజు పగదీర్పవచ్చి
యొక్కఁడనేగుట యుచితంబుగాదు
వెనుకఁజిక్కినయట్టి వీరపుంగవులు
కలయవచ్చినదాఁక గడియకాలంబు
విశ్రమింతమటంచు వేడ్కతోనుండె
* నటముస్నకలని లోనైనకార్యంబు
వివరంతుజనులకు విశదంబుగాను
నలగాముకొల్వులో నాయకురాలు

## సంధికయి నాయకురాలు రాయబారమంపుట.

తలపోసిమదిలోనఁ దగినవారలను
వాసిగబ్రహ్మన్న వద్దకుఁబంపి
బవరంబుగాకుండఁ బట్టుటకార్య
మని పెద్దలనఁదగు నాప్తవర్గమును
గొండ † యన్నమరాజు కోటకేతుండు
కూరిమిహితుఁడు మాడ్గులవీరరెడ్డి
పరమాప్తుఁడౌ చింత పల్లిరెడ్డియును
మొదలయినసువిచార ముఖ్యులైనట్టి
జనవర్గఁబిలిపించి సమబుద్ధిననియొ
బాహుపరాక్రమ ప్రాభవులైన
వీరులు రాజులు వెలయశోభిల్లు
కొల్వులోనికిఁబోయి కూరిమిమీఱ
సమరంబుగాకుండ సంధియౌనట్లు
మాటాడియటమీద మాచెర్లభాగ
మేలుకొమ్మనిచెప్ప మింకొకమాట
నాయునివద్దకు నరసింగుఁడెచ్చి
కలవైరమడఁతుము కోరిమీరంద
ఱొక్కటికమ్మని యొప్పించిరంతు
మగిడిపోవలయును మనదేశమునకు
ననివీడుకొలిపిన నంతటవారు
పైనమైరయేతెంచి పట్టపురాజు

## రాయబారులు మలిదేవమహీపతి కొల్వునకు వచ్చుట.

మలిదేవుదర్శించి మన్ననవడయఁ
జెలువొందజోహారు చేసిరందఱును
గూర్చుండనియమించెఁ గుంభినీశ్వరుఁడు
వచ్చినవారలు వారితోననిరి
యిదియేమికలనిలో నిన్నిదినములు
తడసితిరిచటికిఁ దడవాయెవచ్చి
యేమికార్యమొమాకు నెఱిఁగింపుఁడనిన

* ఇది కవి వచనము.

† "మన్నెమరాజు" అని పాఠాంతరము.

మీరెఱుంగనికార్య మేదియెయ్యెడలఁ
దెలిసియునడిగినఁ దెలుపఁగవలయు
సంధికార్యమునకు జనుటెఱుఁగంగ
నలరాజునంపిన నామహీశ్వరుని
హేయముమనక పట్టి హింసించుటెల్లఁ
దీర్పరులౌమీకుఁ దెలిసినమేలు
నలగామతమ్ముఁడు నరసింగురాజు
తలఁగోసికొనఁగఁ బంతంబూనరించి
కులవైరముం దీర్పఁ గుతుకంబుతోడ
విఖ్యాతయశులగు వీరపుంగవులు
నిలిచిరిరణభూమి నిశ్చలప్రజ్ఞ
నెత్తివచ్చినవార లిఁకఁబోవరాదు
సమరంబుచేయుట సంతోషకరము
బ్రతుకులస్థిరములు పడుటసిద్ధంబు
సంపదల్నిలువవు జలబుద్బుదములు
సత్కీర్తి యొక్కటి సమయదెన్నటికి
వెలుఁగందిపందలై వెనుదీయకుండ
నని సేయమీరెల్ల నాయత్తపడుచుఁ
బరుగునరమ్మని బ్రహ్మన్నపలికె
వినికోటకేతుండు వివరించిచెప్పె
వినవయ్య నాయుఁడ విన్నపంబొకటి
అతివివేకులుమీర లఖిలరాజ్యముల
మీదృశులయినట్టి మేటివిక్రములు
నీతివంతులులేరు నిశ్చయంబిదియు
గొంతుఁగోయఁగమీరు కోరినయట్టి
నరసింగరాజును నయమునఁదెచ్చి
యిచ్చెదనామీద నేమైనలెస్స
సరవిరక్షించిన సంహరించినను
భారంబుమీపైనఁ బాదుకయుండు
మునుపటిరీతిని ముదమొప్పమీరు
మాచెలఁగభాగంబు మక్కువనేలి
సంరక్షణము సేయ జనములనెల్ల
నుభయరాజులుమీర లొక్కటైయున్న
మావంటివారికి మానసంబలరు
నఖిలాధిపతులు మీ యాజ్ఞ సేయుదురు
మీరెఱింగిననీతి మేమెఱుంగుదుమె
ఉభయసంధానంబు లొక్కటిమాకు
* ననుగురాజేంద్రుఁడు హరిపురికేగు
సమయంబున ననుఁబుత్రచయమునుఁ దెచ్చి
మీకుసమర్పించి మేనుత్యజించెఁ
దర్వాత నిర్వాహదశ యెల్లనీది
యొకయిల్లు రెండుగనొప్పనొనర్చి
తడ్డుమాటాడె నేయపుదేవరైన
మతిచెడియాలోన మనకులుగలఁగె
నందుచేఁబగ హెచ్చె నీర్ష్యజనించెఁ
గోడిపోరాడుట కూడదటంచు

---

* ఇతఁడు మలిదేవనలగామరాజాదుల తండ్రి. చనిపోవునప్పుడీయన తన భార్యలను బుత్రులను నెదుటికి రప్పించి బ్రహ్మనాయకుని కొప్పగించెను. తరువాత నాయకురాలికుట్రచే ననుగురాజు పుత్రులైన నలగామ మలిదేవాదులు వేరైరి. మలిదేవులకు బ్రహ్మనాయఁడును, నలగామరాజాదులకు నాయకురాలును బ్రధానులైరి.

నిచ్చతోఁజెప్పిన నెవ్వరువినిరి
గురిజాలపురికినిఁ గోడిపోరాడ
నెవ్వరువచ్చిరి యిదియేమిమాయ
ఐనట్టికార్యంబులన్నియునీకుఁ
దెలిసియేయున్నవి (తేటతెల్లముగ)
గతజలంబుల కడ్డుగట్టినరీతి
(జరిగినదానికిఁ జర్చలేమిటికి
నావలీవలి వారినరసిరక్షింప
భారంబునీయది బ్రహ్మనాయుండ
కాగవతలి నెల్లఁ గిదనంబునందుఁ
గూఁకటివేళ్ళతోఁ గూల్చియామీఁద
బహుళార్తినడవుల పాలైరిగాక
పాండవులేమేలు పడసిరిచెప్పుమ?
చేరిమీరొక నరసింగునికొఱకు
సకలభూపతులను సమయంగఁజేసి
పాడైనరాజ్యంబు పైనఁబెట్టికొని
చివరకుఫలమేమి చెందంగఁగలరు
పొందికఁగల హింపుబుద్ధులుమాని
సవతిపుత్రులకిష్టు సంధియొనర్చి
యనుకూలమున నుంటయర్హంబువీరు)
నరయనింతియ కాక * మనుగురాజాన
నీయాన మే మింక నిల్వమిచ్చుటను
నావినియావీర నాయకులనిరి

వీరులు రోసవాక్యములాడుట.

పాపంబుచేసిన పగవాఁడువచ్చి
కనుపట్టశిక్షింపఁ గర్తవ్యమగును
సహానంబొనర్చిన జనులుదూషించి
భయపడిరంచును బరిహసి. చెదరు
పగవారియెడ దయపాటింపఁదగదు
హతమొనర్చుట మంచిదనువైనవేళ
భాండంబునెగఁబట్టి బలురాతిమీఁద
వేసిపగిల్చిన విధమునమించి
తటిచూచిశత్రుని దండింపవలయు
హస్తగతుండైన యట్టిశాత్రవునిఁ
బొమ్మనిసెలవిచ్చి పోరాడుటెంచఁ
జెట్టెక్కి ఫలమును జేనంటిచూచి
వేగమెదిగి రాతవేసినట్లగును
దెంపునవీరులీ తీరుననినఁ

కొమ్మరాజు వీరుల వాక్యములఁ
బూర్వపక్షము చేయుట.

శివులురెండునుమూసి శ్రీకంఠుఁదలఁచి
నయమునఁగొమ్మ భూనాథుఁడిట్లనియె
చేతికిచ్చినవాని ఛేదించినట్టి
పాపంబునెబ్బంగిఁ బాపికోవచ్చు
(చిన్నరహస్యంబు నెప్పెదవినుము 19/10
చతురంగబలముల చందమట్లుంచి
మానసికంబైన మర్మంబుకనుము
ప్రజ్వరిల్లెడు వీరభావంబుమీఁద
స్వకృతాపరాధంబు ప్రాబల్యమొంది
తొడిఁబడఁజల్లని తుంపురుల్ చల్ల

* మలిదేవరాజులయొక్కయు, నలగామరాజులయొక్కయు తండ్రి.

జ్వలనంబుక్షీణించి చల్లారఁగడఁగి
నీతిచేవలిగాదు నిర్మలజంతు
చిత్తసన్నిధియందుఁ జెలుమంటయగును
సైరించితలవంచి శరణనివేడి
నగముక్షీణించిన శత్రునిఁబట్టి
చంపుటయేనీతి ? సర్వజ్ఞులార
అలరాజుఁజంపిన యట్టివైరంబు
మహితుఁడౌనలగాము మానసమందుఁ
జారుసమరుష్కృన సూదిరైపోడువఁ
దానొనర్చినయది తప్పనితెలిసి
సిగ్గుచేఁదలవంచి చేరియున్నాఁడు)
శరణనివచ్చిన శత్రువునైనఁ
గాచిరక్షించుటే ఖండించుటరయఁ
గాదనికసిపోవ ఖండింతుమేని
నిహమునసిందింతురెల్ల వారలును
బరమునసరకంబు ప్రాప్తమౌనుమ్మ
పగవానితమ్ముఁడు పాదంబుఁబట్టి
రక్షింపఁడామును రామభూపాలుఁ
డని భానుకులనాథుఁడాడుమాటలకు
మనసులోఁగోపంబు మానినాయకులు
సంధికార్యమునకు సమ్మతులైరి
అరివీరవరులకు సభ్యతుఁడైన

### బాలచంద్రుఁడు నలగొండ శిఖరమునుండి రణరంగంబు నవలోకించుట.

బల్లరగండఁడు బాలచంద్రుండు
నలగొండపైనుండి నాలుగుదిశలు
పరికించికనుఁగొని భావముప్పొంగ
వెలమదోర్నినితో వివరించిపలికె
సెలిఁగియుండుదువ నీవీశిబిరంబు
నడిగెదగుఱుతుల నవిచెప్పవలయు
ననినదోర్నిఁడను నాతనితోడఁ
జెప్పశక్యముగాదు సేనలతెఱఁగు
వెలయనంబుధిపెల్లి విరిసినయట్లు
నలగామభూమీశు నమ్మినసేన
యున్నదినామది యుత్తలపడఁగ
నిసుకచల్లినఁ బడనెడమేమిలేదు
నేలయీనినరీతి నిండియునుండెఁ
జుట్టుకొండలు నిల్వఁజూడనొప్పుచును
రణరంగభూమివిరాజిల్లసాగ
(వెనుకటిరాజులు విక్రమస్ఫూర్తిఁ
గట్టునఁజెలరేగి కదనంబుసల్ప
వీరులరక్తంబు విసువకత్రాగి
మత్తిల్లియల్లన మలయుచునున్న
నాగులేఱల్లదెనా యునిసుతుఁడ)
పాలేటియుఱుముచేఁ బగిలిభూధరము
నాగాధిపతి ప్రాణనష్టంబుచేసి
నడుముగాఁబాఱిన నాగులేఱాయెఁ
గన్నులపండువై కన్పించెఁజూడు
ముభయపక్షంబుల యొప్పైనబలము
నివసించియున్నది నిశ్చలమతిని
సొద్దులుచెప్పెద నవిచిత్తగింపు

## దోర్నీఁడు శిబిరంబునకు హద్దులు వివరించుట.

* జువ్వలకల్లను సొగసైనపల్లె
† సన్నిగండ్లనఁబడు జవరనియూరు
తూరుపుదిక్కుకుఁ దుదిమేరసుమ్ము
దక్షిణదిశహద్దుతగ వివరింతు
నాగులేటికిఁదూర్పు నలగొండకానఁ
జెలువైనయా § వప్పిచెర్లనుపల్లె
పడమటికినిహద్దు బాలచంద్రుండ
కొదమగుండ్లనఁబడు గుత్రిగామమొకటి
ప్రజలమేలిమి ¶ చింతపల్లియునొకటి
యుత్తరదిశ యెల్లలొయ్యనఁగాంచు
మిఁకఁగొన్ని గుఱికొండ్లనేర్చెదవినుము
జన్నిదేవరగుళ్లు ‡ సవనాలమేడ
వంగతోటలబైలు వన్నియకెక్కు
సింగభూపతిచెఱువు శ్రీకరమైన
సంగడిగుళ్ళను సర్వేశుఁడైన
యుత్తరేశునిగుళ్ళు నూర్జితాకృతిని
నుయ్యాలకంబంబు నున్నట్టితావు
గరుడకంబముఁదాఁకి కలజువ్విఁజుట్టి
నల్లగొండనుహత్తినాగులేఱంటి
విడిసియున్నదిదండు విభవంబుతోడ
నాశ్చర్యమైతోఁచె నదియేమొమదికి
నరనాథుఁడైనట్టి నలగామరాజు
గొల్లెఁ చుట్టునుఁగూడికాపాడు
సేనాధిపతులనుఁ జెప్పెదవినుము
పడమటిదిక్కునఁ బాజాలబ్రహ్మ
శంకోజిగణపతి సరవితూర్పునను
నాయకురాల్ దక్షిణంపుదిక్కునను
దంటలైయుండిరి దక్షత మెఱయ
నందెలరాముండు నానెమలిపురి
ముమ్మడిరెడ్డియు మొనతీర్చినట్టి
పొందుగలనుసేలు భూరివిక్రముఁడు
వీరమల్లనునట్టి విఖ్యాతుఁడొకఁడు
నుత్తరభాగాననుండిరి వేడ్క
నిందఱినెల్లను హెచ్చరించుచును
దిరుగుచునరసింగ ధీవరుఁడుండె
విక్రమసింహంబు వీరకామేంద్రుఁ
డబ్భంగిసేనతో నచ్చటవిడిసె
మాన్యబలుండైన మలిదేవుసేన
మాగ్గానియున్నది మనకుంచికనుము
ఘనమైనతురగముల్ కాలిబలంబు

---

* కార్యమపూడికిఁ దూర్పుగ షుమారు 8 మైళ్ళదూరముననున్నది.

† కార్యమపూడికిఁ గొంచెమాగ్నేయ దిశయందు $1\frac{1}{8}$ మైళ్ళదూరముననున్నది. దీనినే నేటుసన్నిగండ్లయని కూడ చెప్పుదురు.

§ కార్యమపూడికిఁ బడమర $1\frac{1}{2}$ మైళ్ళదూరముననున్నది.

¶ కార్యమపూడికి వాయవ్య దిశయందు $1\frac{1}{2}$ మైళ్ళదూరముననున్నది.

‡ ఇది వెనుక యజ్ఞములు సల్పుచోటైయుండును.

బల్లాని పెట్టెలు పటువీరవరులు
మహితనాగానది మడుఁగండచేసి
వఱలు రేవంతుని బైలులోపలను
దీపించుపడమటి తీరంబునందుఁ
బరవీరభయదమై బలమెల్లవిడిసెఁ
జాలుపుతేరులు సమదేభములును
మనవారికనయైన మానవుల్ గలరె
యొక్కొకవీరుఁడె యొక్కొకలక్ష
దళమునుసమయింపఁ దగియున్నవాఁడు
చెలువైననలగాము సేనకునెదిరి
కడలికిఁజెలియలికట్టు చందమున
మనబలమున్నది మహిమమీఱంగ
నని తెల్పుదోర్న్ని కనియెబాలుండు

### నలగొండదిగి రాజ దర్శనమునకుఁ బోవుటకై బాలచంద్రుఁడు గమకించుట.

బలమెల్లసాంద్రమై బహుదూరముగను
గిక్కిరిసియుండెఁ గేరివీక్షింప
నొక్కెడసందులే దిసుమంతయైన
మార్గంబుగనదుకూతుక్కంపుచూడిక్కయును
రాఁడాయెనంచును రాజుచింతించు
నాలస్యమిచ్చటనాయెను మనకు
నపకీర్తిపాలౌదు నాడికవచ్చుఁ
దెంపుననొకదిక్కు తెగటార్చికొనుచు
శౌర్యసంపదమీఱఁ జయ్యనఁబోయి
కలసినవీరులు కలహించిమనల
నెంతకోపింతురో యేమినలుకుదురో
యఱువదేగురుతాము నటులుండఁగాను
పడుచుతనంబున బాలుఁడు వచ్చి
యెంగిలిచేసి నాఁడెదుటిబలంబు
నేమందమీపట్ల నీపిన్నవాని
ననినిందసేయుదురల జడియగును
దెగనికార్యంబాయెఁ దెలియదుమనకు
నిరుగడవారల యిచ్చలీవేళ
నెబ్భంగిఁదెలియద మెవరుచెప్పెదరు
సంధికార్యంబింత సమకూడె నేని
విచ్ఛిన్నమైపోవు వేడుకతగ్గఁ
బొందినకార్యంబు పొసఁగంగనీక
పగతెచ్చెవీఁడని ప్రజలాడఁగలరు
నవ్వుదురవనిపుల్ నామోము చూచి
ఛీయనిరోయుదుర్ సిగ్గెల్లఁబోవు
నాతండ్రికొడుకని నన్నుఁజేపట్టఁ
డనిపలుమాఱును హర్షంబుతగ్గి
పలుకంగఁజెలికాండ్రు బాలునికనిరి
వినుబాలచంద్రుఁడ విద్విషద్భయద

### బాలచంద్రుఁడు కార్యమవూడిం జేరఁగదలుట

పరశురాముఁడవీవు బాహులబల్మిఁ
బరగజహర్యక్ష పావనమూర్తి
శౌర్యగంగాధర సర్వజ్ఞచంద్ర
కదనగాండీవికిఁ గడుపునఁబుట్టి
యీనిందపడుటకు నేమికారణము

కులవైరముం దీర్చి కొనవలె భూమి
పోనివ్వఁగూడదు పోరు నిశ్చయము
కూర్మితో మలిదేవు కొల్వులోఁ జొచ్చి
వీరులఁ గనఁగాని వేడ్క మైమ్రొక్కి
కలనిలో మీరున్న కారణంబేమి
యానతిండని వారినడుగంగ కలయఁ
గామునితో సంధికార్యంబు సేయ
నుద్వార మితరంబులొప్పవు మాకు
నని మాటలాడిన నావలికేగి
దర్పింతమన్నహా ధరణీశవరుని
రాజు పంపఁగఁ బోయి రణమొనరింపఁ
బ్రాప్తమహాదేవేంద్ర పట్టణవాస
మనిపల్కు బాలుండు హర్షంబునొంది
శైలంబుపైనుండి సాహసంబొప్ప
దుట్టుకెక్కు భూమిపై పృథ్వి పుల్వడఁక
బలువైనమందర భ్రమణంబు కతనఁ
గలఁకఁజెందిన యట్టి కంధిచందమునఁ
దరితీపుప్రాపించి ధైర్యంబు కదలి
బలమెల్లభయపడి పాఱఁగ సాగఁ
దురగముల్ గజములు ధూళిమిన్నలమ
బంధంబులూడ్చుక పరువులు వెట్టె
దండెల్లనీరీతిఁ దత్తఱమొందెఁ
దమ్ములుఁ బలమును దనవారలెల్లఁ
గలసిరి బాలుని ఘనమోదమలర
నంతట నాబాలుఁ డధిక శౌర్యమునఁ
బరిఘముల్ డెక్కముల్ బలుసాధనములు
శస్త్రమైతగు భద్రసాలేయమాడు
జగజంపుఛత్రంబు జయమునఁగొన్న
సకలమహాబిరుదులు సరసరంజిల్ల
భయదమై నరసింగుపాలిటిమృత్యు
వీరూపమునవచ్చి యెదిరించెననఁగ
బ్రహ్మన్న తనయుఁడు పటుసాహసుండు
తొలఁగుఁడి తొలఁగుఁడి దూరంబుపోవుఁ
డెదుటనిల్వకుఁడంచు హెచ్చరించుమను
బలములనన్నిఁటిఁ బాయఁదోలుచును
మలిదేవు గొల్లెనమార్గంబువట్టి
వచ్చెడుచందంబు భావించిచూచి
సంధికార్యమునకుఁ జనుదెంచినట్టి
దొరలమొగంబులఁ దొలఁగెఁదేజంబు
వెలవెలఁబాఱుచు వేడుకలుడిగ
నొకరిమొగంబొకరొయ్యనఁజూచి
యిఁక నేమిచక్కటి యేమికార్యంబ
దితఁడు రాకుండిన నెసఁగును సంధి
యిఁక సాగదెవ్వరి హితవిచారంబు
దైవకృతంబేరు తప్పింపలేర
యనిచింత సేయుచు నక్కటాయనుచుఁ
గళతప్పినిలిచిరి కడుఁజిన్నపోయి
మలిదేవభూపతి మంత్రియైనట్టి
బ్రహ్మనీఁడాతని బంధువర్గంబు
సమరసంతోషులౌ సకలవీరులును
గొల్వుకూటంబునఁ గూర్చుండి కలిమి
బాలచంద్రుండంత ప్రాభవంబొప్ప
రాచబిరుదులతో రంజిల్లుచుండి
తమ్ములుఁ గొల్వఁగఁ దరగని వేడ్క

* వనజాప్తసుతురీతి వచ్చెనాసభకు

## బాలచంద్రుఁడు సభలోఁ బ్రవేశించి రాజదర్శనమునకు మార్గమి మ్మని సభాస్తారులనడుగుట.

వీరులు కైతవ విభవంబెసంగఁ
గార్చిచ్చుభంగినిఁగనలి కోపించి
భూవరుదర్శింపఁ బోవసందీక
యున్నభావము బాలుఁడోయ్యనఁ దెలిసి
సౌందర్యసాంద్రరాజ సభాస్థలంబు
గనుఁగొంటి సంతోషకలితుఁడనైతి
విష్ణుసన్నిభుఁడైన విభునిఁజూచెదను
దెరువీయవలెమాకు ధీరాత్ములార
యనదానివినకైరి యప్పుడుకినిసి
బాసదబ్బరగండ బ్రహ్మన్నసుతుఁడు
(మండుకారడువుల మంటచందమున
రణరంగమునయందు రాజిలువాఁడు
ప్రారబ్ధకార్యంబు వదలనివాఁడు
కొఱగానికోర్కులు కోరనివాఁడు
సుఖదుఃఖభేదంబు చూడనివాఁడు
తనదేహకష్టంబు తలఁపనివాఁడు
పరులకార్యములకై పనిచేయువాఁడు
స్వవిహితధర్మంబు సలిపెడువాఁడు
పల్నాటివారికిఁ బ్రాణహితుండు
మహివీరవరులకు మార్గదర్శకుఁడు)
వాసిగ రేచెర్ల వంశవర్ధనుఁడు
(స్వాంతనైర్మల్యుండు బాలచంద్రుండు)
పదములుదట్టించి బాహువులెత్తి
సాహసోత్సాహుఁడై శౌర్యంబు మెఱయఁ
గలికిసింగపుఁబిల్లగంతుకొన్నట్లు
కుప్పించిదుమికెను గురుజవమొప్ప
వసుధేశుసముఖాన వ్రాలెను వేగ
పిడుగుపడ్డవిధంబు పృథివికంపించె
సన్నిధినిల్చెఁడి జగదీశుఁజూచి
యతిభక్తియుక్తిననటు మొగమాయఁ
గడుభయభ్రాంతుఁడై కరములుమోడ్చి
యేమిచేసితిరాజ యేలకన్గొనవు
నాయందుఁదప్పేమి నన్నేలువాఁడ
యనిప్రార్థనముచేయ నాకొల్వులోన

## బాలచంద్ర కన్నమదాసుల సంవాదప్రకారము.

గాసిల్లుకన్నమ కడుఁగోపవశత
నులికిపాటునలేచి యుగ్రుఁడై మెఱసి
ఘనరౌద్రకలితుఁడై ఖడ్గంబుదూసి
నయ్యనజళిపించి సభఁజూచిపలికెఁ
గంటిరాబాలుని గద్దరిపనులు
తనసాటిబలియుఁడు ధరలేఁడటంచు
మత్తిల్లిమఱచెను మావంటివారిఁ
జాలకనైతిమి వీనిచూపులకేము
దండిశూరులుచూడ దట్టించినిన్ను

* కర్ణుడు.

ఖండించి వైచెద గనియలు గాఁగ
నేపాటిడంటవు నీవు మాకన్న
మా పేరు విన్నంత మదిలోన బెగడి
యుభయ దళంబులు నులుకుచునుండు
సభలోన నీవుంట సహ్యంబు గాదు
పగసుఁడవగుదువు పయ్యనఁ జనిన
ననవినియా బాలుఁ డప్పుడిట్లనియె
బంట్లు మీగలు గాక బవరంబునందు
మే మేడబంట్లము మీ సాటి గాము
పరిగఁ బంచిన యూళ్లు సర్వంబు విడిచి
విపినశైలంబులు వేసట లేక
తిరిగితి రెవ్వరు దీటు లేరైరి
వాగులనీళ్లును వనములఁ బండ్లు
తినుచును మితిగ్గున దినములన్నియును
జరగఁ గాఁ జేయుమ సమరంబు మంచి
యున్నందుచే పీనగొరగానామీదు
సాలఖడ్గములకుఁ ద్రుప్పలు పట్టెఁ
గాపికోనఁగ మీకు బవరంబు లేదు
పగవారు కన్నులఁ బడకున్నవారు
పగ చేసి మముఁ గూల్చి సాపికోత్రుప్ప
సభలోన నేనిట్లు శోకించితిని
పార్థివుఁ గొండగాంచ వచ్చినయప్పు
డెవ్వరు నెదమీయరె నీతి చెప్పుమని
పంతంబు చెడి నేను బ్రతిమాలలేక
యొయ్యనవీడుగా నురవడిఁ జనితిఁ
దప్పేమి నాయందుఁ దగవల నడుగు
వల్లవెంగముం దీన్వఁ గూర్చుండుటేమి

పఁభూములందెల్లఁ బరువులు వాటి
వనములఁ గృశియించి వచ్చినందునను
మేనున బడలికల్ మించినోయేమొ
యారీతి బడలికలంటెనా మీకుఁ
బగవారి విస్తరి బండికన్న గును
భావించికొనఁ దగు బ్రౌఢులు మీర
లనినఁ గన్నమ పల్కె నా బాలుతోడఁ
బసుచువాఁడవు నీవు పలుమాటలేల
కొలువులో విషయంబు గులుతెలుఁగకయు
యీ తేపపలికిన నీకత్తి చేతఁ
దల వెగవేయుదు ధరణీశు నెదుట
ననిన తామసపడి యపుడు బాలుండు
కులశైలధీరత గొబ్బునఁ బలికెఁ
గదలిమధ్యంబున గద్దెయున్నట్లు
ప్రాలియున్నారు శాత్రవుల్ మధ్యమున
మున్నీరు పెరిగినా మునుగనుదిన్న
శాత్రవబలములు సమయంబు మాచి
నల్దిక్కులను దొక్కి నడచిన వేళ
నేమౌదురో మీర లెఱుఁగకయుండి
యిది విచారింపక యేల వచ్చితిరి
మీరు మాత్రమె గాక మేదినీశ్వరుని
నేటికిఁ దెచ్చితిరి స్థలంబునకుఁ
బ్రజలాడికొనుటలు పరికించి వినరు
గొల్లెనలోఁ జేరి కోపంబు చేసి
పదరినమాత్రన ఫలమేమి చెప్పుమ
బ్రహ్మనాయుఁడు నీకు బంధువుఁ డెట్లొ
వినిపింపు కన్నమ వివరంబు గాఁగ

ననినకన్నమవల్కె నాతనితోడ
నాయఁడువిష్ణువు నారాయణుండు
ప్రకటదయాంబుధి వరములొసంగఁ
దగజనించితినేను దల్లిగర్భమునఁ
బరమపావనమూర్తి బ్రహ్మనాయునికిఁ
బాదసేవకుఁడనై పరఁగినవాఁడ
భుజములముద్రలు పూనినవాఁడ
క్షుద్రమార్గులచెప్పు చూడనివాఁడఁ
బ్రాసాదజీవినై ప్రబలినవాఁడ
జ్యేష్ఠపుత్రుఁడనంగఁ జెలఁగినవాఁడఁ
బుట్టితివీవెన్కఁ బురుషోత్తమునకు
దట్టించిపలికెదు ధరణీశునెదుటఁ
బడుచువాఁడవునీవు వాగ్గర్వమేల
యనవినియబ్బాలుఁ డప్పుడిట్లనియెఁ
జెలఁగిబ్రహ్మన్నకు జ్యేష్ఠపుత్రుఁడవు
తలదన్నిపుట్టిన తమ్ముఁడనేను
గదిసియగ్రజాతోడల్ గద్దెలుచేసి
ద్రొక్కుచుఁబోవచ్చుఁ దొడరినకూర్మి
ధరణీశుఁబోడగన దాఁటితినన్న
అంతమాత్రమెసుమ్మ హంకారమెఱుఁగ
ననిపల్కఁగన్నమ యటుఁదలవంచి
భైరవఖడ్గంబు పడవైచిధరణిఁ
జిఱునవ్వునవ్వుచుఁ జేరిసోదరుని
నొనరంగనెత్తుక యుర్వికిఁదించి
తప్పునాయెడనుండెఁ దమ్ముఁడాయనెను
బాలచంద్రుఁడు హర్షభావమునొంది
భ్రాతలునుంధాను రాజునుఁజూచి
జోహారుచేసినఁ జూడకాభూపుఁ
డూరకతలవంచియుండెను బాలుఁ
డందుకువెఱఁగంది యనుజాలకనియెఁ

## బాలచంద్రుఁడు మలిదేవభూపతిని సమ్ముఖమున దూషించుట.

దలిసెనా? ధరణీశు తెఱఁగెల్లమీకుఁ
బగతీర్చికొనుటకు బవరంబుసేయ
మితిమీఱుచెలలని మేకొనిచెప్పె
మదిలోననామితి మఱచెనోయేమొ
యొండకన్నెఱుఁగని యీరాజచంద్రుఁ
డవనిశాత్రవులకు నర్పించిపెక్కు
కానలఁద్రిమ్మరి కాయంబుడస్సి
నీడలనిలిచిన నీళ్ళెల్లఁద్రావి
పొలపుకూరలుచాల భుజియించెఁగానఁ
బసరుకన్నులకెక్కె పలుకవన్నాఁడు
మంచిమందిచ్చిన మానునువేగ
ననిపల్కుమాటల కదరుచుగండు

## గండుకన్నమనీఁడు బాలచంద్రుని వాక్యంబులఁ బూర్వపక్షము చేయుట.

కన్నప్పయిల్లుఁ గనికోపకలన
భజియించినీతియా పల్కులననియె
నిటువంటిమాటలు నేమిఫలంబు
తప్పంతమనయందు దట్టమైనిల్చె
నేరీతిననియొదవే నెఱిఁగింతుఁ

బగవారివర్గ్యలు భావమందెఱిఁగి
కులవైరము నుదీర్చికొనుటకు మనము
వచ్చుచుఁదగవుడు వసుధాశశేంద్రుఁ
డెచ్చుటయొకతప్పు త్రిపురాంతకమునఁ
గలహానిశ్చముగాఁ గలుకంబంబు
త్ర్లింపరెండవ తప్పనియెఱుఁగు
కంకణంబులపల్లె కడనివసించి
కంకణంబులు చేతఁ గట్టుటయూఁగు
తెగిరణభూమిలో దిగుట నాల్గవది
తఱిమిశత్రులువచ్చి తాఁగొన్నపిపపఁ
గలయువిచారించు కార్యమైదవది
యీయైదు నేరము లెవ్వరివగును ?
పంచాపరాధముల్ వైరులయందుఁ
గలవని చెప్పెద గ్రహింపఁగడఁగు
పరిరాజ్యమోర్వక సంగ్రహబుద్ధిఁ
గోడిపోరున గెల్చి కొనుటయొక్కంకు
విపినంబులకుఁ బంపి వెలయుట రంకు
జామాతఁజంపుట పగవిమూఁడవది
భట్టుసుమనవారు పంపించినపుడు
వెళ్ళఁదోలించిన విధము నాల్గవది
కూటువమూఁకలఁ గూర్చుకవచ్చి
గర్వించినిల్చిన కార్యమైదవది
ఎక్కువతక్కువ లీరీతినుండఁ
దెలియకధరణీశుఁ డెగిమాటలాడ
నపరాధమంటదా యతినీతియారె
యెక్కువమాటల నీకనాడఁబోను
మనసురాకుండిన మగిడిపోవేగ
ననిపల్కుమాటల కాబాలుఁడనియె

కన్నమనీని వాక్యంబులకు బాల
చంద్రుఁడు ప్రత్యుత్తరంబిచ్చుట.

మేరతప్పవటంచు మీఱిపల్కితివి
మేటిబ్రహ్మనవాకు మితితప్పరాదు
చుక్కలు రాలిన సూర్యుండుతప్పి
పడమటఁబొడిచినఁ బాథోధిమించి
చెలియలికట్టపైఁ జెంగలించినను
జల్లనైననువహ్ని సత్యసంధుండు
నాయునిమాటకు నమ్మికగలదు
పగవారికలుకుచుఁ బలికితివయ్య
యిటువంటికార్యము లెందునుజరుగఁ
బగవాని సేనలోఁ బల్వడిఁజొచ్చి
కరములు శిరములు ఖండించివైతు
దగ్ధము సేయుదు దావాగ్ని రీతిఁ
జిన్నవాఁడంటివి చెలఁగియీకలన
నలనాఁడుగురిజాల నయినట్టిపగకుఁ
జేపట్టియిల్లడ చేయఁగాలేదె
యపుడు బాలుఁడనాదు నఖిలభూపతుల
కదిరియుద్ధము చేయ నేనిల్చినప్పు
డపకీర్తిమాటల నాడుటతగవె
వినఁగూడదీమాట విడువుము చాలు
నని చెప్పి సభలోన నందఱువినఁగ
వీరులవేల్పౌఱఁ బిలిచికోపమున
మలిదేవు సముఖాన మందుచుఁబలికె
ధీరాగ్రయూవంకి దేవరాజేశ

### బాలచంద్రుఁడు యోధులకు రోషమువచ్చు మాట లాడుట.

(వీరుఁడనని పేరు పెట్టుకనీవు
బ్రతికియుండంగనే పగఱునీసుతుని
బట్టిచంపిరిగదా భయమింతలేక
శౌర్యంబునీయందుఁ జచ్చెనాయేమి
ముక్కుదూలముమీఁదఁ బొడిచినయపుడు
గుఱ్ఱుమనఁగలేని కోపమెన్నటికి)
శంకింపగానేల సమరంబుకదిసెఁ
దీరనిముద్దులఁ దెగఁజాలవేల
ధనువుశింజనిలాగి ధ్వనిచేసితేని
బ్రహ్మాండభాండముల్వగిలినట్లుండు
సెనలేనివిలుకాఁడ విటువంటినీవు
తనయునిచావుకుఁ దాఁగెదవెట్టు?
ఆవాలనాయుఁడ యపుడుపంతములు
పలికిననీవేల పరవశుఁడైతి
తలపోయఁగావీర ధర్మంబుమఱచి
నిద్రించుచుండుట నీతియెనీకు
విముఖతలేనట్టి వీరుఁడవీవు
కట్టినాఁడవుకాశి పట్టితికత్తి
పగయీవలేనట్టి పౌరుషమేమి?
మితిమీరుసెలలాయె మెదలకున్నావు
నీవంటిజగజెట్టి నేఁజూడలేదు
మాకుకన్నమనీఁడ మగటిమియేది
కదలనికంబంబు కాలిసంకెలలు
పొందించిచావుకై పూనినిల్చితివి
కంబంబుచెదలంటెఁ గదలించిచూడు
సుంకరరాముఁడా చుట్టుడొంకెనలు
త్రుప్పలుపట్టెను దొడ్డగవదేల
చెవులనాయకులార చెలఁగెడుబంటు
లిచ్చగించరుమది సెంగిలిపోటు
మేటిశూరులనాజి మెచ్చనియట్టి
నమ్మినజంగిలి నాయకులార
తగుజల్లికేడెముల్ దండచక్రములు
పోఁగొట్టిపోరయ్య పోరుమీకేల
వీరయోధులుగదా పెనుమాలవారు
గాయగోవాళాఖ్య గలబిరుదములు
పగతుఱుగనకుండఁ బాతుఁడిభూమి
బాదన్నరాహుత్త పాటవమేడ
సంపెటనాగన్న జయమగుబిరుద
మెక్కడికేగనీ వెందుదాగితివి
(జడతనిద్రించెదు శౌర్యాత్ములార
యుద్ధతయుద్ధ సూర్యోదయంబయ్యెఁ
దఱచుగాఁగల్య కర్తవ్యముల్గలవు
లెండుకాలంబయ్యె లెండులెండింక)
ననిబాలుఁడుగ్రుఁడై యదలించిపలుక
వినిబ్రహ్మనాయుఁడు వేగమేలేచి
తనయునికెదురేగి తాగారవించి
యర్ధాసనంబున నాసీనుఁజేసి
వలనొప్పదంటగ వచ్చినవారిఁ
గొల్వునఁబిలిపించి కూర్చుండుఁడనినఁ
గూర్చుండిరందఱు సూరిమిమెఱయఁ

గూర్చినవారల కుశలంబులడిగి
తనకార్యమంతయుఁ దగవినిపింప
వినిబాలుఁడీక్ష్ణశ్రో వివరించిపల్కె
శాత్రవు * లలగాజుఁ జంపినయట్టి
కోపంబు మదిలోనఁ గూర్చుటగాని
పందమాటలు పల్కఁబంతమావిూకు
భీమరుద్రోగ్రసంభూత పటుగోపవహ్ని
భస్మీకృతాఖిల పరరాజవిపిన
బ్రహ్మాస్త్రనాతోడఁ బల్కకుమయ్య
వదలకరాజును వంచించినపుడె
నాచేతిహేతితో నాయకుల్ జూడఁ
దలతెగఁగొట్టుదు ధరణీశునెదుట
సత్యంబుపల్కితి శంకనాకేల

## కొమ్మరాజు బాలచంద్రుని కోపంబు చల్లార్చుట.

యనఁగొమ్మభూపతి యల్లునిడాసి
వినయంబుతో గట్టిగదుకపట్టి
నాయన్న వినుమయ్య నళినాప్తతేజ
సంధికార్యంబేగి శత్రులచేతఁ
బరఁగఁజచ్చినవాఁడె బాలుఁడుసువ్వె
యరయమానుతుఁడైన యలరాజవీవె
వచ్చిమనలఁజూచి వారనిభీతి
బిరుదులుత్యజియించి పిఱికిపాఱుచును
హీను తమ్మని నిచ్చినయపుడె
క్షత్రియజాతికిఁ జచ్చుటనుమ్మ
నలమునఁబోరాడ సారస్యమేమి
చేతికిచ్చినశత్రుఁ జెలఁగివధింప
బలుపాతకంబని పల్కె వేదంబు
లెన్నిజన్మములకు నేక్రియనైనఁ
బాయదుపాపంబు పట్టిపీడించు
ననియితిహాసంబు లతనికిఁ జెప్పి
కాగిటఁజేరిచి కడుబుజ్జగించి
మనసుపెట్టకుమన్న మసలకుమన్న
మామాటవినుమన్న మన్నింపుమన్న
వినిబాలచంద్రుఁడు వినయుఁడైయుండెఁ
జలమెల్లవిడనాడి సంధిమేకొనిరి
తరువాతఁగొందఱు దర్పముల్ మీఱ
నేచేటుపాటైన నేమిమాకేల
విందులుభుజియించి వేగమేపురికిఁ
బోవలెజాడ్యంబు పూనకుఁడనిరి
యిరుపక్షములవారు నింపుసొంపెసఁగఁ
బొదిలినసంతోష మునమాఱుచుండి

## అనపోతు మేడపి కేగుట.

గంతట మేడపి కనపోతుచేరి
మాంచాలమేడకు మక్కువనేగి
వినయంబుతోడుత వెలఁదినిఁజూచి
మంజులభాషణ మహనీయసుగుణ
కంజాతలోచన కరిరాజగమన
త్రైలోక్యసుందరి రతిదర్పహారి

* 19 వ ప్రతిలోఁ బరసజ్ఞిగాఁ జూడుము.

సుశ్రీలసత్కర్ణ శోభితవర్ణ
కోమలసీమంత కుందాభదంత
(యధరవిజితబింబ) యధికనితంబ
వరవసంతమువీఁక వనములచిలుక
మారునిసైదండ మల్లెలదండ
రమణినేవచ్చిన రాకనాలింపు
* మన్న బాలుఁడుపంపె నతివనీవద్ద
ముత్యాలహారంబు ముద్దుటుంగరము
కలవవితెమ్మన్నఁ గదలివచ్చితిని
మఱచినవస్తువుల్ మాచేతికిమ్ము
త్వరగఁబోవలెనేను బాలునికడకు
నననవపోతుతో ననియెమాంచాల
యేమానవాఁడయ్య యీపదార్థముల
కనబ్రాహ్మణోత్తముఁడా పెనుజూచి
కూరిమిఁగొన్నప్పైఁ గూర్చుండితాను
పైఁటకొంగొయ్యనఁ బట్టిలాగినను
ముత్యపుచేరులు మొదటికిఁదెగిన
నవికనలేకుంట యానవాలమ్ము
యనవినిమాంచాల యవుడయ్యతత్త్వ
శాస్త్రముల్ వేదముల్ చదివినవాఁడ
వెఱుఁగవైతివిగదా యీరహస్యంబు
తమ్ములుపిలిచినఁ దరితీపుతోడ
విడికట్టముత్యముల్ వెదికికూర్పంగ
శ్రద్ధలేకఁటచే బాలుఁడువెడలె
మాటతెల్పెడినీవు మదివిచారింపు
కారణమేలేదు కలనికిఁబోవ
మీయన్న బాలుని మితిచేసివారు
పోనఁగఁబట్టము గట్టమూఁడుమాసములు
మితివెళ్ళెఁగావున మీవారిఁగలయఁ
జనియెనుమీయన్న సమరంబుకడకు
వీరమేడపినీవు వెలయరక్షింప
బాలచంద్రుఁడునీకుఁ బట్టముగట్టె
నందుచేఁగలనికి నరుగంగఁగూడ
దనవినిబ్రాహ్మణుఁ డత్యుగ్రుఁడగుచు
విముఖుఁడైయచ్చోటు వెడలియేతెంచి

## అనపోతు శ్యామాంగి గృహమునకుఁ జనుట.

శ్యామాంగి యింటికి సయ్యనవచ్చి
పలికెనాయనపోతు భామతోనపుడు
ముత్యాలగళమాల ముద్దుటుంగరము
మఱచివచ్చితినేను మగిడినీవేగి
యడిగితెమ్మని పంపెనానవాలడిగెఁ
గోళికాఫలచయ కలితచర్మంబు
నిచ్చితిఫలమని యిదియానవాలఁ
టన్న నాసతినవ్వి యనపోతుకనియె
నాసలేనట్టియీ యానవాలంది
యెందుకువచ్చితివిది పొల్లుమాట
మఱమటదామట మాకద్దలేదు
మాయమాటలుచెప్పి మరలఁబంపించెఁ
గనలేకవచ్చితిగద భూసురేంద్ర

* సోదరుఁడు. అనిననని యర్థముకాదు.

యనిపల్కి బ్రాహ్మణుఁడతి రోషమంది
వెడలుకోపాగ్ని చే వెడలెనువేగ

## బాలచంద్రుఁడు మేడపినుండి మరలుట

గదలియాత్రిపురాంత కమునకువచ్చి
బాలుని తెఱఁగెల్లఁ బ్రజలనునడిగె
నాతీరు మేమేమి యరయుటలేదు
మూఁకలుగూడెను మందటిదెసను
దెలిసికొమ్మనివారు దెల్పఁదీవ్రముగ
నచ్చటికేగియా యవనీసురేంద్రుఁ
డశ్వత్థతరువున కమరించినట్టి

## బాలచంద్రుఁడు వ్రాసిన పత్రము ననపోతు చదువుట.

పొందైనపత్రిక పుటసెగనెత్తి
తిన్నగాఁజదివెనీ తీరునదాని
శ్రీగిరీశునియాన చెన్నునియాన
మలిదేవరాజాన మాతండ్రియాన
యబ్బాదాట్లురువీరు లందఱియాన
త్రోసివచ్చితివేని ద్రోహమంటెదును
బాలునిమిత్రుల ప్రాణంబులకును
దప్పినలాగాను దరలితివేని
నానలుమీఱుట యదినీతిగాదు
తనకుంగడీలతోఁ దరలెబాలుండు
సాహసమునసీవు సాగిరాఁగూడ
దనునట్టికతనంపు టానలుచదివి
చండాగ్ని పైనూనె చల్లినరీతి
భీకరకోపాగ్ని పెనఁగెఁజిత్తమున
నప్పుడుభూసురుఁడతిదుఃఖమొంది

## అనపోతు బాలచంద్రునిఁగూర్చి నిష్ఠురవాక్యంబులాడుట.

దంటనాననువీడధర్మమానీకు
మంచితనంబున మన్నించినన్నుఁ
బొమ్మన్నఁబనులకుఁ బోయితిఁగాని
తప్పానవాలని తలఁపకపోతి
నిజమనిచెప్పిన నీయానవాలు
తబ్బిబ్బుఁటంచెగ తాళినలిపిరి
నిజమువిచారించి నీవున్నకడకు
వచ్చితివిడనాడి వడినేగినావు
వగవనేనందుకు వరగుణశాలి!
నీనాతిమాంచాల నిపొందుకత్తె
హాస్యంబుచేసిరి యానవాలెటిఁగి
వెంగలి నైతిని వెలమలవద్దఁ
గలిమికోసమువచ్చి కలియుటలేదు
కులమునఁగొదవని కూడుటలేదు
తల్లినిఁదండ్రిని దాయాదజనుల
నెడఁబాసినీపొందు నేనమ్మియుంటిఁ
బగవాఁడనైతిని బాంధవతతికిఁ
బాసిపోఁదగునయ్య బ్రహ్మన్నతనయ
కల్లగాఁబోయితి ఖిన్నునిఁజేసి
న్యాయంబువిడనాడి నమ్మినవాని
నొంటరిగానుంచ నొప్పెనాచిత్త
మెన్నఁడునాలావు నికుమంతయైనఁ
గనుఁగొనవైతివి కట్టిఁడివాఁడ
బ్రాహ్మణుఁడీతఁడు బవరంబుచూచి

భయపడునంచును భావించితేకట
యటులైనఁబంచితే యనిలోననన్ను
బ్రాహ్మణమరణంబు పాపమఁటంచుఁ
జనితివిదయలేక సర్వజ్ఞచంద్ర
ధర్మశాస్త్రంబుల దారినీకలిక
తను గెలిచినట్టి యా ధరణీశునెదుట
సమరంబులోపలఁ జచ్చినయపుడు
పాపమనఁగరాదు బలిమినిఁబట్టి
ఖండించివైచినఁ గలుషంబువచ్చు
ద్రోణుండుకృపుఁడును ద్రోణసుతుండు
సమరంబుచేయరా సాహసమొప్ప
గురువైనద్రోణుండు కూలెయుద్ధమున
నేమనుష్యవశంబె నాకిల్బిషంబు
నీవెఱుంగుదు దీని నింతిమాటలకు
నన్నాడఁబాసితి నాకర్మమేమొ
కాముని బలములు కదిసిన మీఁద
బల్లియములవారి బవరంబునందు 22/10
గెలువఁగలేనంచుఁ గేరుచునుంటి
నీ తెలఁగాయెను హితమైనవాంఛ
యేమి సేయఁగలాఁడ నేమందువిధిని
నడవిపాల్సేసితివన్న! సోదరుని
వీరవిక్రమయుద్ధ విభవంబుగనఁగ
భాగ్యంబులేదాయెఁ బాపిని నేను
పూర్వజన్మంబునఁ బొందులుదీసి
యుర్వరివ్వరిని నే నెడఁబాపినానొ
యనుభవింపఁగవచ్చె నాఫలంబిప్డు
డీవుపాసినయట్టి యీదేహమెల్ల
(జన్మమెత్తితిఁగాని సఫలంబుగాదు
సఫలంబుకాని యీజన్మంబదేల
తనవారిరక్షింపఁ దలఁచిచచ్చినట్టు
వినియోగపడనట్టి వీరరక్తంబు
రక్తమేకలువనీరంబగుఁగాక
యుప్పొంగుచున్నది యుజ్వలశక్తి
యడఁగదు నేనెంత యడఁచిననైన
దహియించుచున్నది దావాగ్నిరీతి
ప్రాణంబులీక నేనా బట్టఁగఁజాలఁ
దివిరివ్యర్థంబైన దేహంబువిడుతు
స్వర్గలోకమునందు బాలునిరాక
కెదురుచూచుచునుందు నెంతయువేడ్క)
బుణ్యనివాసంబుపొందియుండు
ననిచింతసేయుచు నయ్యయోయనుచు
నున్నంతలోపల నొయ్యననపుడు
గరిగమాచియను కాంతయొకర్తు
వీరమేడపినుండి వీరులఁగలయఁ
జనుదానినచ్చోటఁ జయ్యనఁజూచి
యంజలిచేసినాఁడనపోతు తెలిసి
బ్రాహ్మణుఁడాయిట్లు పలుకంగరాదు
తగమునీవొనరించు దండముగానఁ
నేలయిచ్చటనుంటి రెటేఁగింపుఁడనిన
ననపోతుమాచికనియె నావేళ
బాలునిఁగలనికిఁ బంపియిచ్చోట
నిల్వఁగారణమయ్యె నెలఁతరో నాకు
నన్నబాలునికేన యంజలిచేసి
విన్నవించెద నేను వినిపింపవమ్మ

నామాటగాఁజెప్పు నాసోదరునికిఁ
గూరిమితమ్ములఁ గూడుకనన్ను
వలదనిపోయితి వగచినవాఁడ
నాలస్యమింకఁజేయ నాయత్తపడితి
నిందులఁగిల్చిషం బెనయదునీవు
నీరాకమాచెద నేవ్వర్గమందు
ననుఁగూడరావయ్య నాబాలచంద్ర
యనిచెప్పిమదిలోన నధికహానియతి
నీషణత్రయమునందే హ్యభావమున
నింద్రియదళకంబు నేర్పడనిల్పి
తల్లిదండ్రులనెంచి దండంబుపెట్టి
పరమాత్మమదిలోనఁ బాయకతలఁచి
యడపంబువారిని నతిప్రీతితోడ
గొడుగువారినిఁబ్రేమఁ గూడఁగఁబిలిచి
వెఱతురురక్తంబు వెడలుటమాచి
యీదెసనిల్వక యేగుఁడుతొలఁగి
పాపమనుచునన్నుఁ బట్టంగఁబోకుఁ
డనిచెప్పిబ్రాహ్మణుఁ డత్యంతభక్తి
నింటివేల్పులనంగ నేర్పడియున్న
శ్రీగిరిలింగంబు చెన్నకేశవుల
భక్తితోఁబ్రార్థించి ప్రభుఁడైనయట్టి
బ్రహ్మన్ననామంబు భావించియెంచి
సంగడీలనుఁజాల సన్నుతిచేసి
బంగారుజందెంబు పాదంబుబిరుదు
మాడదికినొసంగి మన్నించినీవు
బాలునికిమ్మని పణఁతికిఁజెప్పి
తనతలఁగోసుకధరమీఁదఁబ్రాలెఁ
దలయావలిం బెనుదటుకున నెగిరి
కన్నులువిచ్చెను ఘనముగనవ్వె
నెటువంటిభావంబొ యెఱ్ఱుఁగఁడెఱుఁగు
గొడుగడపమువారు గొబ్బునవేగి
తద్గతితెల్పిరి తల్లిదండ్రులకు
వినిమూర్ఛనొందిరి వేగమెవారు

## అనవోతుతలిదండ్రులు కుమారుని మృతకళేబరముంజూచి విలపించుట

కొంతసేపటికిని గొంచెముతెలిసి
కుందుచుఁజనుదెంచి కొడుకుపైఁబ్రాలి
(ఓయమ్మగుద్దికొనుచుఁబొలుచుఁబడుచుఁ)
తనయుఁడామాపుణ్య దశయిట్టులాయె
(మాయచావయ్యెను మాముద్దుకొడుక
యివ్వేళటనుండెనా మృత్యువునీకు ?
చెలువుఁడామమ్మేమి చేసిపోయితివి
చెలికాండ్రకేమేమి చెప్పిపోయితివి
మాకోర్కెలెల్లను మంటఁగల్పితివి
కటాకటామాకడుపు కాల్చిపోయితివి
మూఁడుకాళ్ళముసళ్ళ ముంచిపోయితివి
బాలచంద్రునిపెద్ద పాయఁగలేవు)
నాల్గువేదంబులు నయమొప్పఁజదివి
యఖిలశాస్త్రముల విఖ్యాతినిఁగాంచి
చెల్లితివానేఁడు చెలికానివిడిచి
(దైవమానీకెంత దయతేకపోయె
ననిచింతనొందుచు నయ్యారొయనుచుఁ
గంటికిఁగడవెడు గాఁగనేడ్చుచును
విలపించుచుండంగ విప్రబాంధవులు

కాలంబు నేఁటితో గడచినీతనికి
నిప్పుడో యెప్పుడో యీశరీరములు
పడిపోవఁగలవు శాశ్వతములుగావు
జనియించువానికి చావునిక్కంబు
చైతన్య మెడలిన శవమునుగూర్చి
విలపింప (బ్రతుకునా వెఱ్ఱితనంబు)
దహనకార్యము చేయఁ దగునంచుఁబలుక
గంధపుచెక్కలు ఘనకాష్ఠవితతి
తెప్పించి పేర్పించి తీర్చిరి వేగఁ
దగుశాస్త్రమార్గంబు తప్పిపోకుండ

## అనపోతు దహనసంస్కారము.

సతియును వెంబడి నేగసమ్మతిరాఁగ
దంపతులిద్దఱి దహనునికిచ్చి
చనిరి గేహములకు స్నానముల్ చేసి
యంతటమాడచి యాయత్తపడుచుఁ
దఱచు నెత్తుటి చేతఁదడిసినయట్టి

## మాడచి కార్యమాపూడిలోని శిబిరము సొచ్చుట.

బిరుదునుజందెంబు పెట్టెలోఁబెట్టి
యాందోళికారూఢయై త్వరితముగఁ
జనుదెంచిధరణీశు సముఖాననిలిచి
విందులుభుజియింప వివరంబు గాను
వీరులుదొరలును వేడుకమీఱఁ
బత్తినిగూర్చున్న భానసీలపుడు
వండినవస్తువుల్ వడ్డించిపిదపఁ
జమురులువడ్డించు సమయంబునందు
మాడచియటకేగి మదిఁదలపోసి
తెలిసి మేడపినుండి తెచ్చినయట్టి
మధురవస్తువులెల్ల మఱవక యిచ్చి
పలికె బాలునిఁజూచి పడఁతిధైర్యమున
వీనికం టెను గడుప్రియమైన మేలు
వస్తువులివిగో న వలయునఁటంచుఁ
దఱచురక్తంబునఁ దడిసినయట్టి
జందెంబుబిరుదంబు సయ్యనవిచ్చెఁ

## రక్తసిక్తంబైన జందెము, బిరుదు చూచి బాలచంద్రుఁడార్చుట.

జూచినయంతనె ఛురికాగ్రమునను
వక్షంబుఁబొడిచిన వడువునఁగలఁగి
బాలచంద్రుఁడులేచి పగఱువినంగఁ
బెడబొబ్బపెట్టెను బృథ్వీశులదర
నొప్పువారును వీరునొక్కటియైన
శంకింపకెదురెక్కి శాత్రవచయము
బారులపైఁబడి ప్రకటశౌర్యమున
బ్రహ్మన్నముఖ్య వీరవరులఁగదిసి
యనిలోనముందుగ హతముగావించి
తరువాతఁగాముని దళముపైదుమికి
కాలిబలంబుల గజవాజివితతి
పీనుఁగుపెంటలు వెల్లుగఁజేసి
తమకించి నరసింగుతలనుఖండించి
కొమ్మభూపతికిచ్చి కులవిరోధంబు
దీర్చిచిపంతంబు దీర్చెదఁజూడు
మనిబాలుఁడాడిన యప్పుడు తెలిసి

### సంధికాదని యందఱు నాళవదలుట.

వీరులుదొరలును వేగమె లేచి
సంధికార్యముమాని * బ్రహ్మనికేగి
యామడ్గులోవేసి రన్నమంతయును
జివరసఁగార్యంపు స్థితివిచారించి
రాయబారులతోడ రాజులిట్లనిరి
కాకున్నకార్యంబు కాకపోదిప్పు
డెక్కడిబంధుత్వ మెక్కడిచెలిమి
బాలునితమకంబు పట్టలేరెవ్వ
రనివీడుకొల్పిన నారాయబార్లు
కామునికడకేగి కరములుమోడ్చి
వినిపింపసాగిరి విషయమంతయును
మమ్మంపితిరిమీరు మలిదేవుకడకు
విన్నవించితి మంతవీరులయెదుట
నొనరంగసంధికి నొప్పియావేళ
వీరులురాజులు వేడ్కతుప్పొంగి
విందులుభుజియింప వివిధవస్తువులు
పచనంబుచేసిరి పక్షులుసాగ
నిరుపక్షములవారు నింపుమీఱంగఁ
గూర్చుండిరలలేని కూరిమితోడ
బానసీలన్నంబు పట్టుకవచ్చి
వడ్డించిచమురులు వడ్డించువేళ
నరిగెమాడచివచ్చి కలవరపడఁగ
ననవోతు తెఱఁగెల్ల నపుడుబాలునికిఁ
దెలుపఁగనాతఁడు తెంపునలేచి
యిడినట్టియన్నంబు నేఁటిలోఁగలిపి
యుగ్రుఁడైరణమున కుద్యుక్తుఁడయ్యె
మలిదేవరాజును మన్నెనాయకులు
మముఁబంపిరంతట మగిడివచ్చితిమి
కాఁగలకార్యంబు గతిమీకెయెఱుక

### బాలచంద్రుఁడు సోదరులదగ్గఱకుఁ బిల్చుట.

యంతటనబ్బాలుఁ డతికోపమునను
భుజములనెగఁబెంచి పాదవుగానిక్క
యుదుటుపంతములాడు చున్నంతలోన
గురుతరరణలక్ష్మి గొబ్బునవచ్చి
యావేశమైనిల్చె నాతనియందుఁ
గేరితమ్ములతోడఁ గిలకిలనార్చి
నిండుధైర్యముమీఱ నిశ్శంకుఁడగుచుఁ
గనుఁగొనుచుండెను గాముని దళము
తమకంబుహెచ్చంగఁ దాలిమిమెసఁగ
బవరంబునకుఁ దాము పైనమైపోవ
సుముహూర్తమెక్కటి చూడఁగభూమి
దేవవితతిఁబిల్చి స్థిరముగనడిగె
వీరాగ్రగణ్యుండు వినుతసద్గుణుఁడు
హాటకాచల ధీరుఁడబ్ధిగంభీరుఁ
డరిజయసంశీలుఁడై తమ్మనుతుఁడు
సంగడీలకుఁ బ్రాణసఖుఁడైనవాఁడు
నిర్మలుఁడగు బ్రహ్మనిజకూర్మిపట్టి
భగవదంశముగల బాలచంద్రుండు

---

* గంగధార మడుగు.

పులినిదండంబుతోఁ బొడిచినయట్లు
కొల్వులోపలినుండి గొబ్బునలేచి
తనప్రాణసఖులను దగ్గఱఁజేర్చి
వెన్నిచ్చిపగఱకు వెనుకాళపడవు
విఱిఁగినవైరుల వెన్నాడిచనవు
కులమునవెలమవు క్రోధంబుహెచ్చు
సకలశాస్త్రవులకు సమవర్తివీవు
వన్నె తెచ్చితివార వంశమంతకును
ననుఁజేరరావయ్య నమ్మినవాఁడ
మేటిరెుజ్జలలోన మేటివైనట్టి
కమ్మరపట్టి నాకడకురావయ్య
తగవింజమాజూకుఁ దనయుఁడవైన
కంపాలచందు! దగ్గఱకురావయ్య
గురుతైనబిరుదుల కుమ్మరపట్టి
మఱియుఁజాకలచందు మంగలమల్లు
నమ్మినమిత్రులనఁజేరరండి
యనియిట్టులావ్వారి నతిభక్తిఁబిల్వ 23/10
సంతోషమునబాలు సన్నిధికేగి
వరుసతోఁ మ్రొక్కి వదనముల్ చూచి
తరువాతబాలుఁడు ధైర్యచిత్తమున

## బాలచంద్రుఁడు వీరులకుఁ నిజమనోరథంబు దెల్పుట.

వీరనాయకులను వేడుకఁజూచి
విన్నవించెనుశౌర్య విభవంబెసంగ
దేవతల్ చూడంగఁ దీక్ష్ణత మెఱయ
మనసునశంకలుమట్టుగాఁజేసి
బ్రతుకులపైనాశ పాఱఁగఁద్రోశి
పితికిఁ ప్రేవులువిడ్చి వెగడుటమాని
లోభమోహంబుల లోలతఁద్రుంచి
సూర్యతేజంబున శూరతమీఱఁ
గామంబుక్రోధంబు కడకేగనెట్టి
కామభూపతిగెల్తుఁ గదనంబునందు
సత్యవ్రతోత్సాహ సాహసులార
నిర్మలగుణయుక్త నిశ్చలులార
జయులార దేవాంశ సంభూతులార
ధర్మమర్మవిచార తత్పరులార
విజ్ఞానశోభిత వీరాత్ములార
సజ్జనావనులయి జగములలోన
వీరకార్యంబుల వెలసినయట్టి
యఱువదేగురుమేటి యయ్యలుమీరు
మీబంటుబ్రహ్మన్న మితిలేనిగరిమఁ
బూర్వమొనర్చిన భుజవిక్రమములు
విందుమమీరెల్ల వినిపించుచుండ
బ్రహ్మన్నకాదిరెడు పగవాఁడుగలఁడె
యటువంటిబ్రహ్మన్న కనుఁగుపుత్రుఁడను
భీతిచేఁబగఱకు బెదరనునేను
దాతతండ్రులకును దగుమామలకును
గడుపిన్ననని మీరు గారాబమలర
నెత్తిముద్దాడుట యామేలుమీద
కన్నెకయ్యమునందుఁ గలిగాపుణ్యంబు
స్వర్గంబుఁగొనుటకుఁ జాలినవాఁడ
నాపంతమరయుఁడి నాయకులార
కామునితమ్మునిఁ గలనిలోఁజంపి
తలఁదెచ్చిమీకిత్తుధరణీశు నెదుటఁ

జంపుదురణమందు సకలశాత్రవులఁ
బ్రతినతీర్పకయున్న బాలుఁడఁగాను
నాపుఁడువినివీర నాయకులనిరి

## వీరులు బాలచంద్రు నివారించుట.

వలదుబాలుఁడవిన్న వాఁడవునీవు
చిన్నపుపనికాదు సమరకార్యంబు
దళమువిస్తారంబు తగదుశౌర్యంబు
పడుచువాఁడవునీవు పటిమకోంచెంబు
వలనొప్పశీలము వారందఱికిని
సంతానమేలేక సంతోషమెడలి
పంద్రెండువర్షాల పరిమితిగడచె
మాచెర్లచెన్నుని మన్ననవడసి
యైతాంబనినుఁగనె నధికమోహమున
సంతతివృద్ధియై జరుగంగనిమ్ము
సమరంబునకునేగు సాహసమేల
మీతలిదండ్రుల మిగులమన్నించి
మమ్మాదరించియు మామాటవినుమఁ
టంచుఁబల్కినవారి కనియెబాలుండు
కడుతెంపుమీఱఁగఁ గలకలనవ్వి

## బాలచంద్రుఁడు వీరులకుఁ ప్రత్యుత్తరమిచ్చుట.

యీరీతిఁబల్క మీకిదిధర్మమౌనె
యసహాయులనఁదగు నయ్యలుమీరు
తనరినయాగంగ ధారకువచ్చి
కలిసినముద్దులో ఘనులుమీరంత
స్నానముల్ చేసి ప్రశస్తంబుగాను
బటులింగమూతులఁ బట్టుకవచ్చి
ధరణిఁబ్రతిష్ఠించి ధైర్యసంపత్తి
నన్నంబువెనుమట్టి యారాజుచేత
విడియముల్ గొన్నట్టి వీరులుమీరు
ప్రథమతాంబూలంబు పట్టితినేను
వీరులునాయకుల్ వేడుకఁజూడ
శ్రీరణమొనరింతుఁ జెన్నుఁడుమెచ్చ
వెంగిలిపోటగు నిప్పుడుమీకు
సురలోకవైభవస్ఫూర్తి సాకగును

## బాలచంద్రుఁడు తన పూర్వజన్మముల వృత్తాంతము తెల్పుట.

బాలుఁడీతండని పలుకఁగరాదు
నాపూర్వమంత విన్నపమొనరింతు
వీరనాయకులార విఖ్యాతులార
వినుఁడుచెవులనొగ్గి విశదముగాఁగ
సురుతరనగరమయోధ్యఁబాలించి
చనినట్టియాహరిశ్చంద్రభూపతికిఁ
జంద్రమతికినేను జనియించిమించి
లోహితాస్యుఁడనైతి లోకములెఱుఁగ
నాఁడుబాలుఁడగాను నాయకులార
కనకకశిపునకుఁ గాంతులువెచ్చఁ
బ్రహ్లాదుఁడనుపేరఁ బరగిపుట్టితిని
జేసితిదుర్ఘటచేష్టలుకొన్ని
యతులమనోస్థైర్యమగపఱచితిని
నాఁడుబాలుఁడగాను నాయకులార
యీరెడుశివకంచి యేకామ్రపతికిఁ
జిఱుతొండనంబినాఁ జెలఁగుభక్తునికి

శెంకెలశిరువను సీమంతినికిని
సిరియాళుఁడనఁబుట్టి చెన్నొందినాఁడఁ
దలిదండ్రులపుడు నిదర్శయతమదిర్ణించి
యిష్టభోజనముగానే మీశ్వరునకు
నిన్ని వ్వనుంటిమి నీవేమియందు
వనినన్నుఁబ్రశ్నింప నానుగాదనక
సమ్మతించితివారి సత్కారమునకు
జీవముతోడనె శివునితోఁగూడ
గాంచీపురంబునఁ గాపురమున్న
యేడువాడలవారి నింపుదళ్కార్త
ఘనపుణ్యవాసంబు కైలాసమునకుఁ
గొనిపోయితిని నేను గురుతరభక్తి
నాఁడుబాలుఁడఁగాను నాయకులార
కిష్కింధనేలెడు కీశాధిపతికిఁ
దారకంగదుఁడనై ధరఁబుట్టినాఁడ
రామచోదితుఁడనై రావణుకడకు
రాయబారిగనేగి రాక్షసుల్ గ్రమ్మ
వారినిఖండించి వడిమాపినాఁడ
నాఁడుబాలుఁడఁగాను నాయకులార
రఘువంశమందున రామచంద్రునకుఁ
గుశుఁడనైపుట్టితి గురుశూరుఁడైతి
నాఁడుబాలుఁడఁగాను నాయకులార
పాండుభూవరునకుఁ బౌత్రుఁడనగుచు
నభిమన్యుఁడనుపేరఁ నవనిజన్మించి
వీరధర్మముచూపి వెలసినవాఁడ
నాఁడుబాలుఁడఁగాను నాయకులార
యిటువంటిజన్మంబు లెన్నియోకలవు
చెప్పశక్యముగాదు చెన్నునియాన
ప్రతిజన్మమందైన ప్రౌఢవిక్రమము
శ్రీపురాణంబులు చెప్పుచునుండుఁ
గలియుగంబుననిప్డు కడసారికేను
గుంతాలవారింటఁ గూరిమిమీఱ
బ్రహ్మనాయునికినిఁ బడఁతియైతమకు
బాలునిపేరఁటఁ బల్నాటిలోన
జననమొందినవాఁడ సమరశూరుండఁ
బేరబాలుఁడుగాని బిరుదుమగండఁ
బగవారిఁగొట్టని బ్రతుకదియేలఁ?
తలిదండ్రులనుఁబ్రోవఁ దనయుఁడేకర్త
మానాభిమానముల్ మగటిమిమించఁ
బ్రబలింపఁగలవారు బాలురెసుమ్ము
బాలురె పెద్దలు బల్లిదుల్ వారె
బాలురకే వృద్ధిపరికించిచూడఁ
బెద్దలుమతిచెడి పిఱికిపాలుదురు
పాంచభౌతికదేహ పటిమక్షీణించు
మనసుచలించును మాటిమాటికిని
ధైర్యంబుతగ్గును తాపహంబులుడుగు
వయసుమీఱినవేళ వచ్చునాబలిమి
కీర్తికైనను నపకీర్తికినైన
బాలురవైనుండు భారతమంతయును
మైలమకాముని మడియంగఁజేసి
నాయకురాలిని నయహీనఁజేసి
పరదళంబులఁజంపి పంతంబుతీర్తుఁ
బడుదునురణభూమి బవరంబుచేసి
చూచియాస్వర్గంబు చూఱలుగొందు
ననియిట్టులా బాలుఁడాడినమాట

## బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని సాహసము వారించుట.

వినితండ్రు లెల్లరు విశ్వాసమునను
గాఢంబుగాఁ గుచ్చి కౌగిటఁ జేర్చి
బాదన్న మొదలైన భ్రాతృవర్గంబు
వేఱుచింతలుమాని వినుచుండఁగాను
బాలునితోడుత బ్రహ్మన్న పలికె
నాయాత్మనందన నాకూర్మిపట్టి
పుట్టినదాదిగ బుధులనుఁగొల్వ
నిట్టిధీరత్వంబు నీదిట్టతనము
నేరీతినీకబ్బె నిదియేమివింత
యొకబుద్ధి చెప్పెద నొప్పఁగవినుము
ఘోటకంబులు మేటి కుంజరావళులు
కాలిబలంబులు ఘనఖడ్గవితతి
కుంతంబులును గండ్రగొడ్డండ్లు గదలు
ముసలముద్గరములు మొనలకటార్లు
చక్రతోమరములు శార్ఙసంఘంబు
ఛురికలుబాణముల్ శూలచయమ్ము
మొదలైనశస్త్రాస్త్రముల నెల్లఁజూచి
భావంబుచెదరినఁ బంతముల్ గావు
పలికినరీతిని బవరంబునందు
విక్రమంబుననిల్పు విధమద్భుతంబు
సమరకాలంబున సకలదేవతలు
కనిచిత్తచలనంబు గావింతురు
గణపతిభైరవుల్ కాళియుదుర్గ
విఘ్నకారులు యుద్ధవిభవంబువేళఁ
* పార్థుఁడంతటివాఁడు ప్రథనరంగమునఁ
గర్ణునిరాకడ గనిభీతినొంది
బ్రతికితే శుభములు పడయంగవచ్చు
వరదంబుమరలింపు మయ్యశ్రీకృష్ణ
యనివిన్నపము చేసె నాశ్చర్యభంగి
నితరులమాటలిఁ కేల వచింప
నామీదఁబౌరుష మంతయుఁబోవు
ననవినియాబాలుఁ డల్లననవ్వి

## బాలచంద్రుఁడు నిజ శౌర్యంబు తండ్రికిఁ దెల్పుట.

తండ్రితోననియెను ధైర్యంబుమీఱఁ
బిడ్డచిన్నదికాద భేదించుఁగొండ
చిన్నవీర్యమునందుఁ జెడుకాకారంబు
ఘనకపాలము కెక్కి కాకనొందించు

* 1 " గాండివి శౌరికిట్లులనుఁ గర్ణునిఁజూచితె యేకవిక్రమా । ద్దండతఁ దెంపుచేసి పటుదర్పము నూపుచుఁ దేరిచూడరా । కుండెడునట్టు గానలుకను గ్రతమండెడు నిప్పు సేర్పుపై । నుండక యీసునం దొడరి యోట మిడెచ్చికొనంగ నేటికిక ॥ గీ॥ పట్టపగలింటి సూర్యుని పగిదిఁ గర్ణుఁ । డుగ్రమూర్తియై వెలుగుచున్నవాఁడు । మనరథంబిప్డు మాధవ మరలనిమ్ము । బ్రతికియుండిన శుభములు బడయవచ్చు" మహాభాగతము, కర్ణపర్వము, ఆ. 8.

మానకనోరంత మందును లెన్న
కాలుదావాగ్నికిఁ గారడవెదుర
హనుమానుఁడెగురు నాయాచాటిపడెలు
వారిధిలంఘించి వడిదాఁటుఁగాక
బాలుఁడుచిల్లర బలముపైఁబడఁడు
కామునితమ్మునిఁ గదిసిమర్దించి
తలఁగోసితెచ్చును ధైర్యంబెసంగ
ననుచుబాలుఁడువల్కె నందఱువినఁగఁ
దరువాతనాయుఁడు తనయునిఁజూచి

### బాలచంద్రుఁడు యుద్ధమునకుఁ బోవుటకు సమ్మతించి బ్రహ్మనాయుఁడతనికి రణధర్మంబుల నుపదేశించుట.

వినుబాలచంద్రుఁడవి శదముగాఁగ
ధరలోననాపేరు దశదిశలందుఁ
బ్రఖ్యాతినొందెను బ్రహ్మనాయుండ
మండలేశులకెల్ల మదితల్లడమయి
చెల్లినమనపేరు చెడిపోవనీకు
పృథ్విబిరుదములఁ బెంపునొందింపు
ఘనమైననాపేరు కల్లచేయకుము
ముల్లుచూశౌర్యంబు మొక్కపోనీకు
మిలలోనమనలావు లెన్నలేరెవ్వ
రాజీయసంగ నేమనితలంచెదవు

### యుద్ధరంగ తత్త్వము.

శౌర్యంబునకుఁ బాదుస్వర్గంపుఁద్రోవ
యిహపరసౌఖ్యాల కిదిపట్టుగొమ్మ
యిదిముక్తిసోపాన మిదిమూలధనము
(అగగ్భశూరులకాటప్రదేశ)
మిదిదేవవితతుల కెన్ననామేలు
హెచ్చైనవీరుల కిదిపుట్టినిలు
(ధర్మసంరక్షణార్థణంబయి బుధులు 24/10
కదలకరక్తంబు కార్చెడుచోటు)
పటుకీర్తినొందించు బ్రహ్మాండమందు
నిదిసమరావని యిదిపుణ్యభూమి
శ్రీకంఠుశిరసంటి చెప్పెదనీకుఁ

### బ్రహ్మనాయుఁడు కుమారునకు రణనీతి నుపదేశించుట.

గామనృపాలుండు కల్మి పెంపొంద
సకలభూమీశుల సంగ్రామమునకుఁ
బిలిపింపవచ్చిరి పేర్మినిఁజూప
బహుయుద్ధపటిమచేఁ బ్రబలినవారు
చతురంగబలములు చాలువచ్చుటను
బూర్వంబుమనతోడఁ బోరాడలేక
చిక్కిచెప్పినయట్లు చేయుచునుండి
పగవారిలోఁజేరి పఱతెంచినారు
జడియకనిల్తురు సమరంబునందుఁ
గన్నెకయ్యంబిది కనిపెట్టిపోరు
కలుపంగవలయును సత్కీర్తివచ్చుఁ
దలపడునప్పుడు తలఁకకుమన్న
యాలుఁగులదీప్తికి నలుకకుమన్న
వారణధ్వనివిని వడఁకకుమన్న
శరములదీప్తికి జడియకుమన్న
సమరకాలంబున జంకకుమన్న

మొనచెడగణములలో మురియకుమన్న
బిరుదులుజాతిన బెదరకుమన్న
ఘనఖడ్గహతులకు గతిమాలవలదు
బలములుముట్టిన భంగంబుగాకు
పందడిరణమున శంకనొందకుము
బహుతరనైపుణ్య పటిమ సెలంగఁ
బరదళంబులనొంచి బవరంబు చేయుము
కాముఁడుర.ఁమునఁ గంపంబునొంద
నరుగుముపీకచే నరసింగుపైకి
జయముచేకొనుపుత్ర సాహసస్ఫూర్తి
ననినీతిగాఁజెప్పి యపుడు బ్రహ్మన్న
తగినట్టికర్పూర తాంబూలమిచ్చి
శంఖతీర్థ మొసంగి జయమొందుమంచుఁ
బంపింపఁదనతండ్రి బ్రహ్మనాయునికి

## బాలుఁడు యుద్ధరంగమున కేగుట.

దండనమస్కృతుల్ తాఁజేసి వెడలె
నా వేళ గణభేరులధికమై మ్రోసె
ఘంకాఘమామికల్ † డంగురంబులును
బటహాశంఖంబుల పటుతరధ్వనులు
బహుళమైమిన్నంద బాలచంద్రుండు
సమగభూస్థలినుండి సంతోషమునను
సూర్యభైరవులాది సురలకు మ్రొక్కి
దిక్పతులార యో దేవతలార
కనుఁగొనుచుండుఁడీకదనరంగంబు
చేసెదసమరంబు చిత్తముప్పొంగ
ననివిన్నపము చేసి యాయుధమంది
యొఱతీసిఝళిపించి యుగ్రుఁడై నిల్చెఁ
దరువాతనరసింగ ధరణీశ్వరుండు

## నరసింహాభూపతి రణమునకు వచ్చుట.

ఘనమైనగజముపై గ్రక్కుననెక్కి
సమరరంగమునకుఁ జనుదెంచువేళఁ
జొక్కుచువ్వలవారు నూరెలవారు
పదివేలునిల్చిరి పటుశౌర్యమునను
బల్లెముల్ పట్టుక బలుమైనబంట్లు
గజముముందేగిరి గాఢధైర్యమున
విలుకాండ్రు నాలుగువేలసాహసులు
బాణతూణీరముల్ ప్రబలధరించి
నడితోడరణరంగ వసుధఁదార్కొనిరి
పంచసహస్రాశ్వ పంక్తియేతెంచె
భూరిమాతంగముల్ భూధ్రంబులట్లు
బృంహితధ్వనులతోఁ బెల్లుగనడిచె
శూలశరోద్వృష్టిశోభిల్లుచుండు
వీరులువచ్చిరి విచ్చలవిడినిఁ
గడమబలంబులఁ గాదు లెక్కింపఁ
బటువిక్రమస్ఫూర్తి బలమిట్లువెడలె
ధ్వజములు పడిగెలు దట్టమైకదలె
బిరుదుఛత్రంబులు పెద్దటెక్కెములు
సాంద్రమైయుండెను జగదీశునెదుట
బహుతరవాద్యంపుఁ బటుల్ మ్రోయంగఁ

† వీరణము.

చిక్కటిల్లెదిశల భేరీరవంబు
కాహళల్ బూరలుకనక తప్పెటలు
ధ్వనులచేజనతతిఁ దల్లడపఱచ
నతిభీకరంబగు నరిసైన్యచయము
బాలచంద్రుఁడుచూచి భ్రాతలుఁదాను
కుపాక్కటవులనగ్ని కుడిసినయట్లు
కోయనియార్చుచుఁ గుప్పించియుఱికి
బలముపైఁబ్రాలెను బౌరుషాధికతఁ
గుంతముల్ చేనంది గుదులుగాఁబొడిచి
కత్తులచేఁదలల్ ఖండించివైచి

## బాలచంద్రుఁడు భీమంబగు సంగ్రామం బొనర్చుట.

మణికట్లుఁదునుమాడి మస్తకవితతి
ధరమీదనొరగంగ దట్టించినఱికి
మోచేతులెడసేసి ముక్కులుచెక్కి
ఫాలంబులంజెంపి ప్రక్కలఁగోసి
దౌడలూడఁగనూకి దండముల్ ద్రుంచి
కనుగ్రుడ్లు పగులంగఁ గర్ణముల్ వ్రాల
బలువైనఱొమ్ములు పఱియలుగాఁగఁ
దొడలెల్లఁదునుకలై తూఁగాడుచుండ
జానువులూడంగ జంఘలువిఱుగ
చీలలుపట్టెడి చీకాకునొంద
నీరీతిఁగొంతసే పీప్సితమడర
ననుజులతోఁగూడ నని చేసిపిదప
దంతావళంబుల దట్టంబుచూచి
బాలుఁడుకోపంబు ప్రకటంబుగాగ
కాధమసింహముభంగిఁ గుప్పించియెగిరి
పటుతరకుంభముల్ పగులఁగమోది
తొండముల్ తోఁకలు తునుకలుసేసి
మావంతులనుగొట్టి మరణమొందించి
పైనున్నదొరలను బడిపోవఁబొడిచి
దంతముల్ ముక్కలై ధగవ్రాలఁజిదిమి
చెవులనుఁగత్తితోఁ జీలికల్ చేసి
పిల్లదంతంబులఁ బెకలించివైచి
ఘనపదంబులఁ దునిమ్కంఠముల్ నఱికి
కొంతసేపీమ్మాడ్కి గురుశౌర్యమలర
సమరంబుగావించి జవనాశ్వవితతిఁ
జక్కఁగఁ గనుఁగొని సాహసపటిమ
ఖడ్గకుంతంబులు కరములఁబట్టి
పైనున్నరాహుత్తపటలినిఁ జంపి
తొడిగినజోడంగి తుక్కుగఁజేసి
సింగిణివిండ్లనుఁ జిదుకలొనర్చి
తూణీరబాణముల్ తుముఱుగావించి
ఖడ్గఖేటకములు ఖండించిమించి
మెడలురెండుగఁజేసి మేనులుసించి
యుదుటుఱొమ్ములలెన్న యీటెలగ్రుచ్చి
కొంకులుతెగఁగొట్టి ఖురములుచెక్కి
చాలసేపీగతి సమరంబొనర్చి
బలమెల్లనీలాగు భంగంబునొంది
కంఠముల్ దెగిపడ గ్రక్కునఱికి

## నలగామరాజు సైన్యము కలఁత నొందుట.

పడితన్నికొనిచచ్చు బలసమూహంబు
మస్తకంబులుపోయి మహిమీదమడిసి

కన్నులు తెఱచుచు గంతులువైచి
ప్రాణముల్ విడిచెడు వారునుమఱియుఁ
బాదముల్ విఱుగఁగ బవరంబుచేయఁ
బండుగీటుచుఁ దూలుపటుశూరవితతి
కరములుతునిసినఁ గత్తులువదలి
బాలునిఁగనివచ్చు భయదోగ్రభటులు
ప్రేవులువెడలినఁ బెడచేతనొత్తి
కడిమిచేబల్లెంబు గట్టిగాఁబట్టి
యహమహమికతోడనరుదెంచఁగడఁగి
సంచలింపనిదీర్ఘ సాహసఘనులు
మూల్గుచుఁజచ్చెడు ముదియోధవరులు
బాలునిఁగనుఁగొని భయమందిబెగడి
పాఱిపోయెడుపంద భటసమూహంబు
పాఱిపోవఁగలేక బ్రతుకుపైనాశ
బ్రతిమాలుచుండెడు బలనిచయంబు
లిటువంటిజగడంబు లెన్నఁడెఱుంగ
మేలాగుపోదు మన్నేడ్చెడువారు
నాలుబిడ్డలఁబాసి యన్నంబుకొఱకు
వచ్చితిమీనేల ప్రాసెనుమృత్యు
వనిదుఃఖమొందుచు నసురుసురంచు
వేగమె ప్రాణముల్ విడిచెడువారు
బహుదినంబులు మేము పాళెరుచేసి
మునికొల్లలెల్లను ముంజాలఁదోపి
పఱతులుదిట్టినఁ బడలేకవచ్చి
చచ్చుచునుంటిమీ సమరరంగమునఁ
బాఱిపోఁజిచ్చిన బ్రతుకుదుమయ్య
యనిమ్రొక్కుచుండెడు నతిహీనభటులు
బోయవారము మేము పూర్వంబునందు
బుజములకాయలు పూనికన్గాసుఁడి
పగవారమముఁగని పాఱిపోవుదురు
మీకేమిభయమని మొలఁతనాగమ్మ
బాగుగానమ్మించి పంపవచ్చితిమి
జీవముల్ దక్కెనఁ జిన్నలఁగలిసి
బలుసాకుదినినైన బ్రతుకఁగఁగలము
మీరుపిల్చినవేళ మేమరుదెంతు
(మనియంజలియొనర్చి యావమానమొందు
మగసిరిచేపట్టి మానహీనులును
వీలుచిక్కెనరణ వీరులవిడిచి
పోయెడుదుర్మార్గ బుద్ధియుక్తులును)
జచ్చినవిధమున సమరోర్వియందుఁ
బలుకకయూరక బ్రాలెడువారు
చనలేకభయమునఁ జచ్చినవారి
మీఁదఁద్రోసుకయుండి మెదలనివారు
చచ్చినగజముల చాటునడాఁగి
పందతనంబునఁ బడియుండువారు
పెండ్లాలఁదలఁచుక బిట్టేడ్చువారు
వల్మీకములమీద వసియించువారు
గడ్డిలోఁదూఱఁబడి కదలనివారు
వ్రేళ్ళుచీకెడువారు వెన్నిచ్చువారు
(వెండ్రుకల్ విప్పుక విదిలించువారు
నీవారమనిపల్కి నిల్చుండువారు
నాయుధాల్ పడవైచి యాలికెడువారు
పడలేకచతికిలఁబడి యుండువారు)
బవరంబులోఁగూలి ప్రాణజాలంబు

విడిచియొకఖడ్గమున్ విసువనివారు
భయదమైయిబ్బంగిఁ బరికింపరాక
సమరరంగము భయజనకమైయుండెఁ

## బాలచంద్రుఁడు శాత్రవబలంబులఁ జక్కాడుట

గొందఱువిలుకాండ్రు గుంపులుగూడి
బహుబాణములుమీఁదఁ బఱపెడువేళఁ
దమ్ములనందఱఁ దగనిల్వఁజేసి
పరిఘమొక్కటిచేతఁ బట్టుకతూరి
తనువునబాణముల్ దాఁకకుండంగ
భ్రమణనైపుణ్యంబు బల్విడిఁజూపి
పఱతెంచువిశిఖముల్ పాయఁగొట్టుచును
ఖడ్గమాడించుచు గర్జలొనర్చి
యుట్టహాసంబున నావిలుకాండ్ర
పైకేఁగిధనువుల భంగంబుచేసి
శింజినులెల్లను జిదురుపల్ చేసి
తూణముల్ శరములు తుమురుగాఁగొట్టి
చుట్టుపేరెముచాటి శూరతమెఱయ
వండఁదటిగినట్లు వడిమేనులెల్ల
ఖండించియముఁజేర గ్రక్కునం బెఁ
జొక్కుచువ్వలవారు శూరతహెచ్చ
వంచుకపైకుతిక్క వచ్చుటసూచి
బాలుఁడువెసనార్చి పకపకనవ్వి
తమ్ములుతోడు రాదంటమైతోడరి
కప్పించిపైఁబడి గొడ్డండ్లతోడఁ
జెఱకుబునఁటికిన చెలువుఘటిల్ల
నలుఁగులనీఁటెల నన్నింటిఁదునిమి
శూలంబులంబొడ్చి సురియలఁగ్రుమ్మి
గండ్రగొడ్డండ్లతోఁగ కెలుగాఁగొట్టి
బాఁకులఁబొమ్మలు పటియలుచేసి
గదలచేశిరములఁ గడునుగ్గొనర్చి 25/10
బాధించిపొట్టలఁ బటిమచేఁజించి
కత్తులమేనుల కండలుడుల్చి
పంపించెజముఁజాడ బలములనెల్ల
సంగ్రామమీరీతి జరిగినవేళఁ
బాఱిటిమిగిలిన బంటులుగూడి
యావేళనరసింగుఁ డతికోపకలనఁ

## పాఱిపోవుచున్న సైన్యమునకు నరసింహభూపతి ధైర్యవాక్యములు చెప్పుట.

బారెడువారికిఁ బలుకంగసాగె
విఱిగిపోవుట యిట్లువీరధర్మంబె
బాలురఁగనుఁగొని పరువిడనేల
మిమ్ముగాచినవారి మేలెత్యజింప
(బలిమిమీనరములఁ బాఱురక్తంబు
రాజాన్నవర్ధిత రక్తంబుగాదె
ధూర్తులైనృపునకు ద్రోహంబొనర్చి
నమ్మినరాజును నట్టేటముంచి
పోవుటయేనీతి పుణ్యాత్ములార
తనువులస్థిరములు ధనములుకల్ల
కీర్తియొక్కటి భువిఖిలముగానుండు
ధైర్యహీనత వీరధర్మంబుమాని
భంగుగంతై మలభాండమైనట్టి

దేహంబుకొఱకు సత్కీర్తిఁబోనాడి
విఱిగిపోయెదునట్టి వెఱ్ఱులుగలరె
క్షితిలోన శ్రీవీరసింహులకును
సమరరంగంబులే సంచారవనులు
చచ్చినబ్రతికిన సౌఖ్యమచ్చటనె
బుద్ధులుచెడి పాఱిపోవుదురేని
భుక్తిముక్తులు రెండుపోవునఁదొలఁగి)
ననుఁబాసిపోవుట న్యాయంబుగాదు
తప్పనామరణంబు తలచెడిపాఱ
మృత్యుదేవతవచ్చి మేనులనిల్చె
బంటుపంతంబులే పాఱిపోవుటలు
పరికింపఁబెండ్లికి వచ్చుటలేదు
సమరకార్యమునకై చనుదెంచినాము
వచ్చినకార్యంబు వఱదలోఁగలిపి
బంధులుమిత్రులు పగవారునవ్వఁ
బోవుట క్షీణతపుట్టదన్నంబు
పోవద్దురాజాన పోయితిరేని
ననియిట్లుపల్కిన నాబలంబెల్ల
బహురోషపటిమచేఁ బాఱకనిల్చె
నంతట నాబాలుఁడనుజులఁగూడి

## నలగామరాజు సైన్యంబు బాల చంద్రునిపైఁ గవయుట

అట్టహాసముచేసె నరిసేనలపుడు
జడిసిగుండెలు వ్రీలఁజలనంబునొంది
ధైర్యంబువహియించి దర్పముల్మీఱ
గదలుచక్రంబులు గండ్రగొడ్డండ్లు
పెద్దవిసురియలు భిండివాలములు
బల్లెముల్ కుంతముల్ పటుశూలచయము
కరములఁగొని రోషకలితులై వచ్చి
మిడుతలుమంటపై మిడిసిపడ్డట్లు
బాలునిఁదాఁకిరి భయదూరులగుచు
విక్రమాటోపత వెలసిబాలుండు
జలధిలోమంథర శైలంబుతిరిగి
కలకనొందించిన కైవడిమీఱి
కాలాగ్నిలోకముల్ గాలిచినట్లు
దవవహ్ని విపినంబు దార్కొన్నభంగి
మనుజాలలోమారి మసఁగినరీతి
శత్రుసైన్యంబుపైఁ జయ్యనఁగదిసి
వారుప్రయోగించు వరశస్త్రవితతి
బహువిధంబులఁద్రుంచె భంగముగాఁగ
నొకబంటునొకకాలు నొయ్యనఁబట్టి
యొకబంటుతొడ వట్టిహుంకరించుచును
నిద్దఱ ముగ్గుఱ నేకకాలమున
గుంతంబులంజిమ్మి కూలఁజేయుచును
బాణంబులంగ్రుచ్చి పట్టియెత్తుచును
గత్తులతోతలల్ గట్టిగానఱికి
వ్రయ్యలై తనువులు వసుధపైఁబడఁగఁ
గటిదేశములయందుఁ గత్తులువేయఁ
దునకలై భూస్థలిఁ దొరఁగుచునుండెఁ
గుంతంబులెడఁ గ్రుమ్మికూల్చెడు వేళ
నెత్తురుభూమిపై నిండియుఁబాఱె
నెదురులేక సమరమీగతిఁజెల్లఁ
గనుఁగొనినరసింగు కంపంబుగదురఁ

దలయూచిశ్రీహరిఁ దలఁచిసమ్మదిని
వ్రేలిడిముక్కుపై వెఱఁగందియుండి

### బాలుఁడు శత్రుసైన్యంబులఁ జాప కట్టుగఁ గూల్చుట.

యితఁడుబాలుండని యేలాగుపలుక
శూరతదళముల నుడివడఁగొట్టె
నితనితోఁ బోరుటకేదినాబలము
గ్రక్కునమాయన్న కడకేగుదెంతు
ననిభయంబున నేగ నవనీశ్వరుండు
తరువాతబాలుఁడు తనరోషవహ్ని
యధికమైజ్వలియింప నాపఁగలేక
చిత్రంబుగాఁగూల్చె సేనలనెల్లఁ
గొందఱఖండించి కొందఱఁద్రిమి
గుదిగ్రుచ్చెఁ గొందఱఁగూల్చె గొందఱను
సంగరమీరీతి జరుగుటకతన
భండనరంగంబు బయలగుచుండె
మదగజవ్యూహంబు మావంతులపుడు
తివిరిధీరతతోడ దీకొల్పియార్చి
దట్టమౌశరవర్ష ధారలుగురియ
బహుకోపయుక్తుఁడై బాలుఁడావేళ
ననుజులతోఁగూడి యతిజవమొప్పఁ
గదిసిఖండించెను గజసమూహమును
దునుమాడిదంతముల్ తుండెముల్ చేసి
శూలంబులంగ్రుమ్మి సురియలఁబొడిచి
పట్టిసంబులఁగొట్టి బాఁకులమొత్తి
గదలచేఁగుంభముల్ ఘాతలుచేసి
పదములుతెగిపడఁ బటుఖడ్గతతులఁ
గొట్టినఁగూలెను గొండలరీతి
వినువీధిదేవతల్ వేడుకచూచి
యాశ్చర్యమొందిరి హర్షంబులెసఁగ

### బాలచంద్రుఁడు నరసింహుని తల యానఁగొని వేఁటాకని తలగోసి తండ్రియొద్దకుఁ గొంపోవుట.

ఘనముగనొకయల్ల గజముపైనెక్కి
నేర్పుమైరయొకఁడుండనిర్భయుఁడగుచు
ననుజలనందఱి నటఁబుచ్చివచ్చి
కొదమసింహముమాడ్కిఁ గుంభిపైదుమికి
పతుమున్నాఁకున వడితోడఁబొడువ
వాలంబునసువెళ్లి వచ్చెనుదిరిగి
కడఁగిగుంజఁగ నెత్రుకాలువలయ్యె
ఖండించిమదగజ ఘనమస్తకంబు
కూల్చెనుభూమిపైఁ గొండచందమునఁ
బైనరుఁడెవ్వఁడో భావింపలేక
నరసింగుఁడీఁడనినమ్మి చిత్తమునఁ
దమకంబుచేవాని తలతెగఁగోసి
తనచేతఁబట్టుక తమతండ్రికడకు
బాలుఁడువిచ్చేసెఁ బ్రజ్వరిల్లుచును
సమగరంగముచూడఁ జక్కఁగనుండె
ఘనమైననెత్తురు కాల్వలైనిలిచెఁ
దెగిపడ్డగజములు దీవులైయొప్పె
నఱికినతురగముల్ నక్రంబులాయెఁ
బొర్లాడుశిరములు బుద్బుదపటలి
పెక్కుముల్గొడుగులు డిండీరవితతి
కలిగినపుచ్ఛముల్ కచ్ఛపరాజి

మేటినేత్రంబులు మీనవారంబు
దీర్ఘశిరోజముల్ తీగైననాచు
మెదడునుమాంసంబు మించినబురద
తెలుపైనయీఁకెలు దర్వ్యకరాళి
పొడిగైనభూషణ పుంజంబులెల్ల
సైకతనిచయంబు సరవివర్ణింప
నిటువంటిరణగంగ వీక్షించికొనుచుఁ
జనుదెంచిసోపాన సంయుక్తమైన
మేడమీదికిసెక్కి మేటివిక్రముఁడు
బాలుఁడాశిరమును బ్రహ్మకొప్పించె
నాయకావలిఁజూచి నాయుఁడిట్లనియెఁ
జెలువైననరసింగు శిరమిదికాదు
రహివెంకుశిరమాట గ్రహియింపలేక
చనుదెంచెనేమయ్య జగదీశుతమ్ముఁ
డైనట్టినరసింహుఁ డన్నదగ్గఱకుఁ
దరలెనుబలములఁ దాఁదెత్తునంచుఁ
దెలియలేవైతివి ధీరాగ్రగణ్య
యనవినియాబాలుఁ డాగ్రహమంది
వీరులకెల్లను వినతిగావించి
యతివేగమునవచ్చి యనుజాలఁగలయ

ఇరుపక్షములవారు సంకుల
సమరంబొనర్చుట.

పటుమున్నె నరసింహుఁడధికమౌబలము
తెచ్చుకమొనచేసె ధీరతనెదుట
మదగజంబులపైకి మత్తసింహంబు
లరుదెంచువిధమున నాశ్చర్యలీల
పొఱుపైవఱచిరి బాలురాయుర్వురును
వసుధేశుతమ్ముఁడు వారలఁజూచి
తనవారికెల్లను దాసైగఁజేసెఁ
గ్రమ్మిరివిలుకాండ్రు ఘనులపైనపును
బాలుఁడుమొదలైన బాలవీరులను
నారులవిండ్లను నలినలిచేసి
దొనలునుబాణముల్ తునుకలుచేసి
వెఱవకయుండిరి వీరులపైకిఁ
గదిసిమూఁకలువచ్చి కదనమధ్యమున
సాంద్రవంశాటవి చందముదోఁపఁ
గ్రమ్మిరిసాధ్వస కరముగనపుడు
తలకకవారలు ధైర్యంబువొంది
చేగదల్ త్రిప్పుచుఁ జెలఁగియార్చుచును
గొక్కెరగుంపుపైఁ గుప్పించియుఱికి
సాళ్వంబుడీకొన్న చందముగాఁగఁ
గరులపైసింహంబు కదిసినరీతి
వ్యాఘ్రంబుగోవుల వడిఁదాఁకినట్లు
సేనలపైకేగి చెండాడిమఱియుఁ
జెక్కుఁమక్కులఁ జేతులమెడలఁ
గన్నులవెన్నుల గడ్డాలఁదలల
ఘనమైనకత్తుల ఖండించిమించి
కుంతములంబొడ్చి శూలంగఁద్రోసి
చక్రసంఘముచేతఁ జక్కుగాఁజేసి
రెదురెవ్వరునులేక యీతీరుసల్పఁ
జాపకట్టుగఁగూలె సకలబలంబు
లంతకంతకుయుద్ధ మగ్గలంబాయె
నప్పుడుబాలుఁడా యనుజాలకనియె

దళముపైఁబోవఁడి దట్టించిమీరు
కామేశుతమ్మునిఁ గనుఁగొనివత్తు
ననుచునతఁడువోయె నడుగుచురిపుల

## బాలచంద్ర నరసింహభూపతుల ద్వంద్వయుద్ధము.

ననుగుభూపతిపుత్రుఁడౌ నరసింహుఁ
డెక్కడనున్నవాఁ డేఁడిరావాఁడు
బాలచంద్రుఁడువచ్చు పటిమవీక్షించి
ధాకకుభయపడి డాఁగనోలేక
పందతనంబునఁ బాఱెనో చెప్పఁ
డనివిచారింపుచు నపుడు బాలుండు
గజముపైసింగంబు గమకించురీతి
బలుశైలమునఁబిడ్గు పడ్డట్లుగాను
దగగంతుగొనెఁగాము తమ్మునిమీఁదఁ
జుట్టున్నవారలు శూరతనపుడు
ఘనపరాక్రమముచేఁ గదియంగఁజూచి
బ్రహ్మనచేనుండు పటుకుంతమునకుఁ
బ్రతివచ్చు * సామంత రాగోలపట్టి
కటియందుగట్టిగఁ గాసెబిగించి
యాంజనేయునిభంగి నటఁజౌకళించి
కిలకిలనార్చుచుఁ గేరళవిభునిఁ
బొడిచిత్రోసెనువేగ భూమిపైఁబడఁగ
గర్ణాటభూమీశుఁ గలనిలోఁజంపె
మాళవమహి నేలు మనుజేశుశిరము
చిదిమినట్టుగఁద్రుంచెఁ జిత్రంబుగాఁగ
బర్బరధరణీశు బాహులనరికి
సమవర్తికడకంపె శౌర్యంబువెలయఁ
గరిపైనినుండిన ఘనునరసింగు
పైఁబడెసాహసప్రౌఢిమమీఱ
దంతినిఁగవియించె ధరణీతలేశుఁ
డంతటబాలుండు నధికకోపమునఁ
దండ్రినిఁబోలిన తనయుఁడుగాన 26/10
నత్యున్నతంబైన యాదంతిపైకిఁ
గుప్పించిదుమికియా కువలయనాథుఁ
బొడిచెనుబుజమున భూమీశుఁడలిగి
బాలునిఁగొట్టెను బలుఖడ్గధారఁ
దప్పించికొనియంత ధరణీశునేసె
నరసింగరాజును నాయునిసుతుఁడు
కర్ణుండువిజయుండు కలహించినట్లు
వృత్రుఁడునింద్రుండు పెనఁగినభంగి
రామరావణులు పోరాడినరీతి
హెచ్చియుద్ధముచేసి రిపుపురుజాము 20
పటువిక్రమంబున బాలుఁడుమించఁ
గామునితమ్ముఁడు గదిసియావేళ
నంకుశంబునఁబొడ్చె నదిబాలచంద్రు
భేదింపబైటికిఁ బ్రేవులువెడలె
నంతటబాలుండు నధికరోషమున
సామంతరాగోల చక్కఁగఁబట్టి
వక్షంబునంగడు వడితోడఁగ్రుచ్చె
గాఁడివీపునవెళ్ళె గ్రక్కునఁనలుఁగు
మొగలిపూభంగిని మొనచందమమర

---

* 1 ఆయుధ విశేషము,

నప్పుడు నరసింహుఁ డాత్మనిశ్చలత
మాచెర్ల చెన్నుని మదిలోనఁదలఁచి
యనుగుభూతలనాథు నాత్మలోనెంచి
శ్రీలక్ష్మనాయునిఁ జింతించిపొగడె
నూర్ధ్వమార్గంబుల నొయ్యన నెక్కి
బ్రహ్మరంధ్రంబునఁ బ్రాణంబు లేగఁ
గుంభికుంభము మీఁదఁ గూలెనారాజు

**బాలచంద్రుఁడు నరసింహభూపతి తలగోసికొని తండ్రియొద్ద కేగుట.**

బాలచంద్రుఁడువచ్చి బహుదుఃఖమొంది
యతనిచుట్టుదిరిగి యతిభక్తి మ్రొక్కి
యనుగుభూవరపుత్ర యంగజగాత్ర
యుర్వీశతనయ యయోధ్యనివాస
మానదుర్యోధన మైలమసుతుఁడ
యోతండ్రినరసింహ యోరాజవిభుఁడ
అపరాధిఁగాను నే నపకారిఁగాను
బాపమించుక లేదు పట్టపురాజ
మిమ్ముఁగట్టంద్రాళ్ళు మీరెతెచ్చితిరి
మీపాలిమృత్యువు మెలఁతనాగమ్మ
యలరాజుఁజంపిన నాపగదీర్పఁ
బట్టిచంపితిఁగాని పాపంబెఱుంగ
నని ఖేదమొందుచు నాయత్తపడుచుఁ
గత్తితోఁదలగోసి కరములఁబట్టి
యనుజులతోనిట్లు లపుడువచించె
నరసింగుతలనిత్తు నరనాథునెదుట
నిచ్చోటనిల్వుఁడి యెచటికిఁబోక
యనిచెప్పితమ్ముల నచ్చటనిలిపి
యొకచేతఁ బ్రేవులు నొయ్యన నెత్తి
సామంతరాగోల చంకనఁబెట్టి
తనతండ్రికావుకుఁ దలఁగొనిపోయి

**నరసింహుని శిరస్సునుగనుఁగొని నాయకులువిలపించుట.**

సోపానముల మేడ చులకఁగ నెక్కి
నాయుఁడుగని లేచి నయముదోపంగ
నరసింగువచ్చెను నాయకులార
యెదురుకొందమఁటంచు నేతెంచి భక్తి
నరసింగుశిరమును నమ్రతఁగొనియొఁ
దపనీయపీఠిపైఁ దలయుంచి మంచి
గంధముకస్తూరి కలయంగ నలఁది
తగటుపచ్చడముపైఁ దలయుంచిపిదపఁ
గొలువెల్లమ్రొక్కిరి కోపంబులణఁచి
బ్రహ్మన్నయును మ్రొక్కె వాక్రుచ్చెనిట్లు
బావలఁజూచితే ప్రాణంబువిడిచి
మఱఁదులఁజూచితే మరణంబునొంది
తమ్ములఁజూచితే దైవముఁగలసి
ఘనదేవభవనముల్ గట్టించినట్టి
ధర్మసేనుఁడు మీదు తండ్రియాన్గయ్య
కడకేఁగ మీకిట్లు కారణమాయె
ననుచు శోకమునొందె ననఘుఁడు బ్రహ్మ
యతఁడు దుఃఖంబంద నతని యగ్రజుఁడు
తనమది ఖేదంబు తాఁబట్టలేక
నరసింగుశిరమును నయముగఁబట్టి
కన్నులయశ్రువుల్ గడ్డానజార
బహుళశోకము పొందె బాదన్నరాజు

తండ్రిచచ్చినవెన్క దంటయేకూర్మి
నుండమిక్కొన్ని నా ళ్ళుర్వీశతనయ
వెగటుమృత్యువుమన వెంబడింబడియెం
జెన్నుండుకులమును జెల్లించె నేఁటి
కనిబాదరాహుత్తుం డడలెఁజింతించి
కొమ్మరాజావఁగఁ జేఁ గొలువెల్లనడలె
నుంకర్లునఁగఁజిరి శూరులేడిచిరి
గండువారలవంత ఘనమయియుండెఁ
గమ్మవారందఱు కడుఁజింతపడిరి

## బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని కృత్యంబులఁ దెగడుట.

నాయుఁడాతఁడెఁగూర్మి నందనుఁజూచి
రమ్మనినినుబిల్వ రాజంప లేదు
వచ్చియూరకయున్న వాఁడవుకావు
చూఱకొంటివి సేన శూరుఁడవగుచుఁ
జెల్లెఁబోనీవిట్లు చేసినక్రమము
విభునకు సేనకు విధివైతివకట

## బాలచంద్రుఁడు బ్రహ్మనాయుని కపటకార్యంబుల నెన్నుట.

యనవినియాబాలుఁ డతిరౌద్రుఁడగుచుఁ
బలికెనాదఱువిన బ్రహ్మన్నతోడ
వెడవెడ వేద్పులు వేగచాలింపు
కొల్వులోమామకొమ్మభూపతికి
నలరాజ్యపగకయి యప్పగించితివి
నీస్వభావంబింక నేవివరింతుఁ
బోఁగొట్టితివికోడి పోరునభూమి
నినునమ్మివచ్చిన నీమేనమఱంది
ప్రాణంబుకొన్నట్టి పాపాత్ముఁడవు
చెలువుమాడఁగఁబంపఁ జెవులరాయనను
జటులకర్ముఁడవయి చంపించితీవు
ఘనువేంకజోదును గలనికిఁబంపి
మందలోఁజంపితి మాయయొనర్చి
యిటువంటినీచేష్టలెన్ని వర్ణింతు
ననినమాటలుబ్రహ్మ కలుఁగుశైతోఁచి
బాలచంద్రునికనెఁ బ్రకటముగాఁగ
వెన్నిచ్చివచ్చితివిమతులకీవు
వెన్నిచ్చివచ్చెదు వీరుఁడెఁగాను
నమ్మనిపల్కిన శూరవాక్యములు
విదితమైతోఁచెను వీరులకిప్పు

## బాలచంద్రుఁడుమగిడిరణంబునకేగి యనుజులతోఁగలనిలోఁ నొఱగుట.

డనబాలచంద్రుఁడ హంకారగరిమఁ
దెంపుచేఁగలనికిఁ దిరిగిధైర్యమున
రయముగనేతెంచి రణములోనిలిచి
నప్పటిరణకర్మ మలవియేపొగడ
వాణీశుఁడైనను వర్ణింపలేఁడు
కమ్మరకాచన్న కడుశౌర్యఘనుఁడు
కాంక్షించితనపాలి కామాక్షిఁదలఁచి
పరదళంబులమీద బ్రాలిఖండించి
కడసారిమృతినొంది కలనిలోఁగూలె
శత్రుసైన్యమునకు సమవర్తియైన

మంగలకులమల్లు మహితవిక్రముఁడు
తురగసంఘంబును దునుకలు చేసి
కదనంబులోఁబడి కాలునిఁజేరఁ
గోరాడుచుండిన కుమ్మరపట్టి
విశ్రుతంబుగజాత వేదునిఁబోలి
పరదళవిపినంబు భస్మంబు చేసి
గురుదేవతలమదిఁ గూర్చిప్రార్థించి
హతశేషభటులచే ననిలోనఁ ద్రొగ్గఁ
జాకలచందన్న సాహసాఢ్యుండు
పాతాళగంగను భావమందుంచి
ప్రకటధైర్యవిలయ పవనుని చేత
దుష్టశత్రువులను దుములంబునందు
నాకాశపథమున కరుగంగఁజేసి
బవరంబులోఁ ద్రాలి ప్రాణముల్ విడిచె
సమరంబులోఁజొచ్చి చలనంబు లేక
బాలునియనుజుఁడ బాహుబలుండ
నని చెప్పికొంచు బిట్టుడరిరోషమునఁ
బేర్చైనదళములఁ జెల్లఁగఁబొడిచి
గదలమూఁకలఁజొచ్చి ఖండముల్ చేసి
బల్లెపువారిని భంగంబొనర్చి
తురగాలిపైకేగి తుమురుగాఁగొట్టి
మదదంతిచయముల మరణమొందించి
తలచుగాయంబులఁ దాళఁగలేక
మాచెలజ చెన్నుని మదిలోఁదలంచి
వెలమెలదొర్నీఁడు విడిచెప్రాణంబు
తమ్ములపాటంత తప్పకచూచి
బాలుఁడురోషంబు పట్టఁగలేక
పటుతరసాహసప్రౌఢిమమీఱ
వ్రేలాడుప్రేవులు వేగమె వెతికి
గంగధారంగల్పి కలనికివచ్చి
తమ్ములఁదలఁచుక తావిలపించి
మిముఁబాసియుండుట మేరయె నాకు
నాదురాకడమది నమ్ముఁడి మీర
లనిచాటి చెప్పుచు నాయుద్ధభూమి
నిర్భయవృత్తిచే నిలిచెబాలుండు
కనుఁగొనిపరసేన కడుభీతినొంది
మృత్యువుతలుముక మీఁదికివచ్చె
నెట్లుజీవించెద మీతనియెదుట
ననిపాటిపోయెదు నాసేనఁజూచి
పోవద్దుభటులార పుణ్యకాలంబు
చనుదెంచె దేవేంద్ర సభకేగవలెను
మీరల్లనిలువుఁడి మేలిమిగనుఁడి
యనిపల్కవినియందు నధికవిక్రములు
చౌకచుప్పలవారు సూమత్రైమించి
వచ్చుటగనుఁగొని వడిమీఱనెదిరి
పటుయుద్ధమప్పుడు బాలుఁడు చేసి
చాపకట్టుగఁగూల్చె సకలసైన్యంబు
నాసమయంబున నతులసాహసులు
కుంతంబులంబూని కోయనియార్చి
గడెలువంచుకవచ్చి కదిసిరిబాలు
నెనుకద్దు వేయక విక్రమప్రౌఢి
నలుఁగులపైద్రాలెనై తాంబనుతుఁడు
గ్రుచ్చిపట్టెరియొత్తి గురుశౌర్యఘనుని
వేంచెనిదివియందు వీరులఁగలసి

నంతటభాస్కరుఁ డస్తాద్రికేఁగ
సాంద్రమైచీకట్లు జగమునఁగ్రమ్మె
జంగమస్థావర సకలవస్తువులు
కాటుకపట్టిన కైవడినొప్పె
సకలప్రపంచంబు సత్యనిరూఢి
విష్ణుమయంబన్న వేదవాక్యంబు
నిశ్చయంబాయెను నీలిమనంది
శివుఁడేఁడి కైలాసశిఖరంబు నేది
సోముఁడువృషభంబు సురనదియేడ
యెక్కడికేగెనో యెఱుఁగరాదంచు
సంశయస్వాంతయై శైలజవెదక
నిభమునుగానక యింద్రుఁడు వెదక
వాణిని వెదకెను వనజాసనుండు
తెలియకయీరీతి దేవతలంత
పరశైలవిభ్రాంతిఁ బరఁగిరితలఁచు
నతులమదంబున నాసమయమున

### యుద్ధరంగమునఁ బిశాచగణములు స్వేచ్ఛావిహారములు సల్పుట.

ఘనభూతభేతాళగణములుగూడి
సమరరంగము చూచి సంభ్రమమంది
తగవిచారించిరి తమమదియందు
నెక్కడియుద్ధంబిదేమిచోద్యంబొ
యింతకాలంబయ్యె నెఱుఁగమెయహహా
యనివెఱఁగందుచు నాశ్చర్యపడుచుఁ
గలనుగాచుకయున్న కాళినిఁజూచి
మీదయచేతనె మేముతనియఁగ
నధికభోజనమాంస మబ్బెనుమాకు
ననిమ్రొక్కి తేన్చుచు నౌత్సుక్యమదర
బాలుఁడుమనపాలి బరమేశ్వరుండ
తండు సేయఁగనివ్వి ధంబునదొరక
ననికొండలాడిరి యానందమునను
నాయకురాలైన నాగమ్మనుండి
మనకాంక్షతీరెను మాటలకేమి
యనికొండలాడిరి హాసరంబుమీఱ 27
నిబ్బంగి మెచ్చుచు నింతులుతమరు
చల్లులాడుచు రక్తసాగరమందు
మునుఁగుచునీదుచు మూఁకలుగట్టి
చల్లులాడిచెదరి చాకలింపుచును
గుప్పించిదుముకుచు గొబ్బునమునిఁగి
దూరానఁదేలుచుఁ దూఁగివచ్చుచును
మదమెక్కిసోలుచు మతిస్రుక్కిపడుచు
నెవ్వరురామీద నెక్కినవారు
దిగిరార నాయాల తిట్టెదనుమ్మి
అనివెక్కిరింపుచు హాస్యమొనర్చి
భటకళేబరములు పట్టుకవచ్చి
వచ్చినగజముల సంధించినిల్పి
కదనమాడుమఁటంచుఁ గత్తులఁబొడిచి
పడియున్నగజముల పైనిఁగూర్చుండి
యంకుశంబులతోడ నదలించువారు
వాజిశవంబులపడిమీఱ నెక్కి
చబుకులఁగొట్టుచుఁ జనుమనువారు
గజములవాజులఁ గాలిమానుసులఁ
బట్టుకవచ్చియాపాథోధియందు
ఘనమైనసేతువు కట్టెదమంచు

సంతోషమొందెను శాకినీగణము
గుండెలునములుచు గుంపులుగూడి
పెల్లుగఁబాడెడు పెద్దఢాకినులు
నెదురుమాకవ్వారలీయుద్ధభూమి
మిగిలినదళముల మీఱిమర్దింపఁ
గ్రొత్తునెత్తురుమాకుఁ గూడునఁటంచు
బొబ్బలువెట్టుచు బొండిగల్దినుచ
హుంకారమందెను హాకినీచయము
దిక్కులనంతటఁ దేజంబుహెచ్చ
మిణుఁగుఱుల్ రాల్పుచు మింటికిఁ జనుచుఁ
కూడిపర్వులువెట్టు కొఱవిదయ్యములు
పొరిపొరి నాయుద్ధభూతలమందు
విహరించియీగతి వేడుకగొలఁది
తమనెలవులకును దామేగిరపుడు
సకలజనంబులు సంతసమంద
భానుండుపూర్వాద్రి పైకెగుదెంచె
ఘనుఁడైనశ్రీనాథ కవిరాజరాజు
చెన్నునికృపచేతఁ జిత్తముప్పొంగి
బాలునివిక్రమశ్లాఘయంతయును
వివరించెజనులకు విశదమౌదీనిఁ
జదివినవ్రాసిన శ్రద్ధతోవినిన
ధరణిలోనాచంద్రతారార్కముగను
(సకలశుభంబులు సమకూరుచుండు)
శ్రీయును నాయువు స్థిరముగఁ గలుగు.

బాలచంద్రయుద్ధము.

సంపూర్ణము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.